
అగ్నిమాల
దాసరి సుబ్రహ్మణ్యం

**AGNIMAALA** *(Children's Folk Novel)*
*(Serialized in YUVA - Telugu Monthly in 1975)*
*by DASARI SUBRAHMANYAM*

First Edition : January, 2011

Publication No. 92

*Cover Paintings and Illustrations :*
*VADDADI PAPAIAH*

*Published by :*
**Vahini Book Trust (V.B.T.)**
1-9-286/3, Vidyanagar
Hyderabad - 500 044

A Service Oriented Institution Administrated by Y.V.S.R.S. SAI

*and*

**Manchi Pustakam**
12-13-450, Street No.1
Tarnaka, Secunderabad - 500 017
Phone : 94907 46614
email : info@manchipustakam.in
Visit : www.manchipustakam.in

*For Copies :*
Vahini Book Trust, 1-9-286/3, Vidyanagar, Hyderabad - 500 044
Manchi Pustakam, 12-13-450, Street No.1, Tarnaka, Secunderabad - 500 017
Visalandhra Book House, Bank Street, Hyderabad & other Branches
Navodaya Book House, Opp: Aryasamaj Mandir, Badi Chowdi, Hyderabad
Navayuga Book House, Sultan Bazar, Hyderabad
Navodaya Publishers, Governorpet, Vijayawada

*Designed and Produced by :*
**Rachana Entinti Patrika,** Hyderabad - 500 044

*Text & Title Printed at :*
**Charita Impressions,** 1-9-1126/B, Azamabad, Hyderabad - 500 020

Total Pages : 154 :: Price : ₹ 60/- :: US $ 10

ISBN 978-81-88512-92-8



# 'అగ్నిమాల' నవల ప్రచురణ గురించి.....

శ్రీ దాసరి సుబ్రహ్మణ్యం(దాసు)గారితో ముఖఃపరిచయం లేకపోయినా ఆయనతో ఫోన్ ద్వారా చాలాసార్లు మాట్లాడిన పరిచయం ఉంది. అందుక్కారణం ఆయన రచనలంటే ఉన్న అభిమానం ఒకటైతే, ఆయన 'రచన'కు చాలా ఏళ్లుగా చందాదారుడుగా కొనసాగడం మరొకటి!

ఆగస్టు, 2008లో ఓరోజు మిత్రుడు దాసరి వెంకట రమణ విజయవాడ నుంచి ఫోన్ చేసి 'దాసు'గారికి ఫోన్ అందించేరు. తను రాసిన 'అగ్నిమాల' నవల వపాగారి బొమ్మలతో 'యువ' దీపావళి సంచికలో వచ్చిందనీ, దాన్ని సంపాదించి పెట్టమనీ అడిగేరాయన. ఓ గంటసేపు ఉన్న దీపావళి సంచికలన్నీ ఒకటికి రెండుసార్లు వెదికినా కనపడలేదు. వెంటనే ఆ సంగతి చెప్పి ఉజ్జాయింపుగా ప్రచురణ సంవత్సరం చెప్పగలరా అనడిగితే గుర్తులేదన్నది సమాధానం. కేవలం వపాగారి బొమ్మలతో దీపావళి 'యువ'లో వచ్చిందన్నదే ఆయన జ్ఞాపకం.

కారణాలు తెలియవుగానీ 'చందమామ'లో 'దాసు'గారి 'రాకాసిలోయ' సీరియల్ తర్వాత 1964 నుంచి రెండేళ్లపాటు బెంగాలీ సీరియల్స్ - 'దుర్గేశనందిని', 'నవాబునందిని' - ప్రచురించారు. అందుకు 'దాసు'గారు కొంత మనస్తాపం చెంది ఉండవచ్చు. అది సహజం కదా! అలాంటి సంస్థానాల కథలు మనం కొత్తగా రాయలేమా అన్న పట్టుదలతో ఆ తర్వాతి కాలంలో 'దాసు'గారు రాజపుత్ర సంస్థానాల నేపధ్యంలో 'అగ్నిమాల' రాసి ఉంటారు. అయినా అందులో ఆయనకే ప్రత్యేకమైన జానపద చమక్కుల, తళుకుల సొబగులతో పాటు స్త్రీ పాత్రల ప్రాధాన్యత కూడా 'అగ్నిమాల'లో మనకు ప్రస్ఫుటంగా గోచరిస్తుంది. ఈ 'అగ్నిమాల' నవల 'చందమామ'లో ఎందుకు సీరియల్‌గా ప్రచురింపబడలేదని విశ్లేషిస్తే కారణం సుస్పష్టంగా తెలిసిపోతుంది. బెంగాలీ నవలలు పాఠకుల నిరాదరణకు గురికావడంతో మరలా 1966లో 'దాసు'గారి 'పాతాళదుర్గం' సీరియల్‌ను 'చందమామ'లో ప్రారంభించారు. అది వేరే సంగతి!

'అగ్నిమాల' నవల 'కథానిలయం'లో ఆక్కడ ఉన్న కొద్దిపాటి 'యువ' దీపావళి సంచికల్లో దొరుకుతుందేమో వెదికి పెట్టమని మిత్రుడు దాసరి రామచంద్రరావును కోరడం జరిగింది. ఏ దీపావళి సంచికలోనూ 'అగ్నిమాల' దొరకలేదన్నది వచ్చిన సమాచారం. అక్కడితో వెదుకులాట తాత్కాలికంగా ఆగింది. కానీ - 2009 చివరలో అకస్మాత్తుగా ఓ రోజున దాసరి రామచంద్రరావు ఫోన్ చేసి వేరే మరో కథ గురించి వెదుకుతూంటే 'అగ్నిమాల' ఆచూకీ దొరికిందని చెప్తూ, అది 1975లో 'యువ' సాధారణ సంచికల్లో ప్రచురింపబడిందనీ - అయితే ఏడు సంచికలే లభ్యమనీ చెప్పారు. కొంత సంతోషం, కొంత నిరుత్సాహం! ఆ సంగతే 'దాసు'గారికి చెబితే ఆయనదీ అదేరకమైన స్పందన!

ఎలాగైనా పూర్తి నవల సంపాదిస్తానని ఆయనకి మాటిచ్చేను. అప్పట్నించీ ఆ దొరకని సంచికల గురించి వేట మొదలయింది. 1971 నుంచీ ఉద్యోగరీత్యా పరాయి రాష్ట్రాలలో ఉన్న కారణంగా నా వద్ద ఆ సంచికలు ప్రోగుపడలేకపోయేయి. ఇదిలా ఉండగా 2010 జనవరిలో 'దాసుగారు పరమ పదించేరు. ఆయన కోరిన ఆ చిన్న కోరిక తీర్చలేకపోయేననే అసంతృప్తి మాత్రం తొలిచివేస్తుండేది.

'దాసుగారి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన రాసిన సాంఘిక కథల సంపుటిని మిత్రుల సహకారంతో ప్రచురించాలనే ప్రయత్నం మొదలు పెట్టేను. ఆ సందర్భంలో మిత్రులు వి³ రమణగారు 'దాసుగారి కొన్ని కథలు సంపాదించి పెట్టేరు. మాటల్లో 'అగ్నిమాల' ప్రస్తావనప్పుడు ఆయన ప్రయత్నించి ఫిబ్రవరి '75 నుంచి డిసెంబర్ '75 దాకా సీరియల్ భాగాలను అందించేరు. అప్పుడు నిర్ధారణ అయింది – అది జనవరి 1975 నుంచి డిసెంబర్ 1975 దాకా 'యువ'లో సీరియల్‌గా ప్రచురితమైందని. కానీ మళ్లీ మొదటి కొచ్చింది వేట – జనవరి సంచిక కోసం. చివరాఖరికి ఆ సంచికనీ దొరకబుచ్చుకోవడం జరిగింది. బోనస్‌గా 'కథానిలయం' సేకరణ నుంచి మూడు కవర్ పేజీలను చక్కగా స్కాన్ చేసి పంపేరు మిత్రులు వివిన మూర్తిగారు. 'అగ్నిమాల' సేకరణలో సహకరించిన వీరందరికీ కృతజ్ఞతలు!

ఈ సమయంలోనే 'దాసుగారి 'బొమ్మరిల్లు' సీరియల్ 'మృత్యులోయ' కూడా దొరికే అవకాశాలు మెండుగా కన్పించడంతో కథాసంపుటితో పాటుగా ఈ రెండు పిల్లల నవలలనీ కూడా పుస్తకరూపంలో తేవాలన్న కోరిక బలీయమైంది. కానీ సమకూరుతున్న ఆర్థిక వనరులు కేవలం కథాసంపుటికే సరిపోయేటట్లు కన్పించలేదు. కానయితే మూడు పుస్తకాలూ వేసితీరాలనే కోరిక ప్రగాఢమౌతూ వచ్చింది.

ఓ రోజున 'చరిత' సుబ్బయ్యగారితో ఈ ప్రచురణలకు సంబంధించి మాట్లాడుతున్నప్పుడు 'మంచి పుస్తకం' సురేష్‌గారు రావటం తటస్థించింది. విషయం తెలుసుకున్న ఆయన, 'మీకు అభ్యంతరం లేకపోతే పిల్లల పుస్తకాలను జంటగా ప్రచురిద్దాం' అని ముందుకొచ్చేరు. ఇలా 'మంచి పుస్తకం' సురేష్‌గారు ఈ ప్రాజెక్టులో పాలుపంచుకోవడం యాదృచ్ఛికం!

హైద్రాబాద్‌లోనే ఉంటున్న 'వపా'గారి అబ్బాయి శ్రీ వి. రవిరామ్‌గారికి విషయం చెప్పి వపాగారి బొమ్మలతో 'అగ్నిమాల' నవల ప్రచురించాలనుకుంటున్నానని చెప్పగానే ఆయన సంతోషంగా, స్వచ్ఛందంగా అందుకు సమ్మతి తెలియజెప్పినందుకు కృతజ్ఞతలు!

ఈ పుస్తకానికి అక్షరాలంకరణ చేసి, 'దాసుగారి రేఖాచిత్రాన్ని చిత్రించిన ప్రఖ్యాత చిత్రకారుడు, ఆత్మీయ మిత్రుడు చంద్రకి అభినందనలు!

'దాసుగారు సజీవులుగా ఉన్నప్పుడే ఈ నవల దొరికి ఉంటే ఆయన ఎంతగానో సంతోషించి ఉండేవారు. ఇప్పటికయినా ఆయన కోరిన చిన్న కోరిక తీర్చగలిగినందుకు ఆనందంగా ఉంది.

– 'రచన' శాయి



# దహించేదీ ధరించేదీ

సృష్టిలో జీవరాశులు అనంతం. సృష్టి అనంతంగా కొనసాగడానికి ఇంచుమించు అన్ని జీవరాశుల్లోనూ స్త్రీపురుష విభజన సామాన్యం. మనుషుల్లో స్త్రీపురుష బంధాన్ని అసామాన్యం చేసింది ప్రేమ. సామాన్య జీవితంలో అంతర్లీనమై భాసిల్లే ప్రేమని – వెలికి తీసి మనోహరం చేసి సామాన్యుడికి అందిస్తుంది సాహిత్యం. ఏ భాష సాహితి చూసినా నరజాతి చరిత్ర సమస్తం ప్రేమాయణ పరవశత్వం.

సాహిత్యంలో ప్రేమ పుట్టుకకు – వినికిడి, తొలిచూపు కారణమవడం సర్వసాధారణం. కొండొకచో వ్యామోహం, రాజకీయం ప్రేమకు దారి తీసినా – ఆ కథల్లో వ్యూహానికున్న ప్రాధాన్యం ప్రేమకు లభించకపోవడం సాధారణం. అలా చూస్తే అసామాన్య రచయిత శ్రీ దాసరి సుబ్రహ్మణ్యకృత 'అగ్నిమాల' అసాధారణం.

కథానాయకుడు అగ్నిపాలుడు మహావీరుడు, రాజభక్తుడు, ధీరోదాత్తుడు. అలాగని పురుషోత్తముడు కాడు. మేటి వీరుణ్ణి మట్టి కరిపించినా అది – ఒక వారవనిత కోసం. కథానాయికని ప్రేమించినా అది – ఒక అవజ్ఞనిపై పందెం గెలవాలని.

కథానాయిక వకుళమాల అసమాన సౌందర్యవతి, సుగుణవతి, అభిమానవతి. అలాగని మహిళోత్తమ కాదు. అపహాస్యంతో తనకు నచ్చని బేతాళవర్మను నొప్పించగలదు. ఆవేశంతో ప్రియుడికే

ప్రాణాంతక స్థితి కలిగించగలదు. వీరురువురి ప్రేమకథలో మాధుర్యం అల్పం, రాజకీయం అనల్పం. ఇవన్నీ రచయిత శ్రీ దాసరి సుబ్రహ్మణ్యం (దాసు) వాస్తవిక దృక్పథానికి నిదర్శనం.

వాస్తవానికిది అగ్నిపాలుడి ప్రేమకథ ఐనా – ఆ ప్రేమ నవభోజుడు, కాలభోజుడు అనే ఇద్దరు ప్రభువుల రాజకీయ వ్యూహంలో అంతర్భాగం కావడం ఈ రచనలో విశేషం. జూదంలాంటి పందెంలో పుట్టిన ప్రేమని కథ పొడుగునా నిరసించే ఔచిత్యం, బురదలో పుట్టిన పద్మం పంకజమై పూజార్హమైనట్లు – ఆ ప్రేమ ఉదాత్తమని అడుగడుగునా స్ఫురింపజేసే చాకచక్యం ఈ రచన ప్రత్యేకత. ఐతే ఈ రచన గొప్పతనం ప్రేమలో కాక పాత్రచిత్రణలో ఉండడం గమనార్హం.

ఈ కథలో ముఖ్యపాత్ర అగ్నిపాలుడు. అతడు మహాశక్తిమంతుడైనా రాజుని సేవించాలనే తప్ప రాజు కావాలని అనుకోడు. జగ్గరాజువంటి మహాయోధుణ్ణి ఓడించినందుకు గర్వపడుతూనే – ఒక వారకాంత కోసం అతడితో తలపడ్డానని కించపడతాడు. స్నేహితుల కీచులాటని పట్టించుకోని వాస్తవిక దృక్పథం, అతిథుల మధ్య అలాంటి దొప్పని సంస్కారం ప్రదర్శిస్తూనే – కుటిలత్వం రెచ్చగొడితే నీచమైన పందేనికైనా సిద్ధపడతాడు. పందెం కోసమే వకుళమాలని పొందాలనుకున్నా – ఆమె ప్రేమను పొందినాకనే పెళ్లాడాలనుకుంటాడు. ఆమె తనను నిరసించి ద్వేషించినా – ఆత్మాభిమానంగా గుర్తించి గౌరవిస్తాడు. అవజ్ఞుడి వంటి దుష్టుణ్ణి అన్నివేళలా అంచనా వెయ్యలేక పోయినా, ప్రాణప్రమాద సమయంలో కూడా తన ధైర్యాన్ని మొక్కవోనివ్వడు. అతడి పాత్ర నవలకే తలమానికం.

కథానాయిక వకుళమాల పాత్రని – హీరో ప్రధానంగా వచ్చే నేటి చలనచిత్రాల్లో హీరోయిన్ పాత్రలకు – ఒరవడిగా అనుకోవచ్చు. అవధుల మేరకే ప్రదర్శితమైన ఈ పాత్ర ప్రవర్తనలో సజీవం. ఆమె ఉనికి పాఠకుల్ని ఉత్తేజపరుస్తుంది.

ఈ కథలో ప్రతినాయకుడు అవజ్ఞవర్మ. అతడు కుటిలుడు, దుష్టుడు, అత్యాశాపరుడు. తన బలహీనతలు, పరిమితులు తెలిసినవాడు. కార్యసాధనకై ఆత్మాభిమానాన్ని పణంగా పెట్టగలిగినవాడు. వ్యక్తిత్వం బలమైనది కాకపోయినా ఆశయబలంతో బలవంతులతో పోటీపడిన వాడు. అవకాశవాదంతో అర్హతకు మించిన అవకాశాలు పొందగలిగినవాడు. ఈ రచనలో అతడి పాత్ర అక్కడక్కడ మాత్రమే కనిపిస్తుంది కానీ – కర్ణుడి తల భారతమన్నట్లు – అతడే ఇంత కథకూ కారణమయ్యాడు. నేటి రాజకీయవాదుల్ని గమనిస్తున్నవారికి అతడి పాత్ర సజీవమని స్ఫురించడం సహజం. మరో దుష్టపాత్ర



బేతాళవర్మ సామర్థ్యంలో తక్కువైనా ఆశయాల్లో అవజ్ఞవర్మను సరిపోలుతాడు. దుష్టుల ప్రగతి స్వీయప్రతిభలో కాక మంచివారిని నమ్మించి మోసగించడంలో ఉన్నదని ఈ పాత్రల ద్వారా సూచిస్తూ, వారి అదృష్టం చివరికి తాత్కాలికమేనని హెచ్చరించారు రచయిత.

మిగతా పాత్రలు లీలామాత్రమైనా – వాటిపట్ల రచయితకున్న సంపూర్ణ అవగాహన చిత్రణలో ద్యోతకమౌతుంది. హైహయ వంశస్థుణ్ణని మిడిసిపడే ప్రసేనుడు సామంతుడైనా 'రాజా ప్రసేన్'గా సంబోధించబడతాడు. అసహాయంగా అనుసరిస్తూనే అవధులమేరకు భర్త మూర్ఖత్వాన్ని నిరసిస్తుంది చంద్రావతి. ప్రసేనుడితోసహా నవభోజుడిపట్ల రాజద్రోహానికి తలపడినవారందరి సందిగ్ధ మనోభావాలు – నేటి రాజకీయ వాదుల్ని స్ఫురింపజేస్తాయి. విధి నిర్వహణకు విచక్షణను జోడించాడు ధర్మనందుడు. *'మీ తండ్రిగారి సేవలోనే మరణించి ఉంటే ఎంత బాగుండేది'* అని వాపోయేటంతలా సేవాధర్మం జీర్ణించుకున్న మాహూాలో ఆత్మీయతానుబంధమే తప్ప – సేవకుడినన్న భావం లేదు. వీరందరూ ఈ రచనలో పాత్రచిత్రణకు పరాకాష్ఠ అనవచ్చు.

ఈ కథలో పాత్రల పేర్లు గమనించతగ్గవి. ప్రతిద్వంద్వులైన రాజులిద్దరూ భోజులే. 'నవ'భోజుడు ఆధునిక దృక్పథానికీ, 'కాల'భోజుడు కౌటిల్యానికీ సూచికలు. దుష్టులైన వారిద్దరూ వర్మలే. అవజ్ఞుడు తిరస్కరించబడిన వాడు. బేతాళుడు కథని పొడిగించినవాడు. రాజద్రోహానికి తలపడినా స్నేహానికి ప్రాణమిచ్చేవాడు విష్ణు 'మిత్రుడు'. అనుమానితుణ్ణి బందీ చేసినా – నిర్దోషిత్వ నిరూపణకు అవకాశ మిచ్చినవాడు 'ధర్మ'నందుడు. విశ్వాసపాత్రుడైన సేనాని హనుమప్ప. విధి నిర్వహణకు సూచికగా కథానాయకుడు అగ్నిపాలుడు. ప్రేమాస్వాదనకు తగిన కథానాయిక వకుళమాల. రాజకీయపరంగా అత్యావశ్యకమైన వారి కలయిక 'అగ్నిమాల'గా ఈ రచనకు మకుటం.

మన పురాణకథల విశిష్టత ఏమంటే – అవి 'చందమామ'లో పిల్లల్నీ, సాంఘికంగా పెద్దల్నీ సమంగా అలరించగలవు. భక్తులకు కల్పవృక్షాన్నీ, వ్యతిరేకులకు విషవృక్షాన్నీ అందివ్వగలవు. మేధావులకు వేదాంతాన్ని సూచించగలవు. చర్చల్ని సముద్రమంత లోతుకు తీసుకెళ్లగలవు. ఆ విధంగా 'అగ్నిమాల'కూ పురాణవైశిష్ట్యముంది. 'అగ్నిమాల' కథగా బాలసాహిత్యమై సంక్షిప్తమై 'చందమామ'లో ఆరు పేజీల్లో ఇమడగలదు. కథనంలో సాంఘికమై సమగ్రమై వందల పేజీలు దాటగలదు. రెండిటా ఆరితేరిన సవ్యసాచి 'దాసు' ఈ కథను సులభగ్రాహ్యంగా, ఆలోచనాత్మకంగా రూపొందించడంలో కృతకృత్యులయ్యారు. 'చందమామ' సీరియల్స్ శైలి కథనానికి సొగసులిస్తే –

సాంఘికంగా సీరియల్ కాకపోవడం కథనానికి పగ్గాలేసింది. వారపత్రికలో ధారావాహికంగా కనీసం 52 సంచికల్లో కొనసాగాల్సిన కథనం - మాసపత్రికలో 12 సంచికలకు పరిమితం కావడంతో - ఆరంభం కాస్త పొడిపొడిగా - ముగింపు మరీ వడివడిగా రూపొందింది. విపులంగా 'దాసు' కథనంలో రాణించాల్సిన - విష్ణుమిత్రుడి ఉదంతం, మాహూ అనుభవాలు, బేతాళవర్మ కుతంత్రాలు వగైరాలెన్నో - పాఠకుల ఊహకు వదిలివెయ్యబడ్డాయి. కావ్యంలా కొనసాగాల్సిన వకుళమాల ప్రేమ సందిగ్ధం - కథ ముగింపుకి తొందరపడి చిన్ని పేరాతో పరిష్కారమైపోయింది. ఆ మేరకి ఈ రచన పాఠకులకి కొంత అసంతృప్తిని కలిగించినా - కథనం ఉత్కంఠభరితమై ఏకబిగిన చదివిస్తుంది.

సాగరమంత లోతైన ఈ ఇతివృత్తంలో ఆణిముత్యాలకు కొదవా?

వ్యాఖ్యల్లో మచ్చుకి కొన్ని :

'ఏ కార్యమైనా వారివారి మనఃప్రవృత్తినిబట్టి గౌరవప్రదమో, అగౌరవ కారణమో అవుతుంది';

'జూదం శాస్త్ర సమ్మతం. కుక్కవెంబడే తోకలాగా జూదంతోపాటే పందెం ఉంటుంది';

'లౌక్యం మరిచి కేవలం పౌరుషం ప్రధానంగా మాట్లాడే భర్తతో విసిగిపోయింది';

'ఉరి తియ్యబడుతున్న రాజద్రోహులెలా ఉంటారో చూడాలని ఉన్నదిట. ఒకరి బాధ మరొకరికి ఆనందం'.

చతురోక్తుల్లో మచ్చుకి కొన్ని :

'ఈ కొండ ఈ ఇరవై ఏళ్లలోనూ పుట్టి పెరిగి ఉంటుంది',

'ఆ శవం దొరికితే బావుండును - విష్ణుమిత్రుడైతే తప్పక గుర్తిస్తాడు'.

ఇక పాత్రానుగుణమైన మనోవిశ్లేషణ కథనానికి అదనపు సొబగులు చేకూర్చింది. మచ్చుకి అగ్నిపాలుడి విషయమై - ప్రసేనుడు, చంద్రాదేవి, వకుళమాలల ఆలోచనలు అత్యంత సహజమూ, అద్భుతమూ.

అగ్ని దహిస్తే పునీతం. మాల ధరిస్తే పరిమళభరితం. అధికారాన్నీ అలంకారాన్నీ అగ్నిమాలగా సమన్వయిస్తే - నరజాతి చరిత్ర సమస్తం నిస్సందేహంగా ప్రేమాయణ పరవశత్వం.

ఒక్క మాటలో చెప్పాలంటే - హస్తభూషణం అనుకునేవారు చదవతగ్గదీ, మస్తక మథనం అనుకునేవారు అధ్యయనం చెయ్యతగ్గదీ - ఐన పుస్తకం 'అగ్నిమాల'.

- వసుంధర








అది రాత్రి రెండవ జాము. చంద్రగిరి నగర వీధుల్లో ఎక్కడా జనసంచారం లేదు. అంతా నిశ్శబ్దం. కాపలా భటులు అప్పుడప్పుడూ చేసే హెచ్చరికలు మాత్రం ఆ నిశ్శబ్దాన్ని భంగపరుస్తున్నవి. అలాంటి రాత్రివేళ, నవభోజ మహారాజు ఆస్థానంలో ప్రముఖులయిన ముగ్గురు మిత్రులు, తమలో ఒకడైన అగ్నిపాలుడనే మిత్రుడి ఇంట చేరి, ఒక ముఖ్యవిషయం గురించి సంభాషించు

కుంటున్నారు.

"ఓబలా! నువ్వు చెప్పేదే నిజమైతే ఇది అన్ని విధాలా ప్రభువులకు మనఃక్లేశం కలిగించే వార్త. అందులో సందేహం లేదు," అన్నాడు అగ్నిపాలుడు.

ఓబలరాజూ, ధర్మపాణీ, జయసింగూ ముఖముఖాలు చూసుకున్నారు. అది గమనించిన అగ్నిపాలుడు కిటికీ దగ్గిరకువెళ్ళి, ఓ క్షణకాలం బయటి అంధకారంకేసి చూసి, చటుక్కున వెనుదిరుగుతూ, "మీరు అవజ్ఞవర్మకు పట్టనున్న దుస్థితికి సంతోషిస్తున్నారేగాని, చంద్రగిరి ప్రభువులకు ఇది ఎలాంటి చిక్కుసమస్యలను తెచ్చిపెట్టగలదో ఆలోచించటంలేదు," అన్నాడు.

అగ్నిపాలుడి ఈ మాటలు అతడి మిత్రులు ముగ్గురిలోనూ పెద్ద మార్పు కలిగించినై. ఓబలరాజు ఆశ్చర్యపడుతూ అగ్నిపాలుడికేసి చూసి, "నిజమే! నిజమే!" అంటూ తలవూపాడు.

ధర్మపాణి మౌనంగా పట్టుమెత్తపై నుంచి, కిటికీ దగ్గర నిలబడివున్న అగ్నిపాలుడిని సమీపించి, "అగ్నీ! నిజంగా మల్లూరు మండలాధీశుడు అంత బలవంతుడంటావా?" అని అడిగాడు.

"అతని బలదర్పాల గురించీ, శౌర్యసాహసాల గురించీ నేను కొత్తగా చెప్పవలసిందేమీ లేదు. జయసింగ్‌కు ఏవి జ్ఞాపకంవున్నా లేకపోయినా, కనీసం ప్రాణగండాలన్నా గుర్తుంటవనుకుంటాను. అయిదు సంవత్సరాలనాటి మాట... గుర్తున్నదా, జయసింగ్?" అన్నాడు అగ్నిపాలుడు.

జయసింగ్ ముఖం వివర్ణమైంది. అతడు అగ్నిపాలుడికేసి అనుమానిస్తున్నట్టు ఒక చూపు చూసి, "ఇందూరు యుద్ధం సంగతి ఈ క్షణాన నువ్వు గుర్తుచేయనవసరంలేదు, అగ్నీ! ఆనాటి అవమానం నేను జన్మజన్మలకూ మరిచిపోలేను," అన్నాడు.

అగ్నిపాలుడు చిరునవ్వు నవ్వుతూ జయసింగ్ దగ్గరకు వచ్చి, అతడి భుజాన్ని ఆప్యాయంగా తడుతూ, "జయా! నిన్ను అవమానపరిచేందుగ్గాని, నీ మనస్సు నొప్పించేందుకుగ్గాని నేనా ఇందూరు యుద్ధం ప్రసక్తి తేలేదు. మన ప్రభువు నవభోజుడు ఆ మల్లూరు మండలాధీశుడి స్నేహాన్ని అంతగా ఎందుకు కాంక్షిస్తున్నాడో చెప్పేందుకే ఆ సంగతి తేవలసివచ్చింది," అన్నాడు.

ధర్మపాణి ఆ మాటలకు అయిష్టంగా తలాడిస్తూ, "నిజంగా మల్లూరు మాండలికుడు అంత బలశాలి అయివుండి అతణ్ణి మన ప్రభువు స్నేహితుణ్ణి చేసుకోదలిస్తే, అందుకు అవజ్ఞవర్మ ఎన్నికసరి అయినది కాదు. నా ఉద్దేశం, ఆ మండలాధీశుణ్ణి అవమానపరిచేందుకే మన ప్రభువు అవజ్ఞవర్మను అక్కడికి పంపి ఉంటాడని," అన్నాడు.

"ఆ అంచనా సరికాదు, పాణీ! కృష్ణకు అవతల జరుగుతున్న అల్లకల్లోలాలూ, అరాజకం గురించి బహుశా నీకు అంతగా తెలిసి వుండదు,"





అన్నాడు అగ్నిపాలుడు.

"సర్వం తెలుసు. నేనంత అమాయకుణ్ణనుకోకు అగ్నీ!" అన్నాడు ధర్మపాణి, మిగతా ఇద్దరు మిత్రులకేసీ ప్రశ్నార్థకంగా చూస్తూ.

"నేనివ్వాళ ఉదయమే, నవభోజ ప్రభువులతో మాట్లాడాను. కాలభోజుడు రాష్ట్రకూటులనుంచి సహాయం పొందటంలో కృతకృత్యుడవటమే కాదు, చాళుక్య చంద్రనాభుడు కూడా అతడివేపే మొగ్గుతున్నట్టు ప్రభువులు అనుమానిస్తున్నారు. అలా జరిగినప్పుడు మన రాజ్యపు ఎల్లలకూ, వారికీ మధ్య ఉన్నది మల్లూరు మండలం మాత్రమే. మనం కృష్ణానదిని దాటి వారిని ఎదిరించాలన్నా, వారు మనమీద దాడిచేయాలన్నా, సుగమమైన మార్గం మల్లూరు మండలంలోనుంచే గదా? ఆ పరిస్థితుల్లో ఇరుపక్షాలకు మల్లూరు మండలాధీశుడి స్నేహం ఎంత అవసరమో నేను మరీ మరీ నొక్కి చెప్పనవసరం లేదు," అన్నాడు అగ్నిపాలుడు.

ఓబలరాజు తలవంచుకొని పట్టుమెత్తపై మునివేళ్ళతో తాళం వేయసాగాడు. ధర్మపాణి కనుబొమలు ముడిచి, కదులుతున్న దీపస్తంభపు నీడకేసి దృష్టిసారించాడు. జయసింగ్ ఒక్కడే నిర్వికారంగా అగ్నిపాలుడి కళ్ళలోకి సూటిగా చూస్తూ, "వినండి! నేనొకటి చెప్పబోతున్నాను. అది ప్రభువులవారిని తృణీకరించటంగా నువ్వు భావించవనుకుంటాను, అగ్నీ?" అన్నాడు.

అగ్నిపాలుడు నవ్వి, ఓ తృటికాలం జయసింగ్ మనోభావాలకోసం అతణ్ణి పరీక్షగా చూసి, "జయసింగ్! నేను నవభోజ ప్రభువుల ఆశ్రయం సంపాయించిన చిన్న సామంతరాజును. నువ్వాయన సేనాపతుల్లో ఒకడివి, ముఖ్యుడివి! ఓబలరాజు ఆయన ఆంతరంగిక మిత్రుడు. ఇక ధర్మపాణి సంగతి చెప్పనే అవసరంలేదు. వయసులో మనకన్న ఒకటి రెండేళ్ళు చిన్నవాడైనా అనేక యుద్ధాల్లో ఆరితేరిన గండరగండడు. ఇలాంటి వాళ్ళు ఇంతమంది ఇక్కడ ఉండగా, ప్రభువులకు ఏమైనా చెపుతానేమోనని నా ఒకణ్ణి గురించే నీకెందుకా భయం కలిగింది?" అన్నాడు.

"మా అందరికన్న నువ్వాయనకు ఎక్కువ ఆప్తుడివి, మిత్రుడివి!" అన్నాడు జయసింగ్.

"దాన్ని మేం ఇద్దరమూ బలపరుస్తున్నాం!" అన్నారు ధర్మపాణి, ఓబలరాజులు,

"అలా అయితే ప్రభువులను నువ్వేమాత్రం తృణీకరిస్తూ మాట్లాడినా, బహుశా ఆ సంగతి నేనాయనకు చెప్పవచ్చు. అప్పుడు నీ తల......" అంటూ అగ్నిపాలుడు హస్తాన్ని ఏటవాలుగా పెట్టి గాలిలోకి కత్తి విసిరాడు.

అగ్నిపాలుడి చర్య అందరికీ నవ్వు తెప్పించింది. జయసింగ్ అంతలోనే నవ్వాపుకుని, "అగ్నీ! నేను ప్రభువులను మరేమీ నిందించటం లేదు. అంత బలవంతుడూ, శక్తిమంతుడూ అయిన మల్లూరు మండలాధీశుని ఏకైక పుత్రికను

హం ఆడి, అతణ్ణి మనకు అనుకూలుడుగా కునే పని, అవజ్ఞవర్మ వంటి పొగరుబోతుకూ, హీనుడికీ ఒప్పచెప్పవలసింది కాదు. ఈ కలో ప్రభువులు చాలా పెద్ద పొరపాటు రు. ఇదీ నేను చెప్పదలచుకున్నది!" అన్నాడు.

"ఈ అనుమానం ధర్మపాణి ఇంతకుముందే వరించాడు. కాని, అతడి అభిప్రాయంలో ప్రభువులు మల్లూరు మాండలికుణ్ణి అవమాచాలని అలా చేశారని! కాని, అది సరికాదు. అవజ్ఞవర్మను ఆయన ఎన్నుకోవటంలో ఔచిత్యం లేకపోలేదు. అతడు మనందరి కామినీ హృదయాపహరణ కార్యంలో ఆరితేడు. మనం అంత అనుభవజ్ఞులం కాదు," న్నాడు అగ్నిపాలుడు.

'అగ్నీ! అవజ్ఞవర్మ వారవనితా హృదయాధినేత సంగతి ఈ చంద్రగిరి వాసులందరూ ఎరిగి కాని, ఇప్పుడతడు వెళ్ళి అవమానంతో తిరిగి కార్యం, అలాంటివారితో సంబంధించినది. హైహయ వంశస్థుడననే గర్వమే కాక, డు ఇందూరు యుద్ధంలో నవభోజ ప్రభువు సేనానినే ఓడించానన్న బింకం కూడా రు మాండలికుడికున్నది. ఇక ఆయన పుత్రిక వకుళమాల సౌందర్యాన్ని గురించి అందరం వినే ఉన్నాం. అలాంటి కన్య గ్రహణం కోసం పోవలసినవాడేనా, ఈ వర్మ?" అన్నాడు ధర్మపాణి తీవ్రంగా.

అగ్నిపాలుడు ఆ ప్రశ్న వెనకవున్న సత్యాన్నీ, ధర్మపాణి ఉద్వేగాన్నీ గుర్తించి కూడా, "అయితే ఆ కార్య సాధనకు అవజ్ఞవర్మకన్న తగినవాడెవడని నీ అభిప్రాయం?" అని అడిగాడు.

"నా గురించి నే చెప్పుకోవటం మర్యాద కాదు, అవునా?" అంటూ ధర్మపాణి మిత్రుల ముఖాల కేసి ఓసారి పరీక్షగా చూసి, "అగ్నీ, నీవున్నావు... ముప్పై ఏళ్ళయినా నిండని యువకుడివి, ఒక సంస్థానాధిపతివి! నీ అందచందాల గురించీ, సహృదయత గురించీ, మొత్తం రాజ్యంలో తెలియనివారు లేరు. ఇక నీ శౌర్యసాహసాలూ, కత్తియుద్ధంలో నీ నైపుణ్యం - ప్రభువుల మన్ననలనే కాక కవిపండితుల దృష్టిని కూడా ఆకర్షించినై. నిజంగా నవభోజ ప్రభువులు వకుళమాలతో తన ఆశ్రితుడికి వివాహం జరిపించటం ద్వారా ఆమె తండ్రిని తన పక్షానికి తిప్పుకోదలిస్తే, అందుకు నీకన్న అర్హుడెవడూ లేడు!" అన్నాడు.

అగ్నిపాలుడు కొంచెం కళవెళపడ్డాడు. తన ప్రశ్నకు అంత సూటి మాటలతో జవాబు వస్తుందని అతడు ఊహించలేదు. ఈ కారణంవల్ల అతడు వెంటనే ప్రత్యుత్తరం ఇచ్చేందుకు తటపటాయించాడు.

ధర్మపాణి ఒకటి-రెండు క్షణాలాగి మళ్ళీ, "సవ్యసాచినీ - అభినవ అర్జునుణ్ణనీ వల్లమాలిన అహంకారంతో విచ్చలవిడిగా అందరినీ అవమానించపూనుకున్న జగ్గరాజును యుద్ధంలో నీ కత్తికి ఎరచేశావు. ఆ కీర్తి ఒక్కటే చాలు నీకు, ఎంత కులీన కన్యనైనా వధువుగా చేసేందుకు," అన్నాడు.

జయసింగూ, ఓబలరాజూ అవునన్నట్లుగా తలలూపారు.

అప్పటికి అగ్నిపాలుడు తెప్పరిల్లాడు. అతడు ధర్మపాణికేసి కృతజ్ఞత ఉట్టిపడేలా చూస్తూ, "పాణీ! నీ మాటలు నిజంగా నాకెంతో ఆనందాన్ని కలిగించినై. కాని, కత్తియుద్ధంలో అజేయుడని పించుకున్న ఆ జగ్గారావుతో ఏ కారణం వల్ల నాకు శత్రుభావం కలిగిందో కూడా అందరికీ తెలిసిందే. ఒక వారకాంత కోసం మేం కత్తులు దూసుకోవటం, అతణ్ణి నేను వధించటం - నాకదేమంత గౌరవప్రదమైనది కాదనుకుంటాను," అన్నాడు.

"అది వారివారి మనఃప్రవృత్తిని బట్టి గౌరవప్రదమో, అగౌరవకారణమో అవుతుంది. జగ్గరాజు ఒకవిధంగా లోకకంటకుడు. కత్తిసాములో తనకున్న నైపుణ్యాన్ని ఆధారంగా చేసుకుని దాదాపు పది సంవత్సరాలపాటు అతడు రాజ్యంలోని ప్రతి ఒక్కరినీ ఏదో ఒక నెపం మీద అవమానపాలు చేశాడు. కొందరిని హత్య చేశాడు. అటువంటి కంటకుడు నీ కత్తికి ఎరకావటం అంటే, అందుకు కారణం అయిన తగవు ఒకానొక వారకాంత వల్లనే సంప్రాప్తమయినా, అది తప్పక గర్వకారణమవుతుందనే, నేను భావిస్తున్నాను. ఓబలరాజూ, జయసింగూ కూడా నాతో ఏకీభవిస్తారనుకుంటాను," అన్నాడు ధర్మపాణి.

"అటువంటి కీర్తి కోసం కావాలంటే నా సర్వస్వం అర్పిస్తాను," అన్నాడు జయసింగ్.

"జగ్గరాజు అంతవాణ్ణి కత్తియుద్ధంలో ఓడించాననే పేరు నాకెవ్వరైనా ఇవ్వగలిగితే దానికి బదులుగా వెయ్యేళ్ళు నరకవాసం చేసేందుకైనా ఒప్పుకుంటాను," అన్నాడు ఓబలరాజు.

అంతలో ఒక నౌకరు పత్రం ఒకటి తెచ్చి అగ్నిపాలుడికి అందించాడు. దీపం వెలుగులో దాన్ని చదివి, ఆశ్చర్యంగా అందరికేసీ చూసి కంఠస్వరం తగ్గించి, "అవజ్ఞవర్మ!" అన్నాడు.

ఆ పేరు వింటూనే అందరూ ద్వారంకేసి తలలు తిప్పారు. అదే సమయంలో చేరగిలవేసి ఉన్న తలుపును సగం వరకు తెరిచి, గతుక్కుమని, అంతలోనే చిరునవ్వుతో తలుపు బార్లా తోసి, అవజ్ఞవర్మ గదిలోకి అడుగు పెట్టాడు.

"స్వాగతం, సుస్వాగతం!" అంటూ అగ్నిపాలుడు మందహాసం చేశాడు.

అవజ్ఞవర్మ ముఖం చిట్లించి, "అగ్నీ!..... వయసులో నేను మీ నలుగురికన్న ఓ పదేళ్ళు పెద్ద కావచ్చు. కాని, నేనూ మీ స్నేహకోటిలోని వాడినే," అన్నాడు.

"అంటే జరిగిన అవమానంలో మమ్మల్ని కూడా పాలుపంచుకోమనా నీ ఉద్దేశం?" అన్నాడు ఓబలరాజు తొణక్కుండా.



పట్టుమెత్త మీద కూర్చుని, వెనక దిండుకు ఆనుకోబోతున్న అవజ్ఞవర్మ ఛడేలుమని వీపుమీద కొరడాదెబ్బ తిన్నవాడిలాగా ఎగిరిపడ్డాడు. అగ్నిపాలుడు ఓబలరాజుకేసి గుడ్లురుముతూ చూశాడు.

"నీవు దేన్ని ఉద్దేశించి అంటున్నావో నాకేమీ అంతుబట్టలేదు, ఓబలా!" అన్నాడు అవజ్ఞవర్మ, వస్తున్న కోపాన్ని తొక్కిపడుతూ.

ఓబలరాజు ఏదో జవాబు చెప్పబోయేంతలో అగ్నిపాలుడు విసుక్కుంటూ అతణ్ణి వారించి, "ఇది నా గృహం! ఇక్కడ ఉన్న ప్రతి ఒక్కరూ నాకు స్నేహితులే కాదు, అతిథులు కూడా. స్నేహితుల మధ్య కీచులాటైతే నేను పట్టించుకోనేమో కాని, నా అతిథుల మధ్య మాత్రం అలాంటిది జరగటానికి నేనొప్పుకోను. ఇక, ఓబలరాజనే అవమానం సంగతి! అది నిజంగా అవమానమే అయితే అది ఒక్క అవజ్ఞవర్మదే కాదు, ఈ చంద్రగిరి రాజ్యంలోని ప్రతి ఒక్కరిదీ. నా ఉద్దేశంలో మాత్రం అది అవమానం కాదు - దురదృష్టం. ఒక బలవంతుడైన మాండలికుణ్ణి మన రాజ్యానికి అప్తుణ్ణి చేసుకోలేకపోయాం - అంతే!" అన్నాడు.

అగ్నిపాలుడి కంఠస్వరంలోని కాఠిన్యం అందరినీ చకితులను చేసింది. కొద్దిసేపు ఎవరూ మాట్లాడలేకపోయారు.

ఆ తరవాత అవజ్ఞవర్మ తెప్పరిల్లినట్టు కనిపించాడు. అతడు చిరునవ్వుతో అగ్నిపాలుడికేసి ఓ క్షణకాలం చూసి, "అగ్నీ! వయసులో





చిన్నవాడివైనా, నీ లోకజ్ఞానం మెచ్చదగింది. నవభోజ ప్రభువులవారికి నాయందున్న ప్రత్యేకాదరణ కారణంగా అనుకుంటాను. నన్ను మల్లూరు సంస్థానానికి పంపారు. నేను అక్కడికి వెళుతున్న కారణం అప్పట్లో నాకూ, ప్రభువులకూ తప్ప మరెవరికీ తెలియదు. తన కొమార్తెను ఆకర్షించి, వరింపచేసుకునేందుకు నేను వస్తున్నాననే సంగతి ముందుగా ఆ మాండలికుడికి తెలిసినా లేక ఆయన కొమార్తెకు తెలిసినా, నే వెళ్ళే కార్యం చెడటమే కాక, అవమానంపాలు కావలసి వస్తుందని నాకు తెలుసు. ఈ కన్యాగ్రహణ కార్యానికి నేను అర్హుణ్ణి కాదేమో అన్న సంశయం కూడా నేను ప్రభువులవారి దృష్టికి తెచ్చాను. కాని రాచ కుటుంబాలతో, రాచమర్యాదలతో నాకున్న అనుభవాన్ని పురస్కరించుకొని ఆయన నన్నే ఈ కార్యానికి నియోగించాడు. నేను విఫలుణ్ణయ్యాను," అన్నాడు.

ధర్మపాణి చప్పున అందుకుని, "వారవనితా హృదయ చోరత్వం వేరు, రాచకన్యా హృదయ పరిగ్రహణం వేరు! ఆ మొదటిదానిలో పాండిత్యం గడించినంత మాత్రాన ఈ రెండవదానికీ అర్హుణ్ణనుకోవటం పెద్ద పొరబాటు!" అన్నాడు.

అవజ్ఞవర్మ చిన్న మందహాసం చేసి ఊరుకున్నాడు. అగ్నిపాలుడు మాత్రం ధర్మపాణికేసి కోపంగా చూశాడు.

"కార్యం వమ్మయిన సంగతి ఇంకా ప్రభువుల వరకూ పోలేదనుకుంటాను," అన్నాడు జయసింగ్.

"ప్రభువులతో ఈ వైఫల్యం గురించి నివేదించటం ఎలా? అదీ ఇప్పుడు నన్ను పీడిస్తున్న సమస్య. వారి అంతరంగికుల్లో ఒకడుగా అగ్నికున్న స్థానం అందరికీ తెలిసిందే. అందుకే పనిగట్టుకుని ఇక్కడి కొచ్చాను," అంటూ అవజ్ఞవర్మ అగ్నిపాలుడికేసి సాభిప్రాయంగా చూశాడు.

"నాకేమీ అర్థం కాలేదు వర్మా!" అన్నాడు అగ్నిపాలుడు.

"ప్రభువులకు మొహం చూపేందుకు భయపడుతున్నాను," అన్నాడు అవజ్ఞవర్మ.

"అంటే, ఈ వార్త ప్రభువులకు నన్ను అందజేయమనా నీ అభిప్రాయం?" అని అడిగాడు అగ్నిపాలుడు.

"కేవలం కాదు. నీ అభిప్రాయం తెలుసుకుందామని వచ్చాను. సమయాని కిక్కడ అందరూ ఉండటం నా అదృష్టం...... ముఖ్యంగా ఓబలరాజు!" అంటూ అవజ్ఞవర్మ ఓబలరాజుకేసి చూశాడు.

"ఒక మారుమూల పల్లెలో ఉన్న కన్యను చేపట్టేందుకు ఇంత లోకానుభవమూ, కళానైపుణ్యమూ ఉన్న నీవల్ల కాలేదంటే నాకు నవ్వొస్తున్నది. నీ స్త్రీజనాకర్షణ శక్తీ, శృంగార సామగ్రీ ఏమయినట్టు, వర్మా?" అన్నాడు జయసింగ్.

అవజ్ఞవర్మ ఆ ఈసడింపు మాటలనేమీ

గుర్తించనట్టుగా చిరునవ్వు నవ్వి, "ఆ మల్లూరు ప్రభువు ఏకైక పుత్రిక వకుళమాలను చూసివుంటే నువ్విలా మాట్లాడవు. స్త్రీజనాకర్షకమని మనం భావించే ఏ సాధన సామగ్రీ ఆమెను కదిలించ లేవు. నేను మహారాజాధిరాజైన నవభోజుని ఆంతరంగిక మిత్రుణ్ణని చెప్పుకున్నా, ఆమెకు చీమకుట్టినట్టయినా కాలేదు. అసలామెకు స్త్రీసహజమైన వాంఛలున్నవా అనేది కూడా నాకు సందేహమే! ఆమెను హిమాలయాన్నుంచి జారిపడిన మంచుముద్దతో పోల్చవచ్చు," అన్నాడు.

"ఆ మంచుముద్దను కరిగించగలిగేది అగ్ని ఒక్కటే! అగ్నిపాలుడు నెరవేర్చవలసిన కార్యాన్ని నీ నెత్తికి ఎత్తుకోవటం అంత బుద్ధిమంతనం కాదు," అన్నాడు ఓబలరాజు.

అవజ్ఞవర్మ ఏ మాత్రం చలించలేదు - "చూతాం, ప్రయత్నించమను!" అని ఊరుకున్నాడు.

"పందెం!" అంటూ ఓబలరాజు ఆసనం మీది నుంచి లేచి నిలబడ్డాడు.

"నా సంస్థానం!" అన్నాడు అవజ్ఞవర్మ తాపీగా.

"చాలు, చాలు, ఆపండి!" అంటూ అగ్నిపాలుడు ఓబలరాజూ, అవజ్ఞవర్మల ముందుకు వచ్చాడు. అతని కళ్ళు ఓసారి అవజ్ఞవర్మనూ, ఓబలరాజునూ నఖశిఖపర్యంతం పరీక్షించి చూసినై. చివరికతడు తీక్షణంగా అవజ్ఞవర్మకేసి చూస్తూ, "అవజ్ఞవర్మా! ఇప్పుడు నీవు మాట్లాడిన తీరులో విజ్ఞత ఆవగింజ మాత్రం కూడా లేద
ఈనాటి రాజ్యపరిస్థితులు నీకు తెలియనివి కాక్ష
ఇప్పటికే ఉత్తర సరిహద్దుల్లో అరాజకంతోపాట
మనకూ, కాలభోజుడికీ మధ్య చిన్న చిన
యుద్ధాలు కూడా జరుగుతున్నవి. చంద్రగి
రాజ్యానికి తనే న్యాయమైన వారసుణ్ణనే కా
భోజుడి వాదంతో మనం ఏకీభవించకపోయినా
మన రాజ్యాన్ని సర్వనాశనం చేయాలని చూస్తు
చాళుక్యులకూ, గాంగులకూ అందులో న్యాయ
కనబడవచ్చు - వాళ్ళు కాలభోజుడికి చాటుగ
అప్పుడప్పుడూ సహాయం చేస్తున్నారు. కాని, వార
మన రాజ్యపుటెల్లలు దాటాలంటే మల్లూర
మండలం నుంచి ఉన్న మార్గమే శరణ్యం. అం
తప్పనిసరైతే వాళ్ళు ఇతర మార్గాలు కూడా అల
చించవచ్చు. ఇలాంటి విషమ పరిస్థితుల
మల్లూరు మండలాధిపతి మనకెంతో సహా
కారి. కాని కాలభోజుడికీ, ఆయనకీ ఎక్కడ
దూరపు చుట్టరికం ఉన్నట్టు వింటున్నాం. కనుక
దాని ప్రభావం అతడి మీద పనిచేయకుండ
చేయాలంటే అతని ఏకైక పుత్రిక అయిన వకు
మాలను మన ప్రభువులపై భక్తిప్రపత్తులు ఉన్న
వారెవరైనా వివాహమాడటం రాజ్యానికి క్షేమ
కరం. ఆ పని సాధించేందుకు ప్రభువుల దృ
నీమీద ప్రసరించి ఉండవచ్చుగాని, నీలోనే గన
నమ్రతా, నిరహంకారతా లేశప్రాయంగా ఉన్నా
అందుకు నీవంగీకరించేవాడివి కాదు. నీ దు





హంకారం, నిర్లజ్జతే నిన్ను ఈ అవమానంపాలు చేసింది. అంతేకాక, రాజ్యానికి కూడా తీరని హాని కలిగించింది," అన్నాడు.

ఓ నిమిషకాలం అంతా నిశ్శబ్దం. ఎవరూ మాట్లాడలేదు, కదలలేదు. ఆఖరుకు అవజ్ఞవర్మ అగ్నిపాలుడికేసి ఓరచూపులు చూస్తూ, "అవును. నేను నా ఓటమివల్ల చంద్రగిరి రాజ్యానికి కూడా చాలా నష్టం కలిగించాను. కాని, నాకన్న స్ఫురద్రూపం, సంపదా, కీర్తిప్రతిష్టలూ ఉన్న నీవు నీ ప్రభుభక్తి, దేశభక్తి ప్రోత్సాహంతో అయినా ఆ మల్లూరు మండలాధీశుని కుమార్తెను వరింప చేసుకుని, వివాహం ఆడి, అతడిని నవభోజ ప్రభువుకు హితుణ్ణిగా చేయటం మంచిది. ఇందులో నీకు దేవకన్యను పోలిన వకుళమాల సహధర్మచారిణి అవడమేకాక నా సంస్థానం, ప్రభువుల కృతజ్ఞతా కూడా లభించే అవకాశం ఉంది," అన్నాడు.

అగ్నిపాలుడికి అవజ్ఞవర్మ గొంతులోని కాఠిన్యం, 'చాతనైతే నాతో పందెం వేయి. నేను తయారే!' అన్న ధోరణీ చాలా కోపం తెప్పించినై. అయినా అతడు కోపావేశాన్ని తొక్కిపట్టి, "అవజ్ఞవర్మా! కావాలంటే నీతో ఈ విషయంలో తప్ప మరెందులోనైనా పందెం వేయగలను. నేనెంత ఉడుకు పాలపొంగులో ఉన్న ముప్పై ఏళ్ళ యువకుణ్ణయినా, ఎంత సౌందర్యవంతురాలైన కన్యనైనా సరే ప్రేమించి వివాహం ఆడగలనుకాని, పందెం కోసం వివాహం చేసుకోలేను," అన్నాడు.

"అందని ద్రాక్షపళ్ళ కథ అందరికీ తెలిసిందే! నేనవమానింపబడినట్టు నీ స్నేహితులంతా ఎందుకు భావిస్తున్నారో నాకర్థం కావటంలేదు. నేను ప్రయత్నించి సాధించలేని వయారిని మరే పురుషుడైనా సరే - ఆఖరికి అగ్నిపాల సంస్థానాధిపతి, అగ్నిపాలుడైనా సరే సాధించలేడు. ఆ సంగతి ప్రత్యక్షంగా ఇప్పుడు రుజువైంది" అన్నాడు అవజ్ఞవర్మ.

"ఇది కవ్వించటం!" అన్నాడు అగ్నిపాలుడు.

"కేవలం ఉబుసుపోని మాటలు... వాచాలత!" అన్నాడు ఓబలరాజు.

అవజ్ఞవర్మ ఓబలరాజుకేసి కోరగా చూశాడు.

"తాచెడ్డకోతి... శివశివా!" అన్నాడు ధర్మపాణి.

జయసింగ్ దిండుమీద చేరగిలబడి, "ఆహా!" అంటూ పొట్టచెక్కలయేలా నవ్వసాగాడు.

అవజ్ఞవర్మ అందరికేసీ నిప్పులు చెరిగే కళ్ళతో ఓ మారు చూసి, గోటితో మీసం గీటుతూ, "ఇది విదూషకుల గోష్ఠి కాదనుకుంటాను! అదే నిజమైతే, పోటు మాటలతో పనిలేదు. ఇక్కడ మగటిమి ఉన్నవాడెవడైనా ఉంటే, నా సంస్థానాన్ని ఒడ్డుతున్నాను. మల్లూరు యువరాణి వకుళమాలను భార్యగా చేపట్టండి!" అన్నాడు.

ఆ మాటలతో అగ్నిపాలుడు అగ్గిపిడుగులా అయాడు. అతడు క్రోధావేశంవల్ల వణుకుతున్న కంఠస్వరంతో ఇలా అన్నాడు :



అవజ్ఞవర్మా! నీ అవమానం, చేతగానితనంలో
పాలుపంచి, ఆ విధంగా నవభోజ ప్రభువుల
లో నన్నూ కించపరచటానికి నువ్వు ఎత్తు
కు వచ్చినట్టు ఇప్పుడు నేను గ్రహించాను.
ారీచ ప్రక్రియకు ఓబలరాజు దుందుడుకు
బాగా సహకారి అయింది. సరే, ఇప్పుడు
గిపోయిందేమీ లేదు. నేనూ పందెం ఒడ్డ
కి తయారుగా ఉన్నాను. మల్లూరు మండలా
సి కుమార్తె వకుళమాలను నేను భార్యగా
ించలేకపోతే, నా సంస్థానం నీ పరం
ను. ఒకవేళ నేనామెను భార్యగా తేగలిగితే
ఒడ్డగల పందెం ఏమిటి?"
ఇంతకుముందే చెప్పాను. నా సంస్థానం నీ
పరం చేయటానికి సిద్ధం!" అన్నాడు అవజ్ఞవర
తొణక్కుండా.

"అది పేరుకు సంస్థానం... అయినా అంగీకర
స్తున్నాను. కాని, ఒకమాట! వకుళమాల వి
యమై మనం పందెం వేసుకున్నట్టు నవభో
ప్రభువులకు తెలియకూడదు. అందుకు అంగీకా
మేనా?" అన్నాడు అగ్నిపాలుడు.

"నిరభ్యంతరంగా! కాని, నీ స్నేహితుల మా
మిటి? వారాయనతో చెప్పవచ్చుకదా!" అన్నాడ
అవజ్ఞవర్మ ఎంతో ఏవగింపు కనబరుస్తూ.

"ఇది చాలా లజ్జాకరమైన పందెం!" అన్నాడ
జయసింగ్.

"ఈ పందెం సంగతి ప్రభువులకు తెలిస్తే మీ
ఇద్దరికీ దేశ బహిష్కారం తప్పదు," అన్నాడు ధర్మపాణి.

"ఇందులో లజ్జపడవలసిందీ, సిగ్గుపడవలసిందీ ఏమీ లేదు. జూదం శాస్త్ర సమ్మతం. కుక్క వెంబడే తోకలాగా, జూదంతోపాటే పందెం ఉంటుంది. కనుక, అదీ శాస్త్ర సమ్మతమేనన్న మాట. పంచమ వేదాన్ని మనకు ప్రసాదించింది పందెం కాదా? పైగా..."

"అంతటితో ఆపు ఓబలా!" అంటూ అగ్నిపాలుడు ఓబలరాజుకేసి కన్నెర్ర చేశాడు.

ఓబలరాజు మాట మధ్యలోనే ఆగిపోయాడు.

తరువాత అగ్నిపాలుడు అవజ్ఞవర్మకేసి తిరిగి, "సరే, పందెం నిశ్చయమయింది. దానికి సంబంధించిన నియమనిబంధనలు రాసుకుందామా?" అన్నాడు.

"ఓం, నిరాక్షేపణగా!" అంటూ అవజ్ఞవర్మ చిరునవ్వు నవ్వాడు.

ఆ వెంటనే నౌకరొకడు కలమూ, కాయితాలూ తెచ్చి అక్కడ పెట్టాడు. ఓబలరాజు క్షణాల మీద ఆ పందెం సంగతీ, అందులో ఒడ్డిన ఆస్థిపాస్థుల సంగతీ రాసి అగ్నిపాలుడూ, అవజ్ఞవర్మా చేవ్రాళ్ళు చేసింతరువాత, ఆ కాయితాలను పరస్పరమూ మార్పిడి చేసి, ఒకటి అవజ్ఞవర్మకూ, రెండవదాన్ని అగ్నిపాలుడికీ ఇచ్చాడు.

- 2 -

ఇది జరిగిన మరుక్షణంలోనే అవజ్ఞవర్మలో ఎక్కడలేని మార్పూ వచ్చింది. అతడు అందరికేసీ మందహాసంచేసి, ఆప్యాయత ఉట్టిపడే గొంతుతో, "ఈ జరిగినదానికి కోపగించుకోరనుకుంటాను. ఒకవేళ ఈ పందెంలో నేను ఓడి, అగ్ని గెలవటం అంటే నేను నా సర్వస్వాన్నీ కోల్పోయి బికారిని కావటమే కదా! అలాకాక అగ్ని ఓడటమంటూ జరిగితే... అతడు ఆ సంస్థానం పోయినా నాకన్న యువకుడూ, రాజగౌరవపాత్రుడూ గనక త్వరలోనే తిరిగి అంత పెద్ద సంస్థానాన్నీ సంపాయించుకోగలడు!" అన్నాడు.

ఆ మాటలకు అగ్నిపాలుడు నవ్వాడు.

"అవజ్ఞా! నీవు ఈ పందెం విషయంలో నన్ను తెలివిగా బుట్టలో వేయగలిగానని గర్విస్తున్నట్టున్నది. ఈ పందెం సంగతి ప్రభువులకు తెలిసే అవకాశమే లేదు. ఒకవేళ విధివశాన నేను ఓడిపోయి, నా సంస్థానాన్ని నీకు ధారాదత్తం చేసినా, ఆ సంగతీ ప్రభువుల దృష్టికి రాకుండానే జరిపించవలసి ఉంది. పైగా నా ఆస్థిపాస్థులను పందెంలో ఓడిన తరవాత, తిరిగి అంత ఆస్థిమంతుణ్ణి కావటానికి ప్రభువులను ఆశ్రయించటం కన్న నీచం మరేమీ ఉండదు. ప్రగల్భాలనుకోకపోతే, నా కత్తే తిరిగి అంత సంస్థానాన్నీ నాకు సంపాయించి ఇవ్వగలదు ఎక్కడో ఒకచోట. తెలిసిందా?" అన్నాడు.

అవజ్ఞవర్మకు ఇక అగ్నిపాలుణ్ణి రెచ్చగొట్టడం ప్రమాదకరమని తెలిసిపోయింది. అతడు లేని

సంతోషాన్ని కనబరుస్తూ, "సరే, ప్రస్తుతానికి సెలవు. మళ్ళీ కలుసుకుంటాను," అంటూ అగ్నిపాలుడి జవాబుకు నిరీక్షించకుండా లేచి బయటికి వెళ్ళిపోయాడు.

అవజ్ఞవర్మ ద్వారం దాటేంతవరకూ అందరూ అతడికేసే చూసి, తరవాత ముఖముఖాలు చూసుకున్నారు.

"నేను మాత్రం ఇప్పుడు జరిగిన దానికి చాలా సంతోషిస్తున్నాను," అంటూ ప్రారంభించాడు ఓబలరాజు.

"బ్రహ్మచారి ముదిరినా, బెండకాయ ముదిరినా నిరుపయోగం అంటారు పెద్దలు. ఇరవై ఏళ్ళయినా నిండీ నిండకముందే వివాహం ఆడి, పిల్లాజెల్లలతో హాయిగా గృహస్థ జీవితాన్ని అనుభవిస్తున్నవారిని చాలామందిని మనం ఎరుగుదుం. రూపం, సంపదా, కీర్తిప్రతిష్ఠలే కాక, రాజాశ్రయం కూడా ఉన్న మన అగ్ని, ఈ ముప్పై ఏళ్ళ వయసులో కూడా తనకు ఓ సహధర్మచారిణి కావాలన్న ఆదుర్దా ప్రదర్శించకపోవటం నిజంగా నాకు చాలా ఆదుర్దా కలిగించింది. ఇప్పటికి – ఆ అవజ్ఞుని పుణ్యమా అని, మన మిత్రుడు ఓ గృహస్థు అవబోతున్నందుకు నేను చాలా సంతోషిస్తున్నాను," అన్నాడు.

జయసింగ్, ధర్మపాణీ అతడికేసి కోపంగా చూశారు. అగ్నిపాలుడు తల వంచుకున్నాడు. తాము ఏదో పెద్ద అమర్యాదకరమైన పనిచేసినట్టు, వాళ్ళు లోలోన బాధపడుతున్నారని స్పష్టమౌతున్నది.

"ఓబలా, నువ్విక గృహోన్ముఖుడవటం అన్ని విధాలా మంచిది. ఒకవేళ అగ్ని, ఆ మల్లూరు యువరాణి వకుళమాలను ఈ తెల్లవారే లోపల ఇక్కడికి తీసుకువస్తే, ఆ సంగతి నీకు వార్త పంపుతాంలే," అన్నాడు జయసింగ్.

"ఆ వార్త నేనే స్వయంగా మోసుకువస్తాను సరేనా?" అన్నాడు ధర్మపాణి.

ఆ మాటల వెనకవున్న అవహేళన, ఆగ్రహావేశాలను అర్థంచేసుకున్న ఓబలరాజు చప్పున అగ్నిపాలుణ్ణి సమీపించి, "అగ్నీ! సెలవు. వస్తానిక," అని చెప్పి, తిరిగి చూడకుండా బయటికి వెళ్ళిపోయాడు.

ఓ క్షణకాలం నిశ్శబ్దంగా దొర్లిపోయింది.

తరవాత ధర్మపాణి గొంతు సవరించుకొని "అగ్నీ! అవజ్ఞవర్మ కపటి, మోసకారి అన్న సంగతి మనందరికీ తెలిసిందే. కాని, ఆ విద్యలో అతడికున్న ప్రావీణ్యాన్ని నీ మీద ప్రయోగించటంలో ఓబలరాజు వాచాలత చాలావరకు సహాయపడింది," అన్నాడు.

"ఓబలరాజు వాచాలత్వం గురించి మనకు తెలుసుకదా! దాదాపు నీ పక్షాన మొదట్లో అతడే పందెం కాసేశాడు. నీవు అడ్డుచెపితే సరిపోయేది అగ్నీ!" అన్నాడు జయసింగ్.

అగ్నిపాలుడు తల ఎత్తి చిరునవ్వు నవ్వాడు.







"మీ ఇద్దరూ ఇప్పుడు జరిగినదానికి పూర్తి బాధ్యత ఓబలరాజు నెత్తికి అంటగడుతున్నారు. అతడి దురుసు మాటలు, అవజ్ఞవర్మకు అవకాశం ఇచ్చిన మాట నిజమే! కాని, అవజ్ఞవర్మ ఇంత రాత్రివేళ ఇక్కడికి వచ్చాడంటే ఉబుసుపోక మాత్రం కాదని నమ్మండి. అతడు మల్లూరు మండలాధీశుడి వల్ల పొందిన అవమానం గురించి పట్టణం అంతా మారుమోగిపోతోంది. ఈ దెబ్బతో తనకు ప్రభువు వద్ద దేవిదేమన్నా జరుగుతుందని అతడు భయపడ్తున్నాడంటే, అందులో మనం ఆశ్చర్యపడవలసిందేమీ లేదు. ఆ వకుళమాల ప్రేమను సంపాయించటం తనవల్ల కాదు గదా, మరెవరివల్ల కూడా కాదని అతడు ప్రభువులకు చెప్పదలుచుకున్నాడు. కాని, వట్టిమాటలయితే ప్రభువులు నమ్మరు. అందుకోసం నన్ను రెచ్చగొట్టి అక్కడికి పంపి, నేనూ అపజయం పొంది వస్తే అప్పుడు తన మాటలకు విలువ ఉండటమే కాక, నా మీద విజయం కూడా సాధించినట్టు అవుతుంది. అవజ్ఞవర్మ వంటివాడు పందెంలో సంస్థానం లాంటి వాటిని ఒడ్డటమంటే, బహుశా ఆ వకుళమాల కొరకరాని కొయ్య అన్న దాంట్లో సందేహించవలసిందేమీ లేకపోవచ్చు," అన్నాడు.

"అవును, అంతే అయివుంటుంది!" అన్నాడు జయసింగ్.

"అయితే ఈ చిక్కులోంచి బయటపడేందుకు



పెద్ద ఆలోచన అవసరంలేదు," అంటూ ధర్మపాణి అగ్నిపాలుడికేసి సాభిప్రాయంగా చూశాడు.

అగ్నిపాలుడు ఆశ్చర్యంగా అతడికేసి చూసి, కనుబొమలు ముడివేశాడు.

"ఈ పందెం సంగతి ఏదోవిధంగా నవభోజ ప్రభువుల చెవిని పడేటట్టు చూస్తే సరి, ఆయన తప్పక అడ్డుకుంటాడు," అన్నాడు మళ్ళీ ధర్మపాణి.

అగ్నిపాలుడి ముఖంలో చిరుకోపం కదలాడింది. అతడు సూటిగా ధర్మపాణి కళ్ళల్లోకి చూస్తూ, "పాణీ! నీవిలాంటి అవమానకరమైన ఆలోచన చేయగలవని నేననుకోలేదు. నీవు చెప్పిన విధంగా చేసిననాడు, నా గౌరవ మర్యాదలు ఏమయేట్టు? కోపావేశంలో పందెం ఒడ్డి, అది చల్లారగానే పిరికితనంతో దాన్నుంచి బయట పడేందుకు ప్రభువుల శరణుజొచ్చానని అవజ్ఞవర భావించడా? నేను బికారినయేందుకైనా సిద్ధవే కాని..... మానమర్యాదలను కోల్పోయేందుక మాత్రం కంఠంలో ప్రాణమున్నంతవరకూ అంగీక రించను," అన్నాడు.

ధర్మపాణీ, జయసింగ్‌లు మాట్లాడలేదు.

అగ్నిపాలుడు కొంచెం ఆగి, "సరే, జరిగిపో యిందేదో జరిగిపోయింది. పందెం గెలుచుకునేం దుకు ప్రేమ నటించి, ఒకానొక కన్యను భార్యగ స్వీకరించటం అన్నదే నీచాతినీచం. దురదృష వశాత్తూ నేను ఈ విషవలయంలో చిక్కుకున్నాను చూద్దాం, ఏం జరుగుతుందో!" అన్నాడు.





"ఏం జరిగినా సరే, నేను సర్వవేళలా నీకు సహాయపడేందుకు సిద్ధంగా ఉంటాను. నీవు మాటమాత్రంగా కబురు పంపితే చాలు," అన్నాడు జయసింగ్.

ధర్మపాణి కూర్చున్నచోటునుంచి లేచి, అగ్నిపాలుణ్ణి సమీపించి, అతడి భుజాన్ని ఆప్యాయంగా తట్టుతూ, "అగ్నీ! ఇందులో నీకు విజయం కలగాలని నేను దేవుణ్ణి ప్రార్థిస్తున్నాను. అదృష్టం కలిసివచ్చి నీవు వకుళమాలను భార్యగా పొందగలిగావంటే, పందెం మాట ఎలా ఉన్నా అది గొప్ప విజయంగానే భావించవచ్చు. ఆమె సౌందర్యాన్ని గురించి నేను చూచాయగా విన్నాను. సరే, నేను వెళ్ళివస్తాను, పొద్దుపోయింది. నీవు చేసుకోవాల్సిన ఏర్పాట్లు చాలా ఉన్నవి కదా," అంటూ వెనుదిరిగాడు.

అతడితోపాటే జయసింగ్ కూడా బయలుదేరి వెళ్ళిపోయాడు.

స్నేహితులిద్దరూ అలా బయటికెళ్ళగానే అగ్నిపాలుడు పరుపు మెత్తల మీద నుంచి లేచి, తల వంచుకుని గదిలో అటూ ఇటూ కొద్దిసేపు పచార్లు చేశాడు. తరవాత ఏదో ఒక నిశ్చయానికి వచ్చినట్టు తలాడించి, వాకిలికేసి చూస్తూ, "ఎవరక్కడ? మాహూ!" అని కేక పెట్టాడు.

ఆ వెంటనే నిగనిగలాడే నల్లని శరీరంతో ఆజానుబాహుడైన ఒక వ్యక్తి బుంగమీసాలను వేళ్ళతో సవరించుకుంటూ లోపలికి వచ్చి, ఓర చూపుల్తో అగ్నిపాలుడికి అల్లంత దూరంలో నిలబడి, "అయ్యా!" అన్నాడు.

అగ్నిపాలుడు అతడికేసి అనుమానంగా చూస్తూ, "ఏం, అంతా విన్నట్టున్నావే?" అని అడిగాడు.

"చిత్తం! అంతా కాదుగాని కొంత విన్నాను," అన్నాడు మాహూ ముక్తసరిగా.

"నాకు తెలుసు నువ్వు ఆ తలుపు వెనక నిలబడి అంతా వింటూనే ఉంటావని. అయినా ఈ మధ్య నీకు పనీపాటూ ఏమీలేక శరీరం కూడా దొందుబారుతున్నది. ఇప్పుడు, ఈ ప్రయాణంలో గాని నీ అంతు తేలదు," అన్నాడు అగ్నిపాలుడు.

"చిత్తం. ప్రయాణమా? ఎక్కడికి?" అన్నాడు మాహూ అమాయకంగా ముఖంపెట్టి.

"అంతా విన్నావు కదా! మళ్ళీ ప్రశ్నిస్తావేం?" అన్నాడు అగ్నిపాలుడు విసుగ్గా.

"అయ్యా, అంతా ఏదో తమాషా అనుకున్నాను. దేశ పరిస్థితులు మీకు తెలియనివి కాదు గదా?" అన్నాడు మాహూ వినయంగా.

"నీ దుర్వినయమంతా నా ముందు ప్రదర్శించకు. దేశపరిస్థితులు... అంటే?" అన్నాడు అగ్నిపాలుడు కోపం, ఆశ్చర్యం కలిసిన స్వరంతో.

"మధ్యాహ్నం రాజప్రాసాదం వైపుకు వెళ్ళాను. ఎక్కడ చూసినా ప్రజలు గుంపులుగుంపులుగా కూడి చెప్పుకుంటున్నారు! ప్రభువువారి మిత్ర కోటిలోవారు గనక, మీకు వాళ్ళందరికన్న

ఎక్కువే తెలిసి వుండాలి," అన్నాడు మాహూ.

అగ్నిపాలుడికి తన సేవకుడి ధోరణి కోపం తెప్పించింది. అతడు అయిష్టంగా పెదాలు చిట్లించి, "విసిగించక అక్కడ నువ్వు విన్నదేమిటో వివరంగా చెప్పు," అన్నాడు.

"కాలభోజుడు చంద్రగిరి రాజ్యపు ఎల్లలు దాటాడు. అందరూ అనుకుంటున్న మార్గాన కాక ఆయన కృష్ణానదిని మానుకోటవద్ద దాటి, దేశంలోకి చొచ్చుకువస్తున్నట్టు తెలుస్తున్నది. ఆయన వెంట కొంత చాళుక్య సైన్యం కూడా ఉన్నట్టు వినికిడి," అన్నాడు మాహూ భయంతో అగ్నిపాలుడి ముఖం చూస్తూ.

సేవకుడి మాటలు విని అగ్నిపాలుడు కొంచెం సేపు అటూ ఇటూ పచార్లుచేసి, మాహూ వైపుకు రెండడుగులు వేసి, "మాహూ! నువ్వు విన్నవన్నీ ఆ కాలభోజుడి పక్షీయులు ఈ రాజధానీ నగరంలో ప్రచారంలోకి పెట్టిన నీలివార్తలయి ఉంటవి. ఇంత త్వరలో కాలభోజుడు కృష్ణానదిని దాటగలగటం అసంభవం. నది ఈవలనున్న మన సేనలు చూస్తూ ఊరుకోవు కదా!" అన్నాడు.

"అవును. పెద్ద పోరాటం జరిగిన తరువాతే మన సైన్యాలు వెనక్కు తగ్గటం, మానుకోట కాలభోజుడి వశం కావటం జరిగింది. ఇవి కాలభోజుడి చారులు పుట్టించే వదంతులు కావు. కోటలో ఉండేవారి ద్వారానే విన్నాను," అన్నాడు మాహూ.

"అయితే నువ్వు కూడా రాజాస్థానంలో ప్రవేశించాలని చూస్తున్నావన్నమాట! బావుంది," అంటూ అగ్నిపాలుడు నవ్వి, "రాజాశ్రయం సంపాయించడానికి రాజకీయాల్లో ప్రవేశం ఉండటం మంచి యోగ్యతే! కాని ప్రస్తుతం నువ్వు నా దగ్గిర నౌకరీలో ఉన్నావన్న సంగతి మాత్రం మరిచిపోకు," అన్నాడు.

"చిత్తం! నేను మీ దగ్గిరే కాదు, మీ తండ్రిగారి దగ్గిర కూడా నౌకరీ చేశాను," అన్నాడు మాహూ. అతని గొంతులో గర్వం ప్రతిధ్వనించింది.

అగ్నిపాలుడు తనలో నవ్వుకున్నాడు. మాహూ తన తండ్రి నుంచి తనకు సంక్రమించాడు. క్రమేణా తన నౌకర్లందరి మీదా నాయకుడు కావడమేగాక, తనకు అంగరక్షకుడయ్యాడు. అందువల్లనే అప్పుడప్పుడూ తన మాటలకు ఎదురు చెపుతూంటాడు. అడపా దడపా సలహాలు కూడా ఇస్తూంటాడు. అతడి స్వామిభక్తీ, చాకచక్యం చూసి అగ్నిపాలుడివేమీ అంతగా పట్టించుకోడు.

"సరే, మనం ప్రస్తుతం ఆలోచించవలసిన దానికీ, ఈ కాలభోజుడు కల్పిస్తున్న అరాజకానికీ ఏమీ సంబంధం లేదు. తన సైన్యం, ఆయుధ సంపత్తీ, అనుభవశాలురైన సేనానులూ ఉన్న నవభోజ మహారాజుకు ఈ పితూరీలను అణచటం ఏమంత లెక్కలోది కాదు. కనుక, ఆ గొడవలన్నీ ప్రస్తుతానికి మనం మరిచి పోదాం,"





అన్నాడు అగ్నిపాలుడు.

"కాని, మనం పోవలసిన దారి ఈ యుద్ధం జరుగుతున్న ప్రదేశం నుంచే గదా!" అన్నాడు మాహూ నసుగుతూ.

"అంటే మా సంభాషణ కొంచెం కాదు, సర్వం విన్నావన్నమాటే!" అంటూ అగ్నిపాలుడు కనుబొమలు ముడిచి, "ఫర్వాలేదు. ఎలా అయినా ఈ సంగతి నీకు చెప్పక తప్పేది కాదులే. ఒకవేళ నీవా మల్లూరు మాండలికుడిని కూడా ఎరిగి వుండవు కదా!" అన్నాడు.

"అవును. ఆ మల్లూరు మాండలికుణ్ణీ నేనెరుగుదును. ఇరవై ఏళ్ళ క్రితం మీ తండ్రిగారు ఆయనకు ఓ నెల రోజులపాటు అతిథిగా ఉన్నారు కూడా!" అన్నాడు మాహూ.

ఆ మాటలు వింటూనే అగ్నిపాలుడు సంభ్రమాశ్చర్యాలలో మునిగిపోయాడు.

"నిజమా మాహూ! నిజమా?" అన్న అగ్నిపాలుడి ప్రశ్నకు మాహూ చిరునవ్వు నవ్వుతూ, "నిజం ప్రభూ! అప్పుడు మీకు పదో ఏడు. మీరు అమ్మగారి దగ్గిర ఇక్కడే ఉండిపోయారు," అని ఇంకేదో చెప్పబోయి ఆగాడు.

"ఏమిటి……చెప్పు!" అంటూ అగ్నిపాలుడు మాహూ ముఖంలోకి ఆశ్చర్యంగా చూసి, "అయితే నీవాయన కుమార్తె వకుళమాలను కూడా చూశావన్నమాట! అవునా?" అని అడిగాడు.

"చూశాను… ఉయ్యాల తొట్టెలో! మీరు ఇక్కడ ఆ విషయమై వాదులాడుకోవటం వినేవరకూ నాకు ఆ తొట్టెలో ఉన్నది అమ్మాయి అని తెలియదు," అన్నాడు మాహూ.

"అదృష్టం అంటే ఇలా ఉండాలి!" అని అగ్నిపాలుడు నవ్వి, "మాహూ, మనం ఈ తెల్లవారుఝామునే బయలుదేరుతున్నాం," అన్నాడు.

మాహూ మాట్లాడలేదు.

"ఇప్పటికి ఇరవై ఏళ్ళ కిందట అయినా – ఒకసారి ఆ ప్రాంతం అంతా చూసివచ్చినవాడివి కనక, నీ సహాయంతో దారితప్పకుండా ఆ మల్లూరు మండలం చేరుకోవచ్చు!" అన్నాడు మళ్ళీ అగ్నిపాలుడు స్వగతంలా.

మాహూ అయిష్టంగా తలాడిస్తూ, "ఆ ప్రాంతాల సాగుతున్న యుద్ధంలో మనం ఒకవేళ చిక్కుకోవలసివస్తే?" అన్నాడు.

"మనం ఆ గొడవల్లో చిక్కుకునే అవకాశం లేదు. ఒకవేళ చిక్కుకుంటే అప్పుడు చూసుకుందాం," అన్నాడు అగ్నిపాలుడు గంభీరంగా.

మాహూ తలవంచుకు ఊరుకున్నాడు.

"మనం తెల్లవారుజామున బాగా చీకటి ఉండగానే బయలుదేరాలి. మనం ఏ పనిమీద ఎక్కడికి వెళ్తున్నామో, ఇతర్ల కెవరికీ తెలియకూడదు. అందువల్ల దీన్ని చాలా రహస్యంగా ఉంచాలి. నాకు పడుకునేందుకు వీలుగా పరుపులు అమర్చి, బండిని సిద్ధంచేయించు. పదీపన్నెండు మంది సర్వాయుధాలతో, గుర్రాల మీద నాకు రక్షణగా



రావాలి. నా కవచం, కత్తీ, దుస్తులూ – అన్నీ సిద్ధపరుచు. ఒకటి రెండు బళ్ళమీద దారిలో మనకు అవసరమయ్యే అన్ని పదార్థాలూ, వంట సామగ్రీ కూడా వేయించు. తెలిసిందా?" అన్నాడు అగ్నిపాలుడు.

"చిత్తం! మనం అంతర్యుద్ధం ముమ్మరంగా సాగుతున్న ప్రాంతాలకు పోతున్నాం. మన ప్రభువులకు సామంతులుగా ఉండే ఇద్దరు ముగ్గురు కాలభోజుడి పక్షం అయినట్టు కూడా వార్తలు వస్తున్నవి," అన్నాడు మాహూ.

"ఆ సంగతంతా లోగడే ఒకటి రెండుసార్లు చెప్పావు. నిన్ను నేను సలహా అడగటంలేదు. నా ప్రయాణానికి ఏర్పాట్లు చేయమని ఆజ్ఞాపిస్తున్నాను. అంతే, వెళ్ళిక!" అన్నాడు అగ్నిపాలుడు తీవ్రంగా.

మాహూ అగ్నిపాలుడి ముఖంలోకి ఓసారి దీనంగా చూసి, తల వంచుకుని భారంగా ఆ గది నుంచి వెళ్ళిపోయాడు.

- 3 -

ఇంకా జామురాత్రి ఉందనగా అగ్నిపాలుడు తన గృహం నుంచి బయలుదేరాడు.

అతడు కూర్చునేందుకు, నిద్రపోయేందుకూడా వీలుగా అతడెక్కిన బండిలో మెత్తని పరుపులూ, దిండ్లూ అమర్చబడినై. రెండు గుర్రాలను పూన్చిన ఆ బండికి ముందు వెనకల అయిదు గురేసి రౌతులు ఆయుధధారులై బయలుదేరారు.





దారివెంబడి అవసరాల కోసం ఉపయోగించుకునే దుస్తులు, వంటసామగ్రి మొదలైనవన్నీ రెండు బండ్ల మీద పేర్చబడినై. ఆ బండ్ల వెంట కావలిగా నలుగురు కాలిభటులు బయలుదేరారు.

మాహూ తన యజమాని గుర్రం ఎక్కి ఆయన బండి వెంటనే రాసాగాడు.

నవభోజ మహారాజుకు తను వెళుతున్న పని తెలియకుండా ఉండటం మేలని భావించే అగ్నిపాలుడు అంత చీకటిలో అంత రహస్యంగా బయలుదేరాడు. ఒకసారి నగరం వదిలి, కొంత దూరం పోగలిగితే ఆ తరువాత రాజుకు తెలిసినా వచ్చే పెద్ద బాధ ఏమీ లేదనుకున్నాడు అగ్నిపాలుడు.

సరిగ్గా మధ్యాహ్నం భోజనాలవేళకు అగ్నిపాలుడు తన పరివారంతో ఒక చిన్న చిట్టడవి దాటి, ఆ పక్కనే ఉన్న కొండ అంచున గల ఒక కుగ్రామం చేరాడు.

అంత చిన్న గ్రామంలో సత్రం అంటూ ఏమీ లేకపోవడంచేత వంట కార్యక్రమం అంతా పూర్తి చేయవలసిన బాధ్యత మాహూ మీదనే పడింది.

వంట పూర్తయి భోజనాలు చేసింతరవాత, అగ్నిపాలుడు విశ్రాంతి కోసం ఒక చెట్టు నీడను పరుపు వేయించుకుని పడుకున్నాడు. అతడికి కొంచెం కునుకు పట్టే సమయానికి దాన్ని భంగ పరుస్తూ గుర్రపు డెక్కల మోత వినిపించింది.

అగ్నిపాలుడు తృళ్ళిపడి లేచి కూర్చున్నాడు. ఎదురుగా ఒక సైనికుడు నురగలు కక్కుతున్న గుర్రాన్ని ఆపి, "ఈ దాపుల ఎక్కడైనా సత్రం లాటిది ఉన్నదా?" అని మాహూను అడుగుతున్నాడు.

అలాంటిదేమీలేదని మాహూ ఇచ్చిన జవాబుతో సైనికుడు దిగాలు పడుతూ అగ్నిపాలుడికేసి చూశాడు.

అగ్నిపాలుడు మాహూను దగ్గిరకు పిలిచి, బహుశా ఆ రౌతు ఆకలిగొని ఉన్నాడేమో, భోజనం ఏర్పాటు చేయమని చెప్పాడు. మాహూ తిరిగి వచ్చి రౌతుకు ఆ సంగతి చెప్పేసరికి, అతడి ముఖంలో సంతోషం తాండవించింది. మాహూ వల్ల అతడి యజమాని ఎవరో తెలుసుకున్న ఆ సైనికుడు గుర్రం దిగి అగ్నిపాలుడి దగ్గిరకు వచ్చి ప్రణామం చేశాడు.

అగ్నిపాలుడు అతణ్ణీ, అతడు ఎక్కి వచ్చిన గుర్రాన్నీ ఓ సారి పరిశీలించి చూసి, "ఏమోయ్, చాలా దూరం నుంచి వస్తున్నట్టున్నదే?" అని ప్రశ్నించాడు.

"ప్రభూ, ఇరవై కోసులు ఏకధాటిన ప్రయాణం చేశాను. అత్యవసరం అయిన కార్యం!" అన్నాడు ఆ సైనికుడు.

"చంద్రగిరి నగరానికేనా, నీ ప్రయాణం?" అన్నాడు అగ్నిపాలుడు.

"అవును. హనుమప్ప సేనాని నుంచి మహారాజులకు లేఖ తీసుకుపోతున్నాను," అన్నాడు ఆ సైనికుడు హుందాగా.



ఆ వార్త అగ్నిపాలుడిలో చిన్న కలవరం కలిగించింది. హనుమప్ప సేనాని చంద్రగిరి రాజ్యపు ఉత్తరపు టెల్లలను కాపాడే చంద్రగిరి సైన్యానికి నాయకుడు. కాలభోజుడు నిజంగా చాళుక్యుల అండదండలతో కృష్ణానది దాటిన మాట నిజమైతే, అతడి సేనలకూ, ఆ హనుమప్ప నాయకత్వంలో ఉన్న సేనావాహినులకూ ఎక్కడో ఒక చోట ఘోర సంగ్రామం జరిగి వుంటుంది!

తనలో కలిగిన ఈ భావసంచలనాన్నేమీ బయటపెట్టకుండా అగ్నిపాలుడు సైనికుడితో ముందు భోజనం ముగించమని చెప్పాడు.

కొద్దిసేపటి తరవాత ఆ సైనికుడు తృప్తిగా భుజించి, తిరిగి ప్రయాణ సన్నాహం అవుతుండగా అగ్నిపాలుడు అతణ్ణి దగ్గరకు పిలిచి "ఇందాక నిన్నొక ప్రశ్న అడుగుదామనుకుంటూ ఉపేక్షించాను. విజయం ఎవరిది?" అన్నాడు.

"విజయం మనదే! నవభోజ మహారాజ సైన్యాలకు ఎదురు నిలవగలిగిన సైనికశక్తి ఎవరికుంది? ఆ ద్రోహి కాలభోజుడు చావుతప్పి కన్ను లొట్టపోయి కృష్ణానది దాటుకుని చాళుక్య రాజ్యంలోకి పారిపోయాడు," అన్నాడు సైనికుడు.

"చాలా ఆనందం కలిగించే వార్త చెప్పావు. ఇప్పుడు ఈ ప్రాంతంలో ఏ కల్లోలాలూ లేవన్న మాట!" అంటూ అగ్నిపాలుడు చిరునవ్వు నవ్వాడు.

సైనికుడి ముఖంలో అంత ఉత్సాహం లేదు.





అతడు గొంతు తగ్గించి, "అయ్యా! అప్పుడే అంతా ముగిసిపోయిందని సంతోషించటానికి వీల్లేదు. మన రాజ్యంలోనే కొందరు ద్రోహులు - సామంతులూ, సంస్థానాధిపులూ ఆ కాలభోజుడి పక్షం వహించారు. అందువల్లనే అతడు అంత ధైర్యంగా కృష్ణానదిని దాటి మానుకోటను పట్టుకోగలిగాడు. అతడు ప్రాణాలరచేత బట్టుకొని చాళుక్య రాజ్యానికి పారిపోయినా, అతడి పక్షీయులు ఇంకా కొందరు కృష్ణకు ఈవల ప్రాణాలకు తెగించి పోరాడుతూనే ఉన్నారు. వాళ్ళకు చావు తప్ప మరో మార్గాంతరం లేదు. ఓడి మనకు బందీలుగా చిక్కినా, ద్రోహులుగా వారికి ఉరి తప్పదు కదా? అందుకే వాళ్ళు అంత తెగించి యుద్ధం చేస్తున్నారు!" అన్నాడు.

ఆపైన అగ్నిపాలుడికి ఆ సైనికుణ్ణి ప్రశ్నించవలసిందేమీ లేదనిపించింది. అతడు తిరిగి పక్కమీద మేనువాల్చాడు. అతడి మనసులో అనేక ఆలోచనలూ, భయాలూ ముసురుకున్నవి. తను మల్లూరు సంస్థానం చేరటానికి ఇంకా యాభై కోసుల దూరమైనా పోవాలి - అదీ దగ్గర దారిన పోతే మాత్రమే! ఒకవేళ దారిలో ఎక్కడైనా ఇరు పక్షాలకు పోరు జరుగుతూవుంటే, తను మరో చుట్టుమార్గాన్ని అనుసరించవలసి ఉంటుంది. దురదృష్టవశాత్తూ తను పోరాడే శత్రుపక్షాల మధ్య చిక్కుకుంటే... అతడి శరీరం జలదరించింది.

సరిగ్గా అదే సమయానికి దగ్గిరలో అడుగుల చప్పుడు వినిపించింది. తన ఆలోచనలను కట్టిపెట్టి అగ్నిపాలుడు కళ్ళు తెరచి చూశాడు.

ఎదురుగా చేతులు కట్టుకొని మాహూ నిలబడి వున్నాడు.

అగ్నిపాలుడు తల కొంచెం ఎత్తి ఏమిటన్నట్టు అతడికేసి చూశాడు.

మాహూ తలాడిస్తూ, "చిత్తం, మరేం లేదు. ఆ సైనికుడు చెప్పింది విన్నారు కదా!" అన్నాడు.

"విన్నాను," అన్నాడు అగ్నిపాలుడు ముక్తసరిగా.

"అయితే మన ప్రయాణం..."

ఆమాట అగ్నిపాలుణ్ణి ఆశ్చర్యచకితుణ్ణి చేసింది - "మన ప్రయాణాని కొచ్చిన చిక్కేమిటి?" అన్నాడతను.

"సరిగా మనం వెళ్ళవలసిన దారిలో ఉన్న కూర్మశైలం గుట్ట దగ్గిరే ఇరుపక్షాలూ పెద్ద పోరుకు సిద్ధమవుతున్నవట!" అన్నాడు మాహూ.

"అలా అయితే మనం ఆ మార్గం వదిలి మరో మార్గాన ప్రయాణిద్దాం, సరిపోయిందా?" అంటూ అగ్నిపాలుడు కళ్ళు మూసుకున్నాడు.

మాహూ కొంచెంసేపు అక్కడే నిలబడి, యజమాని ఎంతకూ కళ్ళు తెరవకపోయేసరికి మెల్లిగా అక్కణ్ణించి కదిలి, తిరిగి ప్రయాణం సాగించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయటంలో నిమగ్నుడయ్యాడు.

సూర్యుడు బాగా పశ్చిమానికి ఒరిగిన తరవాత,

తిరిగి ప్రయాణం ప్రారంభమైంది. వినపడీ వినపడనట్లు శతఘ్నుల మోతలు గాలివెంట వస్తున్నవి. ఎక్కడో దూరాన నల్లని పొగలు ఆకాశం కేసి మందంగా నడుస్తున్నవి.

అగ్నిపాలుడి బండివెంటే నడుస్తున్న మాహూ ఓ క్షణకాలం ఆ ధ్వనులనూ, ఆకాశంకేసి పోతున్న పొగమేఘాలను చూసి మెల్లగా తన గుర్రాన్ని బండి వెనకకు రానిచ్చి, "ప్రభూ!" అన్నాడు భయ సంకోచాలతో.

"ఏమిటీ?" అంటూ అగ్నిపాలుడు బండీలోంచి మాహూకేసి తలతిప్పి చూశాడు.

"మనం సరాసరి యుద్ధం జరుగుతున్న ప్రదేశానికే పోతున్నామని నా భయం," అన్నాడు మాహూ.

"మన ఈ ప్రయాణం యుద్ధంలో పాల్గొనేందుక్కాదు. ఆ సంగతి నీకు తెలుసు కదా?" అన్నాడు అగ్నిపాలుడు కోపంగా.

"చిత్తం... అదికాదు!" అంటూ మాహూ నసిగి, "సరే, ఈ ప్రాంతాలన్నీ నాకు తెలిసినవే. బండ్లను మరో మార్గానికి తిప్పిస్తున్నాను. ఆ అడవి మార్గం కొంత చుట్టయినా, క్షేమం అనుకుంటాను," అన్నాడు.

"నీకీ ప్రాంతాలు తెలిసివున్నది ఇరవై ఏళ్ళనాటి మాట! అది గుర్తుంచుకుని... ఒళ్ళు దగ్గిర పెట్టుకు మరీ దారి తెలుసుకుంటూ ముందు నడువు," అన్నాడు అగ్నిపాలుడు.

మాహూ గుర్రాన్ని అదిలించి, అందరికన
ముందుండి దారితీస్తూ, రాజమార్గానికి పక్క
వున్న మరో మార్గం నుంచి బండ్లను అడవిదా
పట్టించాడు. అతడు దూరంగా ఒక కొండ
గుర్తుపెట్టుకొని - అదే కూర్మశైల గుట్ట అ
సాధ్యమైనంతవరకూ దానిని తప్పుకుపోవాల
ఆలోచించాడు.

క్రమంగా చీకటిపడింది. చల్లనిగాలి ప్రార
భమై కొంతసేపటికి సన్నని తుంపరలు ప
సాగినై. ఇదే నిజంగా చిలికి చిలికి పెద్ద జడివా
అయితే, ఈ రాత్రికి ఏ పంచ చేరడమా అ
భయం మాహూను బాధించసాగింది.

బండిలో మెత్తని పట్టుపరుపులపై పడుకు
అగ్నిపాలుడి ఆలోచనలు మరొకవైపుక
నడుస్తున్నవి. తను మల్లూరు మండలధీశ్వరుడి
తన పేరూ, వచ్చిన కార్యం చెప్పి ఆతిథ్యం అడ
టమా లేక ఏదో ప్రయాణం మధ్యలో అను
కుండా అక్కడికి చేరినట్టు నటించి, ఓ వార
రోజులు అతిథిగా ఉండి, ఆ కాలంలో వకు
మాలను తనదాన్నిగా చేసుకునేందుకు శా
శక్తులా ప్రయత్నించటమా? ఏది ఏమైనప్పటి
తను అవజ్ఞవర్మతో వేసిన పందెం సంగతి ఎ
పరిస్థితుల్లోనూ బహిర్గతం కాకూడదు. ఒకవే
ఈసరికే అవజ్ఞవర్మను నవభోజ మహారాజే పం
దన్న సంగతి మల్లూరు ప్రభువుకు తెలిసివుం
తన రాకకూ అలాంటి కారణాన్నే ఆయ

ఊహించుకోవచ్చు! నవభోజుడి ప్రోత్సాహంతో ఆయన ఆస్థానం నుంచి ఒకరొకరుగా తనను వివాహం ఆడేందుకు వరులు వస్తున్నారని తెలిస్తే, వకుళమాల తనను గురించి ఎలాంటి అభిప్రాయాన్ని ఏర్పరచుకుంటుంది? తనను ప్రేమించి కాక, కేవలం రాజాజ్ఞ పాలన కోసం తన మీద ప్రేమ నటించే వారిని చూస్తే ఏ కన్య మాత్రం ఎలా ప్రేమించగలదు? అన్నివిధాలా తాను పెద్ద చిక్కులో పడిపోయానే అని అగ్నిపాలుడు నిట్టూర్చాడు.

కావాలనే తనను కించపరిచేందుకు అవజ్ఞవర్మ ఈ ఎత్తు వేశాడని, ఆ క్షణాన అతడికి నమ్మకం కుదిరిపోయింది.

అగ్నిపాలుడు ఈ విధమైన ఆలోచనలతో సతమతమవుతుండగా, "ప్రభూ!" అని పిల్చాడు మాహూ.

అగ్నిపాలుడు లేచి కూర్చుని బయటికి తొంగి చూసాడు. వణికిపోతూ దీనవదనంతో మాహూ నిలబడివున్నాడు.

"ఏం జరిగింది?" అని అడిగాడు అగ్నిపాలుడు.

"మనం దారి తప్పాం," - అన్నాడు మాహూ వణుకుతున్న గొంతుతో.

అగ్నిపాలుడు తన సేవకుడికేసి ఓ తృటికాలం నిప్పులు చెరిగే కళ్ళతో చూశాడు.

"అంటే మనం యుద్ధ భూమిలో... ఇరుపక్ష సేనల మధ్య చిక్కుకున్నామన్నమాట. అంతేనా?" అన్నాడతను కోపంగా.

"చిత్తం, అది కాదు..." అన్నాడు మాహూ.

"మరి?" అంటూ అగ్నిపాలుడు బండి నుంచి ఒక్క దూకున బయటికి వచ్చి చుట్టూ కలయ చూశాడు. అప్పుడు వాళ్ళున్నది ఒకానొక కొండ అంచున. అనతిదూరంలో చిన్న చిన్న పొదలూ, రాళ్ళగుట్టలూ - అస్పష్టంగావున్న చంద్రకాంతిలో లీలగా కనబడుతున్నవి. ఎక్కడా జనపదం ఉన్న జాడలే లేవు.

"ఈ కొండ గుర్తుపెట్టుకోవటం పెద్ద పొరపాటయింది, ప్రభూ! లోగడ మీ తండ్రిగారితో నేను ప్రయాణం చేసినప్పుడు ఈ దరిదాపులకైనా మేము రాలేదు," అన్నాడు మాహూ ఎంతో బాధ పడుతున్నట్టు.

అంత విషమ పరిస్థితిలో కూడా అగ్నిపాలుడికి ఆ మాటలు నవ్వు తెప్పించినై. అతడు మాహూ వైపుకు రెండడుగులు వేసి, "బహుశా, ఈ కొండ ఈ ఇరవై ఏళ్ళలోనూ పుట్టి పెరిగివుంటుంది!" అని మిగిలిన నౌకర్ల కేసి తిరిగి, "మనం ఈ రాత్రికి ఇక్కడే గడపవలసివస్తుందేమో! తగు ఏర్పాట్లు చేయండి," అన్నాడు.

అందరూ తమ తమ గుర్రాల మీది నుంచీ, బండ్ల మీది నుంచీ దిగి సమతలంగా ఉండే ప్రదేశం కోసం వెతకసాగారు.

అగ్నిపాలుడు మాహూ చేసిన పొరబాటుకు



లోలో మండిపోతూ, ఏమీ తోచక కొండ అంచునే ముందుకు నడవసాగాడు.

అతడావిధంగా కూతవేటు దూరం నడిచేసరికి ఉన్నట్టుండి కొండ మలుపు తగిలింది. ఇక వెనక్కు తిరిగిపోదామని అగ్నిపాలుడు అనుకునేంతలో, అతడి దృష్టి ఆ మలుపు పక్కనవున్న ఒక సమతల ప్రదేశంలో ఎత్తుగా ఉన్న ఒక గుడిసె మీద పడింది.

'ఓహోఁ ఈ ప్రాంతాల ఏదో పల్లెపట్టు ఉన్నట్టున్నదే!' అనుకుంటూ అగ్నిపాలుడు తాపీగా ఆ గుడిసెను సమీపించబోయాడు. అంతలో, లోనుండి సన్నని మూలుగు వినిపించింది. అగ్నిపాలుడు ఓ తృటికాలం స్థాణువులా

అయిపోయి, అంతలోనే తెప్పరిల్లి మెల్ల
గుడిసెను సమీపించి, ద్వారానికి అడ్డంగావ
మేదరి తడికను తోసుకుని లోపలి కెళ్ళాడు.

లోపల అంతా చీకటి. వెనకవైపున గోడ అ
డక్కడా శిథిలమైన కారణంగా, ఆ ఖాళీ ప్రదేశ
నుంచి బయటి చంద్రకాంతి అస్పష్టంగా ఆ గ
శాన పడుతోంది.

అక్కడవున్న ఒక గడ్డిమేటు మీద ఒక మా
కారం కాళ్ళూ చేతులూ కదిలిస్తూ, మధ్య మ
మూలుగుతున్నట్టు అగ్నిపాలుడు గ్రహించా
సంభ్రమాశ్చర్యాలతో అగ్నిపాలుడు ముం
ఒకడుగు వేసేసరికి, ఆ మూలుగుతున్న
ఒక్కసారిగా పక్కకు తిరిగి, "ఎవరు?" అని ప్ర







చాడు.

అగ్నిపాలుడికి ఆ పరిస్థితుల్లో ఏమని జవాబు చెప్పాలో తెలియలేదు. ఏమని జవాబివ్వటమా అని అతడాలోచిస్తున్నంతలో, ఆ వ్యక్తి మళ్ళీ అదే ప్రశ్న అడిగాడు. ఈసారి అతడి కంఠస్వరంలో భయచిహ్నాలు కనిపించినై.

"నువ్వెవరివి? కాలభోజుడి పక్షీయుడివా, నవభోజుడి భృత్యుడివా?" అన్నాడా వ్యక్తి, బాగా ఆయాసపడిపోతూ.

"రెండూ కాదు... నేను, ఇప్పటి పరిస్థితుల్లో ఏ పక్షానికీ చెందినవాణ్ణి కాదు!" అంటూ అగ్నిపాలుడు ఆ వ్యక్తిని సమీపించాడు.

"నమ్మవచ్చునా?" అన్నాడా వ్యక్తి.

"నేనే పక్షం వాణ్ణీ కాను. అయినా ఇప్పుడు నువ్వున్న స్థితిలో ఎవరినైనా నమ్మటం, నమ్మక పోవటం అన్న సమస్యే రాదు," అన్నాడు అగ్నిపాలుడు.

"అవును!" అంటూ ఆ వ్యక్తి సూటిగా అగ్నిపాలుడి ముఖంలోకి చూశాడు.

ఆ వ్యక్తి దుస్తులన్నీ రక్తం ఓడుతున్నవి. పొట్ట మీద గట్టిగా బిగించివున్న ఒక వస్త్రంకేసి వేలితో చూపుతూ అతడు, "ఇక్కడ పెద్ద గాయం తగిలింది. చాలా రక్తం కూడా పోయింది. ఇక నేను ఎంతో కాలం బతకను. నా తుదికోర్కె... ఒక సాయం ... చేయగలరా?" అన్నాడు బొంగురుపోయిన గొంతుతో.

పాలుడు అతడి పక్కనే వంగి అతడి
ధరించిన దుస్తులనూ పరీక్షగా
.. అతడికి పాతికేళ్ళకన్నా ఎక్కువ వయ
శరీరానికి ఇంకా కవచం ఉన్నది. దాన్ని
అగ్నిపాలుడు, అతడు సామాన్య సైని
డని గ్రహించాడు.
ం ఎలాంటి సహాయం అయినా చేయ
ాని, అలా అని వాగ్దానం చేసే ముందు,
నాకు తెలియాలి కదా?" అన్నాడు
డు.
తగాత్రుడు అగ్నిపాలుడి కళ్ళల్లోకి ఓ
ాసి, "నా పేరు విష్ణుమిత్రుడు. కూర్మశైల
ధిపతిని. ఈ మధ్యాహ్నమే మా పక్షానికీ,
డి పక్షానికీ మధ్య దారుణ యుద్ధం
అందులో నేను గాయపడి, ప్రాణాలతో
చేరగలిగాను," అన్నాడు.
దే మీరు కాలభోజుడి పక్షీయులన్నమాట!
నాకొచ్చిన అభ్యంతరం ఏమీ లేదు.
మయ స్థితిలో ఉన్న మీకు ఎలాటి సహాయ
యగలను," అన్నాడు అగ్నిపాలుడు.
పాలుడి మాటలు, విష్ణుమిత్రుడిలో ఎక్కడ
రేఖలనూ పొటమరింపచేసినై. అతడు
ంతో అగ్నిపాలుడికేసి చేయి ఊపుతూ,
కృతజ్ఞుణ్ణి! గొంతు ఎండిపోయింది.
తీర్చుకునేందుకు మీ దగ్గిరేమైనా మంచి
·?" అని అడిగాడు.

"ఒక్క క్షణం!" అంటూ అగ్నిపాలుడు ఒక్క
గంతులో గుడిసె నుంచి బయటికివచ్చి కొండ
మలుపు వరకూ వేగంగా పరిగెత్తి, "మాహూ
మాహూ! నీటిపాత్ర తీసుకుని వెంటనే రా!" అ
కేకవేశాడు.

తన యజమాని కోసం అతడు వెళ్ళిన దా
వెంటే వస్తున్న మాహూ ఈ కేక వింటూనే ఛెంగు
వెనుదిరిగి హుటాహుటిని బండ్ల దగ్గరకు పోయి
నీటి పాత్ర తీసుకుని ఆఘమేఘాల మీద అగ్నిపా
లుడి దగ్గిరకు పరిగెత్తుకు వచ్చాడు.

క్షణాల మీద ఇద్దరూ గుడిసెలో ప్రవేశించారు
గడ్డిమేటు మీద ఆయాసపడుతున్న విష్ణు
మిత్రుణ్ణి చూస్తూ మాహూ గతుక్కుమన్నాడు.

అది గమనించిన అగ్నిపాలుడు, "నీకొచ్చిన
ప్రాణభయం ఏమీ లేదు. అతడికి వెంటనే దాహ
ఇవ్వు," అన్నాడు చిరుకోపంగా.

నీటిపాత్రను చూస్తూనే విష్ణుమిత్రుడు లే
కూర్చునేందుకు ప్రయత్నించాడు. కానీ, బాధగ
మూలుగుతూ వెనక్కు పడిపోయాడు.

మాహూ, పాత్రకు చేతిని అడ్డంపెట్టి చిన్న
ధారగా విష్ణుమిత్రుడి గొంతుకలో నీరు పోశాడు

దప్పిక తీరగానే విష్ణుమిత్రుడు వద్దన్న సూ
నగా చేయి ఊపాడు.

మాహూ నీటి పాత్రను కిందపెట్టి, అగ్నిపాలు
కేసి తిరిగి, "ఈయనెవరో బాగా గాయపడి
ట్టుంది! గాయాలకు కట్లు కట్టమన్నారా?" అ





అడిగాడు.

అగ్నిపాలుడు జవాబు చెప్పబోయేంతలో విష్ణుమిత్రుడు హీనస్వరంతో ఒక్క మూలుగు మూలిగి, "మీ దయకు కృతజ్ఞుడ్ని. కట్లు కట్టేందుకు ఎన్నో గాయాలు లేవు. ఒకే ఒక్క గాయం. దానికి, ఆ యుద్ధభూమిలోనే, నా భటులు మందు వేసి కట్టు కట్టారు. అయినా ఆ లోపలే రక్తం చాలా పోయింది. పైగా ఇప్పుడు ఆ గాయం కట్లతో నయమయేది కాదు," అని ఆయాసపడుతూ కొంచెం ఆగి, అగ్నిపాలుడ్ని దగ్గిరకు రావలసిందిగా సౌంజ్ఞ చేశాడు.

అగ్నిపాలుడు అతడ్ని సమీపించి అతడి తల వైపున వంగాడు.

అప్పుడు విష్ణుమిత్రుడు మరింతగా ఆయాసపడుతూ, "నా అంతం దగ్గిరవుతున్నది. అదుగో, చూడండి..." అంటూ గుడిసెలో ఒక మూలకేసి చేయి చూపి, "అక్కడ ఉన్న గడ్డి కింద కొన్ని కాయితాలు ఉన్నవి. వాటిని..." అంటూ దుఖభారంతో డగ్గుత్తిక అయి, అంతలోనే కొద్దిగా తెప్పరిల్లి, "ఇక నాకు మాట్టాడే శక్తి కూడా పోతున్నది. వాటిని... ఆ కాయితాలు... అవి అన్నీ నాకు కాబోయే వధువు రాసిన లేఖలు. అదృష్టం ఉన్నట్టయితే ఈనాటి నుంచి ఒక్క నెల రోజుల్లో మాకు వివాహం జరిగివుండేది. కానీ ... దురదృష్టవంతుడ్ని... మీరు..."

ఆపైన విష్ణుమిత్రుడి మాటలు మరింతగా అస్పష్టంగా సాగినై.

అగ్నిపాలుడు అతడి పెదాల దగ్గిరగా చెవి పెట్టి వినేందుకు ప్రయత్నించాడు. కాని, ఆ ప్రయత్నం విఫలమైంది. అంతలో విష్ణుమిత్రుడి ముఖం వివర్ణం కావటం, కంఠనరాలు ఉబ్బి బిగుసుకుపోతూండటం అగ్నిపాలుడు గమనించాడు.

అతడు ఎక్కడలేని కుతూహలంతో, ఆదుర్దాతో ముందుకు వంగి, "విష్ణుమిత్రా! ఇంతకూ నేనా లేఖలు అందించవలసిన నీ ప్రియురాలు - వధువు పేరు చెప్పావు కాదు," అన్నాడు.

విష్ణుమిత్రుడు ఎంతో ప్రయత్నం మీద కనురెప్పలు కదిలించి కళ్ళు తెరవగలిగాడు. అతడి గొంతులో చిన్న శబ్దం ప్రారంభమై, కొద్దిసేపటికి అగ్నిపాలుడి చెవిలో, "ఆమె... పేరు... పేరు..." అనేంతవరకూ వచ్చి, హఠాత్తుగా నిశ్శబ్దం అయిపోయింది.

అగ్నిపాలుడు ఒక్క అంగలో విష్ణుమిత్రుడు చెప్పినచోటుకు వెళ్ళి, అక్కడ ఎండుగడ్డి కింద ఉన్న పెద్ద పొట్లం లాంటి దాన్ని చేతికి తీసుకున్నాడు. తరవాత అతడు వెనుదిరిగి, విష్ణుమిత్రుడికేసి చూశాడు.

ఆసరికే అతడి నాడిని పరీక్షించి చూస్తున్న మాహూ, అగ్నిపాలుడికేసి తలతిప్పి పెదాలు చప్పరించి 'ఫ్చ్, ఫ్చ్' అంటూ, తన పైనున్న వస్త్రాన్ని విష్ణుమిత్రుడి మీద కప్పి, తల వంచుకుని లేచి నిలబడ్డాడు.

- 4 -

ఆ అర్ధరాత్రి సమయంలో ఎక్కడో కొండల పక్కన శిధిలావస్థలోవున్న ఒకానొక పూరిగుడిసెలో జరిగిపోయిన విషాద సంఘటన అగ్నిపాలుడ్ని నిలువునా కుంగదీసింది. ఒకరకంగా ఆలోచించి నప్పుడు, ఈ విష్ణుమిత్రుడు, తాను సేవిస్తున్న రాజుకు శత్రువు కావటం ద్వారా తనకూ శత్రువే అవుతాడు. కాని, తాను నమ్మిన ఆదర్శం కోసం కత్తిదూసి, యుద్ధరంగంలో గాయపడి ప్రాణరక్షణార్థం ఒకానొక పూరిగుడిసెలో చేరి, అక్కడ దుర్మరణం పాలుగావటం అంటే – నిజంగా అది చూసేవారి గుండెలను కలకబారించే దృశ్యమే!

అగ్నిపాలుడు ఉన్నచోటనే కదలా మెదలక, ముసుగు కప్పబడి ఉన్న విష్ణుమిత్రుడి ఆకారం కేసి దారుప్రతిమలా చూస్తూ ఉండిపోయాడు.

అల్లంత దూరంలో మాహూ, మరి ఇద్దరు నౌకర్లూ నిలబడి, ఒకసారి తమ యజమాని కేసీ, మరొకసారి విష్ణుమిత్రుడి భౌతికకాయాని కేసీ చూస్తున్నారు.

చిట్టచివరకు పెద్దగా నిట్టూర్చాడు అగ్నిపాలుడు. ఇక ఒక్క క్షణకాలమైనా అక్కడ ఉండేందుకు అతడికి మనస్కరించలేదు. అతడు వాకిలి కేసి కదలబోతూండగా, హఠాత్తుగా అతని దృష్టి చేతిలో ఉన్న పొట్లం మీద పడింది. అతడు ఠక్కున ఆగి, దానికి బిగించివున్న పట్టుతాళ్ళను ఓసారి కదిలించి చూశాడు. 'ఇది మరో దురదృష్టం! ఆ వధువు ఎవరో, పేరేమిటో, ఎక్కడ ఉంటుందో చెప్పితే నా పని ఎంతో సుకరం అయేది – కనీసం పేరు తెలియబరిచినా... అంతా దురదృష్టం!' అనుకుంటూ అగ్నిపాలుడు బయటికి నడిచాడు.

అప్పటివరకూ తుంపరలుగా పడుతూన్న వాన, పెద్ద గాలితోపాటు పెల్లుబికినట్టు జడివాన అయి ఊరుకున్నది. అగ్నిపాలుడు చాలా చిరాకుపడిపోయాడు.

"మాహూ! ఈ వానలో ఈ రాత్రి గడపటం నావల్ల కాదు. ఈ ప్రాంతాల ఎక్కడో ఒకచోట పల్లెగాని, చిన్న పట్టణం గాని ఉండకపోదు. నేను ముందు బయలుదేరి వెళతాను. ఈ కొండ పక్క ఉన్న మార్గం వెంట, వెనకపాటుగా మీ అందరు రండి," అంటూ అగ్నిపాలుడు చప్పున గుర్రం ఎక్కి, కొండపక్కగా మలుపు తిరిగిన దారివెంట బయలు దేరాడు.

ఒక కోసు దూరం ప్రయాణించేసరికి, తన ఊహ సరైనదే అని అగ్నిపాలుడికి తెలిసిపోయింది. ఎదురుగా, దారిపక్కనే అల్లంత దూరంలో మినుకుమినుకుమంటున్న దీపాల కాంతి అతడి కంటబడింది.

అగ్నిపాలుడు గుర్రాన్ని మరింత వేగంగా పరిగెత్తించి, కొద్దిసేపట్లోనే ఒక పల్లెగ్రామం చేరి, అక్కడ నాలుగు వీధుల కూడలిలో ఉన్న ఒక సత్రాన్ని సమీపించాడు. వీధివైపుకు ఉన్న సత్రం పెద్ద తలుపులు దగ్గిరగా వేసివున్నవి. అగ్నిపాలుడు







గుర్రాన్ని దిగి, తలుపులు తోసుకుని సత్రం ఆవరణలోకి ప్రవేశిస్తూ, "ఇక్కడ సత్రం యజమాని ఎవరు?" అని బిగ్గరగా కేక వేశాడు.

"చిత్తం, వస్తున్నాను!" అన్న జవాబుతో పాటు, ఎదురుగా ఉన్న తలుపులు తెరుచుకొని ఒక వృద్ధుడు బయటికి వచ్చాడు. అతడు అగ్నిపాలుడు ధరించివున్న దుస్తుల్నీ, వెంటవున్న గుర్రాన్నీ చూస్తూనే మరింత వినయుడైపోయి, మారు మాట్టాడకుండా మెట్లు దిగి వచ్చి అగ్నిపాలుడి చేతిలో ఉన్న గుర్రపు కళ్ళెం తాళ్ళను అందుకోబోయాడు.

"ముందు నేనీ రాత్రి గడిపేందుకు ఒక గది కావాలి. దాన్ని సిద్ధంచెయ్యి. గుర్రాన్ని ఆ కనబడే మేకుకు నేనే కట్టేస్తాను," అన్నాడు అగ్నిపాలుడు విసుగ్గా.

"చిత్తం! మీ కోసం గదిలో మంచం అవీ సర్దించి... ఆ ఏర్పాట్లన్నీ చూస్తాను. ఈ లోపల మీరు అక్కడ వసారా గదిలో విశ్రాంతి తీసుకుంటూండండి," అంటూ సత్రం యజమాని చకచకా వెళ్ళిపోయాడు.

అగ్నిపాలుడు గుర్రాన్ని మేకుకు కట్టివేసి, ఓరగా వేసివున్న వసారా గది తలుపులను నెట్టుకొని లోపలికి వెళ్ళాడు.

గదిలో మధ్యగావున్న ఒక ఎత్తైన పీఠం మీద దీపం వెలుగుతున్నది. ఒక మూలగా ముగ్గురు వ్యక్తులు కూర్చుని తగ్గుస్థాయిలో ఏమో మాట్లాడు

కుంటున్నారు. అగ్నిపాలుడు లోపలికి రావటం చూస్తూనే వాళ్ళు ఓసారి అతడికేసి నఖశిఖ పర్యంతం పరీక్షగా చూసి, తిరిగి తమ సంభాషణలో నిమగ్నమైపోయారు.

అగ్నిపాలుడు కూర్చునేందుకు ఎక్కడ వీలుగా ఉంటుందా అని చూసేంతలో వీధివైపు నుంచి వేగంగా దగ్గరౌతున్న గుర్రపు డెక్కల మోత వినబడింది. తన నౌకర్లు ఇంత త్వరలో తనను అనుసరించి వచ్చారా అని ఆశ్చర్యపడుతూ అతడు గది నుంచి బయటికి వచ్చి, వీధికేసి చూశాడు.

ముగ్గురు సైనికులు – నురుగులు కక్కుతున్న గుర్రాలను సత్రం ఆవరణలో ఆపుతూనే, అగ్నిపాలుడికేసి దృష్టి సారించి, వెంటనే ఒకరితో ఒకరు గుసగుసలు ప్రారంభించారు. తరవాత ముగ్గురూ గుర్రాలు దిగి, అందులో ఇద్దరు మాత్రం సత్రం యజమాని ఉండే గదివైపు నడుస్తూ, "ఎవరిక్కడ?" అంటూ కేక పెట్టారు.

"వస్తున్నాను!" అన్న సత్రం యజమాని జవాబు వినపడింది.

గుర్రాల దగ్గర ఉన్న సైనికుడు మాత్రం ఒర నుంచి కత్తి దూసి అగ్నిపాలుడికేసి కళ్ళార్పకుండా చూస్తున్నాడు.

ఇంతలో యజమాని కిర్రుమంటూ తలుపు తెరిచిన ధ్వని వినబడింది.

అంతలో ఇద్దరు సైనికులూ, తలుపులను సమీపించి, "మాట్లాడాలి, అక్కడే ఆగు!" అంటూ లోపలకు వెళ్ళారు.

ఈ సైనికుల ధోరణి అగ్నిపాలుడికి మొదట్ల ఆశ్చర్యం కలిగించినా, కత్తి దూసివున్న సైనికుడు తనకేసే రెప్పవాల్చకుండా చూస్తూండటంతో, ఆ ఆశ్చర్యం అనుమానంగా పరిణమించింది. ఇదంతా ఏమిటా అని అతడు ఆలోచిస్తున్నంతలో లోపలి నుంచి సత్రపు యజమాని మాటలు స్పష్టాస్పష్టంగా వినిపించినై.

"...నన్ను బాధించి లాభంలేదు. ఇంతకు ముందే... పేరు అడగలేదు. ఊహూఁ... నాకేమీ తెలియదు," అంటున్నాడు సత్రపు యజమాని.

"అంత పెద్దగా మాట్టాడతావేం? హూఁ" అంటూ ఒక సైనికుడు సత్రపు యజమానిని కోప్పడటం వినబడేసరికి, అగ్నిపాలుడికి బహుశ ఈ కలకలం అంతా తన గురించే అన్న అనుమానం దృఢపడిపోయింది.

తను అవజ్ఞవర్మతో పందెం కట్టిన సంగతి నవభోజరాజుకు తెలిసి, ఆయన తనని పట్టితెచ్చేందుకు ఈ సైనికులను పంపివుంటాడన్న ఆలోచన కలిగేసరికి అగ్నిపాలుడు నిశ్చేష్టుడైపోయాడు. హఠాత్తుగా సత్రం యజమానితోపాటు అతడిని ప్రశ్నిస్తున్న ఇద్దరు సైనికులూ తనకేసి రావటం అగ్నిపాలుడు గుర్తించాడు.

సైనికులిద్దరిమధ్యా బందీలా నడిచివస్తూ సత్రం యజమాని అగ్నిపాలుడ్ని సమీపించి "అయ్యా! తమ నామధేయం అడగ మరిచాను...





సెలవిస్తారా?" అన్నాడు.

ఆ ప్రశ్న వింటూనే అగ్నిపాలుడు సత్రం యజమానికేసి కళ్ళెర్రచేసి చూసి, "ఈ ప్రశ్న నువ్వు మొదట్లోనే అడగవలసింది. పైగా ఇప్పుడు అడిగిన ధోరణి కూడా ఏమీ గౌరవప్రదంగా లేదు. నీ వెంట ఈ సైనికులెందుకు?" అన్నాడు.

"మేము నవభోజ మహారాజు సైన్యంలో వాళ్ళం!" అన్నాడొక సైనికుడు.

"ఆ సంగతి తెలుస్తూనే ఉంది," అన్నాడు అగ్నిపాలుడు ఈసడిస్తున్నట్టు.

"అయితే ఇప్పుడు మేమే అడుగుతున్నాం – చెప్పండి, మీ పేరేమిటి?" అన్నాడా సైనికుడు.

తాను ఊహించినదంతా నిజమైందని అగ్నిపాలుడు భావించాడు. ఏ పరిస్థితుల్లో కూడా తన నిజనామం వారికి చెప్పి, వారితోపాటు తిరిగి చంద్రగిరి నగరం పోవటం అతడికేమాత్రం మనస్కరించలేదు. తను మరేదో పేరు చెప్పేస్తే సరిపోతుంది. ఏ పేరు చెప్పటం? హఠాత్తుగా అతడికి విష్ణుమిత్రుడి పేరు స్ఫురించింది. అతడు తొణకకుండా, "ఈ అర్ధరాత్రివేళ ఈ సత్రంలో నా పేరు తెలుసుకోవలసినంత అవసరం మీకెందుకు కలిగిందో, నా కర్థం కావటం లేదు. అయినా, మీతో వృథాగా తగవుపడి, నా కాలాన్ని వ్యర్థం చేయదలచ లేదు. నా పేరు విష్ణుమిత్రుడు!" అన్నాడు.

ఆ మాట వింటూనే సైనికుల చేతులు తమ తమ కత్తుల మీదికి పోయినై. హఠాత్తుగా ఏదో ప్రాణాపాయాన్ని శంకించిన అగ్నిపాలుడు కూడా మెరుపు వేగంతో ఒరలోని కత్తిని బయటికి దూశాడు.

అంతలో ఇద్దరు సైనికులూ, సత్రం యజమాని వెనక నుంచి ముందుకు వస్తూ "మహాసేనాని హనుమప్ప నాయకుడి ఆజ్ఞానుసారం నిన్ను బంధిస్తున్నాం, కత్తి దించు!" అంటూ హూంకరించారు.

అగ్నిపాలుడు చెంగున ఒకడుగు ముందుకు వేసి, తన ముందుకు రాజూస్తున్న సైనికులకు సత్రం యజమానిని అడ్డంగా పడేలా తోశాడు. ఆ వెంటనే మెట్ల మీద నుంచి కిందకి దూకి, తన గుర్రాన్ని సమీపించి, మేకు నుంచి దానిని విడిపించాడు.

కన్నుమూసి తెరిచేంతలో జరిగిపోయిన ఈ కల్లోలానికి, నిశ్చేష్టితుడై చూస్తూ నిలబడిన సైనికుడు అప్పటికి తెప్పరిల్లి, గుర్రం ఎక్కబోతున్న అగ్నిపాలుడ్ని పక్కల నుంచి కత్తితో పొడవబోయాడు. కాని, ఆ ప్రమాదాన్ని ముందే పసిగట్టిన అగ్నిపాలుడు ఒక్క ఎగురున గుర్రం ఎక్కుతూ, అదే ఊపుతో కత్తిని సైనికుడి తలకు గురిగా విసిరాడు. సైనికుడు ఆ దెబ్బ నుంచి తప్పుకునేందుకు రక్కున తలవంచాడు. కాని, కత్తి అతడి శిరోపరిభాగాన్ని తాకుతూ పోయింది. వాడు పెద్దగా అరిచి పక్కకు ఒరిగాడు.

అగ్నిపాలుడి తాపుకు తమ కత్తులకు అడ్డుగా

పడిన సత్రం యజమానిని తిడుతూ పక్కకు తొలగదోసుకుని, "పట్టుకోండి! రాజద్రోహి విష్ణు మిత్రుడ్ని పోనీయకండి!" అంటూ సైనికులిద్దరూ సత్రం ఆవరణలోకి పరిగెత్తుకుంటూ వచ్చారు.

ఆసరికి అగ్నిపాలుడు తన గుర్రాన్ని వీధి వైపు కున్న ద్వారంకేసి నడుపుతున్నాడు.

సైనికులిద్దరిలో ముందున్నవాడు భీకరంగా అరుస్తూ కత్తిని అగ్నిపాలుడి నడుముకు సూటిగా విసిరాడు.

అగ్నిపాలుడు తన కత్తితో ఆ దెబ్బను కాచుకో వటమేకాక, ఆ వెంటనే దానిని ముందుకు తిప్పి, సైనికుడి గుండెలకేసి విసిరాడు. దెబ్బతిన్న సైని కుడు ఒక చావుకేక పెట్టి వెనక్కు విరుచుకు పడిపోయాడు. అగ్నిపాలుడు తిరిగి తన కత్తిని వెనక్కు లాక్కోబోయేంతలో రెండవ సైనికుడి కత్తి అతడి వీపును బలంగా తాకింది.

అగ్నిపాలుడు ఓ రెప్పపాటుకాలం స్థంభించి పోయి, ఆ వెంటనే కత్తిని ఆ రెండవ సైనికుడి కంఠానికేసి విసురుతూ, గుర్రాన్ని గట్టిగా అదిలిం చాడు. గుర్రం చెంగున ముందుకు దూకింది.

ఆ కారణంగా అగ్నిపాలుడి కత్తికి ఎరకాక బయట పడిన సైనికుడు, "రాజద్రోహి విష్ణుమి త్రుడ్ని పట్టుకోండి!" అని కేకలు పెడుతూ తన గుర్రంకేసి పరిగెత్తాడు.

అగ్నిపాలుడు తన గుర్రాన్ని రాజమార్గంకేసి తిప్పాడు. గుర్రం వేగంగా ముందుకు దూకింది.

అది తనను ఎటు తీసుకుపోతున్నదో అగ్నిపాలుడు ఆలోచించటంలేదు. వెన్ను మీద సైనికుడి కత్తి తగిలిన చోట చుర్రుమనిపించిన బాధ క్రమంగా అధికం కాసాగింది.

"ద్రోహి విష్ణుమిత్రుడు" అన్న కేక, దానికి ప్రత్యుత్తరంగా "వస్తున్నాం! వెంబడించు!" అన్న కేకలూ అగ్నిపాలుడికి వినిపించినై. ఆ వెంటనే తనను వెంటాడుతూ నలుగురైదుగురు అశ్వికులు వస్తున్నారన్న సూచనగా గుర్రపు డెక్కల మోత వినబడింది.

అగ్నిపాలుడు తన వాహనాన్ని మరింత గట్టిగా అదిలించాడు. గుర్రం సుడిగాలిలా ముందుకు దూకుతున్నది. కాని, తనను వెంట తరుముకు వస్తున్న గుర్రపు రౌతుల అలజడి క్రమంగా ఎక్కువవుతున్నది. దానికితోడు వెన్నులో పలు గులు పెట్టి పొడుస్తున్నట్టు బాధ!

గుర్రం జూలు మీదకి బాగా వంగి, అగ్నిపా లుడు తల ఓరగా పెట్టి వెనక్కు చూశాడు. కొంచెం దూరంలో పరుగెత్తుకు వస్తున్న నీడల్లా నాలుగు గుర్రాలు కనిపించినై. 'ఏది ఏమైనా సరే, వీళ్ల చేతుల్లో పడగూడదు!' అనుకున్నాడు అగ్నిపా లుడు. అతడి కుడిచేయి కత్తిపిడి మీదికి వెళ్ళింది మరుక్షణం గుర్రం ముందు కాళ్ళు రెండూ ఎత్తి పెద్దగా సకిలిస్తూ నిలబడిపోయింది.

అగ్నిపాలుడు నిర్విణ్ణుడైపోయాడు.

గుర్రాన్ని ఆటంకపరచినదేమైవుంటుంది! అతడు దృష్టిని ముందుకు సారించాడు.

ఎదుట, గుడ్డి వెన్నెల కాంతి - గట్టు ఒరుసుకు పోతున్న ఒకానొక నది. అవతలి గట్టు దృష్టికి ఆనీ ఆననంత దూరంలో ఉన్నది.

ఒక్క తృటికాలం అగ్నిపాలుడు సంశయగ్రస్తుడయాడు. ముందు వేగంగా పారుతున్న నది - వెనక తరుముకువస్తున్న రాజభటులు!

అతడు బలంగా మోకాళ్ళను గుర్రం డెక్కల మీదికి అదిమి, చీల మడమలతో దాని పొట్ట కింద గట్టిగా పొడిచాడు.

గుర్రం ఓసారి పెద్దగా సకిలించి, ఒక్క ఉరు కున నదిలోకి దూకింది.

నదిలో ప్రవాహ వేగం అతి తీవ్రంగా ఉంది. మంచి జాతిదవటమేగాక, దార్ఢ్యం, శక్తియు క్తులూ కూడా ఉన్న గుర్రం ఏమాత్రం వెనకంజ వేయక ప్రవాహ వేగాన్ని తొలగదోసుకుంటూ సూటిగా ముందుకు పోతున్నది. పట్టరాని ఆనం దంతో అగ్నిపాలుడు వెనుదిరిగి చూశాడు.

అప్పుడే నలుగురు రౌతులు నదీ తీరానికి వచ్చి ఆగారు. తరవాత పెద్దగా కేకలు! ఒక రౌతు చేతిలో నుంచి వెన్నెల కాంతికి తళ తళ మెరిసిన ఈటె ఒకటి బయ్ఁ మంటూ ఎగిరి, అగ్నిపాలు డికి ఒక గజం వెనకగా నీటిని తాకి, బుడుంగు మంటూ మునిగిపోయింది.

అగ్నిపాలుడు రానున్న ప్రమాదాన్ని గుర్తించి గుర్రాన్ని గట్టిగా అదిలించాడు. అదే సమయంలో రౌతుల ఒత్తిడికి లొంగిన రెండు గుర్రాలు నదిలోకి ఉరికినై. కాని, అవి పదీ పన్నెండు గజాల దూరం సూటిగా ఈదుకుంటూ వచ్చి, క్రమంగా నీటి వాలుకు కొట్టుకుపోసాగినై.

"ఇక గుర్రాలను ఒడ్డుకెక్కించండి. నది దిగు వకు వెళితే వాడి శవం మనకు దొరక్కపోదు," అంటూ ఒడ్డునున్న ఒక రౌతు పెద్దగా కేక పెట్టాడు.

అది విని అగ్నిపాలుడు తన అదృష్టానికి ఎంతో ఆనందించాడు. గుర్రం దాదాపు నది మధ్యకు వచ్చింది. కాని, అక్కడవున్న బలమైన ప్రవాహ వేగం దాన్ని వాలుకేసి విసిరికొడుతున్నది. పైగా, గుర్రం అలసిపోయినట్టు కూడా అగ్నిపాలుడు గ్రహించాడు.

గుర్రానికి కొంత బరువు తగ్గించటం క్షేమం అనుకొంటూ అగ్నిపాలుడు దాని వీపు మీద నుంచి నీటిలోకి జారాడు. కేవలం ఒకచేత్తో దాని జూలును ఆధారంగా పట్టుకుని రెండవ చేత్తో అతడు ఈదసాగాడు.

గుర్రం క్రమంగా నీటి వాలుకు కొట్టుకు పోతున్నది. దాని కాళ్ళల్లో ఉన్న శక్తి పూర్తిగా ఉడిగి పోయింది. సరిగా నది మధ్య నుంచి అది ఒక అంగ కూడా ముందుకు ఈదలేక, నీటి వేగాన కొట్టుకుపోతున్నది. దానితో అగ్నిపాలుడు గుర్రం జూలును వదిలి, ఓమారు అవతలి గట్టు కేసి చూసి, కళ్ళు మూసుకొని వేగంగా ఈత



కుపక్రమించాడు. నిమిషాలు గడిచిపోతున్నవి.

కొంతసేపటికి అతడు కళ్ళుతెరిచి చూసేసరికి, అల్లంత దూరంలో ఒడ్డూ, నదిలోకి దిగుతూన్న పెద్ద రాతి మెట్ల సోపాన పంక్తీ కనిపించాయి.

అగ్నిపాలుడి సంతోషం అంతా ఇంతా కాదు. అతడు అలవోకగా చేతులూ, కాళ్ళూ కదిలిస్తూ కొంచెంగా తల ఎత్తి చూశాడు. మసక వెన్నెలలో అతడి దృష్టి బురుజులాగా ఉన్న ఒక ఎత్తయిన కట్టడం మీద పడింది.

ఆయాసంతో వెన్నులో సలుపు పెడుతూన్న గాయాన్ని గురించి ఆలోచిస్తూ అగ్నిపాలుడు, నదిలోకి ఉన్న రాతి మెట్లను చేరి, అక్కడ ఒక మెట్టు మీద కూర్చుని చేతివేళ్ళను వెన్నుమీదకి పోని

చ్చాడు. చిక్కని, ఎర్రని నెత్తురు వేళ్ళకు అంటిం అతడు నిలువెల్లా ఓసారి వణికిపోయాడు. తగిలి గాయం తను అనుకున్నదానికంటే ప్రమాదక మైనదే అన్న అనుమానం అతడికి కలిగింది.

అతడు మెట్ల మీద నుంచి లేచి, చలికి ఒకసా వణికి, మెల్లిగా కాళ్ళీడ్చుకుంటూ ఒక్కొక్క మె ఎక్కుతూ పైకి పోయాడు.

ఎదురుగా కనిపించిన దృశ్యం అతడి మ సులో ఆశారేఖల్నే కాక, భయచిహ్నాలను కూ రేకెత్తించింది.

అది ఒక పెద్ద కోట. చుట్టూ రెండు మూ నిలువుల ఎత్తున్న ప్రాకారపు గోడ పైనుంచి, కొ బురుజులూ, భవనంలో కొన్ని భాగాలూ కనిపి





న్నవి.

“ఈ కోటలోవున్న వారెవరైనా సరే – శత్రువుగానీ, మిత్రుడుగానీ – ఈ పరిస్థితుల్లో నేను వారి సహాయం అర్థించక తప్పదు,” అనుకున్నాడు అగ్నిపాలుడు.

అతడు ఆయాసంతో ఒక్కొక్క అడుగే వేస్తూ, కోట ద్వారాన్ని సమీపించాడు. కోట ద్వారానికున్న బలమైన ఇనుప తలుపులు సగం వరకూ తెరిచి ఉండటం, అతడికి చాలా ఆశ్చర్యం కలిగించింది. దేశం ఇంత అరాజకం పాలయివుండగా, కావలివాళ్ళయినా లేకుండా ఏ కారణంవల్ల ఈ రాజు తన కోట ద్వారాలను తెరిచి వుంచాడు?

అగ్నిపాలుడు అడుగులో అడుగు వేసుకుంటూ కోట ద్వారాన్ని అధిగమించి, ఆవరణలోకి అడుగు పెట్టాడు.

ఆ ప్రాంతాల ఎక్కడా మనుషులున్న సూచనలు లేవు. ఎదురుగా ఉన్న మూడంతస్థుల భవనంలో ఎక్కడా దీపకాంతి కనిపించటంలేదు.

అతడు ఏమి చేయటమా అని ఆలోచిస్తున్నంతలో, భవనంలోని రెండవ అంతస్థులోవున్న ఒక గది తలుపులు బార్లా తెరుచుకున్నవి. తెల్లని దీపకాంతి వెల్లువలుగా బయటికి ప్రవహించింది.

అగ్నిపాలుడు తన దృష్టిని గది ద్వారంకేసి సారించాడు.

ఒక స్త్రీమూర్తి బయటికి వచ్చి, ముందున్న పిట్టగోడను ఆనుకుని, తల ఎత్తి ఆకాశం కేసి చూస్తున్నది.

ఇదీ అని చెప్పరాని ఆనందంతో, భయంతో అగ్నిపాలుడు ముందుకు నడిచాడు. ఇప్పుడతడు నడుస్తున్న దారికి ఇరువైపులా చక్కని ఉద్యానవనం ఉన్నది. ఆ స్త్రీమూర్తి నిలబడివున్న ప్రదేశానికి దిగువగా కొన్ని చెట్లూ, లతలూ ఒకదానినొకటి పెనవేసుకుని, క్రమంగా పిట్టగోడను అందుకుంటున్నై.

అగ్నిపాలుడు సరిగా ఆ చెట్లకేసే బయలుదేరాడు. తానిప్పుడున్న దీనావస్థలో తను ఎవరిని సహాయం అర్థించటమా అన్నది సమస్య కానే కాదు! వెన్నులో తగిలిన గాయం నుంచి ఎంతో రక్తం కారిపోయి, క్రమంగా దేహంలో జవసత్వాలు అడుగంటుతున్నవి. గాయం పెట్టే బాధతో పాటు, తడిసివున్న దుస్తులు విపరీతమైన చలిని పుట్టించి, శరీరాన్ని వణికిస్తున్నవి.

అగ్నిపాలుడు ఆ స్త్రీమూర్తి నిలుచుని ఉన్న పిట్టగోడకు దిగువునగల చెట్లను చేరుకోగలిగాడు.

ఆ స్త్రీమూర్తి ఆకాశంకేసి కొంచెంసేపు చూసి, తరవాత దృష్టిని నదికేసి తిప్పి, చిన్న కంఠస్వరంతో ఏదో రాగం ఆలాపిస్తున్నది.

అగ్నిపాలుడు తనకు ఆచ్ఛాదనగా ఉన్న లతలనూ, చెట్ల కొమ్మలనూ పక్కకు తొలగించి, ఆ మూర్తికేసి పరీక్షగా చూశాడు.

ఆమెకు పద్దెనిమిదీ, ఇరవై ఏళ్ళ కన్నా ఎక్కువ వయసుండదు. తెల్లని దేహచ్ఛాయ, పెద్ద కళ్ళు.

వెన్నెల కాంతిలో వాటి తళతళలు అగ్నిపాలుడి దృష్టిని బాగా ఆకర్షించినై. పిరుదుల మీదికి వేలాడుతున్న ఆమె శిరోజాలు గాలికి రెపరెపలాడుతున్నవి.

'ఎవరీ దేవసుందరి!' అనుకున్నాడు అగ్నిపాలుడు.

చంద్రగిరి నగరంలో అసమాన సౌందర్యవతులని చెప్పబడే స్త్రీలలో చాలామందిని అతడు చూశాడు. కాని వారందరి సౌందర్యాన్ని ఒకచోట గుట్టగా పేర్చినా ఈ స్త్రీమూర్తికి సాటిరాదు.

అగ్నిపాలుడికి విపరీతమైన చలితో పాటు, వెన్నుమీది గాయం ఉండుండి కాల్చినట్టుగా బాధ పెడుతున్నది. కళ్ళకు ఏదో సన్నని పొర అడ్డుపడుతున్నట్టు దృష్టి క్రమంగా మందగిస్తున్నది.

బహుశా సహాయం అందకముందే తను నీరసంతో స్పృహ తప్పి పడిపోతానేమోనన్న భయం అగ్నిపాలుడిని ఆవరించింది. అతడు గొంతెత్తి పిలిచేందుకు సిద్ధమై, పిట్టగోడకేసి చూశాడు. ఆ స్త్రీమూర్తి అక్కడ నుంచి అదే క్షణంలో వెనుక వైపుకు వెళ్ళిపోయింది.

ఆ తరవాత ఓ క్షణంపాటు ఆమె రాగాలాపన వినిపించింది. ఆ మరుక్షణం అంతా నిశ్శబ్దం.

అగ్నిపాలుడు ఇక ఆలసించటం మంచిది కాదనుకున్నాడు. పిట్టగోడకేసి నిలువుగా పాకుకుపోయిన పూల చెట్ల తీగలు మోకుల్లా బలంగా వున్నాయి. అతడు వాటి వెంట క్రమక్రమంగా పాకుతూ పైకి పోయి, పిట్టగోడను బలంగా రెం చేతులతోనూ పట్టుకున్నాడు. తరవాత ఉన్న నంతా కూడగట్టుకుని పిట్టగోడ మీదికి ఎ అవతలి వైపుకు జారాడు. అక్కడ ఎవరూ లే కాని, ఎదురుగా వున్న గది కిటికీలోంచి దీపకా బయటికి ప్రసరిస్తున్నది. గది తలుపులు దగ్గ వేసి వున్నవి.

అగ్నిపాలుడు గొంతెత్తి పిలిచేందుకు సన్నద్ధ ఒక అడుగు ముందుకు వేయబోయేంత రక్కున గది తలుపులు తెరుచుకున్నవి. ఇం ముందు అతడు చూసిన యువతి ఒక అడు బయటకు పెట్టి, ఎదురుగా కనిపించిన అగ్ని లుణ్ణి చూస్తూనే శిలాప్రతిమలా అయిపోయి

ఆమె తెప్పరిల్లి సహాయం కోసం అ ముందే, తను తన దీనావస్థను గురించి చెప్ప వడం మంచిదనుకున్నాడు, అగ్నిపాలుడు.

"నేను దొంగను కాను! దురదృష్టవశాత్తూ చిన్న పోరులో గాయపడి, మీ సహాయం కో యిక్కడి కొచ్చాను. కోటలోని యీ భాగం లుండే ప్రదేశమని నాకు తెలియదు. క్షమిం చా అన్నాడు అగ్నిపాలుడు.

ఆ యువతి ఒక్క తృటికాలం ఆశ్చర్య "గాయపడ్డారా! మీరెవరు?" అంటూ ఒకడు ముందుకు వేసింది.

తను ఎవరినని చెప్పాలి? అగ్నిపాలుడు మకపడిపోయాడు. తను చంద్రగిరి రాజు







భోజుడి ఆస్థానంలో ఉండేవాడిననిగాని, ఫలానా పేరుగల సంస్థానాధిపతిననిగాని చెప్పటం ప్రమాద కారణం కావచ్చు. అరాజకం పాలయిన ఈ ప్రాంతాలలో ఎవరు ఏ పక్షీయులో తెలుసుకోనిదే, తన ఊరుపేరులు తెలియపరచటంవల్ల తనకు ప్రాణాపాయం కలిగే ప్రమాదం కూడా ఉంది. ఒకవేళ, ఈ కోట అధినేత కాలభోజుడి పక్షపాతి అయివుంటే తనకు వెంటనే మరణదండన తప్పదు. అలాకాక తను కాలభోజుడి పక్షం వాడినని చెప్పటంవల్ల మేలు కలుగుతుందా? కర్మకాలి ఈ సంస్థానికుడు నవభోజుడి పక్షం వాడయితే...

"మీరు నవభోజరాజు సైనికులతో జరిగిన పోరులో గాయపడ్డారు, అంతేనా?" అని అడిగిందా యువతి.

జరిగింది కూడా అంతే! అగ్నిపాలుడు అవునన్నట్టు తల వూపాడు.

"అలా అయితే మీరు మాకు అతిథులు. మా నుంచి మీకు ఎలాంటి హానీ జరగదు," అన్నది ఆ యువతి అగ్నిపాలుడ్ని నఖశిఖపర్యంతం పరీక్షించి చూస్తూ.

ఆ మాటలతో అగ్నిపాలుడికి ఆ సంస్థానాధీశుడు ఏ పక్షానికి చెందినవాడో తెలిసిపోయింది. తను నవభోజుడి సైనికులతో జరిగిన పోరులో గాయపడ్డానని ఆ యువతి సూచన ఇవ్వగానే – ఆమె తనకు ఆతిథ్యం ఇవ్వడానికి సంతోషంగా



రిస్తున్నది. అంటే - ఈ కోట ఎవరిదైనా, వఖోజుడి శత్రుపక్షంలో వాళ్ళు!
పరిస్థితుల్లో ఆ చోటున తను సహాయం టం ప్రాణానికే ముప్పు తెచ్చుకోవటం ని అగ్నిపాలుడు భయపడ్డాడు. తను అన్న సంగతి ఏ నిమిషాన్నయినా బయట బి బహుశా, ఈ సంస్థానాధిపతే, తనను గాడు కావచ్చు. అబద్ధం చెప్పి, ఆశ్రయం బించటం అన్న అవమానంతోపాటు తను గ్నీ పక్షాన్నుంచి ఇక్కడికి వేగుగా వచ్చిన కూడా భావించవచ్చు. అప్పుడు తనకు ం తప్పదు.
త్వరగా వీలయితే అంత త్వరగా ఇక్కడి నుంచి పారిపోవటం క్షేమకరమని అగ్నిపాలుడు నిశ్చయించుకున్నాడు. చలితో, గాయాల్నుంచి స్రవిస్తున్న నెత్తురువల్లా తనెక్కడైనా మరణించినా ఫరవాలేదు. అప్పుడు కనీసం తను అవమానం పొందవలసిన అవసరమైనా తప్పుతుంది.

"నేను పొరబడ్డాను, క్షమించాలి. స్త్రీలుండే ప్రాంతానికి ఇంత రాత్రివేళ రావటంలో పెద్ద నేరమే చేశాను. మీరు సహాయం చేస్తానన్నా అంగీకరించలేను," అంటూ అగ్నిపాలుడు గిర్రున వెనక్కు తిరిగి పిట్టగోడకేసి నడిచాడు.

"ఆ విషయమై మీరేమీ బాధపడకండి. తడిసిన దుస్తుల్తో, ఒంటిమీద గాయాలతో మీరు ఈ చీకట్లో ఎక్కడికీ వెళ్ళటం కూడా మంచిది కాదు. మా నాన్నగారిని పిలుస్తాను, ఆగండి!" అంటూ ఆ యువతి ముందుకువచ్చింది.

కాని, ఆ లోపలే అగ్నిపాలుడు పిట్టగోడను తాకుతున్న లతలకేసి చేయి చాచి, "మీ దయకు ఎంతో కృతజ్ఞుడ్ని... కాని..." అంటూనే పిట్టగోడ మీది నుంచి పట్టుతప్పి, కిందికి జారిపోయాడు.

- 5 -

ఎవరో, ఎక్కడో - ఎంతో దూరాన్నుంచి ఏదో మాట్లాడుతున్నట్టూ, తననేదో ప్రశ్నిస్తున్నటూ అగ్నిపాలుడు అనుకున్నాడు కానీ, ఆ మాటల ధ్వని తప్ప వాటి అర్థం అతడికి అవగాహన కావటంలేదు. బహుశా వాళ్ళు ఎక్కడో కొండ శిఖరం మీద ఉండి తనని ప్రశ్నిస్తున్నారేమో! లేక తనే ఏ నూతిలోనో పడివుండటంవల్ల తనకు వారి మాటలు వినబడటంలేదా?

సూర్యకిరణాలు కళ్ళను సూటిగా తాకినట్టయి అగ్నిపాలుడు మెల్లగా కళ్ళు తెరిచాడు. ఎదురుగా పెద్ద కిటికీలోంచి ఎక్కడో దూరంగా ఉన్న కొండా, దానిమీద సూర్యకాంతిలో మెరుస్తున్న రాళ్ళూ అతడికి దృగ్గోచరం అయాయి.

అగ్నిపాలుడు ఆ దృశ్యం చూస్తూనే కళవెళ పడ్డాడు. ఆ కొండను తానెన్నడూ చూచివుండ లేదు. ఆ ఎదురుగావున్న కిటికీ కూడా తనకు కొత్తే! ఇంతకూ తానెక్కడ ఉన్నట్టు? మోచేతిని మంచం మీద బలంగా ఆనించి, మరొక వైపుకు తిరిగేందుకు అగ్నిపాలుడు యత్నించాడు. అదే సమయంలో ఎడమవైపు నుంచి అతడికేదో సంభాషణ వినిపించింది. అతడు వెల్లకిలా పడుకుని, ఆ సంభాషణ వచ్చినవైపుకు తలతిప్పి చూశాడు.

ఇద్దరు వ్యక్తులు తనవంకే చూస్తూ సంభాషిస్తున్నవారల్లా తన చూపులు అటు ప్రసరించేసరికి సంభాషణ ఆపారు. ఇద్దరిలో ఒకరు బాగా వృద్ధు. చెవులకు కుండలాలున్నాయి. ఎర్రని రంగు గల పట్టుశాలువా ఒకటి ఒంటినిండా కప్పుకున్నాడు. రెండవ ఆయన ఆజానుబాహువు, కోరమీసాలు. అంత వృద్ధుడు కాకపోయినా దాదాపు యాభై-యాభై అయిదేళ్ళ వయసువాడిలా కనిపిస్తున్నాడు. ఆయన ధరించిన దుస్తుల తీరునుబట్టి ఆయనేదో రాజోద్యోగిగాని, సంస్థానాధిపతిగాని అయి ఉంటాడని అగ్నిపాలుడు భావించాడు.

ఆయన మందహాసం చేస్తూ అగ్నిపాలుడు ఉన్న మంచం దగ్గిరకు వస్తున్నాడు. ఆసరికి అగ్నిపాలుడికి తన పరిస్థితి అంతా అర్థమైపోయింది. తను ఒక పెద్ద గదిలో మంచం మీద ఉన్నాననీ, తలకు ఏదో కట్టు కట్టబడివున్నదనీ అతడు తెలుసుకున్నాడు. అంతే, తను ఒక్క వెన్ను మీదే కాక, తల మీద కూడా గాయపడ్డాడన్న మాట!

ఆ నిమిషంలో అతడికి జరిగిపోయిన సంఘటనలన్నీ ఒక్కసారిగా కట్టెదుట ప్రత్యక్షమయినై. తను... ఆ యువతి... ఆ సుందరి... ఎవరామె? ఆవిడ ఆతిథ్యాన్ని తిరస్కరించి, తను పిట్టగోడ



మీది నుంచి కిందికి దూకబోయాడు. కాదు..... దూకేందుకు ప్రయత్నించే ముందే, తన కాళ్ళల్లో సత్తువ ఉడిగి, తను అప్రయత్నంగా కిందికి పడిపోయాడు. ఆ తరువాత.....

"ఒంట్లో మరేం బాధగా లేదుగదా? అదృష్టవంతుడివి, విష్ణుమిత్రా! ఆచార్యులు కూడా నువ్వు త్వరలోనే కోలుకోగలవని చెప్పారు," అన్నాడావ్యక్తి.

అగ్నిపాలుడు తృళ్ళిపడ్డాడు. తానెవరు? విష్ణుమిత్రుడా!

అతడి తత్తరపాటును గ్రహించిన ఆ వ్యక్తి మంచం పక్కగా వచ్చి నిలబడుతూ, "ఇక్కడ నీకొచ్చిన భయం ఏమీ లేదు. మరొకచోట అయితే ఏం జరిగివుండేదో ఇప్పుడు ఊహించటం కష్టం. నేనూ నీలాగే నవభోజుడి దుష్ట పరిపాలన ను చంద్రగిరి రాజ్యాన్ని విముక్తం చేయాలనే వాడి కాని, కొన్ని అవాంతరాల వల్ల నేను కాల జుడితో కలిసి కత్తిదూయలేక పోయాను అన్నాడు.

ఈ మాటలు వింటూనే అగ్నిపాలుడు వి దయ్యాడు.

"బహుశా ఈ రెండు మూడు రోజుల్లో జరిగిందో నీకు తెలియకపోవచ్చు. కాలభోజు కూర్మశైలం దగ్గిర జరిగిన భీకర యుద్ధం ఓడిపోయిన మాట నిజమే. కాని, అది నవభో డికి తాత్కాలిక విజయమే తప్ప మరేం కా కాలభోజుడు - కొందరు అనుకుంటున్నట్టు



భోజుడికి బందీగా చిక్కలేదు. నా అనుమానం తిరిగి సైన్యసేకరణకు ఎక్కడికో వెళ్ళివుంటాడని. అతణ్ణి స్వయంగా ఎరిగివున్న నీకు కూడా అతడి పట్టుదలా, ధైర్యసాహసాల సంగతి తెలియంది కాదు గదా," అన్నాడా వ్యక్తి.

అగ్నిపాలుడు కళ్ళప్పగించి చూస్తున్నాడు.

"కూర్మశైలం దగ్గిర జరిగిన పోరులో నేనూ పాల్గొనవలసినవాడినే. కాని, దాన్ని గురించిన వర్తమానం నాకు చాలా ఆలస్యంగా చేరింది," అన్నాడా వ్యక్తి మళ్ళీ.

అగ్నిపాలుడు కంపించిపోయాడు. తనెవరో రాజద్రోహి చేత బడిన మాట వాస్తవం! అతడు తనను విష్ణుమిత్రుడనుకుంటున్నాడు. అలా కాదని తాను చెప్పటం అంటే - కోరి గొంతు మీదికి కొనితెచ్చుకోవటమే అవుతుంది. ఇంతకూ ఈ రాజద్రోహి ఎవరు? ఈ కాలభోజుడి పక్షపాతి, ఏ సంస్థానాధిపతి అయివుంటాడు?

"ఇంతకూ తమరెవరైందీ చెప్పారు కాదు?" అన్నాడు అగ్నిపాలుడు కంఠంలో ఏమాత్రం ఆదుర్దా కనబరచకుండా.

"ఓం!" అంటూ ఆ వ్యక్తి నవ్వాడు - "పెద్ద పొరపాటే చేశాను. నేనెవరైందీ చెప్పకుండానే చాలాసేపు సంభాషణ నడిపాను. నా పేరు నువ్వు వినేవుంటావు. రాజా ప్రసేనుడు. మల్లూరు మండలాధీశుణ్ణి... వినే వుంటావు కదా?"

ఆ మాటలతో అగ్నిపాలుడికి నెత్తిన పిడుగు పడినట్టయింది. తను అవజ్ఞవర్మతో పందెం కట్టి, ఏ సంస్థానానికి చేరాలని బయలుదేరాడో, ఆ సంస్థానానికి చేరిన మాట మాత్రం నిజమే! కాని, తను అగ్నిపాలుడిగా... నవభోజ మహారాజుల అనుగ్రహం సంపాయించిన వాడుగా... ఆయన మిత్రుడిగా కాక, 'విష్ణుమిత్రుడు' అనబడే ఒకానొక రాజద్రోహి పేరును అంటగట్టుకుని అక్కడికి చేరాడు. అసలు తన పేరు విష్ణుమిత్రుడని, ఈ ప్రసేనుడు ఎందుకనుకుంటున్నాడు?

అగ్నిపాలుడు పిట్టగోడ మీది నుంచి కిందకు జారిపడిన తరవాత, జరిగినదేమిటో గుర్తుతెచ్చుకునేందుకు ప్రయత్నించాడు. తన పేరు విష్ణుమిత్రుడని, తనని పట్టితెచ్చిన రాజభటులతో చెప్పిన మాట అతడికి గుర్తుకొచ్చింది. వాళ్ళు నవభోజుడి సైనికులు కనక ఏ పరిస్థితుల్లోనూ ఈ ప్రసేనుడి దగ్గరకు వచ్చే అవకాశం లేదు.

ఆ తరువాత తను ఒక సైనికుడి వల్ల గాయపడటం, నదిని ఈదుకుని ఇవతలి తీరం చేరటం ... అన్నీ అతడి స్మృతిపథంలో కదుల్లాడినై. కాని ... తనెవరితోనూ ఆ తరవాత తన పేరును గురించి చెప్పలేదు.

అగ్నిపాలుడు సాలోచనగా ప్రసేనుడి ముఖం కేసి చూశాడు. అతడు మందహాసం చేస్తూ తన కళ్ళల్లోకే చూస్తున్నాడు.

"మీరు... నేనెవరైందీ గ్రహించటం చాలా ఆశ్చర్యం కలిగిస్తున్నది!" అన్నాడు అగ్నిపాలుడు

తాపీగా.

ప్రసేనుడు నవ్వి, "బహుశా నీకు స్పృహ తప్పి పిట్టగోడ మీది నుంచి దిగువకు పడిపోయిం తరవాత ఏం జరిగిందీ తెలియదనుకుంటాను. నా కుమార్తె వకుళ కేకలు వేయటం విని, నేనక్కడికి వచ్చాను," అన్నాడు.

అగ్నిపాలుడి ముఖం మీద ప్రస్ఫుటం అయిన ఆశ్చర్య చిహ్నాలను చూసి మళ్ళీ ప్రసేనుడే, "ఏమిటంత ఆశ్చర్యపడుతున్నావు?" అని ప్రశ్నించాడు.

"నా పేరు మీకెలా తెలిసిందా అని...." అంటూ అగ్నిపాలుడు ఆగాడు. కాని, ఆ సమయంలో అతడు నిజంగా ఆలోచిస్తున్నది ఈ విషయం గురించి కాదు. తను... ఆ అర్ధరాత్రి వెన్నెల కాంతిలో చూసినది వకుళమాలనే అన్నమాట!

ఈలోపల ప్రసేనుడేదో చెప్పుకుపోతున్నాడు.

"తడిసి ముద్దకట్టుకు పోయిన నీ దుస్తుల్లో లలితాంగి నీకు రాసిన ఉత్తరాల పొత్తి కనిపించింది. అందుమీద..."

"లలితాంగి!" అంటూ అగ్నిపాలుడు అప్రయత్నంగా కనుబొమలు ముడిచాడు.

అగ్నిపాలుడి వాలకం ప్రసేనుడికి నవ్వు తెప్పించింది. అతడు బిగ్గరగా నవ్వుతూ, "ఆ అమ్మాయిని నేను బాగా ఎరుగుదును. ఆమె తండ్రి మణిమంతుడు వయసులో నా కన్నా అయిదేళ్ళు చిన్నవాడయినా – మేమిద్దరం చాలాకాలంగా మిత్రులం. నీ గురించి అతడు చాలాసార్లు నాతో అనేక విషయాలు చెప్పాడు కూడా," అన్నాడు.

ఆ మాటలకు అగ్నిపాలుడికి ఏమని జ బివ్వాలో అర్థం కాలేదు. అతడు కళ్ళప్పగిం చూస్తూ ఊరుకున్నాడు.

"నీకూ, నాకే గాక కాలభోజుడి పక్షీయుల దరికీ సంతోషం కలిగించే వార్త! కొందరు కుంటున్నట్టు మణిమంతుడు కూర్మశైలం ద జరిగిన పోరులో మరణించలేదు. అత ఒకానొకచోట క్షేమంగా ఉన్నట్టు నా కింత ముందే వార్త వచ్చింది," అన్నాడు ప్రసేనుడు.

"చాలా సంతోషం!" అని అగ్నిపాలు కోపంగా పళ్ళు కొరకబోయి తమాయిం కున్నాడు.

ప్రసేనుడు మందహాసం చేస్తూ, "హనుమ నాయకుడి శక్తిసామర్థ్యాల గురించి నీ అభి యం ఏమిటి?" అన్నాడు.

"ఎవరా హనుమప్ప నాయకుడు?" అన్నా అగ్నిపాలుడు, ఈ హఠాత్ ప్రశ్నకు ఆశ్చర్యపో

"ఎవరేమిటి?" అంటూ ప్రసేనుడు అగ్ని లుడి ముఖంలోకి ఆశ్చర్యంగా చూస్తూ, " యుద్ధంలో పాల్గొన్న వాడివి, అంతలోనే మ పోయావా? కూర్మశైలం దగ్గిర నవభోజ సేనలను నడిపినది హనుమప్ప నాయకుడే కద అన్నాడు.

అగ్నిపాలుడు ఓ తృటికాలం సంశయిం తను ఇప్పటి పరిస్థితులలో విష్ణుమిత్రుడిగా న





చక తప్పదనీ, అదే ఉత్తమమార్గమనీ నిశ్చయించుకున్నాడు.

"అతడి సైన్యం సంఖ్యలో మనకన్నా ఐదింతలు – అలాంటప్పుడు సేనానాయకుడిగా అతడి శక్తిసామర్థ్యాలను ఎలా అంచనా కట్టడం?" అన్నాడు అగ్నిపాలుడు.

"అవునవును," అంటూ ప్రసేనుడు తలవూపి, "కాలభోజ ప్రభువుకు ఇది తగిన కాలంగా కనిపించటం లేదు. నా అభిప్రాయం... ఆయన కృష్ణ దాటివెళ్ళి మరికొంతకాలం వేచివుండటం మంచిదని," అన్నాడు.

అగ్నిపాలుడికి ఏం జవాబు చెప్పాలో తెలియలేదు.

"అసలు కూర్మశైలం దగ్గర అంత సంఖ్యాధిక్యత ఉన్న శత్రువులతో మన బలాలు తలపడవలసింది కాదు. అది పొరబాటే" అన్నాడు ప్రసేనుడు.

"వెనుదిరిగేందుకు అవకాశం లేదు. తప్పనిసరి అయే అక్కడ ఆ పోరాటం చేయవలసివచ్చివుంటుంది," అంటూ అగ్నిపాలుడు బద్ధకంగా ఆవులించాడు.

"సరే, ఇప్పటికే చాలా శ్రమ ఇచ్చాను. నీకు రెండు మూడు రోజులు పరిపూర్ణ విశ్రాంతి అవసరం అని ఆచార్యులు చెప్పారు. మాట్లాడవలసిన సంగతులు చాలా ఉన్నాయి. ఆ తర్వాత మాట్లాడుకుందాం," అని ప్రసేనుడు అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

అగ్నిపాలుడు ఆలోచనా సముద్రంలో మునిగిపోయాడు. తను మారుపేరుతో ఉంటున్న నవభోజ మహారాజు మిత్రుడు అగ్నిపాలుడని తెలిస్తే ఈ ప్రసేనుడి వల్ల ఎలాంటి అవమానం పొందాల్సి వస్తుందో! వకుళమాల కూడా తనను విష్ణుమిత్రుడే అనుకుంటూ ఉండాలి. అయితే ఆమెను వివాహం ఆడే ప్రయత్నం తనకెలా సాధ్యమవుతుంది? నిజం చెపితే, తను మారుపేరుతో ఆ ఇంట చేరిన దొంగగా ఆమె భావించవచ్చు!

తన పేరు విష్ణుమిత్రుడని తానిక్కడ ఎవరితోనూ చెప్పలేదు. ప్రసేనుడే తనవద్ద లభించిన విష్ణుమిత్రుడి ఉత్తరాలను చూసి అలా భావించాడు. ఇకపోతే తను ఆపద్ధర్మంగా ... తాత్కాలికంగానే ఆ పేరుకు అంగీకారం చెప్పవలసివచ్చింది. ఇందులో తన తప్పేమీ లేదు – తను ఫలానా అని ప్రసేనుడితో చెపితే?.... తక్షణం తనకు మరణం తప్పదు. ప్రసేనుడు నవభోజుడికి వ్యతిరేకిననే సంగతి తనకు చెప్పేశాడు. అలాంటప్పుడు ప్రాణాలతో తనను బయటికి పోనీయటమంటే – కోరి తనకు ప్రాణగండం తెచ్చుకోవటమేనని అతడు తప్పక భావిస్తాడు! ఈ విషమ పరిస్థితి నుంచి తను బయటపడటం ఎలా?

అగ్నిపాలుడికి ఇలాంటి ఆలోచనలతో తల వేడెక్కిపోయింది. క్రమంగా సూర్యాస్తమయం అయి చీకటి పడి నడిరేయి అయినా కూడా అతనికి నిద్ర పట్టలేదు. తరవాత కొంతసేపటికి

నీరసంగా కళ్ళు మూశాడు.

6

తెల్లవారి బారెడు పొద్దెక్కింతరవాత గాని అగ్నిపాలుడికి మగత నిద్ర వదిలి బాగా మెలకువ రాలేదు. కళ్ళు తెరిచేసరికి మంచం పక్కనే ఉన్న ఆసనం మీద ప్రసేనుడు కూర్చుని, అతడికేసే చూస్తున్నాడు.

"రాత్రి బాగా నిద్రపట్టిందా? ఆ గందరగోళమేమీ నీకు నిద్రాభంగం కలిగించలేదు గదా?" అన్నాడు ప్రసేనుడు.

"ఏ గందరగోళం?" అంటూ అగ్నిపాలుడు ఆశ్చర్యపోయాడు.

"ఓహోఁ అలాగా! అయితే ఆ సంగతులేవీ నీకు తెలియవన్నమాట," అంటూ ప్రసేనుడు ఆసనం మీది నుంచి లేచి, "మళ్ళీ వస్తాను. నీ కాలకృత్యాలు కానీ. ఆచార్యులు కూడా త్వరలోనే ఇక్కడికి వస్తారు. ఆయన వైద్యం వల్ల నీకు సత్వరంగా స్వస్థత చిక్కితే ఎంత బావుండును!" అంటూనే గదిలోంచి వెళ్ళిపోయాడు.

అగ్నిపాలుడు కప్పుకున్న దుప్పటిని పక్కకు తన్నివేసి, మంచం మీది నుంచి దిగాడు. అతడికి రాత్రి జరిగిపోయిన గందరగోళమేమిటో అర్థం కాలేదు. బహుశా, తనను వెతుక్కుంటూ రాజభటులు రాలేదుగద? ఒకవేళ తన నౌకరు మాహూ...

అగ్నిపాలుడు చలించాడు. మాహూ తనను వెతుక్కుంటూ ఇక్కడికి రావటం జరిగితే, తనె... నదీ ప్రసేనుడికి తెలిసిపోతుంది. అప్పుడు ... పరిస్థితి ఎలా పరిణమిస్తుంది? అలాకాక, తన... గాయపరిచి వెంటాడిన రాజభటులు ఇక్క... వచ్చినా, తను వాళ్ళకు బందీ కాక తప్పదు. రాజభటుల చేతబడకుండా తప్పించుకోవాలం... తన నిజ నామం వాళ్ళకు తెలియపరచవ... ఉంటుంది. అప్పుడూ రాజా ప్రసేనుడి నుం... తనకు ప్రమాదం తప్పదు. ఈ హాస్యాస్పద పరి... తుల్లో తగుల్కొన్న తనను గురించి వకుళమ... ఏమనుకుంటుంది?... ఇలాంటి ఎడతెగని ఆ... చనలతోనే అగ్నిపాలుడు కాలకృత్యాలు తీర్చుకు... కొత్త దుస్తులు ధరించి, తిరిగి తన గదికి వ... కూర్చున్నాడు. కొద్దిసేపటికల్లా నౌకరు ఫల... రాలు తీసుకుని వచ్చాడు. అతడి వెనకగా ప్ర... నుడు కూడా గదిలో ప్రవేశించాడు.

ఇద్దరూ ఫలహారాలు తీసుకుంటూండగా ప్ర... నుడు అగ్నిపాలుడికేసి చిరునవ్వుతో చూస్తు... "అగ్నిపాలుడనే రాజాశ్రితుడ్ని గురించి వినేవుం... వనుకుంటాను. నవభోజరాజుకు అతడు ఆ... స్నేహితుడని చెబుతారు," అన్నాడు.

అగ్నిపాలుడు ఆశ్చర్యపడుతున్నట్టు ప్రసేను... కేసి చూసి, తల తిప్పుకుని, ఏదో గొంతుకు అ... పడినట్టు సన్నగా దగ్గాడు.

"సరే, ఇప్పుడతని గురించిన గతం అం... ముఖ్యం కాదనుకో," అంటూ ప్రసేనుడు క...





బొమలు చిట్లించి, "రాత్రి నడిరేయి దాటాక ఆ అగ్నిపాలుడి సేవకులు ఇక్కడికి వచ్చారు," అన్నాడు.

"ఏం పనిమీద?" అంటూ అగ్నిపాలుడు ఆశ్చర్యం ప్రకటించాడు.

"వాళ్ళు వచ్చినపని నీకులాగే నాకూ ఆశ్చర్యం కలిగించింది విష్ణూ!" అంటూ ప్రసేనుడు నవ్వి గొంతు తగ్గించి, "ఆ అగ్నిపాలుడు నా సంస్థానికే బయలుదేరాడట! ఎందుకో తెలుసా?" అన్నాడు.

అగ్నిపాలుడు తెలియదన్నట్టు అమాయకంగా ముఖం పెట్టాడు.

"నా కుమార్తె వకుళను తనకిచ్చి వివాహం చెయ్యమని అడిగేందుకు," అన్నాడు ప్రసేనుడు.

"ఆ సంగతి అతడి నౌకర్లే చెప్పారా?" అన్నాడు అగ్నిపాలుడు పొంగివస్తున్న కోపాన్ని తొక్కిపడుతూ.

"ఊహూఁ! ఆ సంగతి వాళ్ళకు తెలియదు. వాళ్ళకు తెలిసిందల్లా, అతడు ఇక్కడికి బయలుదేరటం వరకే. కూర్మశైలం ప్రాంతాల వాళ్ళూ, అతడూ వేరుపడి పోయారు. ఆ కారణం వల్ల అతడ్ని వెతుక్కుంటూ వాళ్ళు ఇక్కడికి వచ్చారు," అన్నాడు ప్రసేనుడు నిర్వికారంగా.

"పాపం!" అన్నాడు అగ్నిపాలుడు మరేమనేందుకూ తోచక.

"అతడి మీద ఆ రకం జాలి నాకేమీ లేదు. కావటానికి అతడి తండ్రిని ఒకప్పుడు నేను బాగా ఎరిగివున్నవాడ్నే! మా ఇద్దరి మధ్యా ఒకరకం స్నేహం లాంటిది కూడా ఉండేది. దాదాపు ఇరవై ఏళ్ళ క్రితం ఇదే గదిలో అతడికి ఆతిథ్యం కూడా ఇచ్చాను. పదిహేను సంవత్సరాల క్రితం ఆయన హఠాత్తుగా మరణించినప్పుడు ఎంతో విచారించినవాళ్ళల్లో నేనొకడ్ని. కాని, ఆయన కొడుకు ... ఈ అగ్నిపాలుడు తండ్రిలాంటి వాడు కాదు..."

"క్షమించాలి... మీరతడ్ని ఎరుగుదురా?" – అగ్నిపాలుడు అన్నాడు, ప్రసేనుడి కంఠస్వరంలో ప్రస్ఫుటమైన కాఠిన్యానికి ఆశ్చర్యపోతూ.

"ఊహూఁ, ఎరగను. అతడ్ని నాలుగైదేళ్ళ వయసులో ఉండగా చూసి వుంటాను. అతడ్ని గురించి బాగా తెలిసివుండకపోవటమే ఎంతో మేలు!" అన్నాడు ప్రసేనుడు పెదాలు బిగించి.

"ఏం, ఆ అగ్నిపాలుడ్ని గురించి మీ మిత్రులెవరైనా చెడుగా చెప్పారా?" అన్నాడు అగ్నిపాలుడు ఏదో ఉబుసుపోక అడుగుతున్నట్టు.

ప్రసేనుడు, అగ్నిపాలుడి ముఖంలోకి సూటిగా ఓమారు చూసి తల పంకిస్తూ, "అతడితో నీకేమైనా పరిచయం ఉన్నదా విష్ణూ?" అని అడిగాడు.

"నాకా... అతడితోనా... ఊహూఁ!" అంటూ అగ్నిపాలుడు తడబాటు పడ్డాడు.

"మంచిది! మనలాంటి వాళ్ళకు ఆ నవభోజుడి మూకలోని వాళ్ళతో ఏ విధమైన పరిచయాలూ

లేకపోవటమే ఉత్తమం," అంటూ ప్రసేనుడు ఆగి, "ఇంతకూ చెప్పవచ్చిందేమిటంటే ... రాత్రి ఆ అగ్నిపాలకుడి సేవకులు ఇక్కడికి వచ్చారని చెప్పా గదా! ఆ వచ్చిన వాళ్ళంతా ఒక ఎత్తూ, మాహూ అనో - ఊహూ అనో పేరుగలవాడు ఒక్కడూ ఒక ఎత్తు! ససేమిరా తన యజమాని వచ్చేవరకూ ఇక్కడే తిష్ఠవేస్తానని కూర్చున్నాడు. పరిస్థితులు మామూలుగా ఉన్న రోజుల్లో అయితే వాడ్ని చెట్టుకు కట్టించి, తాట ఒలిపించేవాడ్ని. కాని, ఇప్పటి అననుకూల వాతావరణంలో అలాంటిది ... ప్రస్తుతం సర్వశక్తిమంతుడుగా ఉన్న నవభోజ రాజుకు రాజద్రోహంగా కనిపించవచ్చు! ఈ అగ్నిపాలుడనే సంస్థానీకుడు ఆయన మిత్రుడాయె! పైగా నవభోజుడికి నన్ను మిత్రుడ్ని చేసుకోవాలనీ ఉన్నది. అది సాధ్యం కాకపోతే ఏదో కుంటిసాకు చూపి, నన్ను సర్వనాశనం చేయటానికి వెనుకాడడు. ఇవన్నీ ఆలోచించి, ఆ అగ్నిపాలుడి సేవకులతో ఎంతో జాగ్రత్తగా మాట్లాడవలసి వచ్చింది," అన్నాడు.

"ఇంతకూ ఆ మాహూనో, ఆహూనో వెళ్ళిపోయాడా?" అన్నాడు అగ్నిపాలుడు ఉద్వేగాన్ని అణుచుకుంటూ.

"ఆc, చివరికి ఎలా అయితేనేం వదిలించుకున్నాను! ఆ యజమాని లేని ఈ ప్రదేశంలో కాళ్ళుచాపుకు కూర్చునేకన్న, ఈ చుట్టుపక్కల కొండలూ, గుట్టలూ, అడవులూ, నదులూ వెతికి చూడటం మంచిదని చెప్పాను. దానితో అందు వెళ్ళిపోయారు. వాళ్ళకు ఆ అగ్నిపాలుడు ఏ ఒక రూపంలో కనబడవచ్చు... సజీవుడిగా విగతజీవుడిగానో!" అంటూ ప్రసేనుడు చమ రంగా ఒక కన్ను మూశాడు.

ఆ మాటలతో అగ్నిపాలుడు నిలువె కంపించి పోయాడు. ప్రసేనుడికి తను ఎవరై తెలియకపోవటం ఎంత మంచిదయిందో అత ఆ నిమిషాన బాగా అర్థమైంది. ఈ పరిస్థితు తను ఏదో వంకపెట్టి ఇక్కడి నుంచి ఎంత త్వర వెళ్ళిపోతే అంత మంచిదని కూడా తోచింది.

ఇలా ఆలోచిస్తున్న అగ్నిపాలుడికి హఠాత్తు ఒక ఆలోచన వచ్చింది. అతడు గొంత సవరించుకొని, "రాజా ప్రసేన్! మీరా అగ్నిపా లుడ్ని సరిఅయిన కారణం లేకుండానే ద్వేషి న్నారేమో అనుకుంటాను. అతడు కావటాని మన శత్రుపక్షంలోనివాడే కావచ్చు. అయి అతడి తండ్రి మీకొకప్పుడు మిత్రుడని మీరే చె తున్నారు కదా!" అన్నాడు.

"అదేనాటి మాట, విష్ణూ!" అంటూ ప్రసేను అవహేళనగా నవ్వాడు - "ఆ రోజుల్లో చంద్ర రాజులకు తమ సామంతులంటే గౌరవాలుండే ఈనాడు... ఈ నవభోజుడి పరిపాలనలో హైహ వంశస్థుడినైన నాకూ, భిల్లుజాతి నాయకు తేడా ఏమీ లేదు. అన్ని త్యాగాలకూ సిద్ధమై నేనూ, నీతోపాటు మరికొందరమూ కలిసి కా





భోజ రాజును బలపరుస్తున్నామంటే... అందుకు ప్రబల కారణాలే ఉన్నాయని నీకు తెలియంది కాదు గదా?" అన్నాడు ప్రసేనుడు.

"ఆ సంగతులేవీ నేను కాదనటంలేదు. కాని, ఈ అగ్నిపాలుడికి సంబంధించినంతవరకూ అతడు మీకు చేసిన ద్రోహం ఏమీ లేదుకదా?" అన్నాడు అగ్నిపాలుడు.

"అవును, ఈనాటి వరకూ అతడు నాకు వ్యక్తిగతంగా చేసిన ద్రోహమేమీ లేదు. కాని, అతడు శత్రుపక్షంలోని వాడు. అంతేకాక, అతడ్ని గురించి నాకు తెలిసిన సమాచారాన్ని బట్టి - అతడికీ, అతడి తండ్రికీ ప్రవర్తనలో ఎక్కడా పోలికలే లేవు," అన్నాడు ప్రసేనుడు.

"అంటే... ఆ అగ్నిపాలుడ్ని గురించి కొన్ని సంగతులు మీకు తెలుసునన్నమాట!" అంటూ అగ్నిపాలుడు, ప్రసేనుడి ముఖంలోకి పరీక్షగా చూశాడు.

"ఆc, తెలుసుకోదగినంతవరకూ తెలుసు. అతడి చుట్టూ పోగయ్యే దుష్ట మిత్రులూ, నైతిక విలువలు ఏ మాత్రం లేని అతడి ప్రేమకలాపాలూ..."

"క్షమించాలి, ప్రసేన్!" అంటూ అగ్నిపాలుడు ప్రసేనుడి వాగ్ధోరణికి అడ్డుపడి, "అగ్నిపాలుడ్ని ఎరిగివున్న మిత్రుడొకడు నా కున్నాడు. అతడిలో ఉన్న ఇతర లోపాల సంగతి నాకు తెలియదు కాని, మీరనే నైతిక విలువల విషయంలో అతడు చాలా పట్టుదలగలవాడని విన్నాను," అన్నాడు.

ఆ మాటలకు ప్రసేనుడు బిగ్గరగా నవ్వాడు. తరవాత కొంచెం ఆగి, "జగ్గరాజు గురించి నీవు విన్నావుగదా, విష్ణూ?" అని అడిగాడు.

"అవును. విన్నాను," అంటూ అగ్నిపాలుడు తలవూపాడు.

"అతడి మరణానికి కారణం ఏమిటంటావు?" అని అడిగాడు ప్రసేనుడు.

"అతడికీ, అగ్నిపాలుడికీ ద్వంద్వ యుద్ధం జరిగింది. అందులో అగ్నిపాలుడు జగ్గరాజును చంపాడు," అన్నాడు అగ్నిపాలుడు.

"నేనడిగేది జగ్గరాజు ఎలా మరణించాడని కాదు. ఆ మరణానికి - అంటే జగ్గరాజుకూ, అగ్నిపాలుడికీ ఆ పోరు జరగటానికి మూలకారణం ఏదో దాన్ని గురించి," అన్నాడు ప్రసేనుడు.

అగ్నిపాలుడు కనుబొమలు చిట్లించి, ఆశ్చర్యంగా ప్రసేనుడికేసి చూస్తూ ఊరుకున్నాడు.

"ఒకానొక వారవనిత కారణంగా ఆ ఇద్దరూ కత్తులు దూసుకున్నారు. తెలిసిందా?" అన్నాడు ప్రసేనుడు.

"అవును, ఆ సంగతీ విన్నాను. కాని, మీరన్నట్టు ఆవిడ కేవలం వారవనిత కాదు - రాజాస్థాన ప్రధాన నర్తకి," అన్నాడు అగ్నిపాలుడు.

"రాజనర్తకి అయితే మాత్రం ఏం? ఒక సంస్థానాధిపతి, సుక్షత్రియుడు చేయవలసిన పనీ, తగవులాడవలసిన విషయమేనా ఇది?" అన్నాడు ప్రసే



నుడు కొంచెం కటుస్వరంతో.

"ఈ ధర్మసందేహాన్ని గురించి నేను ఎటూ చెప్పలేను. ఈ సంఘటన జరిగిపోయి ఏడెనిమి దేళ్ళయిందనుకుంటాను. యువకుడూ... ఉడుకు రక్తం... మనం అంతగా తప్పుపట్టకూడదు. పైగా ఈ జగ్గరాజు కత్తియుద్ధంలో తనకున్న ప్రావీణ్యా నికి విర్రవీగుతూ ఎన్నెన్ని ఘోరాలు చేశాడో, మీకు తెలియంది కాదు!" అన్నాడు అగ్నిపాలుడు.

"నేను ఇందులో జగ్గరాజును సమర్థించటం లేదు. కత్తియుద్ధంలో అతడికున్న నైపుణ్యాన్ని - అతడు దొమ్మరివాడి కంటే హీనంగా దుర్విని యోగపరుచుకున్నాడు. నేను మాట్లాడేది అగ్నిపా లుడి ప్రవర్తన గురించి! వారకాంత కోసం ప్రాణ త్యాగానికి సిద్ధపడేవాడు సుక్షత్రియ కన్యాపాణి గ్రహణానికి ఎలా అర్హుడౌతాడు?" అన్నాడు ప్రసేనుడు.

"మీరనేదేమిటో నాకు బోధపడటంలేదు," అన్నాడు అగ్నిపాలుడు ఆశ్చర్యపోతూ.

"అవును. నేను వివరాలు చెప్పకుండానే నీతో మాట్లాడేస్తున్నాను," అంటూ ప్రసేనుడు ఆగి, తరవాత అగ్నిపాలుడికేసి చిరునవ్వుతో చూస్తూ, "అవజ్ఞవర్మ అనే పేరుగలవాడొకడు నవభోజుడి ఆస్థానంలో ఉన్నాడు - నీకు తెలుసా విష్ణూ?" అని ప్రశ్నించాడు.

"అతడ్ని గురించీ విన్నాను," అన్నాడు అగ్నిపా లుడు.





ప్రసేనుడు తల పంకించి, అగ్నిపాలుడి కళ్ళ ల్లోకి సూటిగా చూస్తూ, "ఆ అవజ్ఞవర్మ రూపమే వికారం కాదు - మనస్సు కూడా అలాంటిదే అని చాలా మందికి తెలుసు. అలాంటి అల్పుడు, నవభోజుడి పనుపున, ఈ మధ్య నా గృహానికి వచ్చాడు. అతడికి నా కుమార్తెను వివాహమా డాలని ఉన్నది. ఆ సంగతి వచ్చిన మరునాడే బయట పెట్టాడు. అతడి మాటల ధోరణిని బట్టే దీని వెనుక నవభోజుడి ప్రోత్సాహం ఉందని నేను గ్రహించాను. నిజంగా ఆ నవభోజుడికే నన్ను మిత్రుడిని చేసుకోవాలని ఉంటే, అతడు ఈ అవజ్ఞవర్మ కన్న రూపసినీ, కులీనుడ్నీ, నీతివం తుడ్నీ - ఆ పనికి పంపవలసింది. కాని, అతడలా చేయలేదు. దీన్నిబట్టి నేనూహించిందేమంటే - ఆ నవభోజుడు నన్నవమానించదలిచే ఈ అవజ్ఞ వర్మ అనేవాడ్ని పంపాడేమో అని! సరే, ఆ అవజ్ఞ వర్మకు - రాజాశ్రితుడు గనకా, ఆ రాజు తాత్కాలి కంగా నా కన్న బలవంతుడు గనకా - నేను అన్ని మర్యాదలూ చేయక తప్పింది కాదు. కాని, నా కుమార్తె వివాహ ప్రసక్తి వచ్చినపుడు మాత్రం, నేను నిర్మొహమాటంగానే అతడికి చెప్పవలసిన మాటలు చెప్పేశాను. దానితో ఆ అవజ్ఞవర్మ తల వంచుకుని వచ్చిన దారినే తిరిగి పోయాడు. ఆ తరవాత జరిగిందేమిటంటే - నవభోజరాజు అంతటితో ఊరుకోక, ఈ అగ్నిపాలుడ్ని నా దగ్గి రకు పంపుతున్నాడు. ఆ విషయం రాత్రి అతడి నౌకర్లు చెప్పకపోయినా; అతడు ఈ కల్లోల పరిస్థి తుల్లో ఇంత దూరం ఎందుకు బయలుదేరి వస్తు న్నాడో నేనూహించగలను. అంతేకాక, ఈ అగ్ని పాలుడు మాత్రం ఆ అవజ్ఞవర్మ కన్న ఏ విష యంలో అధికుడు? అస్తిపాస్తుల్లో అధికుడు కావచ్చు - రూపంలో అధికుడు కావచ్చు - కాని నీతినియమాల సంగతి వచ్చినప్పుడు..." అంటూ పొంగివస్తున్న కోపాన్నీ ఉద్రేకాన్నీ ఆపు కోలేక దగ్గుత్తిక పడి ఆగిపోయాడు.

ఆ క్షణంలో ప్రసేనుడికి ఏమని చెప్పేందుకూ అగ్నిపాలుడికి గొంతు పెగలలేదు. అతడు ప్రసే నుడికేసి చూస్తూ ఊరుకున్నాడు.

ప్రసేనుడు ఆసనం మీది నుంచి లేచి, గదికి ఒక వైపున ఉన్న కిటికీకేసి నడిచి బయటికి చూస్తూ కాసేపు ఉండిపోయాడు. తరవాత ప్రశాంత వదనంతో అగ్నిపాలుడి మంచం దగ్గిరకు తిరిగివచ్చి, "విష్ణూ! వ్యక్తిగతంగా నాకు సంబం ధించిన రాజ్యాంగ వ్యవహారాలలోని నా ఇష్టా యిష్టాలకు, నా ఒక్కగానొక్క కుమార్తె భవిష్యత్తును ఒడిదుడుకుల్లో పెడుతున్నానని అనుకోకు. అగ్నిపాలుడి తండ్రి సజీవుడై ఉన్నట్టయితే, అతడి ఏకైక పుత్రుడు అంత విచ్చలవిడిగా సంచరించే వాడు కాదని నా నమ్మకం. నా కిప్పటికీ... ఆ నాడు మిత్రపాలుడన్న మాటలు గుర్తున్నవి. నెలల పాపగా ఉయ్యాలలో కేరింతలు కొడుతున్న వకుళను అతడు భుజాన ఎత్తుకుని ఆడిస్తూ,

'ప్రసేన్! ఏనాటికైనా మనం వియ్యమంది తీరాలి! మా అగ్నిని చూశావు కదా, వకుళ నా కోడలెందుక్కాకూడదూ?' అన్నాడు! ఆనాటి దేశ పరిస్థితులే వేరు. నేను ఎంతో సంతోషంగా తల వూపాను. నిజంగా మిత్రపాలుడు బతికివున్నట్టయితే... ఆనాటి అంగీకారం, వాగ్దానమే అయేది. కాని, అతడు లేడు... అతడి కుమారుడైన ఈ అగ్నిపాలుడు తన తండ్రి కీర్తిని నిలపగలిగినవాడు కాదు," అన్నాడు.

"కావచ్చు. అతడ్ని గురించి నాకేమీ వివరాలు తెలియవు," అన్నాడు అగ్నిపాలుడు వజ్రఘాతం తగిలినవాడిలా వణికిపోతూ.

- 7 -

వారం రోజులు గడిచిపోయినై. ఈ మధ్య కాలంలో చెప్పుకోతగ్గ సంఘటనలేవీ జరగలేదు. తనకు శారీరక స్వాస్థ్యం చిక్కగానే, ప్రస్తుతానికి రాజా ప్రసేనుడి గృహం వదిలిపోవటమే క్షేమమని అగ్నిపాలుడు ఆలోచించాడు. కాని, ఈ వారం రోజుల్లోనూ అతడు వకుళమాలను - ఆవిడ తల్లి వెంట వుండగా - దూరాన ఉండి - రెండు మూడుసార్లు చూశాడు. ఆమె అందం, యౌవనం, ముగ్ధత్వం - ఆలోచించిన కొందికీ అతడ్ని మరింత బలంగా ఆకర్షించసాగినై. పైగా మొదటినాడు ఆ చిరువెన్నెలలో తను ప్రథమంగా చూసిన నాటి రాత్రి - ఆమె తనపై చూపిన దయ, కరుణ అతడి హృదయం మీద బాగా ముద్రితమైపోయాయి.

అవజ్ఞవర్మతో తన పందెం మాట అటుంచి, వకుళమాలను తన భార్యగా ఏ విపత్కర పరిస్థితులలోనైనా సరే పొందలేనినాడు, తన భావి జీవితం వృథా అనుకున్నాడు అగ్నిపాలుడు.

ఇలాంటి సమస్యలతో సంకుల సమరం చేస్తూ, ఒకనాటి సాయంకాలం వేళ అగ్నిపాలుడు ఉద్యానవనంలో చల్లగాలికి తిరుగుతూండగా, ముఖద్వారం వైపు నుంచి పెద్దగా మాటలు వినిపించినై. అగ్నిపాలుడు అటుకేసి తల తిప్పాడు.

రాజా ప్రసేనుడి వెంట అతడి భార్య చంద్రాదేవీ, కుమార్తె గాక - మరెవరో యువకుడు, దాదాపు పాతికేళ్ళవాడు ఉన్నాడు. అతడు చేతులు అటూ యిటూ ఊగిస్తూ, పెద్ద గొంతుతో మాట్లాడుతున్నాడు. ప్రసేనుడు తల వంచుకొని వింటూ, మధ్య మధ్య యువకుణ్ణి ఏదో ప్రశ్నిస్తున్నాడు.

చూస్తూండగానే ఆ నలుగురూ అగ్నిపాలుడున్న చోటుకు వచ్చారు.

ప్రసేనుడు అగ్నిపాలుణ్ణి ఆ యువకుడికి చూపుతూ, "చెప్పానుగదా, వర్మా! ... ఈయనే విష్ణుమిత్రుడు!" అంటూ అగ్నిపాలుడికేసి తిరిగి, "బేతాళవర్మ... వరసకు బావమరిది అవుతాడు!" అని కొంచెం ఆగి, "విష్ణూ! వర్మ చాలా ముఖ్యమైన సమాచారం.......మనందరినీ దుఃఖసాగరంలో ముంచే వార్త తీసుకువచ్చాడు. మన కాలభోజ రాజు, హనుమప్ప సేనానికి బందీగా చిక్కినట్టు ధృవపడింది!" అన్నాడు.

"నేను మొదటి నుంచీ చెబుతూనే వున్నాను..." అంటూ చంద్రాదేవి ఏమో చెప్పబోయేంతలో, ప్రసేనుడు ఆమెకేసి చిరుకోపంగా చూశాడు.

అగ్నిపాలుడు ముఖంలో కొంత విచారం కనబరుస్తూ, "ఇలా జరుగుతుందని మనలో ఎవ్వరం ఊహించలేకపోయాం. మహారాజు తిరిగి కృష్ణానదిని దాటి చాళుక్య రాజ్యంలో ప్రవేశించి ఉంటారని కూడా నేననుకున్నాను," అన్నాడు.

"నన్నడిగితే - మనం ఇప్పుడు ఆలోచించవలసింది ఆయన్ని గురించి కాదు. మన భవిష్యత్తు ఎలా ఉండబోతున్నది? అదీ ముఖ్య సమస్య!" అన్నాడు బేతాళవర్మ.

"క్షమించాలి... ఈ ధోరణి ధైర్యవంతుల లక్షణం అనిపించుకోదు," అన్నాడు అగ్నిపాలుడు.

ఈ మాటలు వింటూనే బేతాళవర్మ గతుక్కుమని కోపం, ఆశ్చర్యం మిళితమైన ముఖకవళికలతో అగ్నిపాలుడి ముఖంలోకి సూటిగా చూశాడు.

అగ్నిపాలుడు కూడా ఏమాత్రం తొణకక, అతడి ముఖంకేసి ఓమారు చిరునవ్వుతో చూసి, పక్కనే నిలబడివున్న వకుళమాలకేసి దృష్టి తిప్పాడు.

వకుళమాల పెదాల మీద మందహాసం వెల్లివిరిసింది. తరవాత ఆమె బేతాళవర్మకేసి తలతిప్పి అపహాస్యంగా చూస్తున్నట్టు అగ్నిపాలుడు గమనించాడు.

"విష్ణూ, నీవన్నది నిజం! పరిస్థితులు అనుకూలంగా పరిణమించినప్పుడే మనం బెంబేలు పడిపోకుండా, సావధానులమై కర్తవ్యాన్ని గురించి ఆలోచించవలసి వుంటుంది," అన్నాడు ప్రసేనుడు.

"మనం తొణక్కుండా, బెంబేలు పడిపోకుండా ఉన్నంత మాత్రాన, మనను చుట్టుముట్టిన విషమ సమస్యలు పరిష్కారం అయిపోగలవా?" అన్నాడు బేతాళవర్మ.

"అసలు మనమిప్పుడు ఏ విషమ సమస్యల్లో చిక్కుకున్నాం?" అన్నాడు అగ్నిపాలుడు.

"కాలభోజ మహారాజు శత్రువుల చేజిక్కాడు," అన్నాడు బేతాళవర్మ కోపంతో ముక్కుపుటాలు అదురుతూండగా.

"ఇది దురదృష్టకరమైన సంఘటనే అయినా... మనకు అంత విషమ సమస్య కాదు," అన్నాడు అగ్నిపాలుడు నిర్వికారంగా.

"ఆ తరువాత మన వంతూ వస్తుంది!" అన్నాడు బేతాళవర్మ.

అగ్నిపాలుడు ఇక అతడితో వాదించి లాభం లేదన్నట్టు ప్రసేనుడికేసి తిరిగి, "మీరు ఈ అంత ర్యుద్ధంలో కాలభోజుడి పక్షాన వున్నట్టు తెలిసిన వారెవరు?" అని అడిగాడు.

"ఇక్కడవున్న మనం, మణిమంతుడు... అంత

కన్న మరెవరికీ తెలియదు," అన్నాడు ప్రసేనుడు.

"అలా అయితే, ఈ సంగతి బయటికి పొక్క వలసిన అవసరం లేదు," అన్నాడు అగ్నిపాలుడు బేతాళవర్మతో.

"మణిమంతుడి మాటేమిటి?" అని ప్రశ్నించాడు బేతాళవర్మ.

"అతడు స్వేచ్ఛగా వున్నట్టు నాకు వార్త వచ్చింది," అన్నాడు ప్రసేనుడు.

"అయితే, యి పరిస్థితుల్లో మనకు వచ్చిన ప్రమాదం ఏమీలేదు," అన్నాడు అగ్నిపాలుడు.

బేతాళవర్మ అయిష్టంగా తలవూపి ఊరుకున్నాడు.

ప్రసేనుడు కొంచెంసేపు తలవంచుకుని ఆలోచిస్తూ ఊరుకుని, "నిజమే విష్ణూ! మనం భయపడ వలసిందేమీ లేదు. చిన్నతనం అవటం వల్ల వర్మ అనవసరంగా హడావిడి పడిపోయాడు. సరే, నేను చూసుకోవలసిన పనులున్నవి. మీరు మరికొంతసేపు ఈ తోటలో తిరిగి రండి!" అంటూ వెనుదిరిగి బయలుదేరాడు. అతడి వెనకగా చంద్రాదేవి కూడా బయలుదేరింది.

బేతాళవర్మ ఓసారి అగ్నిపాలుడికేసీ, వకుళ మాలకేసీ పక్క చూపులు చూసి, గిర్రున వెనుదిరిగాడు.

వకుళమాల అతణ్ణి ఉద్దేశించి, "ఏం, మామ గారికి అంత తొందరపనేం గుర్తుకొచ్చింది? ఎక్కడికి బయలుదేరుతున్నారు?" అన్నది నవ్వుతూ.

"పనేం లేదు, అయినా..." అంటూ బేతాళవర్మ నసిగాడు

"అందరం కలిసి అటు నడికేసి వెళ్ళి వద్దాం, రాకూడదా!" అంటూ వకుళమాల ముందుకు దారితీసింది.

అగ్నిపాలుడు, ఆమెకు అంత ఎడంలో నడవ సాగాడు. బేతాళవర్మ, వకుళమాల పక్కనే తల వంచుకు నడుస్తూ, "వకుళా, ఈ సంగతి విన్నావా?" అన్నాడు.

"ఏ సంగతీ?" అన్నది వకుళమాల.

"అగ్నిపాలుడు! బహుశా పేరు వినే వుంటావు! అతడీ ప్రాంతాల ఎక్కడో మరణించినట్టు గగ్గోలుగా వుంది"

"ఆ పేరైతే విన్నాను. కాని, ఆయన్ని నేనెప్పుడూ చూడలేదు. పాపం ఏ కారణం వల్ల మరణించాడో!" అన్నది వకుళమాల జాలిగా.

వాళ్ళ సంభాషణ వింటున్న అగ్నిపాలుడికి ఆశ్చర్యంతోపాటు కుతూహలం కూడా కలిగింది. తను మరణించినట్టు వార్తలు పుట్టించినదెవరు? ఇదీ ఒక విధంగా తన మంచికేనా?

"ఏ కారణం వల్ల ఎక్కడ మరణించాడో ఎవరికీ తెలియదు. చంద్రగిరి నగరం నుంచి అతడు ఈ ప్రాంతాలకు బయలుదేరి వచ్చినట్టు మాత్రం రూఢి అయింది. నిజంగా అతడి మరణం నాకు గొడ్డలిపెట్టు," అన్నాడు బేతాళవర్మ.







అగ్నిపాలుడు అమితాశ్చర్యం చెందాడు. ఈ బేతాళవర్మకు తన మరణం ఎందువల్ల గొడ్డలిపెట్టవుతుంది? తనీ నాటివరకు ఇతడి ముఖమైనా చూచి వుండలేదే!

"నువ్వనేదేమిటో నా కర్థం కాలేదు మామా!" అన్నది వకుళమాల.

"నేను లోగడ కొంతకాలం చంద్రగిరి నగరంలో ఉన్నాను, గుర్తుందా?" అన్నాడు బేతాళవర్మ సగర్వంగా.

"గుర్తులేకేం, అది ఏనాటి మాట!" అన్నది వకుళమాల.

"ఆ రోజుల్లో మేం ఇద్దరం ఎటువంటి స్నేహితులం... ఓఁ, నిజంగా సోదరుల్లా తిరిగామంటే నమ్ము," అన్నాడు బేతాళవర్మ.

వకుళమాల బేతాళవర్మ వంక కొంచెం ఆశ్చర్యంగా చూసి, అగ్నిపాలుడి కేసి చిరునవ్వు నవ్వుతూ, "మీరేమీ మాట్లాడరేం? ఏదో ఆలోచిస్తున్నారల్లే ఉంది," అన్నది.

"ఆఁ, మరేం లేదు," అంటూ అగ్నిపాలుడు తడబడ్డాడు.

"మా మామ చెప్పే మరణవార్త మిమ్మల్ని కలత పరచటం లేదుగదా? బహుశా మీకూ ఆ అగ్నిపాలుడు సోదరుడులాంటి స్నేహితుడై వుంటాడేమో!" అన్నదామె.

ఆమె కంఠస్వరంలో పలికిన హాస్య ధోరణిని గుర్తించిన అగ్నిపాలుడు చిన్నగా నవ్వి, "స్నేహ

భావం వేరూ, సోదర భావం వేరూ. ఆ అగ్నిపాలుణ్ణి గురించి విన్నానేగాని ఆయనతో పరిచయ భాగ్యం మాత్రం నాక్కలగలేదు," అన్నాడు.

"అగ్నిపాలుణ్ణి గురించి వినివుండటంలో గొప్ప ఏమీ లేదు! ఆయన్ని గురించి వినని వాళ్ళు ఈ చంద్రగిరి రాజ్యంలోనే కాదు..." అంటూ బేతాళవర్మ మాటలు తడబడేంతలో, వకుళమాల అందుకుని, "అంగ, వంగ, కళింగ, గాంధార..." అంటూ ఏకరువు పెట్టబోయింది. కాని, బేతాళవర్మ మధ్యలోనే అందుకుని, "వకుళా! ఇది నీకు హాస్యకారణంగా కనబడవచ్చునేమో కాని, నాకు మాత్రం కాదు. ఆ అగ్నిపాలుడు నాకు ప్రాణస్నేహితుడు తెలుసా?" అన్నాడు చిరుకోపంగా,

"అదే నిజమైతే, నువ్వు వాళ్ళూ వీళ్ళూ చెప్పిన వార్తలు విని ఆయన మరణించాడని నమ్మేకన్న, స్వయంగా బయలుదేరిపోయి, నీకు నీవై అందులోని నిజానిజాలు తెలుసుకుంటే బాగుండేది," అన్నది వకుళమాల.

బేతాళవర్మ ఆ జవాబుకు తెల్లబోయి కొంచెం సేపు తల వంచుకు నడిచి, అగ్నిపాలుడికేసి చిరునవ్వుతో చూస్తూ, "మీరెప్పుడైనా చంద్రగిరి రాజ్యంలో వున్నారా?" అని అడిగాడు.

"కొంతకాలం కిందట, కొద్ది వారాలపాటు ఉన్నాను," అన్నాడు అగ్నిపాలుడు.

"అలా అయితే మీకు అగ్నిపాలుణ్ణి గురించి బాగా తెలిసి వుంటుంది!" అన్నాడు బేతాళవర్మ జంకుతూ.

"ఇంతకు ముందే చెప్పాను... అతణ్ణి గురించి నా కంతగా తెలీదు," అన్నాడు అగ్నిపాలుడు.

ఇంతలో ముగ్గురూ నదిని సమీపించారు.

వకుళమాల ఓ క్షణకాలం ఆగి, వరద నీటితో పొంగులువారుతున్న నదికేసి ఓమారు చూసి, నదిలోకి సోపానాలుగా కట్టివున్న రాతిమెట్ల కేసి నడిచింది.

ముగ్గురూ ఒకరికొకరు కొంచెం ఎడంగా మెట్ల మీద కూర్చున్నారు.

అగ్నిపాలుడు ఎలాంటి సంభాషణ ప్రారంభించి వకుళమాలను వినోదపరుద్దామా అనుకునేంతలో, బేతాళవర్మ ఒకసారి పెద్దగా ఉస్సురుమని, "ఆ భవనం... ఆ నౌకర్లు... ప్ఛ ప్ఛ!" అన్నాడు ముఖం వేళ్ళాడవేస్తూ.

"ఎవరి గురించి అంత అద్భుతపడుతున్నావ్, మామా?" అన్నది వకుళమాల.

"మరెవరు? ఇందాకట్నుంచీ మాట్లాడుతున్నది ఎవరిని గురించి?" అన్నాడు బేతాళవర్మ ఎంతో బాధగా.

"అంటే, ఆ అగ్నిపాలుడనే ఆయన అంత ఐశ్వర్యవంతుడా?" అన్నది వకుళమాల.

"ఐశ్వర్యం!... నవభోజుడి తరవాత, చంద్రగిరి రాజ్యంలో ఆయనే ఐశ్వర్యవంతుడు. ఆయన చేసే విందులూ - ఆ సమయంలో అక్కడికి అతిథు





లుగా వచ్చే ప్రముఖులేగాక నర్తిణులూ, గాయకులూ... ఆహాహా!" అన్నాడు బేతాళవర్మ.

అగ్నిపాలుడికి, బేతాళవర్మ పలికే వెకిలి మాటలు వింటున్నకొద్దీ చిరాకు ఎత్తుకొస్తున్నది. అతడు చాలామంది అమాయకుల్నీ, అవివేకుల్నీ చూశాడుగాని ఈ బేతాళవర్మ అలాంటి వారినందరినీ మించిపోతున్నాడు.

"ఆ విందులకు మీరు వెళుతుండేవారా?" అని అడిగాడు అగ్నిపాలుడు.

"ఏమిటలా ప్రశ్నించారు?" అన్నాడు బేతాళవర్మ ఆశ్చర్యపోతూ,

"మీరంత ఆశ్చర్యపడవలసిందేమీ లేదు వర్మా! నేనూ అతడు చేసిన ఒక విందుకు వెళ్ళాను. అందుకడుగుతున్నాను," అన్నాడు అగ్నిపాలుడు.

బేతాళవర్మ తెల్లబోయి, అంతలోనే తెప్పరిల్లి, "అయితే...అయితే... నన్నక్కడ చూసే వుంటారు, అవునా?" అన్నాడు.

"దురదృష్టవంతుణ్ణి... అంత గొప్ప భాగ్యం కలగలేదు," అన్నాడు అగ్నిపాలుడు తాపీగా.

ఈ ఈసడింపు బేతాళవర్మకు అర్థం కాకపోయినా, వకుళమాల గ్రహించింది. ఆమె అగ్నిపాలుడికేసి మెరుస్తూన్న నేత్రాలతో చూస్తూ, "మీరు చాలా మంచి ఛలోక్తులు వేయగలరు, ఆః!" అన్నది ఎంతో ఉత్సాహంగా.

ఆ మెప్పుకోలు బేతాళవర్మకు చుర్రుమనిపించింది.

"వకుళా! నువ్వు ఆ అగ్నిపాలుడు మాట్టాడుతుండగా వినివుండవలసింది. ఆఖరికి నవభోజ రాజు కూడా, అతడి చమత్కృతికి పొట్టచెక్కలయ్యేలా నవ్వుతారు," అన్నాడతను.

"అలాగా! ఇంతకూ ఆయనకు వివాహం అయిందా? పిల్లలెందరు? ఆడామగా వేరు వేరుగా చెప్పు మామా!" అన్నది వకుళమాల వచ్చే నవ్వును ఆపుకుంటూ.

"పిల్లలేమిటి? ఆయన వివాహితుడే కాదు," అన్నాడు బేతాళవర్మ.

"పాపం, మనిషి అంత అనాకారా ఏం?" అన్నది వకుళమాల జాలిగా.

"అంత అందగాడు యిక పుట్టడు - పుట్టబోడు!" అన్నాడు బేతాళవర్మ.

"నిజం!" అంటూ వకుళమాల కొంటెగా నవ్వింది.

బేతాళవర్మ, అగ్నిపాలుడికేసి తిరిగి, "విష్ణుమిత్రా! మీరు ఒకసారి ఆయన చేసిన విందులో పాల్గొన్నామన్నారు గదా! కనీసం అల్లంత దూరంలో అయినా అగ్నిపాలుణ్ణి చూసే ఉంటారు. నేను చెపితే నమ్మటంలేదు, వకుళకు మీరైనా చెప్పండి. అతడు చాలా స్ఫురద్రూపి కదా?" అన్నాడు.

అగ్నిపాలుడు అవునన్నట్టు తల వూపాడు.

"సరిపోయిందా? ఇప్పుడైనా నమ్ముతావా?" అన్నాడు బేతాళవర్మ, విజయం పొందిన వాడిలా వకుళమాల కేసి చూస్తూ.

"అందగాడు, స్ఫురద్రూపి - అలా అనేస్తే సరిపోయిందా? షుమారుగా నువ్వూ, నేనూ ఎరిగున్న వాళ్ళల్లో ఎవరితోనైనా పోల్చి చెప్పు," అన్నది వకుళమాల.

"నేను చెపితే నువ్వేదీ నమ్మవు. అదీ విష్ణుమిత్రుణ్ణే అడుగుదాం," అంటూ బేతాళవర్మ అగ్నిపాలుడికేసి చూశాడు.

"నేను చెప్పగలను. కాని అది అంత ఔచిత్యం అనిపించుకోదు. నాకు వినయం, నమ్రతా... అలాంటి గుణాల మీద చాలా విశ్వాసం వుంది," అన్నాడు అగ్నిపాలుడు.

వకుళమాల, అగ్నిపాలుడికేసి ఆశ్చర్యంగా చూసి, "ఏం పోతుంది! కాస్త చెప్పండి, వింటాను," అన్నది ఎంతో కుతూహలంగా.

"నా ఎత్తు ఆరడుగులు - కొంచెం ఏ నూలు వాసో అటూ యిటూ కావొచ్చు. అగ్నిపాలుడు కూడా సరిగ్గా కొలిచినట్టు నా ఎత్తే వుంటాడు. అవునా, వర్మా?" అన్నాడు అగ్నిపాలుడు.

బేతాళవర్మ, అగ్నిపాలుడికేసి అనుమానంగా చూస్తూ, "అవును," అన్నాడు.

"అయితే ఇక అతడి ముఖం, ముక్కూ, కళ్ళూ దేహచ్ఛాయా - వాటికి వద్దాం. ఆనాడు నేవెళ్ళిన విందులో చాలా వింత జరిగింది. సరే, ఆ సంగతి చెప్పేముందు వర్మ నుంచి మరో విషయం తెలుసుకోవాలి," అంటూ అగ్నిపాలుడు బేతాళవర్మ కేసి గుచ్చి చూస్తూ, "అతడి శరీరచ్ఛాయకూ, నా శరీరచ్ఛాయకూ పూర్తి పోలిక లేకపోయినా దాదాపు ఒకటిగానే ఉంటుందనుకుంటాను. నేను వారం పది రోజులు గాయాలతో మంచం పట్టాను గదా, ఆ సంగతి గుర్తుంచుకో," అన్నాడు.

బేతాళవర్మ ఓ క్షణకాలం ఎటూ తేల్చుకోలేక తటపటాయించి, "ఆవును! దేహచ్ఛాయలో మీకూ, ఆ అగ్నిపాలుడికి ఎక్కడో పోలికలున్నవి," అన్నాడు.

"ధన్యవాదాలు! అయితే ఇక అసలు విషయానికొస్తాను... ఆనాడు, అగ్నిపాలుడు చేసిన విందు సంగతి. ఒక స్నేహితుడికి ఆహ్వానం రాగా, అతడి వెంట నేనూ దానికి వెళ్ళాను. విందు ప్రారంభమై, దాదాపు అరగంట గడిచిన తర్వాత అగ్నిపాలుడు అక్కడి కొచ్చాడు. కారణం, హఠాత్తుగా ఆ సమయంలో నవభోజ రాజు అతణ్ణి ఏదో పనిమీద రాజప్రాసాదానికి పిలిపించటం, ఈ లోపల - అంటే, ఈ అరగంట కాలంలో, ఆయన బదులు నేనే అతిథులందరికీ స్వాగతం చెప్పి, వాళ్ళ స్థానాల్లో కూర్చోబెట్టాను. ఒక్కగానొక్కరైనా నేను అగ్నిపాలుణ్ణి కాదని అనుమానించలేదు," అన్నాడు అగ్నిపాలుడు.

బేతాళవర్మ నోరు తెరిచి మాట్టాడాలని ప్రయత్నించీ సాధ్యంకాక, మూగివాడిలా ఉండిపోయాడు. వకుళమాల కూడా ఎంతో ఆశ్చర్యం కనబరిచింది.





అగ్నిపాలుడు మాత్రం ఇవేమీ గమనించనట్టు, దూరంగా నదిలోకి చూస్తూ ఊరుకున్నాడు. ఇప్పుడు తను చెప్పినదానివల్ల, వకుళమాలకు నిజంగా తనెవరైనదీ తెలిసినా, అది తనకు క్షేమకరంగానే పరిణమించ వచ్చుననుకున్నాడు.

"మీరు చెప్పింది చాలా వరకు నమ్మదగిందిగానే వుంది," అన్నది వకుళమాల.

"అందులో ఒక్క మాట కూడా నేను నమ్మను," అంటూ బేతాళవర్మ, అగ్నిపాలుడికేసి కొరకొరలాడుతూ చూశాడు.

"అంటే, అగ్నిపాలుడు నా అంత అందగాడు కాదనా నీ అభిప్రాయం, వర్మా?" అన్నాడు అగ్నిపాలుడు చిరునవ్వు నవ్వుతూ.

"ఇది నన్ను అవమానించటం!" అంటూ బేతాళవర్మ లేచి నిలబడ్డాడు కోపంతో.

"ఇందులో అవమానం ఏం వున్నది మామా?" అన్నది వకుళమాల.

"నాకు అగ్నిపాలుడితో స్నేహం లేదని, ఈ విష్ణుమిత్రుడు వ్యంగ్యంగా చెప్పజూస్తున్నాడు. ఆ పాటి గ్రహించలేని అమాయకుణ్ణి కాదు, నేను!" అన్నాడు బేతాళవర్మ.

"మీ ఇద్దరి స్నేహాన్ని గురించీ నేనేమీ చెప్పలేదు. అగ్నిపాలుడి అందచందాలను గురించిన చర్చ మీరే తెచ్చారు. అందులోకి నన్ను లాగినప్పుడు - నా అనుభవం గురించి నేను చెప్పవలసి వచ్చింది. అవునా?" అన్నాడు అగ్నిపా

లుడు.

బేతాళవర్మ విసురుగా అక్కణ్ణించి వెళ్ళిపోతూ, "ఇంత అహంకారం నేనెక్కడా చూడలేదు! అంద చందాలు, ఐశ్వర్యాల్లోనేకాక, శౌర్యప్రతాపాల్లో కూడా సాటిలేని వాడనిపించుకున్న నా స్నేహి తుడు అగ్నిపాలుడితో ఈ విష్ణుమిత్రుడు తగుదు నంటూ పోటీకి రావటం - ఇంతింతనరాని అస హ్యం కలిగిస్తున్నది," అన్నాడు.

"మా మామకు గొప్పలు చెప్పుకోవటం అల వాటు. ఈ స్నేహం సంగతి నిజం కావొచ్చు - అబద్ధం కావొచ్చు. చెప్పలేం! మీరేమీ అనుకో కండి," అన్నది వకుళమాల ఎంతో వినయంగా అగ్నిపాలుడితో.

ఆ మాటలతో అగ్నిపాలుడికి ఎక్కడలేని ఉత్సా హం కలిగింది. వకుళమాల ప్రేమ కోసం తను పడే తాపత్రయంలో ఈ బేతాళవర్మ తనకు ప్రత్యర్థి కాదు. అతడి మీద వకుళమాలకు జాలీ, స్నేహ భావం తప్ప ప్రేమలాంటిదేమీలేదు...

"మీ మామ మనస్సుకు ఏమైనా కష్టం కలిగి వుంటే, అది కావాలని బుద్ధిపూర్వకంగా నేను చేసింది కాదు. నువ్వు నన్ను గురించి అన్యథా భావించవు గదా, వకుళా.... వకుళమాలా!" అంటూ అగ్నిపాలుడు కొంచెం తడబాటుపడ్డాడు.

"వకుళ అనే పిలవండి, మునిగిపోయేదేమిటి!" అంటూ వకుళమాల చిన్నగా నవ్వి, తల పక్కకు తిప్పుకున్నది.

- 8 -

ఒకటి రెండు రోజులు గడిచేలోపలే అగ్నిపా లుడికి, వకుళమాల ప్రవర్తనలో వస్తున్న మార్పు అర్థమయింది. ఆమె తన విషయంలో ప్రదర్శి స్తున్న భావం కేవలం ఆదరమో, అభిమానమో కాదనీ... అది తప్పక ప్రేమ భావమై ఉంటుందనీ అతడనుకున్నాడు. కాని, వకుళమాల దృష్టిలో తాను విష్ణుమిత్రుడనే వ్యక్తి; ఆమె ప్రేమిస్తున్నది ఆ వ్యక్తినే!

తను విష్ణుమిత్రుడు కాదనీ, అగ్నిపాలుడనే ఒక సంస్థానాధిపతి అనీ ఆమెకు తెలియటం జరిగితే, అప్పుడు వకుళ తనను ప్రేమించగలదా?

వకుళమాల తనపై చూపుతున్నది ఒట్టి గౌరవ భావం కాదని అగ్నిపాలుడికి పూర్తి నమ్మకం కుది రింది. నిష్కాపట్యం, నిష్కల్మషం అయిన ఆమె నిర్మల హృదయం, విష్ణుమిత్రుడనే యోధుణ్ణి ప్రేమిస్తున్నది. తను యోధుడు కావచ్చేమోకాని, విష్ణుమిత్రుడు మాత్రం కాదు. కనుక, అగ్నిపాలు డనే వ్యక్తిని గురించి వకుళమాలకు ఎంతవరకు తెలుసో, అతణ్ణి గురించి అభిప్రాయం ఏమిటో తను ముందుగా తెలుసుకోవటం మంచిదని అగ్ని పాలుడు నిశ్చయించుకున్నాడు. అంతేకాక, అవజ్ఞవర్మను గురించి ఆమె వెలువరించే అభి ప్రాయాలు కూడా తను ఎరిగివుండటం మంచిది.

ఇలాంటి ఆలోచనలతో సమయం కోసం ఎదురు చూస్తున్న అగ్నిపాలుడికి ఒకనాటి సాయం





కాలం ఉద్యానవనంలో వకుళమాల ఒంటరిగా కనిపించింది. అతడు అక్కడవున్న పూలమొక్క లను గురించీ, లతలను గురించీ కొంచెంసేపు మాట్లాడి, ముందుండి దారితీస్తూ ఆమెను నదీ తీరానికి తీసుకుపోయాడు.

ఇద్దరూ తీరానవున్న మెట్ల మీద కూర్చున్నారు. తను సంభాషణ ఎలా ప్రారంభించటమా అని అగ్నిపాలుడు మథనపడుతున్నంతలో, అదృష్ట దేవత పలికించిందా అన్నట్టు వకుళమాలే ఆ విష యం ప్రస్తావించింది.

"ఈసారి మా వర్మ మామకు మామూలుకన్న ఎక్కువ కోపం వచ్చినట్టుంది. ఇవ్వాళ తెల్లవారు జామున వెళుతున్నట్టు నౌకర్లకు మాత్రం చెప్పి బయలుదేరి పోయాడు," అన్నదామె.

"మీ మామయ్య, మీ ఇంటికి వచ్చిన అతిథు లందరితోనూ ఇలాగే ప్రవర్తిస్తూంటాడా?" అని అడిగాడు అగ్నిపాలుడు.

"అందరితో అలా.. అంత దురుసుగా, మకురు తనంగా ఎందుకు ప్రవర్తిస్తాడు? నాతో కొంచెం చనువుగా మాట్లాడే వాళ్లను చూస్తేనే అతడికి తిక్కరేగుతుంది. ఆ మధ్య అవజ్ఞవర్మ అనే ఆయన ఒకరు వచ్చారు. ఆయనకూ, మా బేతాళవర్మ మామయ్యకూ విడదీయలేని స్నేహబంధం అల్లు కుపోయింది," అన్నది వకుళమాల.

"అవజ్ఞవర్మా! నవభోజుడి ఆస్థానంలో వాడు కాదు గదా?" అన్నాడు అగ్నిపాలుడు అమాయ కంగా ముఖం పెట్టి.

"అవును, ఆ ఆస్థానంలో వాడే! మీరతణ్ణి ఎరు గుదురా?" అన్నది వకుళమాల.

"నేను కొంతకాలం చంద్రగిరి నగరంలో వున్నా నని చెప్పానుగదా. అప్పుడు అతడితో పరిచయం అయింది. అతడు మీ నాయనగారి ఆహ్వానం మీద ఇక్కడి కొచ్చాడా?" అన్నాడు అగ్నిపాలుడు.

"ఆహ్వానమా?" అంటూ వకుళమాల ముఖం మీద చిరుకోపాన్ని కనబరచింది. తరవాత ఒక క్షణకాలం మౌనంగా వూరుకుని, "ఆ నవభోజ రాజుకు గౌరవ మర్యాదల గురించి ఏపాటి తెలుసో నాకు తెలియదు. కాని, ఆయన పంపగా వచ్చేవాళ్ళకు మాత్రం వాటి గురించి ఏమీ తెలిసి నట్టు లేదు," అన్నది.

"వకుళా? నీ మాటలు నా కర్థం కాలేదు. అవజ్ఞవర్మ, నవభోజరాజు పంపగా వచ్చాడా?" అన్నాడు అగ్నిపాలుడు.

వకుళమాల కొద్దిసేపు నదీజలం కేసి చూస్తూ వూరుకుని, ఏదో చెప్పబోయి ఆగి, ఆవునన్నట్టుగా తల వూపింది.

"బహుశా నవభోజుడు మీ నాన్నగారి రాజ భక్తిని శంకించి, ఆ సంగతి తెలుసుకునేందుకు అవజ్ఞవర్మని ఇక్కడికి పంపివుంటాడు. అంతేనా?" అన్నాడు అగ్నిపాలుడు.

వకుళమాల జవాబివ్వకుండా తల పక్కకు తిప్పుకున్నది.

అగ్నిపాలుడు కొంచెంసేపాగి, "వకుళా! అతడి రాక అంత రహస్యంగా ఉంచదగిందా? నాతో కూడా చెప్పరానంత నిగూఢ రహస్యమా?" అన్నాడు బతిమాలుతున్నట్టు.

"అందులో అంత రహస్యం ఏమీ లేదు. అతడు వచ్చిన పనేమిటో నా నోటి మీదుగా చెప్పాలంటే ..." అంటూ వకుళమాల సిగ్గుపడుతూ తల వంచుకున్నది.

"ఓహోఁ, ఏమిటదీ? పెళ్ళి సంబంధం కాదు కదా?" అంటూ అగ్నిపాలుడు చిరునవ్వు నవ్వాడు.

ఆ ప్రశ్నతో వకుళమాల మరింతగా సిగ్గుపడి పోయింది.

"అవజ్ఞవర్మతో నాకున్నది కొద్దిపాటి పరిచయమే అయినా, అతడ్ని గురించి చాలా విన్నాను. చంద్రగిరి నగరంలో అంత గొప్ప రసికుడు లేడని ప్రతీతి!" అన్నాడు అగ్నిపాలుడు.

"బుద్ధి ఒక్కటి తప్ప, ఆ నవభోజుడి ఆశ్రితులకు తతిమ్మా గుణాలన్నీ వున్నట్టున్నవి!" అన్నది వకుళమాల.

"ఆ నవభోజుడి ఆశ్రితులందరూ బుద్ధిహీనులు కాదనుకుంటాను!" అన్నాడు అగ్నిపాలుడు భయపడుతూనే.

"బుద్ధిహీనులు కాకపోతేనేం... అంతా వక్ర బుద్ధులు! రాజాజ్ఞ నెరవేర్చేందుకు భార్య కోసం వెతుక్కుంటూ బయలుదేరే నీచులను గురించి ఏమనుకోవాలి?" అన్నదామె.

"అలాంటి వాళ్ళను గురించి ఏమనుకోవాలో కూడా నువ్వే చెప్పావు, వకుళా!" అంటూ అగ్నిపాలుడు లేని నవ్వు తెచ్చుకుని, "ఇలాంటి కార్యాల్లో నాకు తెలిసిన సంగతొకటి వుంది, చెప్పమంటావా?" అన్నాడు.

వకుళమాల తల వూపింది.

"నా స్నేహితుడొకడున్నాడు – ప్రస్తుతం అతడు వేంగీ రాజ్యంలో ఉంటున్నాడు. అతడు పెళ్ళాడిన తీరు బహువిచిత్రమైనది," అన్నాడు అగ్నిపాలుడు.

"చెప్పండి, ఆ విచిత్రమేమిటో!" అన్నది వకుళమాల కుతూహలంగా.

"అతడు సరిగా నా ఈడు వాడే. ఒకనాడు కొందరు స్నేహితులం కూర్చుని లోకాభిరామాయణం మాట్లాడుకుంటూండగా... పేరెందుకు – ఒకానొక కన్య విషయం ఒకరు చెప్పారు. ఆవిడ తనను వివాహమాడవచ్చిన ఎంతెంత వారినీ నిరాకరిస్తున్నదనీ, ఆమెను మానవమాత్రుడెవడూ చేపట్టలేరనీ ఒకరన్నారు. దానిమీద వాదోపవాదాలు బయలుదేరినై. ఆ కన్య వంశాన్ని గురించీ, అందచందాలను గురించీ, సౌశీల్యాన్ని గురించీ ఏమాత్రం వంక పెట్టేందుకు లేదు. నా స్నేహితుడు ఆ కన్యను భార్యగా తెస్తానన్నాడు. అందరూ పందెం అంటే పందెం అన్నారు. ఆ తరవాత ఆ స్నేహితుడు బయలుదేరివెళ్ళి నెల రోజుల కల్లా, ఆ కన్యను వివాహమాడి ఇంటికి







తిరిగొచ్చాడు," అన్నాడు అగ్నిపాలుడు.

"ఈ పందెం వేసిన వాళ్ళూ, పందెం కట్టిన వాళ్లూ... వీళ్ళలో మీరు కూడా వున్నారా?" అన్నది వకుళమాల తడబడుతూ.

"ఊహుఁ, నేను అంతా చూస్తూ కూర్చున్నాను," అన్నాడు అగ్నిపాలుడు, ఏదో "ఏ

కన్యనైనా ప్రేమించి, అందుకోసం అవసరం అయితే ఏ త్యాగమైనా చేసి భార్యగా చేసుకోవటం విన్నానుగాని, కేవలం పందెం గెలిచేందుకు అర్ధాంగిని తెచ్చుకున్న వాళ్ళను గురించి నే వినలేదు. లోకంలో ఎన్ని రకాల అవినీతిపరులూ, వంచకులూ వున్నారు!" అన్నది వకుళమాల.

"నేను ముఖ్యంగా చెప్పదలచుకున్న సంగతి వదిలేసి, తక్కిందంతా చెప్పేశాను. నా స్నేహితుడు పందెం కోసం, ఆ కన్యవున్న చోటుకు వెళ్ళినా, ఆమెను చూచింతరవాత... మనసారా ప్రేమించాడు," అన్నాడు అగ్నిపాలుడు.

"అంత అప్సరస కాబోలు!" అన్నది వకుళమాల.

"నిజం చెప్పవలసివస్తే, ఆవిడ అంత అప్సరసేం కాదు. ముఖ్యంగా ఆమె సౌశీల్యం, గుణగణాలూ నా స్నేహితుణ్ణి ఆకర్షించినై"

"అలా అని ఆమెతో చెప్పివుంటాడు!" అన్నది వకుళమాల కాస్త కటువుగా.

సంభాషణ తాను అనుకున్నదానికి వ్యతిరేకంగా పరిణమిస్తున్నదని అగ్నిపాలుడు గ్రహించి, "ఏదైనా, ఆ స్నేహితుడు ఆ కన్యను మోసంచేసి వివాహం ఆడలేదని మాత్రం నాకు తెలుసు. ఇంతకూ... ఆ అవజ్ఞవర్మ సంగతి సొంతం చెప్పలేదు. అతడిక్కడ ఎన్ని రోజులున్నాడు?" అన్నాడు.

"ఆ రోజులు కూడా నేను గమనించలేదు... వారం రోజులు కావొచ్చు. మీ స్నేహితుడు పందెం గెలిచేందుకు ఒక కన్యను మోసగించేం దుకు తయారైతే, ఈ అవజ్ఞవర్మ రాజాజ్ఞా పాలన కోసం అందుకు సిద్ధపడ్డాడు," అన్నది వకుళమాల.

"ఆ కన్య ఈ కన్యేనా?" అన్నాడు అగ్నిపాలుడు చిరునవ్వుతో వకుళమాల ముఖంకేసి పరీక్షగా చూస్తూ.

వకుళమాల నిలువెల్లా సిగ్గు కమ్ముకొనగా అగ్నిపాలుడి నుంచి కొంచెం ఎడంగా జరిగి, "చీకటి పడుతున్నట్టుంది. ఇక వెళదామా?" అన్నది వణుకుతున్న కంఠస్వరంతో.

అగ్నిపాలుడి హృదయంలో ఆనందం వెల్లివిరిసింది. ఈ పట్టున ఆమెతో తానెవరైందీ చెపితే ఏమవుతుంది? పందెం ప్రసక్తి ఏమీ లేదు! తాను నిజంగా.. మనసారా ఆమెను ప్రేమించాడు. కానీ తాను ఫలానా అని ఆమెకు తెలిస్తే, ఆ తరవాత తన మాట నమ్ముతుందా?

అగ్నిపాలుడు ఎటూ తేల్చుకోలేక, ఏమీ పాలుపోక కొట్టుమిట్టాడుతుండగా, వకుళమాల లేచి నిలబడి భవనంకేసి బయలు దేరింది. తల వంచుకుని మెల్లిగా అడుగులు వేస్తూ పోతున్న వకుళమాల కేసి అగ్నిపాలుడు తదేక దృష్టితో ఓ క్షణకాలం చూసి, పెద్దగా నిట్టూర్చి లేచి నాలుగడుగుల్లో ఆమెను సమీపించాడు.

"వకుళా! నేనేమీ నీ మనస్సుకు కష్టం కలిగించలేదుగదా?" అన్నాడు అగ్నిపాలుడు ఎంతో ఆప్యాయత వ్యక్తంచేస్తూ.

"నా మనస్సుకు కష్టం కలిగించటమా! మీరు అనరాని మాటలు ఏమన్నారని నేను కష్టపడతాను?" అన్నదామె.

"నా స్నేహితులను గురించీ, వాళ్ళు వేసుకున్న పందెం సంగతీ..."

అగ్నిపాలుడు మాట పూర్తిచేయకముందే వకుళమాల నవ్వి, "మీ స్నేహితులు ఎలాంటివారో నాకు కొంచెం చూచాయగా తెలిసింది. కాని, మీరు వాళ్ళలాంటివాళ్ళు కాదని నమ్ముతున్నాను. నేనిందులో ఏమీ పొరబడటంలేదుగదా?" అన్నది కనుబొమలు ముడివేస్తూ.





అగ్నిపాలుడు వెంటనే జవాబిచ్చేందుకు తడబడ్డాడు. కొంచెం ఆగి, "నన్ను నమ్ము, వకుళా! నేను వాళ్ళలాంటి తేలిక స్వభావం కలవాణ్ణి కాను. నా జీవితంలో యీనాటి వరకూ... నిన్ను చూచే వరకూ ఎవరినీ ప్రేమించలేదు," అన్నాడు.

ఆ క్షణం వరకూ అంతర్గతంగా పొరాడుతున్న ఆ ప్రేయసీ ప్రియుల మనోభావాలకు, అగ్నిపాలుడు హఠాత్తుగా ఒక రూపం కల్పించి – తనకే గాక, ఆమెకూ సాక్షాత్కరింపజేశాడు.

'నిన్ను ప్రేమిస్తున్నాను!' అన్నంత సూటిగానూ చెప్పినా అగ్నిపాలుడి మాటలకు, వకుళమాల మనసు ఆర్ద్రత చెందింది. ఆమె అడుగులు తడబడినై. మిట్టపల్లాలుగా వున్న ఆ నదీతీర భూమి మీద సంధ్య చీకట్లు కమ్ముతూండగా, సిగ్గుదొంతరలు ముంచెత్తుతూండగా ఆమె అగ్నిపాలుడికేసి ఓమారు చూసి, లేడిపిల్లలా ఛెంగున భవనంకేసి పరిగెత్తింది.

అగ్నిపాలుడు అలా పరిగెత్తుతున్న వకుళమాల కేసి చూస్తూ, స్థాణువులా ఉన్నచోటునే నిలబడి పోయాడు.

- ౭ -

బేతాళవర్మ కావటానికి రాజా ప్రసేనుడికి కొంచెం దూరపు బంధువైనా, చిన్నతనంలో తల్లి దండ్రులను కోల్పోయినప్పటినుంచీ అతడు ప్రసేనుడి ఇంటనే పెరిగాడని చెప్పవచ్చు. ఆ కారణంగా అతడికి తనకన్న అయిదారేళ్ళు వయసులో చిన్నదైన వకుళమాలతో చాలా సామీప్యతా, చనువూ ఏర్పడింది.

బంధురీత్యా అతడు ఆమెకు మామ వరస అవుతాడు. ఆ కారణం కూడా అతడికి చాలా కాలంగా వకుళమాలను తన భార్యగా చేసుకోవాలన్న కోర్కెకు ఎంతో దోహదం చేసింది.

ప్రసేనుడు చంద్రగిరి ప్రభువైన నవభోజుడిని ద్వేషించటానికి అనేక కారణాలున్నవి. ఆ ద్వేషాన్ని అతడు ఏనాడూ గుప్తంగా వుంచలేదు. అట్లని అతడు మహాబలసంపన్నుడైన నవభోజుడితో బహిరంగంగా పోరు సల్పటం అంటే, అది ఆత్మహత్యా సదృశమే అవుతుంది! ఇవన్నీ ఎరిగివున్న ప్రసేనుడు, నవభోజుడంటే దూర దూరంగా వుంటూ మాత్రమే వచ్చాడు. నవభోజుడికి కూడా

ప్రసేనుడి మనోగత భావాలు తెలుసు. అయినా, అతడూ కావాలని ప్రసేనుడిని బహిరంగంగా ఏనాడూ కవ్వించలేదు. హైహయ వంశస్థుడైన ప్రసేనుడికి చంద్రగిరి రాజ్యపు ఎల్లల కావల బంధుమిత్రులు - అందులోనూ బలవంతులైన వారున్నారు. ఆ కారణాలన్నీ ఎరిగి వుండబట్టే నవభోజుడు తన సామంతులలో ఎవరికైనా ప్రసేనుడి ఏకైక పుత్రికతో వివాహం నెరపటం ద్వారా అతణ్ణి తనకు మిత్రుడుగా చేసుకోవాలని ప్రయత్నించాడు.

బేతాళవర్మకు ఈ రాచరికపు మచ్చరాలూ, విరోధాలూ, అంతఃకలహాలను గురించి ఏమీ తెలియదు. తన కాబోయే మామ అని ఎవరినైతే భావిస్తున్నాడో అతని వెంట, అతడి భావాలకు అనుగుణంగా కాలం గడుపుకు వస్తున్నాడు - అంతే!

అగ్నిపాలుడి రాక - బేతాళవర్మ దృష్టిలో విష్ణుమిత్రుడి రాక - అతడి ఊహలకూ, ఆశలకూ పెద్ద అఘాతంగా పరిణమించింది. 'తనదే! తన కాబోయే భార్యే!' అని యింతకాలంగా బేతాళవర్మ ఎవరినైతే భావిస్తున్నాడో, ఆ వకుళమాల అగ్నిపాలుడి ప్రవేశంతో యిట్టే మారిపోయినట్టు అతడు ఊహించటమో, గ్రహించటమో జరిగింది.

నిజానికి వకుళమాలకు బేతాళవర్మ మీద ఏనాడూ ప్రేమభావం లేదు. అమాయకుడూ, వాచాలుడూ - ఆమె దృష్టిలో సాధువర్తనుడూ అయిన వర్మ మామ అంటే, ఆమె కొకవిధమైన జాలి. స్వగృహంలో అతడి ఉనికి ఆమెకు పొద్దుపోయేందుకు సహకారి. అప్పుడప్పుడూ అకారణంగా అతడు కనబరచే కోపతాపాలను ఆమె అంతగా గణించేది కాదు - అంతా తాత్కాలికం - క్షణాలలో అన్నీ మర్చిపోతాడు అనుకునేది. గతంలో మాత్రం అంతా ఆమె ఊహించినట్లే జరుగుతూండేది. కాని, ఇప్పుడు వకుళమాల పాణిగ్రహణానికి అగ్నిపాలుడు తనకు ప్రత్యర్థి అని బేతాళవర్మ గ్రహించాడు. ఆ నిమిషం నుంచీ అతడిలో విపరీతమైన మార్పులు కలగసాగాయి.

ఆనాడు నదీతీరం నుంచి కోపంతో వెళ్ళిపోయిన తరవాత, ప్రసేనుడితో అయినా చెప్పకుండా బేతాళవర్మ ఆ రోజు తెల్లవారుజాముననే గృహం వదిలి ఎక్కడెక్కడో తిరిగాడు.

అగ్నిపాలుడు - విష్ణుమిత్రుడనే రాజద్రోహి అని బేతాళవర్మ గట్టిగా విశ్వసించాడు. కూర్మశైలం దగ్గర జరిగిన పోరులో అతడు గాయపడి, ప్రసేనుడి గృహానికి శరణార్థిగా వచ్చాడు. అతడి ఉనికి బయటివారెవరికీ తెలియదు. బహుశా, నవభోజుడి సైనికులు అతడి కోసం దేశం అంతా గాలిస్తూ వుండి వుండాలి! తిరుగుబాటుకు ముఖ్య నాయకుడైన కాలభోజుడు వారి చేతిలో బందీగా వున్నాడు. ఇక యిప్పుడు వారు అతడి అనుచరుల ఏరివేతకు ప్రయత్నిస్తూ వుంటారు...

విష్ణుమిత్రుడు ఫలానాచోట దాగివున్నాడని





ఆ సైనికులకు చెపితే ఏం జరుగుతుంది?... నవభోజుడి సైనికులు వెంటనే వచ్చి, విష్ణుమిత్రుణ్ణి పెడరెక్కలు విరిచికట్టి లాక్కుపోతారు. అయితే, తన గృహంలో రాజద్రోహికి ఆశ్రయం యిచ్చాడన్న కారణంగా ప్రసేనుడికి - తన కాబొయ్యే మామకు ఏదైనా హాని జరగవచ్చా? తప్పక హాని జరుగుతుందని బేతాళవర్మ భావించాడు. కాని, తన ఆనందానికి అడ్డువస్తున్న ఈ విష్ణుమిత్రుణ్ణి నాశనం చేయాలంటే, అందుకు అది తప్ప మరొక మార్గం లేదు. కోరి, రాజద్రోహిని ఇంట వుంచుకున్నందుకు ప్రసేనుడు ప్రతిఫలం అనుభవించవలసిందే!

ఇలాంటి ఆలోచనలతో బేతాళవర్మ, కూర్మశైలం చుట్టపట్లన్నీ తిరిగి విష్ణుమిత్రుణ్ణి గురించీ, నవభోజుడి సైనికుల రాకపోకలను గురించీ చాలామందిని విచారించాడు. అలాగే విష్ణుమిత్రుడి గత జీవితాన్ని గురించి లోతుకుపోయి, ఒకరికి నలుగురిని అడిగిన తరవాత తన ఊహలూ, ఎత్తుగడలూ చిందరవందర అయే రాటి దెబ్బలు తిన్నాడు.

బేతాళవర్మ విచారించిన ప్రతి ఒక్కరూ విష్ణుమిత్రుడు మరణించి వుంటాడనే చెప్పారు. కూర్మశైలం దగ్గర నవభోజుడి సేనాని హనుమప్ప నాయకుడితో జరిగిన పోరులో అతడు ప్రాణాపాయకరమైన గాయాలు తినటం చూచిన వాళ్ళున్నారు. అంతేకాక, ఆ యుద్ధభూమికి చాలా దూరంలో వున్న ఒకానొక అడవి మొగను అతడు ప్రాణాలు వదిలినట్టు మరికొందరు చెప్పారు. అయితే, అతడి శవం ఎక్కడున్నట్టు? ఈ ప్రశ్నకు ఏ ఒక్కరూ తృప్తికరమైన జవాబు చెప్పలేదు. శవాన్ని నక్కలూ, కుక్కలూ పీక్కుతిని వుంటవనేది కొందరి నమ్మకం...

ఈ రకం భోగట్టాతో బేతాళవర్మ కాస్త మతీ చెడింది. దీనికితోడు అగ్నిపాలుడనబడే నవభోజ రాజు మిత్రుడొకడు... ఆ ప్రాంతాల ఎక్కడో దారితప్పి కనబడకుండా పోయినట్టు మరికొన్ని పుకార్లు బయలుదేరినై. ఈ అగ్నిపాలుడు మల్లూరి ప్రభువైన రాజా ప్రసేనుడి దగ్గిరకు ప్రయాణమై వెళుతున్నట్టు చాలామంది చెప్పారు. బహుశా మరణించి వుంటాడనే తప్ప, అతడి శవాన్ని చూచిన వారు కూడా ఎవరూ లేరు.

ఈ వార్తలూ, పరస్పర విరుద్ధమైన సాక్ష్యాలూ బేతాళవర్మను గగ్గోలుపరిచినై.

'విష్ణుమిత్రుడు మరణించాడు - అందుకు సందేహం లేదు!'

ఈ వాక్యాన్నే బేతాళవర్మ పదే పదే మనస్సులో వల్లించుకున్నాడు. అతడికి కావలసింది కూడా ఆ విష్ణుమిత్రుడనే వాడి మరణమే. అప్పుడు వకుళమాలకూ, తనకూ మధ్యగా నిలబడే వాడెవడూ వుండడు.

అయితే, ఈ అగ్నిపాలుడనే నవభోజరాజు మిత్రుడెవడు? వకుళమాల దగ్గిర తన గొప్పతనం

బయటపెట్టుకునేందుకు ఆ అగ్నిపాలుడు తన మిత్రుడని చెప్పాడే తప్ప, బేతాళవర్మకు అతడితో ముఖపరిచయమైనా లేదు.

ఈ అగ్నిపాలుడు మార్గమధ్యంలో ఏమైనట్టు? ఈ ప్రశ్న బేతాళవర్మను నిలువెల్లా కుంగదీసింది. 'అగ్నిపాలుడూ మరణించాడు, అందుకు సందేహంలేదు!' అని మనస్సును సరిపెట్టుకుందామని అతడు ప్రయత్నించాడు. కాని, ఆ వెంటనే అతడికి, వకుళమాల ఆదరగౌరవాలనూ..... బహుశా ప్రేమను కూడా చూరగొంటున్న ఆ వ్యక్తి గుర్తుకు వచ్చాడు.

'అతడు తప్పక విష్ణుమిత్రుడై వుంటాడు – ఉహుం, అగ్నిపాలుడై వుంటాడు – కాదు...' – ఇలాంటి భావ సంఘర్షణలోబడి ఉక్కిరిబిక్కిరౌతూ, బేతాళవర్మ ప్రసేనుడి గృహానికి తిరిగి వచ్చాడు.

ఆ సమయంలో ప్రసేనుడూ, ఆయన భార్య చంద్రాదేవీ ఉద్యానవనంలో వున్నారు. అగ్నిపాలుడూ, వకుళమాలా నదీతీరంలో మెట్ల మీద కూర్చుని వున్నారు.

బేతాళవర్మ సరాసరి ఉద్యానంలో ప్రవేశించి ప్రసేనుడున్న చోటుకు వెళ్ళేసరికి, అతడు చిరునవ్వు నవ్వుతూ, "ఏమోయ్, వర్మా! ఎవరితో చెప్పకుండానే చీకటిమాటున వెళ్ళిపోయావ్, ఏమిటంత ముఖ్యకార్యం?" అని ప్రశ్నించాడు.

"ఏ ముఖ్యకార్యాన్నీ దృష్టిలో పెట్టుకుని వెళ్ళలేదు. కాని, వెళ్ళింతర్వాత మన చుట్టుపక్క ప్రాంతాల తెలిసిన వార్తలు చాలా ముఖ్యమైనవిగానే కనిపించినై!" అన్నాడు బేతాళవర్మ.

"ఏమిటా వార్తలు?" అన్నాడు ప్రసేనుడు ఆశ్చర్యపోతూ.

"విష్ణుమిత్రుడు మరణించాడని అందరూ చెప్పుకుంటున్నారు," అన్నాడు బేతాళవర్మ ఎంతో తాపీగా.

"అందులో వింతపడవలసిందేమీ లేదు!" అంటూ ప్రసేనుడు భార్యకేసి చూసి చిరునవ్వు నవ్వాడు.

"అతడి శవాన్ని కూడా చూసిన వాళ్ళున్నారు!"

బేతాళవర్మ జవాబు ప్రసేనుణ్ణీ, చంద్రాదేవినీ కూడా ఉలిక్కిపడేట్లు చేసింది.

"నిజమా?" అన్నది చంద్రాదేవి.

"ఎలా నిజమవుతుంది, చంద్రా? దాదాపు రెండు వారాల నుంచి మన ఇంట్లో చూస్తున్నాం. ఈ సమయంలో మన వకుళా, ఆ విష్ణుమిత్రుడూ నదీతీరంలో వుండి వుంటారు," అంటూ ప్రసేనుడు బిగ్గరగా నవ్వి, "నేను భూతాలు వున్నవంటే నమ్ముతాగాని, అవి పగలే మనతో తిరుగుతూ, సంభాషిస్తూంటవంటే మాత్రం నమ్మను," అన్నాడు.

బేతాళవర్మ ముఖం వెలవెలా పోయింది.

అది గమనించిన చంద్రాదేవి బుజ్జగిస్తున్నట్టు, "ఏరా, తమ్ముడూ! ఏమిటీ సంగతి, ఆ







శవాన్ని నువ్వేచూడలేదు గదా?" అన్నది.

బేతాళవర్మ చిరుకోపంతో మూతి బిగించుకున్నాడు.

"ఆ శవం దొరికితే బావుండును. విష్ణుమిత్రుడైతే తప్పక గుర్తిస్తాడు," అన్నాడు ప్రసేనుడు బేతాళవర్మకేసి వింతగా చూస్తూ.

"ఇది నవ్వులాడుకునే సంగతి కాదు, బావా!" అంటూ బేతాళవర్మ కోపాన్ని దిగమింగుకుని, "ఈ విష్ణుమిత్రుణ్ణంటూ వచ్చిన మనిషి, అగ్నిపాలుడనేవాడై వుంటాడని నా అభిప్రాయం," అన్నాడు.

"ఇది ఏమాత్రం ఆధారంలేని ఒట్టి ఊహాగానం. ఈ సరికి, ఆ అగ్నిపాలుడి శవం ఎక్కడో కుళ్ళిపోయి కూడా వుంటుంది. అలాకాక అతడు బతికి వున్నట్టు ఎవరైనా ఋజువుచేస్తే – ఆ నవభోజుడి బంటును, నా కత్తికి ఎరచేస్తాను," అన్నాడు ప్రసేనుడు.

"మీ దుందుడుకుతనం మనకేనాడో ముప్పు తెస్తుంది! ఈ దేశాలు పట్టుకుతిరిగే కాలభోజుడి వల్ల మనకు ఒరిగేదేమిటి? ఈ రాజద్రోహం యింతటితో కట్టిపెట్టి, వకుళను ఆ అగ్నిపాలుడికిచ్చి వివాహం చేద్దాం," అన్నది చంద్రాదేవి.

"చాలు, చాలు!" అన్నాడు ప్రసేనుడు ఎంతో కోపంగా.

"బావా, ఇప్పుడు మన ఇంట చేరినతను ఎవరైనా అయివుండొచ్చుకాని, విష్ణుమిత్రుడు మాత్రం కాదు. నా మాట నమ్ము," అన్నాడు బేతాళవర్మ



బతిమాలుతున్నట్టు.

"అతడు... అగ్నిపాలుడైతే ఎంత బావుండును!" అన్నది చంద్రాదేవి.

"బహుశా, అతడే అయియుంటాడు. విష్ణుమిత్రుడు మరణించినట్టు తెలుసుకుని, ఆ పేరుతో యిక్కడ ఆశ్రయం సంపాయించుకున్నాడు," అన్నాడు బేతాళవర్మ.

"నీవు చాలా పొరబడుతున్నావు, వర్మా! అతనికై అతడు ఏనాడూ నాతో తను విష్ణుమిత్రుణ్ణని చెప్పుకోలేదు. నేనే అతడి వెంటవున్న పత్రాల మీద అతడి పేరు చూసి, ఫలానా అని గుర్తించాను, తెలిసిందా?" అన్నాడు ప్రసేనుడు.

"అలాంటి పత్రాలు సంపాయించటం ఏమంత కష్టం!" అన్నది చంద్రాదేవి.

బేతాళవర్మ కళ్ళు మెరిసినై, "అవును బావా!" అంటూ అతడు ఏమో చెప్పబోయేంతలో ప్రసేనుడు అందుకుని, "మీ అక్కకు వున్న తెలివి తేటల్లో నూరోవంతు నీకున్నా, నీవేనాడో కీర్తిప్రతిష్ఠలు గడించి, హాయిగా జీవితం వెళ్ళబోస్తూండేవాడివి. అందువల్ల నీ కిక్కడ వకుళ దగ్గర విదూషకత్వం చేసే బాధా తప్పేది," అన్నాడు.

"నీవనేదేమిటి, బావా?" అంటూ బేతాళవర్మ ముఖం కందగడ్డలా చేసుకున్నాడు.

"నేననేదేమిటో, ఈసరికి నీ మెదడు కాస్త అర్థమయ్యే భాషలో నీకు చెప్పివుండవలసింది! విష్ణుమిత్రుడు శరీరం నిండా గాయాలతో స్పృహలేకుండా పడివున్న స్థితిలో, అతడి దగ్గిర దొరికిన పత్రాలను బట్టి, అతడు ఫలానా అని గ్రహించాను. పైగా మణిమంతుడు లోగడ అనేకసార్లు అతణ్ణి గురించి నాతో చెప్పివున్నాడు. ఇప్పటికైనా అర్థమైందా, వర్మా?" అన్నాడు ప్రసేనుడు.

"ఆ పత్రాలలోవున్న విషయం ఏమిటో చదివి చూశావా?" అన్నాడు బేతాళవర్మ కోపంతో వణికిపోతూ.

"ఆ పత్రాల్లో వున్న విషయమంతా చదివి చూడవలసిన అవసరం నాకేంకలిగింది! గౌరవ మర్యాదలు పాటించే వాడెవడూ, మరొకరికి సంబంధించిన పత్రాలలో ఏమి రాసివున్నదో చాటుమాటున చదవడనుకుంటాను. ఒకవేళ నువ్వనుకుంటున్నట్టు అగ్నిపాలుడైతే... అతడు నా ఇల్లు చేరేందుకు ప్రాణగండం కలిగించేంత పెద్ద గాయాలు స్వయంగానో, మరొకరిచేతనో పొడిపించుకుని వుండాలి! అలా చేసేటంత బుద్ధిహీనుడు కాడనుకుంటాను అగ్నిపాలుడు. నే విన్న దానిని బట్టి అతడు ఎంతో తెలివి తేటలూ, గొప్పవాణ్ణనే అహంకారం వున్న నవభోజ రాజుగారి భృత్యుడు," అన్నాడు ప్రసేనుడు.

బేతాళవర్మ మరి మాట్లాడలేదు. ప్రసేనుడు కావాలనే తనను యింతగా అవమానిస్తున్నాడని అతడు భావించాడు. వెంటనే ఉన్నచోటు నుంచి కదిలి, గబగబా ఉద్యానవనం నుంచి బయటికి వెళ్ళిపోయాడు.





## - 10 -

చంద్రాదేవికి, తన భర్త ప్రసేనుడి పోకడలు గత కొద్దికాలం నుంచీ చాలా మనస్తాపం కలిగిస్తున్నవి. ఆయన తన మూర్ఖపు పట్టుదలతో ఒక్కగానొక్క కుమార్తె వకుళ భవిష్యత్తును ఒడిదుడుకుల్లో పెడతాడేమో అని ఆమె భయం.

మహాశక్తివంతుడూ, సంపన్నుడూ అయిన చంద్రగిరి రాజు నవభోజుడితో, తన భర్త విరోధభావం పూని వుండటం చంద్రాదేవికి ఇష్టంలేదు. నవభోజుడిపట్ల తన భర్త రాజభక్తిని ప్రదర్శిస్తే, ఆయన సాయంవల్ల వకుళ, ఏ గొప్ప సంస్థానాధీశుడికో భార్య అయ్యే అవకాశం కలుగుతుందని ఆమె ఆశ. అలా కానప్పుడు, ఊళ్ళూ ఊళ్ళూ పట్టుకుతిరిగే ఏ కాలభోజుడి భృత్యుడికో తన కుమార్తె భార్య అవుతుంది. అంతకన్న మరొక మార్గాంతరం కనబడదు!

అవజ్ఞవర్మ, నవభోజుడి పనుపున తమ గృహానికి – తమ కుమార్తె పాణిగ్రహణానికి వచ్చాడని తెలిసినప్పుడు, చంద్రాదేవి ఎంతగానో సంతోషించింది. ఈ సంబంధం ద్వారా వకుళ గొప్పవారింటి కోడలవటమేగాక నవభోజుడి ఆస్థానీకుడైన భర్తవల్ల ఎన్నో సౌఖ్యాలు అనుభవించగలదని ఆమె కలలు కన్నది. కాని, అవజ్ఞవర్మను స్వయంగా చూసింతరవాత, అతడి వయసూ, రూపమూ చంద్రాదేవిని కలత పెట్టింది.

'ఇంతకన్న కొంచెం వయసు తక్కువ వాణ్ణీ,

రూపసినీ పగూడదా ఆ నవభోజ రాజు?' అనుకున్నదా... సరిగా ఇరవై ఏళ్ళయినా నిండని తన కుమార్తె - ఏ నలభైయవ పడిలోనో వున్న అనాకారికి.. అతడెంత రాజాశ్రితుడూ, మిత్రుడూ అయినా వతం, యివ్వటం ఎలా? ఈ విషయాన్నే కొం లౌక్యంగా, సగౌరవంగా నవభోజ రాజుకు తెల మబర్చటం ఉచితం అని చంద్రాదేవి భావింది. కాని ప్రసేనుడు, ఈ అవజ్ఞవర్మ వస్తున్నాడనే వార్త వచ్చినప్పటినుంచీ నవభోజుడి మీదా, అత మీదా కారాలూ మిరియాలూ నూరుతూనే వున్నాడు.

"ఇది న అవమానించటం! తన భృత్యుడెవడికైనా న కుమార్తెను యివ్వటానికి, నేనేమైనా ఈయన భృత్యుణ్ణా? ఆ బుద్ధిహీనుడు పంపితే, ఈ బుద్ధిహీడికైనా బుద్ధి వుండవద్దా?" - ఇదీ ప్రసేనుడి వగోరణి.

ఆ వచ్చిన అవజ్ఞవర్మ కనీసం తన ఇంట వారం రోజులు గడపటం కూడా కష్టసాధ్యం చేశాడు ప్రసేనుడు. అతడి ముఖం ఎదట నవభోజుణ్ణి తిరస్కరిస్తూ మాట్లాడకపోయినా, చేతల్లో అతడన్నా, అవజ్ఞవర్మ అన్నా తనకున్న అసహ్యాన్నీ, అక్కసునూ బయటపెట్టాడు.

ఎప్పుడో, ఏనాడో హైహయ వంశీయులకు ఆ నవభోజు వంశస్థులు అన్యాయం చేశారనేది ప్రసేనుడి కోపానికి ఒక కారణం. ఈనాడు కూడా నవభోజుడు తనన్నా, తన సంస్థానం అన్నా చిన్న చూపు చూస్తున్నాడని అతడి వాదం. కాలభోజుడు తనకు చాలా దూరపు బంధువైనా - ఆ కొ బంధుత్వ కారణంగా, అతడు చంద్రగిరి రాజ్యాన్ని వశపరుచుకోగలిగితే, తన గౌరవమర్యాదలు ఉన్నత స్థాయికి చేరగలవని ప్రసేనుడు భావించాడు.

"మనది చిన్న సంస్థానం. మన బలసంపదలు బహు స్వల్పం. అలాంటి పరిస్థితుల్లో మనం మహా బలశాలి అయిన నవభోజుడితో విరోధం పూనటం క్షేమమా?" అంటుంది చంద్రాదేవి.

"నవభోజుడు బలసంపన్నుడనీ, నేను కాదనీ తెలుసుకునేందుకు ఏమంత తెలివితేటలు అవసరం లేదు. ఈ సంగతి మన పశువులు కాసేవాళ్ళకు కూడా తెలుసు. పోతే, ఆ నవభోజుడి బలం మాత్రం నన్నేమీ చేయలేదు. ఇక్కడి పరిస్థితులు అంతగా విషమించినప్పుడు, పక్కనేవున్న ఈ కృష్ణదాటి చాళుక్య రాజ్యంలో ప్రవేశిస్తాను. ఒకవేళ... ఆ దుస్థితే నాకు పట్టిననాడు, నవభోజుడు కూడా మరెంతో కాలం సింహాసనం మీద కూర్చోలేడు," అంటాడు ప్రసేనుడు.

అలా లౌక్యం మరిచి, కేవలం పౌరుష ప్రధానంగా మాట్లాడే భర్తతో చంద్రాదేవి విసిగిపోయింది. తనే ప్రయత్నించి ఏదో విధంగా తన కూతురుకు గొప్ప సంబంధం తేవాలని ఆమె ఆలోచించసాగింది.

అగ్నిపాలుడు - విష్ణుమిత్రుడుగా వా భావించే అగ్నిపాలుడు - ఆమెకు రూపంలో





గుణాల్లో నచ్చాడు. కాని అతడు కాలభోజుడి ర చిన్న సేనా నాయకుడనీ, చెప్పుకోదగ్గ ఆస్తిపాస్తులు లేవనీ విన్నప్పుడు ఆమె చాలా బాధపడింది.

ఇంత అందగాడు, శౌర్యసాహసాలు గలవాడు, సహృదయినవాడు వకుళకు భర్తగా లభించడం అదృష్టమే! అతడికి ఐశ్వర్యాలు లేకపోతేనేం? ఒక్కగానొక్క కూతురు... తమ సంస్థానం ఏనాటికైనా ఆ అమ్మాయికి సంక్రమించేదే కదా? తన భర్త రాజద్రోహి, తను అల్లుడు కాదగినవాడనుకున్న యువకుడూ రాజద్రోహే - అలాంటప్పుడు సంస్థానం మాత్రం ఎంత కాలం నిలుస్తుంది? భోజుడు రాజయ్యే అవకాశాలు యిక లేవు. డు యుద్ధంలో ఓడి, నవభోజుడి సైన్యాలకు బందీగా చిక్కాడు. ఈ విష్ణుమిత్రుడు కూడా ఏదో నాడు, వాళ్ళ చేతుల బడక తప్పదు. ఈశ్వరుడి దయవల్ల... అది తమ గృహంలో జరక్కుండా వుంటే, తాము బతికి బయటపడ్డట్టే...

తాము విష్ణుమిత్రుడని భావిస్తున్న అగ్నిపాలుణ్ణి గురించి చంద్రాదేవికి వున్న యిలాంటి పరస్పర విరుద్ధ భావాల వల్ల, బేతాళవర్మ తెచ్చిన వార్త ఆమెలో యితర ఆలోచనలను రేకెత్తించింది.

ఇతడు తప్పక అగ్నిపాలుడై వుంటాడు! లోగడ భోజుడు పంపిన అవజ్ఞవర్మ అనే అతడికి జరిగిన అనాదరణ సంగతి తెలుసుకుని, ఇతడు మారుపేరుతో - మరణించిన విష్ణుమిత్రుడి పేరుతో, అతడికి సంబంధించిన పత్రాలతో యిక్కడికి వచ్చివుంటాడు. అయితే, శరీరం మీద తగిలిన ఆ గాయాలమాటేమిటి?... ఓc, ప్రేమించిన కన్య కోసం, ఎంతమంది ప్రేమికులు మృత్యువుతో పోరుకు సిద్ధం కాలేదు?' అనుకున్నదామె.

ఆ స్త్రీ బుద్ధికి, మాతృహృదయానికి ఆలోచించిన కొందికీ, ఆ వచ్చిన వ్యక్తి అగ్నిపాలుడేననీ, తన కుమార్తె సౌందర్యం గురించి విని ముగ్ధుడై ప్రాణాపాయాన్ని కూడా లెక్కచేయక తన గృహం చేరాడనీ తోచింది.

నిజంగా అతడు అగ్నిపాలుడై వుంటే - అగ్నిపాలుడే, అందులో సందేహం లేదు - ఆ విషయం తన భర్తకు తెలియకుండా వుండటం మంచిదని చంద్రాదేవి నిశ్చయించుకున్నది. బహుశా ఈ సరికి తన కుమార్తెకు అతడు నిజం చెప్పి వుంటాడు. వాళ్ళిద్దరికీ ఒకరిపైనొకరికి ప్రేమ భావం వున్నట్టు తనకు తెలుస్తూనే వుంది. వాళ్ళు మాట్లాడుకునే తీరూ, ఏకాంతంగా సాయం సంధ్యల నదీతీరానికి వెళ్ళటం అవీ చూస్తూంటే...

ఆ రాత్రి భోజనాలయిన తరవాత, చంద్రాదేవి తన కుమార్తె గదికి వెళ్ళింది. ఆ సమయంలో వకుళమాల కిటికీ పక్కనేవున్న ఉన్నతాసనం మీద కూర్చుని, మబ్బుదొంతరల వెనకనుంచి తొంగి చూస్తున్న నవమి చంద్రుణ్ణి చూస్తూ, ఆ సాయంత్రం నదీతీరాన జరిగిన విశేషాలను మననం

చేసుకుంటున్నది.

చంద్రాదేవి గదిలోకి వెళుతూనే కుమార్తె కేసి దృష్టిసారించి, "వకుళా!" అని మెల్లగా పిలిచింది.

వకుళమాల ఆ పిలుపు వింటూనే ఉలిక్కిపడి తలతిప్పి, దగ్గిరకు వస్తున్న తల్లిని చూసి మంద హాసం చేసింది.

చంద్రాదేవి తన కుమార్తె పక్కన కూర్చుంటూ, ఆప్యాయంగా భుజం మీద చెయ్యి వేసి, "వర్మ చెప్పిన సంగతులు విన్నావే, వకుళా?" అన్నది.

వర్మ అనటంతోనే వకుళమాలకు అవజ్ఞవర్మ స్ఫురించాడు. ఆమె శరీరం కంపించింది.

అది గమనించిన చంద్రాదేవి కుమార్తెను ప్రేమగా దగ్గిరకు తీసుకుంటూ, "నీ కలవర పాటుకు కారణం ఏమిటో నేను గ్రహించానే, వకుళా! కాని, నేననేది బేతాళ వర్మ సంగతి," అన్నది నవ్వుతూ.

వకుళమాల ముఖం మీద ఆనందచ్ఛాయలు గోచరించాయి – "మామయ్య తిరిగి వచ్చాడా? అసలు ఎక్కడి కెళ్ళినట్టు?" అన్నదామె.

"ఏవేవో చాలాచోట్లు తిరిగినట్టు చెప్పాడు. చాలా వింతగొల్పే వార్తలు కూడా తెచ్చాడు. నమ్మ టమో, నమ్మకపోవటమో తెలియటంలేదు," అన్నది చంద్రాదేవి.

"ఏమిటా వార్తలు?" అని ప్రశ్నించింది వకుళమాల.

"ఇదేదో పొరబాటే కావొచ్చు...... కాని, అందరూ అనుకునేదేమిటంటే, విష్ణుమిత్రుడు మరణించాడని!" అన్నది చంద్రాదేవి.

వకుళమాల ఏమీ చలించలేదు. ఆమె తల్లి ముఖంలోకి చూస్తూ, "ఇలా జరిగి ఉంటుందని చాలామంది భావిస్తున్నట్టు నాన్న లోగ చెప్పాడుగదా?" అన్నది.

"అప్పట్లో అవన్నీ గాలివార్తలు. ఇప్పుడు చాలా మంది అది, ధృవపడిన సంగతిగా మాట్లాడుకుంటున్నారట. అతని శవాన్ని చూశామని కూడా కొందరు చెపుతూన్నట్లు వర్మ అంటున్నాడు." అన్నది చంద్రాదేవి.

వకుళమాలకు ఈ మాటలు చాలా ఏవగింపు కలిగించినై. ఆమె పొంగివస్తున్న కోపాన్ని అణచుకుంటూ, "అమాయకులో, నీచబుద్ధులో ఆడుకునే ఉబుసుపోని కబుర్లు, వర్మ మామ లాంటి అజ్ఞులు నమ్మవచ్చు! కాని, మనం ఆ విష్ణుమిత్రుడికి ఆయనకు ఆతిథ్యం యిచ్చాంగదా! ఆ సంగతి నీవెలా మరిచిపోయావో నాకు తెలియకుండా వుంది," అంటూ ఓ క్షణం అగి, "ఇందులో నాకు తెలియని రహస్యాలేమైనా వున్నవా?" అన్నది.

చంద్రాదేవి కూతురు ఉద్వేగాన్ని గమనించి కొంచెంసేపు వూరుకుని, "అగ్నిపాలుడనే అతడు మన ఇంటికి బయలుదేరి రావటం గురించి విన్నావు గదా?" అని అడిగింది.

"వినటమేగాదు, అతడి నౌకర్లను కూడా చూశాను. ఇవన్నీ జరిగి ఎంతో కాలం కూడా







కాలేదే! ఈచర్చ అంతా కొత్తగా యిప్పుడెందుకు వచ్చింది?" అన్నది వకుళమాల కోపంగా.

ఇప్పుడు తను చెప్పదలుచుకున్నదీ, తెలుసుకో దలుచుకున్నదీ ఏమిటో, కుమార్తెను మభ్యపెట్టి మాట్లాడి లాభంలేదని చంద్రాదేవి గ్రహించింది. ఆ కారణం వల్ల, ఆమె కూతురు భుజాన్ని అప్యా

యంగా మునివేళ్ళతో నొక్కుతూ, "వర్మ మాటల్లో ఏదో కొంత నిజం వుండొచ్చని నేననుకున్నాను. మన ఇంట అతిథిగా వుంటున్న ఈ విష్ణుమిత్రుడు అదృష్టవశాత్తూ అగ్నిపాలుడైతే నేను చాలా సంతోషిస్తాను," అన్నది.

"కాని, అమ్మా!... నేను మాత్రం సంతోషించలేను," అన్నది వకుళమాల తీవ్రమైన కంఠస్వరంతో.

"ఎందుకనీ?" అన్నది చంద్రాదేవి అమాయకంగా.

"అతడు ఏ కారణం వల్ల యిక్కడికి బయలుదేరాడో మనకు తెలుసు! అంతేకాక అతడి గుణగణాలను గురించీ, మానమర్యాదలను గురించీ కూడా మనం విని వున్నాం," అని వకుళమాల ఓ క్షణం ఆగి, గొంతు సవరించుకుని, "ఇవ్వాళ కాకపోతే రేపయినా, నీకు చెప్పవలసిందేగా! నేను... నేను, విష్ణుమిత్రుణ్ణి ప్రేమిస్తున్నాను," అన్నది.

చంద్రాదేవికి ఈ మాటలు బాధ కలిగించకపోయినా, సంతోష కారణం మాత్రం కాలేదు. కాని, ఆ సమయంలో తన కుమార్తెతో ఏం మాట్లాడినా అది తనకూ, ఆమెకూ కూడా మనస్తాపానికి కారణం అవుతుందని గ్రహించింది. అందువల్ల ఆమె కుమార్తె పక్కనుంచి లేచి, కిటికీలోంచి బయటికి ఓమారు తొంగిచూసి, వెనుదిరిగి గది బయటికి నడిచింది.

## - 11 -

క్రమంగా స్థితిగతులు ఒక కొలిక్కి వస్తున్నవి. ప్రసేనుడి గృహ వాతావరణంలో విచిత్రమైన మార్పులు కలుగుతున్నవి.

ఆ తండ్రీ, తల్లీ, కూతురూ... వీరిలో ఏ ఒక్కరికీ, రెండవ వారి మీద పూర్తి విశ్వాసం లేదు. ఎవరికి వారు రెండవ వారి క్షేమం కోరుతున్నామనీ, అంత లోకజ్ఞానం, విచక్షణాజ్ఞానం లేని తమ అత్మీయుల్ని కాపాడవలసిన బాధ్యత భుజస్కంధాల మీద వున్నదనీ భావిస్తున్నారు.

ప్రసేనుడికి తన భార్య అంటే ఒక విధమైన అవిశ్వాసం. ఐశ్వర్యం, భోగభాగ్యాల కోసం ఆమె వంశగౌరవాన్ని కూడా త్యాగం చేయగలదని అతడు విశ్వసిస్తున్నాడు.

అర్థం పర్థం లేని వంశగౌరవం, ఆత్మగౌరవాల పేరుతో తమ స్థితినీ, కూతురు భవిష్యత్తునూ తన భర్త మంటగలిపేందుకూడా వెనుకాడడని చంద్రాదేవి నమ్మకం.

తన తల్లిదండ్రులకు తమ బాగోగుల కన్న ప్రస్తుతం దేశంలో చెలరేగుతున్న అంతర్యుద్ధాలూ, గడిచిపోయిన గౌరవప్రతిష్ఠలను గురించిన ఆలోచన ఎక్కువని వకుళమాలకు బాధ.

ఆ వింత వాతావరణ ప్రభావాన్ని, అగ్నిపాలుడు కూడా గుర్తించాడు. ప్రసేనుడూ, అతడి భార్యా కూడా అనేక సమయాల్లో పరధ్యానంగా వున్నట్టు కనబడటం, మాట్లాడిందే మాట్లాడటం





... ఈ ధోరణికి వెనక ఏదో ప్రబలమైన కారణమే వుంటుందని అగ్నిపాలుడు ఊహించాడు.

నదీతీరాన వకుళమాలకు తన హృదయం విప్పి చెప్పిన మర్నాటి ఉదయం, అగ్నిపాలుడు ప్రయత్నించి ఉద్యానవనంలో వకుళమాలను ఒంటరిగా కలుసుకున్నాడు.

అగ్నిపాలుడిని అల్లంత దూరంలో చూస్తూనే వకుళమాల ఒక పొదరింటి చాటుకు పోబోయి, కాళ్లు తడబడగా, అక్కడ వున్న రాతి చప్టా మీద చతికిలబడింది. అగ్నిపాలుడు మందహాసం చేస్తూ, ఆమెను సమీపించాడు. వకుళమాల సిగ్గుతో తల వంచుకుని లేవబోయింది. అగ్నిపాలుడు రాతి చప్టాకు రెండో చివర కూర్చుంటూ, "వకుళా, నీతో మాట్లాడాలని వచ్చాను. నేను దీనికి ఈ చివర కూర్చుంటాను... నువ్వు ఆ చివర – ఇద్దరి మధ్యా కావలసినంత ఖాళీ ప్రదేశం!" అన్నాడు చలోక్తిగా.

వకుళమాల క్రీగంటితో అగ్నిపాలుడికేసి చూసి చిరునవ్వు నవ్వింది.

"వకుళా, మీ వర్మ మామ కనిపించటంలేదేం? ఇంకా తిరిగిరాలేదా?" అని అడిగాడు అగ్నిపాలుడు.

"తిరిగి రావటం, తిరిగి వెళ్లటం కూడా జరిగింది," అన్నది వకుళమాల అయిష్టంగా.

"ఈ హఠాత్ రాకపోకలకు కారణం?" అన్నాడు అగ్నిపాలుడు ఆశ్చర్యంగా.

"అతడేదో వార్తావాహకుడుగా పనిచేస్తున్నట్టున్నది! వార్తాహరులు శుభవర్తమానాలూ, దుర్వార్తమానాలూ కూడా మోసుకొస్తూంటారు గదా," అన్నది వకుళమాల.

"ఇంతకీ, మీ మామ ఎలాంటి వార్తలు మోసుకొస్తున్నాడు?"

అగ్నిపాలుడి ప్రశ్నకు వకుళమాల వెంటనే జవాబు చెప్పక, కొంచెంసేపు తల వంచుకు ఊరుకుని చివరకు, "మా మామ ఏకారణం వల్లనో మీమీద పగబట్టినట్టున్నది!" అన్నది.

"ఆ కారణం నీక్కూడా తెలుసు," అన్నాడు అగ్నిపాలుడు నవ్వి.

వకుళమాల అలవోకగా మందహాసం చేసింది.

"మీరు యుద్ధంలో గాయపడి, శత్రువుల చేతబడకుండా యిక్కడికి చేరటం బయటి వారెవరికీ తెలియదు... మరణించారని కూడా వాళ్లు భావించారు. అదీ ఒక విధంగా మన మేలుకే అనుకున్నాం. కాని, మా వర్మ మామ మరీ వింతయిన వర్తమానం తెచ్చాడు. అదేమిటంటే... మీరు యిక లేరనీ, మీ పేరు పెట్టుకుని అగ్నిపాలుడనే వ్యక్తి యిక్కడికి చేరాడనీ!"

అగ్నిపాలుడు ఆ మాటలకు గతుక్కుమని, "మీ మామ భావం ఏమిటో నాకు పూర్తిగా అవగాహన కాలేదు," అన్నాడు.

"కొద్దిలో చెప్పాలంటే, మీరు విష్ణుమిత్రులు

కాదు – అగ్నిపాలుడు! అదీ వర్మ మామ చెప్పేది!" అన్నదామె.

"ఈ సంగతి మీ నాన్నగారితో కూడా చెప్పావా?" అని అడిగాడు అగ్నిపాలుడు కొంచెం ఆదుర్దా కనబరుస్తూ.

"మా నాన్నకూ, అమ్మకూ కూడా చెప్పాదు"

"వారు నమ్మారా? ఏమంటారు?"

అగ్నిపాలుడి కంఠస్వరంలో ధ్వనించిన జీర, వకుళమాలను ఆశ్చర్యపరిచింది. 'ఈ స్వల్ప విషయానికి ఈయనెందుకింత ఆదుర్దా కనబరుస్తున్నాడు?' అనుకున్నదామె.

"అమ్మ ఉద్దేశం, మీరు అగ్నిపాలుడైతేనే బావుంటుందని!" అన్నది వకుళమాల.

"నాన్నగారి ఉద్దేశం?"

"ఆ పేరు వింటేనే ఆయన కత్తి దూస్తాడు... మీకు తెలుసుగదా?" అన్నది వకుళమాల.

'భగవాన్!' అనుకున్నాడు అగ్నిపాలుడు మనస్సులోనే. తను క్రమంగా చిక్కుల మధ్యకు జారుకుంటున్నాడు. త్వరలో ఈ ప్రదేశం వదిలి బయటికి పారిపోవటమే మంచిది...

"మీ తల్లిదండ్రుల అభిప్రాయం తెలిసింది. ఇక నీ అభిప్రాయం కూడా ఏమిటో వినాలని వుంది," అన్నాడు అగ్నిపాలుడు.

వకుళమాల ఆశ్చర్యంగా అతడి ముఖంలోకి చూసింది. అగ్నిపాలుడు ఒక క్షణం అగి, "నేనెవరన్నది, మీ అందరికీ సమస్య అయ్యింది. సరే, నీ తల్లిదండ్రుల సంగతీ, బేతాళవర్మ సంగతీ అలా వుంచుదాం. నీ ఉద్దేశం ఏమిటో? నేను విష్ణు మిత్రుణ్ణయితే నీకు యిష్టమా లేక అగ్నిపాలుణ్ణ యితే యిష్టమా?" అని అడిగాడు.

"మీరు మీరైన తరవాత... ఆ ఇద్దరిలో ఎవరైతే నాకేం?" అన్నది వకుళమాల ఏమాత్రం సంకో యించకుండా.

"ఆలోచించి చెప్పు, వకుళా! నేను బహుశా అగ్నిపాలుణ్ణయి వుంటాననుకో, అప్పుడు కూడా నన్ను ప్రేమించగలవా?" అని అడిగాడు అగ్నిపాలుడు.

వకుళమాల వెలవెల పోయింది.

అగ్నిపాలుడు ప్రత్యుత్తరం కోసం కొంచెంసేపు ఆగి, ఎంతకూ ఆమె మాట్లాడకపోయేసరికి, "నేను ఊరికే కుతూహలం కొద్దీ అడుగుతున్నాను. నీ ప్రత్యుత్తరం ఏమిటో వినిపించవా?" అన్నాడు.

"మీ కుతూహలం తీర్చేందుకే అయితే... మీ పేరు ఏదైనా, నా కొకటే!" అన్నది వకుళమాల.

"ఊహూఁ, కాదు!" అన్నాడు అగ్నిపాలుడు.

"అలా అయితే, నా ప్రత్యుత్తరం మరోరకంగా వుంటుంది. నన్ను ప్రేమించి కాక, రాజాజ్ఞ నెర వేర్చేందుకు, నన్ను వివాహం ఆడగోరే వ్యక్తిపై నాకు ప్రేమ కాదుగదా, గౌరవ భావం కూడా కలగదు," అన్నది వకుళమాల.

"రాజాజ్ఞో... లేక, నేను లోగడ నా స్నేహితుణ్ణొకణ్ణి గురించి చెప్పానే, ఆ విధంగా పందెం కోసమో, ఆ అగ్నిపాలుడు, విష్ణుమిత్రుడి పేరు పెట్టుకుని యిక్కడికి వచ్చాడనుకో! ఇదంతా కేవలం మాటవరసకు – వాదం కోసం, అంతకన్న మరేంలేదు. సరే, ఆ అగ్నిపాలుడు నిన్ను చూచిం తరవాత, తన రాజు సంగతీ, పందెం సంగతీ అన్నీ మరిచిపోయి, నిజంగానే హృదయం యిచ్చి నిన్ను గాఢంగా ప్రేమించాడనుకో. అప్పుడైనా అతణ్ణి స్వీకరించవా?" అన్నాడు అగ్నిపాలుడు.

వకుళమాల గంభీరంగా తల ఎత్తి నిర్లజ్జగా అగ్నిపాలుడి కళ్ళల్లోకి ఓ క్షణకాలం కన్నార్పకుండా చూసి, "ఉహూఁ, మీరు అగ్నిపాలుడు కాదు, నాకు తెలుసు!" అన్నది.

"అవునని యిప్పటి వరకు నీకు చెప్పలేదు, వకుళా! నా ప్రశ్నకు మాత్రం జవాబిచ్చావు కాదు," అన్నాడు అగ్నిపాలుడు ఆతృతగా.

"అగ్నిపాలుణ్ణి గురించి నేను చాలా విన్నాను. అలాంటి వ్యక్తి, స్వార్థం లేకుండా ఎవర్నీ ప్రేమించలేడు," అన్నది వకుళమాల.

"ఇది నా ప్రశ్నకు జవాబు కాదు! ప్రేమించటంలో స్వార్థంపాలు చాలా వుంటుంది. ప్రేమ అంటే కరుడు కట్టిన స్వార్థం కావొచ్చు; ఎలా తేల్చిచెప్పటం? సరే, నా ప్రశ్న సంగతేమిటి?" అన్నాడు అగ్నిపాలుడు.

ప్రేమను గురించి అగ్నిపాలుడు వెలువరించిన అభిప్రాయం వకుళమాలకు చాలా వింతగా కనిపించింది.

"మీరనేది నాకేమీ అర్థం కాలేదు," అన్నదామె తెల్లబోతూ.

"అర్థంచేసుకునేంత హేతువాదాన్ని ఉపయోగించి ఎవరూ ఎవరినీ ప్రేమించలేరు. అందుకు వ్యతిరేకంగా జరిగిననాడు, అది ప్రేమకాక మమకారమో – మరేదో అవుతుంది. ఇంతకూ నా ప్రశ్న ప్రశ్నగానే వుండిపోయింది," అన్నాడు అగ్నిపాలుడు.

"మీరు అగ్నిపాలుడు కాదు, వదిలెయ్యండి ఆ ప్రశ్నతో నన్ను చంపక!" అన్నది వకుళమాల చిరునవ్వు నవ్వుతూ.

"నీ జవాబు వినాలని నాకెంత కుతూహలంగా వున్నదో, నీవు అర్థం చేసుకోలేదు, వకుళా!" అన్నాడు అగ్నిపాలుడు బాధగా.

ఆ మాటతో వకుళమాలకు ఎక్కడలేని ఆశ్చర్యమూ కలిగింది. అతడు ఈ ప్రశ్నను అంత గుచ్చిగుచ్చి ఎందుకడుగుతున్నట్టు?

"అది అంత ముఖ్యంకాదు కాని, మీరు తప్పక నా ప్రత్యుత్తరం వినాలంటారా?" అని అడిగింది వకుళమాల.

అగ్నిపాలుడు అవునన్నట్టు తలాడించాడు.

"రాజాజ్ఞ వల్లనో, స్నేహితులతో పందెం వేసో, అగ్నిపాలుడు నన్ను భార్యగా చేసుకునేందుకు ఒకసారి ఇంటి నుంచి బయలుదేరింతరువాత, అతడు నిజంగా నన్ను ప్రేమించినా ఆ సంగతి నా హృదయం ఎలా నమ్మగలుగుతుంది? అదే,



మీ ప్రశ్నకు నా జవాబు! మీ కుతూహలం తీరిందా?" అన్నది వకుళమాల.

అగ్నిపాలుడు జవాబివ్వలేకపోయాడు. అతడి తల మీద పిడుగు పడినట్టయింది. ఏ నాటికీ, ఏ పరిస్థితులలోనూ తాను అగ్నిపాలుడుగా మాత్రం వకుళమాలను భార్యగా పొందటం సంభవం కాదని అతడు భయపడ్డాడు. ఈ అతికించుకున్న విష్ణుమిత్రుడి నామం, మరెంతో కాలం నిలవదు. నిలిచినా....... ఆ పేరు చాటున దాగి, వకుళమాలను అర్ధాంగిగా చేసుకోవటం వచ్చి మోసం అవుతుంది. ఈ పరిస్థితుల్లో తను ఈ ఇంటి నుంచి ఎంత త్వరగా బయటపడితే అంత మంచిది. తనను ఎంతో అమాయక హృదయంతో మనసారా ప్రేమించిన కన్యను మోసపుచ్చటంకంటే, మరి నైచ్యం వుండదు.

అగ్నిపాలుడి ఈ మనోగత భావాలనూ, సంఘర్షణనూ గ్రహించినట్టు వకుళమాల అన్నది.

"మీరేదో బాధపడుతున్నారు. నా వల్ల ఏమీ పొరబాటు జరగలేదు కదా?"

"వకుళా! నీవల్ల పొరబాటు జరగటమా! అదేం లేదు. గతించిన ఏదో సందర్భం జ్ఞాపకానికి వచ్చి అలా పరధ్యానంలో పడ్డాను," అన్నాడు అగ్నిపాలుడు.

"కాదు. మీరేదో బాధపడుతున్నారు," అన్నది వకుళమాల కనుబొమలు ముడిచి.

"నేను బాధపడటమా? ఉహుం!" అంటూ అగ్నిపాలుడు నిస్పృహగా తల వూపాడు.

"నా నుంచి ఏదో దాస్తున్నారు. చెప్పగూడదా?" అని అడిగింది వకుళమాల బతిమాలుతున్నట్టు.

"నీ నుంచి నేను దాచిన సంగతి ఒకే ఒకటి వున్నది. అది చాలా ముఖ్యమైంది కూడా. కాని, దాన్ని గురించిన సత్యం నీకు చెప్పిననాడు, నీ దృష్టిలో నా కన్న మరి నీచుడుండడు. కనుక, ప్రస్తుతానికి దాన్ని అలాగే వుంచుదాం," అంటూ అగ్నిపాలుడు లేచి నిలబడ్డాడు.

"చెప్పండి, ఏమిటది? మీ గత చరిత్ర ఎలాంటిదైనా, నాకు అభ్యతరంలేదు. మనసులో దాచుకుని, ఎందుకు బాధపడతారు చెప్పండి?" అన్నది వకుళమాల తనూ లేచి నిలబడుతూ.

అగ్నిపాలుడు, ఆ క్షణంలో తను నిజంగా ఎవరైనదీ వకుళమాలకు చెప్పదలుచుకున్నాడు. కాని, డగ్గుత్తికతో నోటి నుంచి మాట పెగలలేదు. అతడు గట్టిగా ఓమారు గొంతు సవరించుకుని, వకుళమాల కళ్ళల్లోకి బాధగా చూసి గిరుక్కున వెనుదిరిగి, అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

- 12 -

ఆ రాత్రి అగ్నిపాలుడు తను నరకంలో ఉన్నంతగా బాధ పడ్డాడు. తను అగ్నిపాలుణ్ణని చెప్పి వకుళమాలను క్షమించవలసిందిగా కోరుకునే అవకాశాలను ఒకటి రెంటిని చేజేతులా జారవిడుచుకున్నాడు. నిజంగా తను అగ్నిపాలుడని తెలిస్తే, ఆమె క్షమించగలదన్న నమ్మకం కూడా లేదు. వకుళమాల ప్రేమిస్తున్నది విష్ణుమిత్రుణ్ణి! ఆ విష్ణుమిత్రుడు గత జీవితంలో ఏవైనా గొప్ప నేరాలూ, అత్యాచారాలూ చేసి వుంటే... బహుశా, ఆమె క్షమించగలదేమో కాని, అగ్నిపాలుడనే వ్యక్తిని ఎలా క్షమించగలదు?

రాత్రి చాలా పొద్దుపోయేవరకూ, అగ్నిపాలుడు ఇలాంటి సంశయాలతోనే నానాబాధ పడి, తెల్లవారుజాముకు కన్నుమూశాడు. ఏ పరిస్థితుల లోనూ ఆ మర్నాటి రాత్రిని ఆ ఇంట గడపకూడదని మాత్రం అతడు నిశ్చయించుకున్నాడు.

సూర్యోదయమై బాగా పొద్దెక్కి, దాదాపు పది గంటల కాలమైన తరవాత అగ్నిపాలుడికి మెలకువ వచ్చింది. అతడు కిటికీలోంచి తీవ్రంగా లోపలికి వస్తున్న సూర్యకిరణాలకేసి ఓ మారు చూసి, చప్పున మంచం మీద లేచి కూర్చున్నాడు. పడకగది తలుపులు బార్లా తెరిచి వున్నవి. కాని, ఆ ప్రాంతాన సేవకులు ఎవరూ ఉన్నట్లులేదు.

అగ్నిపాలుడు ముఖం కడుక్కుని, స్నానంచేసి దుస్తులు మార్చుకునే సమయానికి నౌకరు ఒకడు వచ్చి బల్లమీద ఫలహారాలు పెట్టిపోయాడు. అంతగా ఆకలి లేకపోయినా, అగ్నిపాలుడు ఫలహారాల ముందు కూర్చున్నాడు.

ప్రసేనుడు మందహాసం చేస్తూ గదిలోకి వచ్చాడు. కాని, అతడి ముఖభంగిమల్లో ఏదో ఆదుర్దా వ్యక్తమవుతోంది.



"విష్ణూ, నువ్వు మంచి అవకాశాన్నొకదాన్ని జారవిడుచుకున్నావ్!" అంటూ ప్రసేనుడు అగ్నిపాలుణ్ణి సమీపించి, అతడి పక్కన వున్న కుర్చీలో కూర్చున్నాడు.

అగ్నిపాలుడు తల ఎత్తి ప్రశ్నార్థకంగా చూశాడు.

"రాత్రి బాగా పొద్దుపోయింతరవాత మణిమంతుడు వచ్చాడు. వెంట అతడి కుమార్తె లలితాంగి కూడా వున్నది. ఆ సమయంలో నిన్ను నిద్రలేపటం ఎందుకులెమ్మని వూరుకున్నాం. కాని, తెల్లవారి ఒకటి రెండుసార్లు సేవకుడ్ని పంపినా... యింకా నువ్వు గాఢనిద్రలో వున్నట్లు తెలిసింది. మణిమంతుడు యింతకు ముందే బయలుదేరి వెళ్ళిపోయాడు. అతడు నీ కిమ్మని యిచ్చిన ఉత్తరం యిది!" అంటూ ప్రసేనుడు ఒక ఉత్తరాన్ని అగ్నిపాలుడికి అందించాడు.

ఆ ఉత్తరాన్ని అందుకునేటప్పుడు అగ్నిపాలుడి చేతులు అప్రయత్నంగా వణికినై. తనను ఒక పెద్ద గండాన్నుంచి ఏ దేవతో రక్షించిందని అతడనుకున్నాడు. ఈ వచ్చిన మణిమంతుడు, విష్ణుమిత్రుడిని బాగా ఎరిగివున్న వాడు. విష్ణుమిత్రుడు తన తుది క్షణాల్లో, తనకు ఒక నెల రోజుల్లో వివాహం జరిగి వుండేదని చెప్పి, ఆ కాబోయే భార్య పేరు చెప్పకుండానే మరణించాడు. బహుశా ఆ యువతి ఈ లలితాంగే అయివుండొచ్చు!

నిజంగా, ఆ మణిమంతుడు వచ్చినప్పుడు తను మేలుకునే వున్నట్టయితే ఈసరికి తన బ్రతుకు ఏమయివుండేది?

హఠాత్తుగా అగ్నిపాలుడికి లలితాంగి విషయం గుర్తుకొచ్చింది. బయలుదేరి వెళ్ళిపోయింది మణిమంతు డొక్కడేనేమో! ఒకవేళ లలితాంగి ఈ ఇంటనే వుండివుంటే?

"లలితాంగి ఎక్కడున్నది?" అని అడిగాడు అగ్నిపాలుడు, తన భయాన్ని బయటికి కనబరచకుండా.

"తండ్రితోనే వెళ్ళిపోయింది," అన్నాడు ప్రసేనుడు.

"ఇద్దరూ అంత హడావిడిగా వెళ్ళిపోవటం..."

ప్రసేనుడు వేలితో సౌంజ్ఞ చేసి, గొంతు స్థాయి తగ్గించి, "మణిమంతుడి కోసం నవభోజుడి సైనికులు ఈ ప్రాంతాలన్నీ గాలిస్తున్నారు. ఆ కారణం వల్ల అతడిక్కడ ఆట్టే కాలం వుండటం క్షేమం కాదనుకున్నాడు. కాని, వచ్చినప్పుడు నాతో అన్నదేమంటే, ఇవాళ చీకటిపడేవరకూ యిక్కడే వుండి తను ముందుగా బయలుదేరిపోతాననీ, లలితాంగిని యిక్కడే వుంచుతాననీ. కాని, ఏ కారణం వల్లనో తెల్లవారి అభిప్రాయం మార్చుకున్నాడు. కుమార్తెతో కూడా వెళ్ళిపోయాడు. ఈ సంగతి చాలా రహస్యం. నా నౌకర్లెకరికీ, అతణ్ణి గురించిన పూర్తి సమాచారం తెలియదు," అన్నాడు.







"ఈ ఉత్తరం యివ్వటమేనా, మరేమైనా చెప్పాడా?" అని అడిగాడు అగ్నిపాలుడు.

"ఈ ఉత్తరం ఒకటే యిచ్చాడు. అదీ, తీరా బయలుదేరే ముందు హడావిడిగా రాశాడు. కారణం ఏమిటో తెలియలేదుగాని, ఎటువంటి విపత్కర పరిస్థితుల్లోనైనా ప్రశాంతంగా వుండే అతడు... ఎందుకో చాలా ఉద్రేకపడుతున్నట్లు కనిపించాడు," అన్నాడు ప్రసేనుడు.

"అలాగా!"

అగ్నిపాలుడు ఆలోచనలో పడ్డాడు. మణిమంతుడికి యిక్కడ ఎవరి మీద కోపం కలిగినట్టు? అది తన మీద... అంటే విష్ణుమిత్రుడి మీద

...గదా? గాయాలతో చచ్చిబతికిన – ఆ విష్ణు ...ణ్ణి, యింత దూరం వచ్చీ చూడకుండా ...మంతుడు ఎందుకు వెళ్ళినట్టు? బహుశా, ...చ్చిపోయిన ఉత్తరంలో ఆ వివరాలు ...చ్చు.

...సేనుడు కొంతసేపు మౌనంగా కూర్చుని, ...లోంచి లేచి వెళ్ళబోతూ, "విష్ణూ! ఇక నీపని ...ంకో. మణిమంతుడు ఆ ఉత్తరంలో ఏవైనా ...విషయాలే రాసి వుండొచ్చు. తనకు ...గా చిక్కిన కాలభోజరాజును నవభోజుడు ...గా విచారించి శిక్షించేందుకు, మానుకోట ...ంకి వస్తున్నాడని వార్తలు వినవస్తున్నట్టు ...ంతుడు చెప్పాడు," అని గది నుంచి ...రికి వెళ్ళిపోయాడు.

...సేనుడు గడప దాటగానే, అగ్నిపాలుడు ...ఉన్న ఫలహారాలను పక్కకుతోసి, ఆత్రంగా ...న్నందుకుని చదవసాగాడు:

*...ష్ణూ! ద్రోహీ!*

*...ద్రోహబుద్ధీ, అవినీతి ప్రవర్తనా నా కుమార్తె ...గి ద్వారా విన్నాను. నువ్వే గనక, నా ఇంట అతిథిగా కాక మరో స్థితిలో నాకు ...వుంటే – ఆ క్షణాన్నే నిన్ను నా కత్తికి ...వుండేవాణ్ణి. కాని ప్రసేనుడు నా బాల్య ...వటం వల్లా, ఈ సమయంలో నువ్వతడి ...ంలో ఉండటం వల్లా బ్రతికిపోయావు.*

*నేనూ కాలభోజరాజు పక్షీయులమే అయుండవచ్చు. అయినా, నీవు ప్రేమించినట్లు నటించి నా కుమార్తెకు చేసిన ద్రోహానికి ప్రాయశ్చితం అనుభవించి తీరవలసిందే.*

*ఈనాటి సూర్యాస్తమయం వరకూ నేను మంజీరా నదీతీరాన వున్న హిరణ్యపురంలో వుంటాను. ఆ పట్టణం మానుకోట వెళ్ళే రాజమార్గం మీద వున్నదని నీకు తెలియంది కాదు. నువ్వే గనక సుక్షత్రియ వంశ సంజాతుడవయితే – ఈనాటి సూర్యాస్తమయం లోపల నన్నా పుర పరిసరాలలోని నా మిత్రుడు విజయరాజు ఇంట కలుసుకోవలసింది. ఆ తరవాత, నీ–నా చేతి ఖడ్గాలే ధర్మనిర్ణయం చేయగలవు.*

*ఇట్లు,*

*నీ కంఠరక్తాన్ని చవిచూడ ప్రతిజ్ఞ పూనిన,*

*మణిమంతుడు*

ఈ ఉత్తరం అగ్నిపాలుడికి ఎంత ఆశ్చర్యం కలిగించిందో, అంత నవ్వూ తెప్పించింది. ఈ మణిమంతుడెవరో గాని... మహానుభావుడు, అగ్గి పిడుగు లాంటి మనిషి, అనుకున్నాడతను. ఒక విధంగా ఆ విష్ణుమిత్రుడు అదృష్టవంతుడే అనుకోవాలి. ఒకవేళ అతడు బ్రతికేవుండి, ఆ సమయంలో ఈ మణిమంతుడి కంట బడితే, అతడి కంఠరక్తం నిజంగానే ఈ మణిమంతుడు చవి చూడగలడు! అనుకున్నాడు అగ్నిపాలుడు. అంతలోనే అతడికో పెద్ద సంశయం కలిగింది. విష్ణుమిత్రుడు తన కుమార్తెకు ద్రోహం చేశాడనే సంగతి ...మణిమంతుడికి ఎవరు చెప్పి ఉంటారు? ...తకూ, ఆ విష్ణుమిత్రుడు చేశాడనే ఆ ద్రోహం ...లాంటిది? ఒకవేళ విష్ణుమిత్రుడు బ్రతికే ...న్నాడా? విష్ణుమిత్రుడు మరణించాడనీ... నాడి ...డా పరీక్షించి చూశాననీ, తనతో చెప్పినవాడు ...ప్రధానసేవకుడు మాహూ! తనకై తాను అతడి ...ండె ఆగిపోవటాన్ని గాని, నాడి ఆడటం, ఆడక ...పోవటం గాని పరీక్షించి చూడలేదు. ఎక్కడో ఏదో ...రబాటు జరిగి వుండాలి!

అగ్నిపాలుడు కుర్చీలోంచి లేచి, కిటికీ దగ్గరకు ...చ్చి, దూరంగా కనబడుతున్న ఉద్యానవనానికేసి ...చూస్తూ యిప్పుడు తన కర్తవ్యం ఏమిటా అని ...ఆలోచించసాగాడు.

తను ఎటూ ఆనాటితో ప్రసేనుడి గృహం ...విడిచిపోక తప్పదు. ప్రస్తుతం తను చిక్కుకున్న ...ఊబిలాంటి ...షవలయంలోంచి ముందు బయటపడాలి. తను ...భవిష్యత్తులో మరేనాడైనా అగ్నిపాలుడుగా వకుళ ...మాలను భార్యగా పొందగలడేమో కాని... ఇప్పటి ...పరిస్థితుల్లో మాత్రం సాధ్యం కాదు.

విష్ణుమిత్రుడు తనకు అప్పచెప్పిన పత్రాలను ...వెంటతీసుకుని, ఆ సాయంత్రం లోపల హిరణ్య...పురంలో మణిమంతుణ్ణి కలుసుకుని, జరిగిన ...సంగతిటో చెప్పటం మంచిదని అగ్నిపాలుడు నిశ్చ...యించుకున్నాడు. ఇకపోతే, ఈ గృహం వదలటం ...అంత కష్టం కాదు. కాని, వీడ్కోలు సమయంలో ...తను వకుళమాలకు చెప్పవలసిందేమిటి?

ఇలా ఆలోచిస్తున్న అగ్నిపాలుడి దృష్టికి హఠాత్తుగా వకుళమాల కనిపించింది. ఆమె ఉద్యాన వనంలో ఒక పొదరింటి పక్కన నిలబడి, తను వున్న కిటికీకేసే చూస్తున్నట్టు అతడు గ్రహించాడు. అతడు తక్షణం గది నుంచి బయటికి వచ్చి, మేడమెట్లు దిగి, ఉద్యానవనం కేసి బయలు దేరాడు. ముఖద్వారం దగ్గర రెండు గుర్రాలు పూన్చిన ఒక బండి, తెరలతో సహా నిలబడి వుంది. అంటే, ఎవరో స్త్రీలు ప్రయాణమై పోబోతున్నారు. వారెవరు? వకుళమాల కాదు గదా! ఆ అనుమానం కలగ్గానే అగ్నిపాలుడు వేగంగా నడిచి వకుళమాల వున్న పొదరింటిని చేరాడు.

ఆమె శిలాప్రతిమలా నిలబడి, రెప్పవాల్చకుండా అతడికేసే చూస్తున్నది. ఆమె ముఖం కోపంతో జేవురించి వున్నది.

వకుళమాలను సమీపించబోయిన అగ్నిపాలుడు అది గమనించి, ఉన్నచోటునే టక్కున ఆగిపోయాడు. అతడి గుండె వేగంగా కొట్టుకోసాగింది.

"వకుళా!" అంటూ అగ్నిపాలుడు తిరిగి ముందడుగు వేయబోయాడు.

కాని అంతలో, "ఛీ, నీచుడా!" అన్న వకుళమాల మాటలు అతణ్ణి నిశ్చేష్టుణ్ణి చేసినై. కాళ్ళ కింది భూమి విచ్చిపోతున్నట్టుగా తోచిందతడికి.

"లలితాంగి వల్ల నీ నీచత్వం అంతా తెలుసుకున్నాను. నువ్వు మానవ రూపం ధరించిన

రాక్షసుడివని తెలిసిపోయింది!" అన్నది వకుళమాల తీవ్ర స్వరంతో,

"వకుళా! నువ్వనేదేమిటో..."

"ఛీ దుర్మార్గుడా! ఇంకా నన్ను వకుళ అని పిలవటానికి నీకు ముఖం ఎలా చెల్లింది? ఇంక నా దగ్గిర ఆ చనువు పనికిరాదు," అన్నది వకుళ మాల కఠినంగా.

"ఇంతకూ నేను చేసిన అపరాధం?" అన్నాడు అగ్నిపాలుడు దీనంగా.

"అపరాధం! నీ అపరాధమేమిటో యింకా తెలియలేదా? లలితాంగిని ప్రేమించినట్టు నటించి, నమ్మించి... ఆమె తండ్రి ద్వారా వివాహ ముహూర్తం కూడా నిశ్చయంచేసుకున్నావు. తరవాత మా ఇంట చేరి, ప్రేమించినట్టు నటించి, నన్ను కూడా మోసపుచ్చాలని చూశావు. నీ నీచత్వం తెలియని నేను నా హృదయంలో నీకు స్థానమిచ్చాను. కల్లబొల్లి మాటలతో, నీ గత జీవితంలో జరిగిపోయిన దేన్ని గురించో నాకు చెప్పలేక బాధపడుతున్నట్టు నటించినదంతా – ఈ బాధపడుతున్నట్టు నటించినదంతా – ఈ లలితాంగికి నువ్వు చేసిన ద్రోహం సంగతేగదా?" అన్నది వకుళమాల.

"నన్ను విశ్వసించు, వకుళా! నేను, నీవనుకుంటున్న వాణ్ణి కాదు. నిజం తెలిసిననాడు..."

వకుళమాల ఛీత్కరిస్తూ, "ఇక మాటలంతటితో కట్టిపెట్టు, లలితాంగి నీ గురించి సర్వం చెప్పింది. నీ ద్రోహానికి, మోసానికి తగిన ప్రాయశ్చిత్తం జరిపించి తీరుతాను," అంటూ గిరుక్కున తిరిగి, ఉద్యానవన ప్రధాన ద్వారంకేసి వేగంగా వెళ్ళిపోయింది.

అగ్నిపాలుడు వెళ్ళిపోతున్న వకుళమాలకేసి చూస్తూ, ప్రయత్నించి కూడా ముందుకు అడుగు వెయ్యలేకపోయాడు. తరవాత కొంతసేపటికి అతడు తెప్పరిల్లి, నీరసంగా ద్వారంకేసి నడిచి ఉద్యానవనం నుంచి బయటికి వెళ్ళేసరికి, దూరంగా జోడు గుర్రాలు పూన్చిన బండి సుడిగాలిలా పరుగిడుతూ, చూస్తుండగానే అతడి దృష్టిపథాన్నుంచి మాయమైంది.

- 13 -

అగ్నిపాలుడికి మారిన ఈ పరిస్థితుల్లో తన కర్తవ్యం ఏమిటో నిర్ణయించుకోవటం ఏమంత కష్టం కాలేదు. తను ఎలా అయినా ఆనాటి సూర్యాస్తమయం లోపల ప్రసేనుడి గృహం వదిలి వెళ్ళదలుచుకొన్నాడు. అప్పట్లో, ఎక్కడికి వెళ్ళాలనేది మాత్రం అతడు ఆలోచించుకోలేదు. కాని, ప్రస్తుతం వకుళమాల ప్రవర్తన దృష్ట్యా మాత్రమే కాక, మణిమంతుడి ఉత్తరం ధోరణిని బట్టి కూడా – తాను హిరణ్యపురం వెళ్ళటం మంచిదనుకొన్నాడు.

ఆనాటి సూర్యాస్తమయం వరకూ, మణిమంతుడు హిరణ్యపురంలోని తన మిత్రుడైన విజయరాజు యింట వుంటాడు. తను అతణ్ణి కలుసు







కుని, విష్ణుమిత్రుడు తనకు అప్పచెప్పిన పత్రాలను ఆయనపరం చేసి, జరిగిన వాస్తవం ఏమిటో వివరించవలసి వుంటుంది. ఏ పరిస్థితులలోనూ తానెవరైనదీ మణిమంతుడికి తెలియనివ్వకూడదని అగ్నిపాలుడు నిశ్చయించుకొన్నాడు.

ఇక వకుళమాల సంగతి, ఆమె తనను విష్ణుమిత్రుడని పూర్తిగా విశ్వసించటం వల్లనే లలితాంగి చెప్పిన మాటలకు అంతగా ఉడికిపోయింది. తను లలితాంగితో వివాహానికి అంగీకరించి, తరవాత తన ఇంటచేరి, తనతోనూ ప్రేమకలాపాలు ప్రారం

భించానని ఆమె నమ్మకం! కాని... 'నీ ద్రోహానికి తగిన ప్రాయశ్చిత్తం జరిపించి తీరుతాను' అన్న ఆమె మాటల అర్థం ఏమిటి? ఏ కారణం వల్ల, ఎందుకోసం యింత హడావిడిగా వకుళమాల ఇల్లు వదిలి ప్రయాణమైపోయింది?

అగ్నిపాలుడికి ఎంత ఆలోచించినా, ఈ ప్రశ్నలకు జవాబులు దొరకలేదు. అతడు నీరసంగా మేడమెట్లెక్కి, తన గదిని చేరి తనకు సంబంధించిన వస్తువులన్నీ ఒకచోట చేర్చి ప్రయాణానికి సర్వం సిద్ధం చేసుకోసాగాడు.

ఆ సమయంలో ప్రసేనుడు అక్కడికి రావటం జరిగింది. అతడు అగ్నిపాలుడు వస్తువులన్నీ ఒకచోటుకు చేర్చుతూండటం చూసి," ఏమిటిదంతా, విష్ణూ!" అని అడిగాడు.

"నాకు సెలవిప్పించండి. చాలా అవసరంగా బయలుదేరి పోవలసిన పని తగిలింది," అన్నాడు అగ్నిపాలుడు.

"ఏమిటా అవసరం అయిన పని?" అంటూ ప్రసేనుడు కొంచెం ఆగి, "మణిమంతుడు ఆ ఉత్తరంలో ఏదైనా ముఖ్యవిషయం రాశాడా?" అన్నాడు.

"అవును. ఆయన్ని ఈ సాయంత్రం హిరణ్యపురంలో కలుసుకోవలసి వున్నది," అన్నాడు అగ్నిపాలుడు.

ప్రసేనుడు ఒక్క నిట్టూర్పు విడిచి కుర్చీలో కూర్చుంటూ, "ప్రస్తుతానికి మన ఆశలన్నీ భగ్నమయినై. నన్నడిగితే మనం తొందరపడి నవభోజుడితో బహిరంగ యుద్ధానికి పూనుకొన్నామంటాను. మరికొంతకాలం వేచి వుండవలసింది," అన్నాడు.

"అంతా అయిపోయింతరవాత ఇప్పుడనుకుని లాభం ఏముంది? అంతా దైవఘటన!" అన్నాడు అగ్నిపాలుడు.

ప్రసేనుడు కొంతసేపు మౌనంగా ఆలోచిస్తూ వూరుకుని, "అన్నట్లు – తనెక్కడికి వెళుతున్నదీ, నీతో ఏమైనా చెప్పిందా విష్ణూ?" అని అడిగాడు.

"ఉహుఁ," అంటూ అగ్నిపాలుడు తలాడించాడు.

"నీవు ఈ రోజున బయలుదేరి పోతున్నట్టు అమ్మాయికి తెలుసా?"

"నేను చెప్ప మరిచాను," అన్నాడు.

"సరే, మనం యిప్పట్లో కలుసుకోవటం జరక్కపోవచ్చు. మణిమంతుడు ఈ అపజయానికి చాలా విచారిస్తున్నట్టు కనిపించాడు. అతడి మాటల ధోరణి చూస్తే, కృష్ణానది దాటి చాళుక్య రాజ్యం చేరదలచినట్టు కనబడింది. ఇక నీ ప్రయాణం..." అంటూ ప్రసేనుడు, అగ్నిపాలుడి ముఖంలోకి చూశాడు

"ముందు మణిమంతుడితో మాట్లాడాలి. ఆ తరవాతే ఏం నిర్ణయించినా," అన్నాడు అగ్నిపాలుడు.

"అదే మంచిపని! కొద్ది రోజుల్లో కాలభోజ







భవిష్యత్తు ఎలా వుండబోతున్నదో మనకు
పోతుంది. ఈ లోపల మనందరం ఒకరొక
నవభోజుడి చేత బడి నాశనం అయ్యేకన్నా
న్న కొద్దిమందిమీ సురక్షితంగా ఏ చాళుక్య
ంలోనో తలదాచుకోవటం మంచిది. నా
త్రి – ఇంతవరకూ నన్ను కాలభోజుడి పక్ష
వని శత్రువులెవరూ గుర్తించలేదు. కనుక,
తానికి నేనిక్కడ వుండక తప్పదు. ఇది ఒక
గా ముందు ముందు, మీ అందరికీ ఉపయోగ
గా పరిణమించవచ్చు," అన్నాడు ప్రసేనుడు.
అగ్నిపాలుడు మౌనంగా తల వూపాడు.
ప్రసేనుడు కుర్చీలోంచి లేచి, గదిలో అటూ
టూ కొద్దిసేపు పచార్లుచేసి, "సరే, విష్ణూ!
నువ్వు కాస్త విశ్రాంతి తీసుకొని బయలుదేరటం మంచిది. హిరణ్యపురం యిక్కడికి ఎంతలేదన్నా, పదీ పన్నెండు కోసుల దూరం వుంటుంది," అని గది బయటికి నడిచాడు.

జరిగిందేమిటో – విష్ణుమిత్రుడికి సంబంధించినంత వరకూ మణిమంతుడితో చెప్పి, ఆ పత్రాలు అతడి స్వాధీనం చేసి, తాను సరాసరి చంద్రగిరి నగరం చేరటమే ఉత్తమమని అగ్నిపాలుడు నిశ్చయించుకున్నాడు. అంటే, దాని అర్థం తను అవజ్ఞవర్మతో వేసిన పందెంలో ఓడినట్టు! తనకు అదృష్టం కలిసిరాలేదు. మారు మాట్లాడకుండా తన సంస్థానాన్ని అతడికి ధారాదత్తం చేయవలసి వుంటుంది. అంతమాత్రాన, తను

నిరుత్సాహపడవలసిందేమీ లేదు. ఏదో ఒకనాడు తను అంతకన్నా గొప్ప సంస్థానాన్ని... మరొక చోట సంపాయించగలడు. కాని, వకుళమాల నెలా...

అగ్నిపాలుడు యిటువంటి ఆలోచనలతో, కుర్చీలోనే మగతగా కళ్ళు మూసుకున్నాడు. అలా ఎంతకాలం గడిచిందో అతడికి తెలియదు.

హఠాత్తుగా భవనప్రాంగణంలో గుర్రపు డెక్కల చప్పుడూ, కేకలు వినిపించి అతడు ఉలిక్కిపడుతూ కళ్ళు తెరిచాడు.

ప్రప్రథమంగా అతడి దృష్టి కిటికీలోంచి భవనం ముందు భాగాన వున్న ఖాళీ ప్రదేశం మీదికి ప్రసరించింది. పదిహేనూ, ఇరవైమంది ఆశ్వసైనికులు అతని కంటబడ్డారు. వారిలో కొందరు యింకా అశ్వాల మీదనే వున్నారు. కొందరు దిగి అటూ ఇటూ పరిగెత్తుతున్నారు. ఒక నడివయసువాడు... బహుశా వాళ్ళ నాయకుడై వుంటాడు – అతడు మాత్రం కత్తి దూసి, భవన ముఖద్వారం కేసి నడుస్తూ, "రాజా ప్రసేన్! రాజా ప్రసేన్!" అని పెద్దగా కేకలు పెడుతున్నాడు.

అగ్నిపాలుడు నిలువెల్లా వణికిపోయాడు. ఎవరో ప్రసేనుడికి ద్రోహం తలపెట్టారు. అతడికి ఆ క్షణంలో బేతాళవర్మ గుర్తుకువచ్చాడు. వకుళమాల కారణంగా అతడు బహుశా పగపట్టివుంటే అది తన మీదే అయివుంటుంది. చూస్తూ చూస్తూ అతడు ప్రసేనుడికి ద్రోహం చెయ్యలేదు. ఒకవేళ ఆ వచ్చిన సైనికులు తన కోసం అయితే?

అగ్నిపాలుడు యిలా మథనపడుతున్నంతలో ప్రసేనుడు తలుపు తెరుచుకుని బయ[టకు] వచ్చాడు, అతణ్ణి చూస్తూనే సైనికుల నాయకు[డు] సగౌరవంగా ప్రణామం చేస్తూ, "రాజా ప్రసే[న్!] నన్ను క్షమించాలి. రాజకార్యం మీద నేనిక్క[డికి] రావటం జరిగింది. మీ గృహంలో ఒక రాజద్రో[హి] వుంటున్నట్టు మాకు సమాచారం చేరింది. అ[తడు] తమకు నిజనామం చెప్పక బొంకిన కారణంగా రాజద్రోహి అని తెలియక, మీరతడికి ఆశ్రయ[ం] యిచ్చి వుంటారు. అతణ్ణి బంధించవలసి వుం[ది.] దయవుంచి, ఎక్కడ వున్నాడో చెప్పకోరతాను" అన్నాడు.

ప్రసేనుడు నిప్పులు చెరిగే కళ్ళతో ఆ సైని[క] నాయకుడికేసి చూస్తూ, "నువ్వనేది ఏ రాజద్రో[]హిని గురించో, నా కర్థం కావటం లేదు. ఎ[వరా]తను?" అని ప్రశ్నించాడు.

"విష్ణుమిత్రుడు! నవభోజ మహారాజు పేరు[న] నేను మిమ్మల్ని అడుగుతున్నాను. అతడెక్క[డ వు]న్నాడు?" అన్నాడు సైనికనాయకుడు అధి[కార] స్వరంతో.

ప్రసేనుడు పైకుబికివస్తున్న కోపాన్ని [] పడుతూ, "ఇది నన్నవమానించటంగా భా[విస్తు]న్నాను. ఆ విష్ణుమిత్రుడు రాజద్రోహి అని [] చెప్పిన వాళ్ళెవరు? అసలు నా అను[మతి] లేకుండా, నా భవన ప్రాంగణంలో అడుగు[పెట్టటానికి]





అధికారం..." అంటుండగా, పరిస్థితి చేజారిపో తున్నదని గ్రహించిన అగ్నిపాలుడు కిటికీలోంచి చేయి వూపుతూ, "రాజా ప్రసేన్! మీరు తొందర పడకండి," అంటూ పెద్దగా కేకవేసి, సైనిక నాయకుణ్ణి ఉద్దేశించి, "మీరేమీ తొందరపాటున పరుషాలు పలక్కండి. విష్ణుమిత్రుణ్ణి నేనే! కిందికి దిగివస్తున్నాను. నన్ను బందీగా పట్టుకుపోవచ్చు," అన్నాడు.

ప్రసేనుడు స్థాణువులా నోటమాట రాక నిలబడిపోయాడు. సైనిక నాయకుడు కూడా అగ్నిపాలుడి మాటలకు అచ్చెరువందుతూ నిల్చున్నాడు.

అగ్నిపాలుడు వేగంగా మెట్లు దిగి భవన ప్రాంగణంలోకి వచ్చి ప్రసేనుణ్ణి సమీపించి, "రాజా ప్రసేన్! నన్ను క్షమించండి. కొన్ని ప్రత్యేక కారణాలవల్ల, మీకు నా నిజనామం చెప్పలేక పోయాను," అంటూ సైనిక నాయకుడికేసి తిరిగి, ఒరలో వున్న తన కత్తి తీసి వేలు చూపుతూ, "నేనిప్పుడు మీకు బందీని. కావాలంటే అందుకు సూచనగా నా కత్తిని మీపరం చేయగలను," అన్నాడు.

ఆ మాటలకు సైనిక నాయకుడు అయిష్టంగా తలవూపి, "మీ గురించి నేను లోగడ విన్నదాన్ని బట్టి, మీరింత తేలిగ్గా నా స్వాధీనం అవుతారను కోలేదు. ఆ కారణం వల్లనే యింతమంది సైనికులతో నేనిక్కడికి రావటం జరిగింది. రాజాజ్ఞ! నేను చేయగలిగిందేమీ లేదు. కత్తిని మీ దగ్గిరే వుండనివ్వండి. దయచేసి, ఆ గుర్రాన్ని అధిరోహిస్తే ... బయలుదేరవచ్చు," అన్నాడు.

అగ్నిపాలుడు మారుమాటాడకుండా, సైనికు డొకడు ముందుకు తెచ్చిన గుర్రాన్ని ఎక్కాడు. సైనిక నాయకుడు ముందు కదిలాడు. అతడి వెనకనే అగ్నిపాలుడు తన గుర్రాన్ని నడిపించాడు. మిగిలిన సైనికులు అతడి వెనక బయలుదేరారు.

అగ్నిపాలుడు భవన ప్రాంగణం దాటి, రాజ మార్గం మీదికి వచ్చేవరకూ తలతిప్పి ప్రసేనుడి వైపుకు చూడలేదు. కాని, రాజమార్గం చేరగానే అతడు తలతిప్పి చూశాడు.

ప్రసేనుడు భవన ప్రాంగణంలోనే నిలబడి వున్నాడు. అతడి పక్కన భార్య చంద్రాదేవి కూడా వున్నది. ఆమె తనకేసి చేయి వూపుతూ, భర్తతో ఏదో ఉద్వేగంగా మాట్లాడుతున్నది.

అగ్నిపాలుడి పెదాల మీద చిరునవ్వు మెరిసింది. తను విష్ణుమిత్రుణ్ణని చెప్పకుండా ప్రసేనుడి ఆశ్రయం సంపాయించినట్టు, సైనిక నాయకుడు అనుకుంటున్నాడు. బహుశా అతడి కొచ్చిన సమాచారం అలాంటిదై వుండొచ్చు. ఆ కారణం వల్లనే తను ప్రసేనుడితో ... 'కొన్ని ప్రత్యేక కారణాల వల్ల, మీకు నా నిజనామం చెప్పలేకపోయాను' అనటం జరిగింది. దీనితో సైనిక నాయకుడికి, ప్రసేనుడి మీద ఇంకా ఏమైనా అనుమానం మిగిలి వుంటే – అది కాస్తా పటాపంచలు కాగలదు.

దారిలో సైనిక నాయకుడు పక్కకు తలతిప్పి, అగ్నిపాలుడికేసి గుచ్చి చూస్తూ, "మిమ్మల్ని చూడ గానే నాకు చాలా ఆశ్చర్యం కలిగింది. లోగడ మిమ్మల్ని ఎక్కడో చూసివున్నట్టు అనుమానం కలుగుతున్నది," అన్నాడు.

"ఎప్పుడైనా మీరు చంద్రగిరి నగరంలో వున్నారా?" అని అడిగాడు అగ్నిపాలుడు.

"కొద్ది రోజుల పాటు వున్నాను. అక్కడ నా మిత్రుడొకడు... ఇప్పుడు రాజాస్థానంలో చాలా పెద్ద ఉద్యోగంలో వున్నాడు - అతడింట నాలుగైదు రోజులున్నాను," అన్నాడు సైనిక నాయకుడు.

"ఎవరామిత్రుడు?"

"జయసింగ్. ఆయన్ని మీరేమైనా ఎరుగు దురా?"

అగ్నిపాలుడు నిశ్చేష్టుడయ్యాడు. ఈ పట్టున తనెవరైనదీ అందరికీ తెలిసిపోవటం మంచిది కాదు. తను రాజద్రోహి విష్ణుమిత్రుడు కాదనీ, అగ్నిపాలుడనీ ఏ క్షణాన కావాలంటే ఆ క్షణంలో రుజువుపరుచుకుని, ఈ చిక్కుల్లో నుంచి బయట పడొచ్చు. కాని, ఈలోపల విష్ణుమిత్రుడుగా తను చేయవలసిన పనులు కొన్ని వున్నవి.

"జయసింగ్‌ను నేనెరుగుదును. కాని, విష్ణు మిత్రుడుగా మాత్రం కాదు. బహుశా నన్ను మీరతడివెంట ఎప్పుడైనా చూసి వుంటారు. ఇంతకూ మీ పేరు?" అన్నాడు అగ్నిపాలుడు.

"క్షమించాలి, చెప్పమరిచాను. నా పేరు ధర్మ నందుడు. ప్రస్తుతం మానుకోట పట్టణంలో విడిసి వున్న సైన్యానికి నాయకుణ్ణి," అన్నాడు ఆ సైనిక నాయకుడు.

"చాలా సంతోషం. రాజద్రోహినైన నా మీద, నవభోజరాజు సైనికులెవరూ యింత మర్యాద కనబరచగలరని నేననుకోలేదు," అన్నాడు అగ్ని పాలుడు.

"మీరు రాజద్రోహులని అప్పుడే ఒప్పుకుంటు న్నారే! మిమ్మల్ని న్యాయాధిపతుల ముందు నిలిపి నప్పుడు... అక్కడ జరగవలసిన న్యాయవిచారణ తంతు చాలా వుంది. నిజమైన రాజద్రోహులు కూడా చాలామంది తెలివిగా శిక్షపడకుండా తప్పించుకోగలుగుతున్నారు. నిర్దోషులు కొందరు శిక్షింపబడుతున్నారు కూడా. ఇదంతా చూచిన తర్వాతనే, నాకు ఈ సైనిక వృత్తి మీద అసహ్యం కలుగుతున్నది. ఒక్క ఆ కాలభోజుణ్ణి మాత్రం ఉరితీసి, తతిమ్మా వారిని ఎవరి మానాన వారిని వదలటం ఒక్కటే ఉత్తమ మార్గం అని నేను నమ్ము తున్నాను. ఆ కారణం వల్లనే, మీతో నేనంత మర్యాదగా ప్రవర్తించటం జరిగింది"

ధర్మనందుడి మాటలు, అగ్నిపాలుడికి ఎంతో ఆనందం కలిగించినై. దురదృష్టవశాత్తూ తను మణిమంతుణ్ణి కలుసుకోకముందే ఈ చిక్కుల్లో పడవలసివచ్చింది. అతడికొకసారి కనిపించి, జరిగిన పొరపాటు ఏమిటో చెప్పటం తన ధర్మం. అందుకు తను సూర్యాస్తమయం లోపల హిరణ్య



పురం చేరాలి; మణిమంతుణ్ణి కలుసుకోవాలి. ఇప్పటి పరిస్థితుల్లో ధర్మనందుడి సహాయంగాని, లేక అనుమతిగాని లేనిదే అది సాధ్యం కాదు. ముందు తనెక్కడికి తీసుకుపోబడుతున్నదీ తెలుసు కోవటం అవసరం...

"ధర్మనందా! మీ దయకూ, నాపై గల సదభి ప్రాయానికీ కృతజ్ఞుణ్ణి. నన్ను మానుకోటకే తీసుకుపోతున్నారా? అభ్యంతరం లేకపోతే తెలు సుకోవాలని వున్నది," అన్నాడు అగ్నిపాలుడు.

"అవును, మానుకోటకే!" అన్నాడు ధర్మనం దుడు.

"మానుకోటకు వెళ్ళే మార్గంలో, హిరణ్యపురం తగులుతుంది గదా?" అని అడిగాడు.

"ఈ రాత్రికి మనం అక్కడే కాలం గడపవలసి వుంటుంది. అక్కడ మీకు బంధువులు గాని, మిత్రులుగాని ఎవరైనా వున్నారా?" అన్నాడు ధర్మనందుడు కుతూహలంతో.

"అక్కడ నా మిత్రులొకరిని కలుసుకోవాలి. అతడితో నేను మాట్లాడేటప్పుడు, మీరు దగ్గిర వుండవచ్చు. స్వవిషయాలూ, కుటుంబ విష యాలూ తప్ప అతడితో రాజద్రోహం ఏమీ మాట్లాడబోవటం లేదు," అన్నాడు అగ్నిపాలుడు మందహాసం చేస్తూ.

"ఓ! మీరు నిరభ్యంతరంగా అక్కడ ఎవరినైనా కలుసుకోవచ్చు. నా కనుగప్పి మీరు పారిపో దలచలేదు గదా? అలాంటిదేమీ లేదని వాగ్దానం చేయండి చాలు," అన్నాడు ధర్మనందుడు ఎంతో మర్యాదగా.


"వాగ్దానం చేస్తున్నాను. గృహవిషయాలు తప్ప, ఎవరితోనూ ఎట్టి రాజకీయ వ్యవహారాలూ మాట్లాడను," అన్నాడు అగ్నిపాలుడు.

ధర్మనందుడు గుర్రాన్ని అదిలించి, వేగంగా దాన్ని పరిగెత్తించుతూ, "చీకటి పడకముందే మనం హిరణ్యపురం చేరగలం. మీరు మాట్లాడ దలచిన స్నేహితుడి ఇల్లు, నగరంలోని ఏ భాగంలో?" అని అడిగాడు.

"నా స్నేహితుడు ఆ నగరవాసి కాదు. అతడు నగర పొలిమేరలలో వున్న విజయరాజనే వారి ఇంట అతిథిగా వుంటున్నాడు. ఈ స్నేహితుడికి నేటి రాజకీయ కక్షలలో దేనితోనూ సంబంధం లేదు. అతడు నాకు బాల్యమిత్రుడు," అన్నాడు అగ్నిపాలుడు ఎంతో నమ్మకంగా.

"ఆ విజయరాజనబడే ఆయన నివసించే పెద్ద లోగిలి నాకు తెలిసిందే. మొదట్లో ఒక వారం రోజుల పాటు, చాలా మంది సైనికులతో పాటు నేనక్కడే వున్నాను. ఆయనకు చంద్రగిరి రాజ్యంలో ఏం జరుగుతున్నదో తెలియటం మాట అటుంచి, హిరణ్యపురంలో ఏం జరుగుతున్నదో కూడా తెలియదు," అంటూ ధర్మనందుడు బిగ్గ రగా నవ్వాడు.

"ఆయనకు అతిథిగా వున్న నా స్నేహితుడు కూడా అలాంటి వ్యక్తే. తన పనేమిటో తప్ప,



మరి లోకం అనేది వున్నదనే సంగతి కూడా అతడికి తెలియదు," అన్నాడు అగ్నిపాలుడు కూడా మందహాసం చేస్తూ.

"ఈ చంద్రగిరి రాజ్యంలో యిలాంటి వాళ్ళ సంఖ్య పెరిగితే, ఈ కల్లోలాలకు తావే వుండదు," అంటూ ధర్మనందుడు అగ్నిపాలుడికేసి చూసి నాలుక్కొరుక్కుని, "మనం విమర్శించి లాభం లేదు. ఎవరి ఆదర్శాలూ, ఆశయాలూ, అభిప్రాయాలూ వారివి! అందరూ వర్తకులూ, వ్యవసాయదారులూ కాలేరు గదా!" అన్నాడు.

"అందుకు మీరూ, నేనే నిదర్శనం. మీరు సైనికులు, నేనూ సైనికుణ్ణే. కాని, నేనొక రాజును నమ్మాను, మీరు మరొక రాజును నమ్మారు. ఈ ఇద్దరిలో ఎవరు జయించగలరనేది మీ - నా శక్తి సామర్థ్యాల మీద ఆధారపడి వుంటుంది," అన్నాడు అగ్నిపాలుడు.

"ఔనౌను!" అన్నాడు ధర్మనందుడు సాలోచనగా.

- 14 -

అగ్నిపాలుడు హిరణ్యపుర ప్రాంతాలకు చేరేసరికి, సూర్యాస్తమయం అయింది. కాని యింకా చీకటి బాగా అలుముకోలేదు. చుట్టూ ఎత్తయిన ప్రహరీగోడలతో ఉన్న ఒక పురాతన భవనాన్ని ధర్మనందుడు, అగ్నిపాలుడికి చూపుతూ, "మీరు వెళ్ళదలచిన విజయరాజుండే గృహం అదే. అక్కడ వున్న మిత్రుడితో మీరు నిర్భ్యం





గా మాట్లాడిరావచ్చును. మీరు తిరిగి వచ్చే
, నేనిక్కడే వేచి వుంటాను," అన్నాడు.
తజ్ఞుణ్ణి. త్వరలోనే తిరిగి వస్తాను," అంటూ
లుడు గుర్రాన్ని అదిలించి, విజయరాజు
కేసి బయలుదేరాడు.
హరీగోడకు ఉన్న పెద్ద తలుపులు బార్లా
వున్నవి. అగ్నిపాలుడు గోడదాటి గృహ
ణంలోకి వెళ్ళేసరికి ఆ ప్రాంతమంతా కోలా
గా వున్నది.
, నీచుడా! నీ కల్లబొల్లి మాటలతో నన్ను
మోసం చేద్దామనుకుంటున్నావా? నువే
సుక్షత్రియుడివైతే, ఒర నుంచి కత్తి దుయ్యి.
పానికి తగిన ప్రాయశ్చిత్తం చేస్తాను,"
న్నదొక గొంతు భీకరంగా.
ణిమంతా! తొందరపడకు. విష్ణు చెప్పేది
వినుు. ప్రసేనుడి ఇంటవున్న వ్యక్తి తను
ందుకు సాక్ష్యం చూపుతానంటున్నాడు
" అంటున్నది మరొక గొంతుక, సావధాన
ధోరణిలో.
సంభాషణ వింటూనే అగ్నిపాలుడు, ఆ
హలానికి కారణం అర్థం చేసుకున్నాడు.
ఎవరైతే మరణించినట్టు భావిస్తున్నాడో...
ష్ణుమిత్రుడు సజీవుడే!
రా! మాహూ! నీ బుద్ధిహీనతవల్ల నేను
మోసపోయానే!' అని అగ్నిపాలుడు తన
ను మనసులోనే శపించి, ఒక్క దూకున

గుర్రం మీది నుంచి దిగి, "అయ్యా, మీరు తొందర పడకండి! కత్తులు ఒరలో పెట్టండి. మీ తగవుకు తగు కారణం లేదు," అంటూ వారికేసి పరిగెత్తాడు.

అగ్నిపాలుడు వారిని సమీపించేంతలో, ఓ పాతికేళ్ళ యువకుడు...నీరసించిన దేహం, పొట్ట మీద బిగించి వున్న కట్లతో ఒకడుగు ముందుకు వేసి, "ఇదుగో! ఇతడే నాకు ఆ రోజున కూర్మశైలం దగ్గిర దాహం తీర్చి ప్రాణదానం చేసిన మహానుభావుడు!" అంటూ ఎగిరి గంతేశాడు.

అతడితోపాటు వున్న ఇద్దరు వ్యక్తులూ ఆశ్చర్యంగా అగ్నిపాలుడి కేసి తలలు తిప్పారు. ఆ ఇద్దరూ సుమారు యాభై ఏళ్ళ వయసుగలవాళ్ళు.

అగ్నిపాలుడు మందహాసం చేస్తూ వారిని సమీపించి, "అయ్యా, మీ వాగ్వాదం నేను విన్నాను. విష్ణుమిత్రుడు చెప్పినట్టు నేను కొన్నాళ్ళ కిందట, ఆయనకు ఒకానొక పూరిగుడిసెలో... దాహార్తిగా వుండగా సహాయం చేసిన మాట నిజం! కాని, పొగరుబోతూ, బుద్ధిహీనుడూ అయిన ఒకానొక సేవకుడు చెప్పిన మాటలు నమ్మి... ఈయన మరణించారనుకున్నాను. ఆ తరవాత కొన్ని కారణాల వల్ల - వారి పేరు పెట్టుకుని నేను రాజా ప్రసేనుడి గృహంలో ఆతిథ్యం పొందటం జరిగింది," అన్నాడు.

మణిమంతుడని పిలవబడిన వ్యక్తి, తన చేతగల కత్తిని అనుమానంగా ఒరలో పెడుతూ,

"మీ పేరేమిటి? ఎక్కడి వారు?" అని అగ్నిపాలుణ్ణి గద్దించి అడిగాడు.

అగ్నిపాలుడు జవాబు చెప్పబోయేంతలో, విష్ణుమిత్రుడు ముందుకువచ్చి, "అయ్యా, మీ సహాయానికి చాలా కృతజ్ఞుణ్ణి. ఆనాడు మీరు దాహం తీర్చటం వల్లనే, నేను కడబట్టిన ప్రాణాన్ని నిలుపుకోగలిగి... ఆ తరవాత నా మిత్రుల కంట బడటం ద్వారా, ఇప్పటికి ఈ విధంగా బ్రతికి వుండగలిగాను. తిరిగి యీనాడు కూడా మీరు నాకు ప్రాణదానం చేశారు. తన కుమార్తెకు నేనేదో ద్రోహం చేసి, ప్రసేనుడి కూతురును వివాహం ఆడేందుకు ప్రయత్నించానని, మణిమంతుడు నా మీద కత్తి దూస్తున్నాడు. ఇదేమీ నా కర్థం కావటం లేదు. ఆ ప్రసేనుడి ఇంటి ఛాయలకు కూడా నేనేనాడూ వెళ్ళినది లేదు. సమయానికి వచ్చి, మళ్ళీ నన్ను కాపాడారు," అన్నాడు.

"విష్ణు చెపుతున్నది నిజమేనా? ఇంతకూ మీరెవరైనదీ చెప్పారు కాదు," అన్నాడు మణిమంతుడు కొంచెం కోపంగా.

"విజయరాజుగారు మీరేనా?" అంటూ అగ్నిపాలుడు అక్కడ వున్న మూడవ వ్యక్తికేసి చూశాడు.

"అవును!" అన్నాడతడు.

"అయితే, మిమ్ము క్షమాపణ కోరుతూ, నేను చెప్పవలసిన సంగతొకటి వున్నది. ఈ సమయంలో ఈ గృహానికి కొంచెం దూరంలో వున్న రాజమార్గం మీద నవభోజుడి సైనికులు కొందరున్నారు. కనుక, మనం అన్ని విషయాలు మెల్లగా మాట్లాడుకోవటం మంచిది," అన్నాడు.

నవభోజుడి సైనికుల పేరు వింటూనే విష్ణుమిత్రుడూ, మణిమంతుడూ, విజయరాజు ఉలిక్కిపడి కత్తులను ఒర నుంచి బయటికి లాగారు.

అగ్నిపాలుడు వారిని వారిస్తూ, "మీరు తొందరపడకండి. ఆ సైనికులకు యిక్కడ మణిమంతుడుగానీ, విష్ణుమిత్రుడుగానీ వున్నట్టు తెలియదు. ఎవరో మిత్రుడితో మాట్లాడేందుకు అనుమతి కావాలని చెప్పి, వారి నాయకుడి నుంచి అనుమతి సంపాదించి యిక్కడికి వచ్చాను," అన్నాడు అగ్నిపాలుడు.

ఆ మాటలు ఆ ముగ్గురినీ శాంతపరిచినై. తరవాత అగ్నిపాలుడు తన దగ్గిర వున్న విష్ణుమిత్రుడి పత్రాలను తీసి, అతడికి అందిస్తూ "విష్ణుమిత్రా! ఇవి... ఆనాడు మీరు నా కప్పజెప్పిన పత్రాలు. వీటిని నేనెవరికి అందజేయవలసి వున్నదో – ఆ పేరు చెప్పేలోపలే మీరు శోషతో కన్నుమూశారు. అది చూసిన నా సేవకుడు, మీరు విగతజీవులయ్యారని, నాతో నమ్మబలికాడు. అందువల్ల ఈ పత్రాలు ఈనాటి వరకూ నా దగ్గిర వున్నవి," అన్నాడు.

"విజయా! ఇందులో... విష్ణు ఆడుతున్న కపట నాటకం ఏమీ లేదుగదా? ఇదంతా మనం నమ్మవచ్చునా?" అన్నాడు మణిమంతుడు.







విజయరాజు ఓ క్షణకాలం వూరుకుని, "ఇందులో నమ్మదగనిది ఏమీలేదు మణిమంతా! లలితాంగీ, విష్ణుల ప్రేమ నాకు తెలియంది కాదు. నువ్వే తొందరపడి విష్ణును చాలా దుర్భాషలాడావు. సరే, ఆ విషయం ప్రస్తుతానికి అలా వుంచుదాం..." అంటూ అగ్నిపాలుడికేసి అనుమానంగా కనుబొమలు ముడిచి చూశాడు.

అది గమనించిన అగ్నిపాలుడు, విజయరాజు ముఖంలోకి సూటిగా చూస్తూ, "విజయరాజు గారూ! మీకు, నా మీద ఏదో అపనమ్మకం వున్నట్లుంది, అవునా?" అని అడిగాడు.

"అవును. ఇది ఎవరినీ నమ్మదగిన కాలం కాదు," అన్నాడు విజయరాజు.

"అంటే! కాస్త విపులంగా చెప్పండి," అన్నాడు అగ్నిపాలుడు.

"మీవెంట నవభోజుడి సైనికులున్నారని చెప్పారు. అదీగాక మీరు, ఈ సమయంలో ఇక్కడ మణిమంతుడుంటాడని ఎవరి వల్ల తెలుసుకున్నారు?" అన్నాడు విజయరాజు.

ఆ ప్రశ్నకు అగ్నిపాలుడు నవ్వాడు.

"ఈనాటి ఉదయం పది గంటల వేళ, ప్రసేనుడి గృహంలో మణిమంతుడు ఒక ఉత్తరం యిచ్చిపోయారు. అది నా పేర... అంటే – విష్ణుమిత్రుడి పేరుతో ఆ ఇంట వున్న నా పేర – రాయబడింది కనుక, ప్రసేనుడు దాన్ని నాకు యిచ్చాడు. ఆ ఉత్తరంలో ఏమున్నదో, మణిమంతులే మీకు

చెప్పగలరు".

"అవును, విజయా!... విష్ణుకు యీ రోజు సూర్యాస్తమయం లోపల యిక్కడ నన్ను కలుసుకోమని ఉత్తరం రాసి, దాన్ని ప్రసేనుడికి యిచ్చాను," అన్నాడు మణిమంతుడు.

"ఆ కారణంవల్లనే నేనిక్కడికి రావటం జరిగింది," అన్నాడు అగ్నిపాలుడు.

"అయితే, వెంట నవభోజుడి సైనికులెందుకు? ఆ సంగతి చెప్పారు కాదు," అన్నాడు విజయరాజు.

"ఆ నవభోజుడి సైనికులు, నా వెంట వుండటానికి కారణం – నేను ప్రస్తుతం వారి చేతుల్లో బందీని!" అన్నాడు అగ్నిపాలుడు.

ఆ జవాబు వింటూనే విష్ణుమిత్రుడు నిశ్చేష్టుడయ్యాడు.

"అయ్యా, మీరు ఆ క్రూరుల చేతిలో బందీ ఎలా అయ్యారు? మీ పేరేమిటి?" అన్నాడు ఎంతో ఆదుర్దాపడిపోతూ.

"నన్ను విష్ణుమిత్రుడని భావించే, వాళ్ళు నన్ను పట్టుకోవటం జరిగింది. కనుక, మీరూ నన్ను విష్ణుమిత్రుడనే..... ప్రస్తుతానికి సంబోధించవచ్చు," అన్నాడు అగ్నిపాలుడు.

ఆ జవాబుకు విష్ణుమిత్రుడు తృళ్ళిపడి, "అయ్యా, ఇది అన్యాయం! ఆ నవభోజుడి సైనికులు, నన్ను పట్టుకునేందుకు ఈ ప్రాంతం అంతా గాలిస్తున్నారు. వాళ్ళకు ఏ కారణంవల్లనో, విష్ణుమిత్రుడని చెప్పుకుంటున్న మీరు దొరికారు. మా కాలభోజరాజు పక్షీయులను, మానుకోటలో రోజుకు ఎంతమందిని ఉరి తీస్తున్నారో మీకు తెలియకపోవచ్చు. నా కారణంగా మీరు ఉరి కంబం ఎక్కటానికి ఏ పరిస్థితులలోనూ నేనంగీకరించను. నేనెవరినో తెలియబరుచుకుని, ఆ సైనికులకు బందీనవుతాను. మీరు క్షేమంగా, మీ మార్గాన వెళ్ళండి," అని బయలుదేరాడు.

అగ్నిపాలుడు, విష్ణుమిత్రుడి భుజం పట్టుకుని ఆపుతూ, "విష్ణుమిత్రా! నాకు ప్రాణం మీద ఆశ లేదని భావించకండి! విష్ణుమిత్రుడెవరో తెలియని యీ సైనికులకు నేను బందీగా చిక్కినా, ఏ క్షణాన అయినా సరే, నేను నా నిజనామం తెలియబరుచుకుని, స్వేచ్ఛగా వెళ్ళిపోగలను. కనుక, మీరు తొందరపడి, ప్రాణం మీదికి తెచ్చుకోకండి," అన్నాడు.

"అయ్యా, మీరు చేస్తున్నది చాలా ప్రమాదంతో కూడిన పని. మా విష్ణు కోసం మీరు చిక్కుల్లో తగుల్కుంటారని నాకు భయంగా వున్నది," అన్నాడు మణిమంతుడు.

అగ్నిపాలుడు జవాబు చెప్పబోయేంతలో విజయరాజు, అతడి ముందుకు వచ్చి, "మీ పేరు అంత రహస్యంగా వుంచవలసినదైతే చెప్పకండి. కాని ఒక్కసంగతి – మీరు కూడా కాలభోజుడి పక్షీయులేనా?" అని అడిగాడు.

"ఈ ప్రశ్నకు నేనిచ్చే జవాబు, మీకు ఆశా...ం కలిగించటమేకాక, కోపకారణం కూడా ...చ్చు. కనుక, నేను జవాబు చెప్పను. కాని, ...సందర్భంలో మీకొక సలహా యివ్వదలిచాను. ...నవభోజరాజుపై శత్రుత్వం మాని, రాజభక్తి ...వుండటం మీకూ, చంద్రగిరి రాజ్యాని ...గా క్షేమకారణమవుతుంది," అన్నాడు అగ్ని...డు.

...మాటలకు, ఆ ముగ్గురూ ముఖముఖాలు ...ుకున్నారు. విష్ణుమిత్రుడు భక్తిగౌరవాలు ...డే కళ్ళతో అగ్నిపాలుడికేసి చూస్తూ – "అయ్యా, మీరు నా కింతవరకూ రెండుమార్లు ...దానం చేశారు. ఏ ప్రాణి యింతకన్న ఎక్కువ ...యానికి అర్హుడు కాడు. కనుక, ఆ నవభోజ ...కులకు నన్నే బందీగా దొరకనివ్వండి," ...న్నాడు.

"అవును, విష్ణు చెప్పేదాంట్లో సత్యం లేక ...దు. మీరు సావధానంగా ఆలోచించండి," ...న్నాడు విజయరాజు.

మణిమంతుడు ఏమనేందుకూ తోచక తల ...ుకున్నాడు.

అగ్నిపాలుడు ఆ ముగ్గురికేసీ గౌరవపురస్స...గా చూస్తూ, "నామీద మీరు చూపిన గౌరవాద...కు కృతజ్ఞుణ్ణి. ఇంతకుముందే చెప్పినట్టు, ... ఏ క్షణంలో అయినా, యీ నవభోజ సైని... చేతుల నుండి స్వేచ్ఛగా బయటపడగలను. ...వేళ దైవేచ్ఛ మరొక విధంగా వుండి, నేను విష్ణుమిత్రుడుగానే ఉరితీయబడినా... అందుకు మీ బాధ్యత ఏమీ వుండబోదు. నా స్వార్థం కొద్దీ, నాకు నేనై – ఆ విష్ణుమిత్రుడి నామం పెట్టుకున్నాను. కనుక, అది తెచ్చి పెట్టే ఫలితాలు మంచివైనా చెడ్డవైనా అనుభవించక తీరదు. ఇక సెలవు!" అంటూ తెరచివున్న వీధి ద్వారంకేసి నడిచాడు.

"జయం! జయం! మిమ్ములను ఆ సర్వేశ్వరుడు సదా రక్షించుగాక!" అని ఆ ముగ్గురూ ముక్తకంఠంతో పలికారు.

## - 15 -

హిరణ్యపురంలో వున్న ఒకానొక పెద్ద సత్రంలో, ఆ రాత్రికి విడిది చేయటం మంచిదని ధర్మనందుడు నిర్ణయించాడు. ఆ ఏర్పాటు అగ్నిపాలుడికి చాలా సంతోషం కలిగించింది. తను మానుకోట చేరేలోపల, ఆలోచించుకోవలసిన సంగతులు చాలా వున్నవి. వకుళమాల ఎక్కడికి ప్రయాణమైపోయింది? తనను నవభోజుడి సైనికులు బందీగా చేశారని తెలిసినప్పుడు, తనను గురించి ఆమె జాలిపడుతుందా లేక సంతోషిస్తుందా?

అగ్నిపాలుడు యిలాంటి ఆలోచనలతోనే, ధర్మనందుని వెంట సత్రానికి వెళ్ళాడు. సత్రం బాటసారులతో కిటకిటలాడిపోతున్నది. వారిలో చాలామంది మానుకోటకు ప్రయాణమైపోతూ, దారిలో ఆ రాత్రికి అక్కడ విడిది చేసిన వాళ్ళు.

భోజనాల తరవాత ధర్మనందుడు, అగ్నిపాలుడ్ని

ఒంటరిగా గదిలో వదిలి, విడిది దిగిన వాళ్ళ ద్వారా వార్తలు తెలుసుకునేందుకు వెళ్ళాడు. కొద్దిసేపట్లోనే అతడికి అనేక ముఖ్య వార్తలేగాక, వింత వార్తలూ, కేవలం పుకార్లూ కూడా తెలియ వచ్చినై.

ధర్మనందుడు, అగ్నిపాలుడున్న గదికి తిరిగి వచ్చాడు. అప్పటికింకా కన్నుమూయక, ఆలోచనల్లో మునిగి తేలుతున్న అగ్నిపాలుణ్ణి చూస్తూనే, అతడు దగ్గరకుపోయి, "విశ్వమిత్రా! సత్రం అంతా, చంద్రగిరి నగరం నుంచి వస్తున్నవారితో కిటకిటలాడిపోతున్నది. వారందరి ప్రయాణం ఎక్కడికో తెలుసా?" అన్నాడు చిరునవ్వు నవ్వుతూ.

అగ్నిపాలుడు అతడికేసి ప్రశ్నార్థకంగా చూశాడు. "ఆ వచ్చినవారిలో చాలామంది పని పాటుల్లేని ధనికులు. వాళ్ళల్లో చాలామందికి మానుకోటలో ఉరితీయబడుతున్న రాజద్రోహులెలా వుంటారో చూడాలని వున్నదట! ఒకరి బాధ, మరొకరికి ఆనందం!" అన్నాడు మళ్ళీ ధర్మనందుడు.

"చంద్రగిరి నుంచి వచ్చి యిక్కడ దిగిన వాళ్ళలో రాజోద్యోగులెవరైనా వున్నారా?... బహుశా నన్నెరిగిన వాళ్ళెవరైనా వున్నారేమో అని అడుగుతున్నాను," అన్నాడు అగ్నిపాలుడు ఆశగా.

"రాజోద్యోగులు కూడా కొందరున్నారు. వాళ్లల్లో ముఖ్యుడు అవజ్ఞవర్మ అనే ఆయన," అన్నాడు ధర్మనందుడు.

"అవజ్ఞవర్మా!" అంటూ అగ్నిపాలుడు నిశ్చేష్టుడై, "అతడు మానుకోటకేనా ప్రయాణం?" అని అడిగాడు.

"అవును. అతణ్ణి నవభోజ రాజుగారు స్వయంగా - తన ప్రతినిధిగా వ్యవహరించేందుకు మానుకోట పంపుతున్నారట! అక్కడ కాలభోజుడి పక్షీయుల్లోని ముఖ్యులు చాలామంది న్యాయస్థానంలో విచారించబడుతున్నారని మీకు తెలుసుగదా?" అంటూ ధర్మనందుడు, అగ్నిపాలుడికేసి జాలిగా చూస్తూ, "మీరు దురదృష్టవంతులు. మీవంటి ఉత్తముల్ని బందీగా పట్టుకోవలసిరావటం, నా దురదృష్టం! మీరు కాలభోజుడి పక్షంవారయినా, నా మిత్రుడైన జయసింగ్‌కు మిత్రులు కావటం ద్వారా... ఒక రకంగా నాకూ మిత్రసమానులే!"అన్నాడు.

అగ్నిపాలుడు ఈ మాటలేవీ వినటంలేదు. అతడు అవజ్ఞవర్మను గురించి ఆలోచిస్తున్నాడు. నవభోజుడి దృష్టిలో, ఈ పనికిమాలిన అవజ్ఞవర్మ హఠాత్తుగా అంత గొప్ప విలువ - మానుకోటలో ఆయన ప్రతినిధిగా వ్యవహరించేంత విలువ - ఎలా సంపాదించుకోగలిగాడు? తను చంద్రగిరి నగరం వదిలిన తరవాత, అక్కడ జరిగిన విశేషాలేమీ తనకు తెలియవుగదా!

"ధర్మనందా, ఒక్కమాట!" అంటూ అగ్నిపాలుడు, ధర్మనందుణ్ణి దగ్గరకు రమ్మన్నట్టు సౌంజ్ఞ





..., అతడు రాగానే గొంతు తగ్గించి, "ఈ ...జ్ఞవర్మను నేనెరుగుదును. కాని, అతడికన్న ...ను బాగా ఎరిగిన రాజాశ్రితులు మరొకరిద్దరు ...రు. అగ్నిపాలుడనే వ్యక్తిని గురించి ఎవరైనా ...ట్లాడుకోవటం విన్నావా?" అని అడిగాడు.

"అగ్నిపాలుణ్ణి గురించి యివ్వాళ వినటమేం, ...గడే విన్నాను. అతడు నవభోజ రాజు సలహా ...ల్లో ముఖ్యుడు గదా! అతడు మరణించినట్టు ...రు వినలేదా?" అని ధర్మనందుడు ఆశ్చర్యంగా ...శ్నించి, "అతడు ఈ ప్రాంతాలే ఎక్కడో మర...చి, రెండు మూడు వారాలు కావస్తున్నది. ...తడు చంద్రగిరి నగరం నుంచి ఏదో పనిమీద ...టు వస్తూ, ఎవరికీ కనబడకుండా మాయమ...డు. కొందరు చెప్పటం, అతడు ఏ నదిలోనో ...నిగిపోయి వుంటాడని - అతడి గుర్రం దొరి...ది. అతడి సేవకులు దాన్ని గుర్తించారు," ...న్నాడు.

"సరే, ఆ విషయం గురించి ప్రస్తుతం ఎవరైనా ...ట్లాడుకుంటున్నారా? బహుశా, వారిలో ...రు అతడి శవాన్ని చూసి వుండవచ్చు," ...న్నాడు అగ్నిపాలుడు మందహాసం చేస్తూ.

"అతడు మరణించినట్టు మాత్రం చెప్పుకుం...న్నారు - అంతేగాని, శవాన్ని చూసినట్టు ...రూ చెప్పుకోగా వినలేదు," అన్నాడు ధర్మనం...డు అగ్నిపాలుడి కుతూహలం చూసి ఆశ్చర్య...స్తూ.

"ధర్మనందా! నువ్వు మొదటినుంచీ నేనంటే ఎంతో గౌరవం చూపుతున్నావు. ఆ రుణం ఇప్పట్లో తీర్చుకోలేను. బందీ అయిన వారెవరికీ యివ్వని సౌకర్యాలూ, స్వేచ్ఛా నా కిచ్చావు. మరోలా భావించకపోతే... ఇప్పుడు నాకొక సహాయం చేయాలి," అన్నాడు అగ్నిపాలుడు.

"ఏమిటది? చెప్పండి," అన్నాడు ధర్మనందుడు.

"ఈ అవజ్ఞవర్మ, రాజప్రతినిధిగా మానుకోట వెళుతున్నట్లు చెప్పావు గదా, అతడితో నేను మాట్లాడాలనుకుంటున్నాను. నిజం దాయటమెందుకు, అతడు నన్ను బాగా ఎరుగును," అన్నాడు అగ్నిపాలుడు.

ధర్మనందుడు సంశయిస్తూ, ఓ క్షణకాలం ఆగి, "బందీగా వున్న మిమ్ములను యితర్ల దగ్గర స్వేచ్ఛగా తిరగనివ్వటం వేరూ... అదే, రాజప్రతినిధి దగ్గర అనుమతించటం వేరూ గదా? వారి దృష్టిలో రాజద్రోహి అయిన మీకు... లేనిపోని సహాయం చేస్తున్నానని ఈ రాజప్రతినిధి భావిస్తే ..." అంటూ, ఆ పైన మాట పెగలక తడబడ్డాడు.

ధర్మనందుడి సంకట పరిస్థితి అర్థంచేసుకున్న అగ్నిపాలుడు, ఎంతో కృతజ్ఞత కనబరుస్తూ, "ధర్మనందా! నన్ను ఒంటరిగా, ఆ రాజప్రతినిధి అవజ్ఞవర్మ దగ్గరకు వెళ్ళనియ్యనవసరం లేదు. నేను బంధితుడననే అతడు గుర్తించే విధంగా మీరూ, మరిద్దరు సైనికులూ నా వెంట కాపలా వుండండి.

నేను కోరేదల్లా... అతణ్ణి, కనీసం అంతదూరాన్నుంచయినా చూడగలగటం. బహుశా, అతడే ముందు నన్ను గుర్తించి, పలకరించవచ్చు. అప్పుడు మీరు పొందబోయే ఆశ్చర్యం అంతా యింతా కాదు!" అన్నాడు.

"ఇప్పుడాయన పానీయాలు తీసుకునే శాలలో వున్నాడు. అక్కడికే వెళదామంటారా?" అని అడిగాడు ధర్మనందుడు.

"అవును. ఈ సత్రంలో వున్న ఎవరైనా డబ్బు చెల్లించగలిగితే, ఆ శాలలో ప్రవేశించి, పానీయాలు సేవించవచ్చు గదా?...... ఇక, నేనా! మామూలు బంధితుణ్ణి కాదు – కూర్మశైలం దగ్గర, గొప్ప సైనిక విభాగానికి నాయకత్వం వహించిన సేనానిని!" అన్నాడు అగ్నిపాలుడు తాపీగా.

"ఇక లేవండి, వెళదాం. నేను హనుమప్ప సేనాని ఆజ్ఞ ప్రకారం మిమ్ములను బందీగా పట్టుకున్నాను. కాని, ఈ అవజ్ఞవర్మగారి వల్ల కాదు," అంటూ ధర్మనందుడు లేచి నిలబడ్డాడు.

ముందు ధర్మనందుడూ, వెనుక యిద్దరు సైనికులూ, మధ్య తనూ – ఈ విధంగా అగ్నిపాలుడు పానశాల ప్రవేశించేసరికి, అందరి దృష్టి ఒక్కసారిగా వారి మీదికి ప్రసరించింది. అగ్నిపాలుడు శాలలోని అన్ని వైపులకూ తల తిప్పుతూ, అవజ్ఞవర్మ కోసం పరీక్షగా చూడసాగాడు.

అవజ్ఞవర్మ మరి ఇద్దరితో కలిసి, ఒక బల్ల ముందు కూర్చుని పానీయాలు సేవిస్తున్నాడు.

ముందుగా అతడి పక్కన వున్నవారి దృష్టి అగ్నిపాలుడి మీద పడింది. వాళ్ళు కొద్దిగా ఆశ్చర్యపోయి, పాన పాత్రలను చప్పున బల్లమీద పెడుతూ, "ఎవరూ? దుస్తులను బట్టి చూస్తే... చాలా ముఖ్యమైన రాజద్రోహిలా వున్నాడే! కాలభోజుడి ముఖ్యానుచరుడు కాదు గదా?" అన్నారు స్వగతంలా.

అవజ్ఞవర్మ చటుక్కున తలతిప్పి, అగ్నిపాలుడికేసి చూశాడు. ఒక్క లిప్తకాలంలో అతడి ముఖంలో ఆశ్చర్యం, ఆందోళనా మిళితమై, అంతలోనే కరుడు కట్టిన క్రోధంలా మారిపోయింది. అతడి పెదాలు బిగుసుకున్నవి. ముక్కుపుటాలు అదిరినై. అతడు దృష్టిని అగ్నిపాలుడి మీద నుంచి ముందు నడుస్తున్న ధర్మనందుడి మీదికి తిప్పి, తరవాత వెనక వస్తున్న సైనికులకేసి పరీక్షగా చూశాడు. ఆ వెంటనే అతడి పెదాల మీద చిరునవ్వు తళుక్కున మెరిసింది. నేత్రాలు కొత్త కాంతితో మిలమిలలాడినై.

అగ్నిపాలుడు, అవజ్ఞవర్మ ముఖభంగిమల్ని చూసి గతుక్కుమన్నాడు. ఆ చూపుల్లో అతడు తనను గుర్తించిన జాడలేమీ లేవు. 'అతిగా పానీయం సేవించడంవల్ల, అతడి నేత్రాలు మసకబారలేదు గదా?' అనుకున్నాడతడు.

అగ్నిపాలుడు ఒక తృటికాలం నిశ్చేష్టుడై, ఏమి చేయటానికీ తోచక, మరుక్షణం సావధానుడై అవజ్ఞవర్మకేసి చిరునవ్వుతో నడుస్తూ, "వర్మా! ఇప్పుడే నీ ఉన్నతోద్యోగం గురించి విన్నాను, అభినందనలు!" అన్నాడు.

అవజ్ఞవర్మ తోక తొక్కిన తాచులా లేచి నిలబడ్డాడు. అతడి కళ్లు నిప్పులు చెరిగినై.

"ఎవడీతడు?" అంటూ అగ్నిపాలుడి పక్కన నడుస్తున్న ధర్మనందుడి కేసి ప్రశ్నార్థకంగా చూశాడు.

ధర్మనందుడు వున్నచోటనే ఆగిపోయి, ఆశ్చర్యంగా, కొంచెం భయంగా అగ్నిపాలుడి ముఖంలోకి చూసి, అవజ్ఞవర్మకు జవాబివ్వబోయేంతలో, అగ్నిపాలుడు కోపంగా చేయి వూపి, "వర్మా, యిది హాస్యమా? లేక నేనెవరినో గుర్తించలేనంత పానీయ మత్తుడుగా వున్నావా?" అని అడిగాడు.

"ఎవడీ ఉన్మాది? నేనింతసేపటి నుంచీ రాజద్రోహి అని మాత్రమే అనుకుంటున్నాను!" అన్నాడు అవజ్ఞవర్మ ఎంతో ఈసడింపుగా.

"అయ్యా, ఈయన విష్ణుమిత్రుడనే కాలభోజుడి పక్షీయుడు. మహాసేనాని హనుమప్ప నాయకుడి ఆజ్ఞ మేరకు, ఈ ఉదయమే బందీగా పట్టుకుని, మానుకోటకు తీసుకుపోతున్నాను. నా పేరు ధర్మనందుడు," అన్నాడు ధర్మనందుడు.

"అయితే, ఈ రాజద్రోహికి, రాజభక్తులుండే పానశాలలో పనేమిటి? వెంటనే..."

"అవజ్ఞా! ఇక చాలు. ఆ దురుసు మాటలు ఇంతటితో కట్టిపెట్టు!" అంటూ అగ్నిపాలుడు భీకరంగా గర్జించి, "నువ్వేదో నన్ను హతమార్చేందుకు కుతంత్రం పన్నినట్టుంది కాని, అది కొనసాగే అవకాశం లేదు. నా శక్తి సామర్థ్యాలు నీకు తెలియనివి కాదుకదా? ముందే హెచ్చరిస్తున్నాను," అన్నాడు.

"వీడెవడో రాటుతేలిన పిచ్చివాడిలా కనిపిస్తున్నాడు!" అంటూ అవజ్ఞవర్మ తన మిత్రులకేసి చూసి, తరవాత చిరునవ్వుతో "ఉన్మాదీ! నీ పేరైనా నీకు గుర్తున్నదో లేదో నాకు తెలియటం లేదు. ఏమిటా పేరు... విష్ణుమిత్రుడా? చాలా మంచి పేరు!" అంటూ బిగ్గరగా నవ్వి, "నువ్వెవరివో నీకు తెలియకపోయినా, కనీసం నేనెవరైనదీ తెలిసినట్టున్నది. చాలా సంతోషం!" అంటూ ఆగి, ధర్మనందుడి కేసి గుడ్లురుముతూ, "ధర్మనందా! నీకు సైనిక మర్యాదలు గాని, రాజమర్యాదలు గాని తెలిసినట్టులేదు. ఇటువంటి రాజద్రోహిని స్వేచ్ఛగా నేనున్న ప్రదేశానికి తీసుకురావటం..." అని యింకేమో అనబోయాడు.

అగ్నిపాలుడు యిక సహించలేకపోయాడు. మహోద్రేకంతో అతడు ఒక్కుదుటున ముందుకుపోయి, కనుమూసి తెరిచేంతలో అవజ్ఞవర్మ కంఠాన్ని తన గుప్పెటలో పట్టుకుని, "ఛీ, దుర్మార్గుడా!" అంటూ గట్టిగా వెనక్కు నెట్టాడు.

అవజ్ఞవర్మ వేళ్ళూడిన మానులా దభీమంటూ వెనక్కు పడిపోయాడు. అదే సమయంలో, ఈ హఠాత్ సంఘటన కలిగించిన ఆశ్చర్యాన్నుంచి తెప్పరిల్లిన అతడి మిత్రులిద్దరూ అగ్నిపాలుడి మీద

కలియబడ్డారు.

ఇది సమ ఉజ్జీల మధ్య జరిగే పోరు కాదని గ్రహించిన ధర్మనందుడు, తన సైనికులను హెచ్చరించి, ఒక్క దూకున అవజ్ఞవర్మ మిత్రుల నుంచి అగ్నిపాలుణ్ణి విడిపిస్తూ, "అయ్యా, యిక ఆగండి! ఒక వ్యక్తిమీద ఇద్దరు కలియబడటం ధర్మం అనిపించుకోదు," అన్నాడు కోపంగా.

ఆసరికి అవజ్ఞవర్మ లేచి నిలబడ్డాడు. అతడి కళ్ళు నిప్పు కణాల్లా కణకణమంటున్నవి. అతడు మునిపళ్ళతో గట్టిగా ఓమారు పెదాలు కొరుక్కుని, "ధర్మనందా! ఈ రాజద్రోహిని విచ్చలవిడిగా వదలటంలో నీ ఉద్దేశ్యమేమిటో తెలియటంలేదు. నీవెవరి సేవకుడవు?" అన్నాడు.

ఆ పదజాలం ధర్మనందుణ్ణి రెచ్చగొట్టింది.

"నేను, నవభోజ మహారాజుగారి సేవకుణ్ణని నా సైనిక దుస్తులు చూచిన ఎవరైనా తెలుసుకోగలరు! ఈ ప్రశ్న వేస్తున్న మీరు, ఎవరి సేవకులు?" అని అడిగాడతను.

"ఈ అవజ్ఞుడు డబ్బుకూ, అధర్మానికీ, దురహంకారానికీ సేవకుడు," అంటూ అగ్నిపాలుడు హూంకరించి, "అవజ్ఞా! నీవిప్పుడు నాకు చేసిన అవమానానికి ఒకానొక రోజున చింతిస్తావు! ఆ రోజు కూడా ఎంతో దూరంలో లేదు," అంటూ గిరుక్కున వెనుదిరిగాడు.

అతడితో పాటే ధర్మనందుడూ, సైనికులూ బయలుదేరారు.

వారు పానశాల ద్వారం దాటి బయటికి వెళుతూండగా, వెనక నుంచి అవజ్ఞవర్మ పెద్ద గొంతుతో, ఏవేవో ఆజ్ఞలు జారీ చేస్తూండటం వారికి వినిపించింది.

- 16 -

అగ్నిపాలుడూ, ధర్మనందుడూ సత్రంలో తాము బసచేసిన గదికి చేరారు. వారిద్దరూ అక్కడికి వెళ్ళేవరకూ, సత్రంలో వున్న అందరి దృష్టీ వాళ్ళమీదే వున్నది.

గదిని చేరింతరవాత అగ్నిపాలుడే సంభాషణ ప్రారంభించాడు.

"ధర్మనందా! నా కోసం మీరు కూడా, ఆ అవజ్ఞవర్మతో ఘర్షణ పడ్డారు. ప్రస్తుతానికి అతడిదే పైచేయిగా వున్నది. మీరు మాత్రం మానుకోట చేరేవరకూ, తగు జాగ్రత్తలో వుండండి. ఆ తరువాత, అతడి అంతు నేను తేల్చితీరతాను," అన్నాడతడు.

అగ్నిపాలుడి మాటలు, ధర్మనందుడికి చాలా ఆశ్చర్యం కలిగించినై.

"విష్ణుమిత్రా! మీ మాటలు నాకు అంతుబట్టటం లేదు. ఆ అవజ్ఞవర్మతో మీరు సంభాషించిన తీరు, నాకేమీ అర్థం కాలేదు. మీ మాటలను బట్టి నేనూహిస్తున్నదేమిటంటే - మీరు నిజంగా విష్ణుమిత్రులై వుండరని, అవునా?" అన్నాడు ధర్మనందుడు.

అగ్నిపాలుడు యిక చేసేదేమీలేక, అవునన్నట్టు







తల ఊపాడు.

"అయితే, మీరెవరు? మీ పేరేమిటి?" అని ప్రశ్నించాడు ధర్మనందుడు.

అగ్నిపాలుడు వెంటనే ప్రత్యుత్తరం యివ్వలేదు. ఇప్పటి సంకట పరిస్థితులలో, తానెవరైనదీ నలుగురికీ చెప్పుకోవలసిన అవసరం ఏర్పడినట్టు అతడు గ్రహించాడు. అవజ్ఞవర్మ ధోరణిని బట్టి తెలుస్తున్నదేమిటంటే, అతడు తనను విష్ణు

మిత్రుడనే రాజద్రోహిగా ప్రకటించి, ఉరి తీయించాలని! అగ్నిపాలుడికి పందెం నాటి రాత్రీ, దానికి సంబంధించిన నియమ నిబంధనలతో రాసిన పత్రాలూ - వాటిని పరస్పరం మార్పిడి చేసుకోవటం - అంతా గుర్తుకొచ్చింది. తను వకుళమాలను భార్యగా పొందలేకపోయినా, ఒకవేళ ఆ ప్రయత్నంలో మరణించినా, తన ఆస్థిపాస్తులు అవజ్ఞవర్మకు సంక్రమిస్తవి! కనుక, అవజ్ఞవర్మ తనను ఏ విధంగా అయినా సరే నాశనం చేయ చూస్తున్నాడు. తను అతడి పన్నుగడ నుంచి బయటపడాలంటే, తను అగ్నిపాలుణ్ణని చెప్పుకున్నంత మాత్రాన సరిపోదు - దాన్ని ధృవపరిచే సాక్ష్యం కూడా కావాలి.

ఆ క్షణాన అతడికి తన నౌకరు మాహూ గుర్తుకొచ్చాడు. బహుశా వాడు ఈ ప్రాంతాలలోనే ఎక్కడో తన కోసం వెతుకుతూండి వుంటాడు. అతడి విశ్వాసం గురించి అగ్నిపాలుడికేనాడూ అపనమ్మకం లేదు. అదృష్టం కలిసి వస్తే, తను మానుకోట చేరేలోపలగాని, తన విచారణ ప్రారంభమయ్యే సమయానిగ్గాని అతణ్ణి కలుసుకోవాలి. అలా జరిగితే, వాడు తనను గురించి సాక్ష్యం చెప్పగలడు. అలా కాని నాడు, రాజప్రతినిధిగా అవజ్ఞవర్మ, తనకు ఉరిశిక్షపడేలా న్యాయాధిపతుల ద్వారా ప్రయత్నించి తీరతాడు!

"ధర్మనందా! ఇప్పుడు నా ఊరుపేరుల గురించి నీకు చెప్పవలసిన సమయం వచ్చింది. ఎందుకంటే, యిప్పటి పరిస్థితులలో అవజ్ఞవర్మ కుట్ర నుంచి నేను బతికి బయటపడాలంటే, నాకు నీ సహాయం అవసరం అవుతుంది," అన్నాడు అగ్నిపాలుడు.

ధర్మనందుడు ఆశ్చర్యంగా అగ్నిపాలుడికేసి చూశాడు.

"నా పేరు అగ్నిపాలుడు! అగ్నిపాల సంస్థానాధిపతిని! ఆ పేరు ఎప్పుడైనా నీవు విని వున్నావా?" అని అడిగాడు అగ్నిపాలుడు.

అగ్నిపాలుడన్న పేరు వింటూనే ధర్మనందుడు నిశ్చేష్టుడయాడు. ఇది నిజమా అన్నట్టు అతడు, అగ్నిపాలుడి ముఖంలోకి గుచ్చి చూస్తూ, "మీరు నాతో హాస్యం ఆడటంలేదుగదా? అగ్నిపాలుణ్ణి గురించి, ఈ రాజ్యంలో తెలియని వారెవరు? ఆయన నవభోజరాజు ముఖ్యమిత్రుల్లో ఒకరని మాత్రమేగాక, జగ్గరాజు వంటి ఖడ్గప్రావీణ్యుణ్ణి ద్వంద్వ యుద్ధంలో హతమార్చిన వీరుడని కూడా అందరికీ తెలుసు," అన్నాడు.

"అయితే, ఆ అగ్నిపాలుణ్ణి నేనే!" అన్నాడు అగ్నిపాలుడు చిరునవ్వుతో.

ధర్మనందుడు ఏమీ అనలేక, అలా చూస్తూ వూరుకున్నాడు. అతడేదో సంశయంలో పడ్డాడని గ్రహించిన అగ్నిపాలుడు, "ధర్మనందా, నీవు నన్ను అగ్నిపాలుడని నమ్మి బంధవిముక్తుణ్ణి చేయనవసరం లేదు. అది ఒక విధంగా నీ గొంతు మీదికి తెచ్చుకోవటమే అవుతుంది. ఎందుకంటే,







వు నన్ను బంధించవచ్చినప్పుడు, నేను విష్ణు త్రుడుగానే నీకు దొరికాను. తరవాత ఈ త్రంలో కూడా అందరూ నన్ను విష్ణుమిత్రుడు నే భావిస్తున్నారు. కనుక తగిన సాక్ష్యాధారాలతో న్యాయాధిపతుల సమక్షాన, నేను అగ్నిపాలుణ్ణని ుజువు పరచుకునేవరకూ, నీవు నన్ను రాజ ద్రోహిగానే భావించవలసి వుంటుంది. కాని, యీ ధ్యకాలంలో, కావాలనుకుంటే నీవు నాకు ంత సాయంచేయగలవు. అది ఏ విధంగానూ కు కష్టకారణం కాదు," అన్నాడు.

"సరే, చెప్పండి. ఏమిటా సహాయం?" అని అడిగాడు ధర్మనందుడు.

"బహుశా, చంద్రగిరి రాజ్యంలో నా పేరు చాలామందికి తెలుసునేమో కాని, వ్యక్తిగతంగా నన్నెరిగినవారు బహు కొద్ది. ఆ మానుకోటలో నన్నెరిగినవాళ్లొక్కరూ వుండరని నా భయం. అదీకాక అలాంటి వాళ్లెవరైనా వుంటే... ఈ అవజ్ఞవర్మ ప్రస్తుతం తనకున్న అధికారంతో వాళ్ళ నోళ్ళు మూయగలడు. అందువల్ల, నేను అగ్నిపాలుణ్ణని రుజువుచేసేందుకు యిప్పట్లో నాకు సహాయపడగలవాళ్ళు నా సేవకులు మాత్రమే. వాళ్ళు నా కోసం, ఈ ప్రాంతాలే ఎక్కడో తిరుగుతూ వుంటారు. నీ వెంటవున్న సైనికులలో ఒకరిద్దరిని వెతక పంపితే, మాహూ అన్న నా ప్రధాన సేవకుడూ, యితర్లూ కనిపించకపోరు. వాళ్ళు నన్ను గుర్తించి, అవజ్ఞవర్మ కబంధహస్తాల నుంచి నన్ను

రక్షించగలరు," అన్నాడు అగ్నిపాలుడు.

"విష్ణుమిత్రా... అగ్నిపాలా! ఇందుకు నేను తప్పక సహాయపడతాను. ఇప్పుడే యిద్దరు సైనికులను, ఆ పనిమీద పంపుతాను," అన్నాడు ధర్మనందుడు.

"చాలా కృతజ్ఞుణ్ణి!" అన్నాడు అగ్నిపాలుడు.

"అసలు మీరీ విషవలయంలో ఎలా చిక్కుకున్నారో నాకు అనూహ్యంగా వుంది," అంటూ ఆశ్చర్యం ప్రకటించాడు ధర్మనందుడు.

అగ్నిపాలుడు నీరసంగా నవ్వాడు.

"ధర్మనందా! నీవన్నట్టు, నేను చాలా పెద్ద విషవలయంలోనే చిక్కుకున్నాను. దీనికి చాలా వరకు నేనే బాధ్యుణ్ణి. అవజ్ఞవర్మ వంటి తుచ్ఛుడూ, మూఢుడూ కూడా నా మీద విజయం సాధించినట్టు ప్రవర్తిస్తున్నాడంటే – నామీద నాకే జాలి కలుగుతున్నది. కాని ఒకటి రెండు రోజుల్లో, ఈ వలయం నుంచి నేను బయటపడతాను. అప్పుడు, ఈ అవజ్ఞవర్మ పడబోయేపాట్లు యిన్నీ అన్నీ కావు," అన్నాడు అగ్నిపాలుడు ఉద్రేకంగా.

"మానుకోటలో, కాలభోజుడి పక్షీయులని చెప్పబడే వారి గురించి జరిగే న్యాయవిచారణ అంతా కేవలం తంతు! గంటకు పదీ పన్నెండు మంది విచారించబడటం, శిక్షలు విధింపబడటం – నేను స్వయంగా చూశాను. అదృష్టం కలిసి రాకపోతే, మీ గురించిన న్యాయవిచారణా గంటల మీద తేలిపోతుంది!" అంటూ ధర్మనందుడు ఆగి, కొంచెంసేపు తల వంచుకు పూరుకుని, "మీ సేవకుడని చెప్పారే... ఆ మాహూ వెంటనే మన కంటబడితే, ఎంత బావుండును!" అన్నాడు.

'అవును. ఇప్పట్లో నన్ను రక్షించగలిగినవాడు మాహూ ఒక్కడే!' అనుకుంటూ అగ్నిపాలుడు పెద్దగా నిట్టూర్చాడు

## - 17 -

మర్నాడు మిట్టమధ్యాహ్నం వేళకు అగ్నిపాలుడు మానుకోట చేరాడు. అక్కడ పట్టణ పరిపాలనాధికారి ఆజ్ఞ ప్రకారం అగ్నిపాలుణ్ణి, ధర్మనందుడు కారాగారాధిపతికి అప్పచెప్పాడు.

అగ్నిపాలుణ్ణి, కారాగారాధిపతికి అప్పచెప్పే ముందు ధర్మనందుడు అతడికి ధైర్యం కలిగించే కొన్ని వార్తలు చెప్పాడు. అందులో ముఖ్యమైనది – నవభోజ మహారాజు మానుకోటకు బయలుదేరి వస్తున్న సంగతి. ఆయన తన ప్రబలశత్రువైన కాలభోజుణ్ణి స్వయంగా విచారించి శిక్షించాలని, చంద్రగిరి నగరం నుంచి బయలుదేరాడు – ఏ నిమిషంలోనైనా మానుకోట చేరవచ్చు.

రెండవ వార్త – మాహూను గురించి. అతడు రెండు రోజుల క్రితం వరకూ మానుకోటలోనే ఉండి, తన యజమాని కోసం వారినీ వీరినీ విచారిస్తున్నాడు. ప్రస్తుతం అతడు మానుకోటలో లేకపోయినా, నగరం నుంచి ఎంతో దూరం వెళ్ళి వుండడు. అతణ్ణి వెతికి పట్టుకుని మానుకోటకు తీసుకువచ్చేందుకు ధర్మనందుడు ఆరుగురు







నికులను నియోగించాడు.

ఈ సమాచారం అగ్నిపాలుడికి చాలా ఉత్సా
ం కలిగించింది. మాహూ సమయానికి దొరి
ా దొరకకపోయినా, నవభోజ రాజు నగరానికి
స్తున్నాడు గనక, చూస్తూ చూస్తూ తనను ఉరి
యించేంత సాహసానికి అవజ్ఞవర్మ ఒడిగట్టడని
గ్నిపాలుడు భావించాడు. అయినా, తను తగు
గ్రత్తలో ఉండటం మంచిది. అందుకని అగ్ని
ాలుడు, ధర్మనందుణ్ణి ఒక సహాయం కోరాడు.

"నవభోజ రాజు రాజధానీ నగరం నుంచి
యలుదేరి రావటం అంటే, వెంట తన మిత్రు
లో ఎవరో ఒకరు తప్పక ఉంటారు. ఓబల
ాజు, ధర్మపాణి, జయసింగ్ – వీరిలో ఎవరో ఒకరు ఆయన వెంట ఉండక తప్పదు –

నీవు వీలుచూసుకుని మహారాజును మార్గమధ్యంలోనే కలుసుకుని, యీ నా స్నేహితులలో ఎవరు వెంటవున్నా – నా ప్రస్తుత పరిస్థితి గురించి వారికి చెప్పు. తతిమా విషయాలన్నీ వారే చూసుకుంటారు," అన్నాడు అగ్నిపాలుడు.

ధర్మనందుడు దీనికి చాలా సంతోషంగా అంగీకరించాడు. ఆ సరికి, యీ విష్ణుమిత్రుడనబడే వ్యక్తి, నిజంగా అగ్నిపాలుడే అని అతడికి నమ్మకం కుదిరిపోయింది.

"మీ విచారణ యీ సాయంకాలం అయిదు గంటల ప్రాంతాల జరగవచ్చు. మిమ్మల్ని బంధించి తెచ్చిన నేను, తప్పక సాక్షిగా పిలవబడ

తాను. మిమ్మల్ని న్యాయస్థానానికి తీసుకువెళ్ళటం నుంచి... చివరకు న్యాయాధిపతుల నిర్ణయం ఏదయినా, అది అమలు జరిగేవరకూ, మీ రక్షణ బాధ్యత నాదే! కనుక, నా సాక్ష్యం పని పూర్తయిన తరవాత, బయలుదేరి వెళతాను. మహారాజు వెంట అదృష్టం కొందికీ, నా మిత్రుడు జయసింగ్ ఉంటే - ఇక చెప్పవలసిందేమిటి!" అన్నాడు ధర్మనందుడు.

అతడు ఊహించినట్టే సరిగా అయిదు గంటల వేళ, అగ్నిపాలుడు న్యాయాధిపతుల ముందు నిలబెట్టబడ్డాడు. న్యాయాధిపతులు ముగ్గురు. వారికి వెనకగా ఉన్న ఒక ఉన్నతాసనం మీద అవజ్ఞవర్మ కూర్చుని ఉన్నాడు. అగ్నిపాలుడు న్యాయస్థానంలో ప్రవేశించటం అతడు చూసి కూడా, చూడనట్టే నటించాడు.

విచారణ ప్రారంభమైంది. న్యాయమూర్తుల అనుమతి కాగానే ఒక న్యాయస్థానోద్యోగి కొన్ని పత్రాలు చేతికి తీసుకుని చకచక చదువుకు పోతున్నాడు. వాటి సారాంశం యిది :

విష్ణుమిత్రుడనే క్షత్రియుడు నవభోజ రాజుకు వ్యతిరేకంగా కత్తి కట్టాడు. అతడు కాలభోజు డనబడే ఒకానొక ప్రబల రాజద్రోహికి అండగా ఉంటూ కూర్మశైలం దగ్గర, హనుమప్ప నాయకుడి ఆధ్వర్యాన ఉన్న నవభోజరాజు సేనలతో యుద్ధానికి తలపడ్డాడు. ఆ యుద్ధంలో అతడికి ప్రమాదకరమైన గాయాలు తగిలినై. అయినా అతడు యుద్ధరంగాన్నుంచి తప్పించుకు పారిపోయి, మల్లూరు సంస్థానాధీశుడైన ప్రసేనుడి ఇంట అతిథిగా ఉంటున్నాడు. కొన్ని రోజులు గడిచిన తరువాత, ఈ విష్ణుమిత్రుడనే రాజద్రోహి అక్కడ ఉంటున్నట్టు, వేగులకు వర్తమానం తెలిసింది.

విచారించగా, ఆ ప్రసేనుడికి, విష్ణుమిత్రుడి గురించి ఏమీ తెలియదనీ, కేవలం ధర్మబుద్ధితో మాత్రమే అతడికి ఆశ్రయం యిచ్చాడనీ బయట పడింది. ఆ వెంటనే అతణ్ణి బంధించటానికి ఆజ్ఞ కాగా, ధర్మనందుడనే సైనిక నాయకుడు, అతణ్ణి ప్రసేనుడి ఇంట పట్టుకుని, మానుకోటకు తరలించుకు వచ్చాడు.

"నీ మీద ఉన్న అభియోగం ఏమిటో విన్నావు గదా? నీవు చెప్పదలచుకున్న దేమిటో చెప్పుకోవచ్చు!" అన్నాడు ఒక న్యాయమూర్తి.

"అయ్యా, ఈ అభియోగం విష్ణుమిత్రుడికి సంబంధించినదవటం వల్ల అందులోని నిజానిజాలు నాకు తెలియవు," అన్నాడు అగ్నిపాలుడు.

న్యాయమూర్తులు ముగ్గురూ ఆశ్చర్యచకితులయ్యారు. అది గమనించి, "నేను విష్ణుమిత్రుణ్ణి కాను!" అన్నాడు అగ్నిపాలుడు.

ఈసారి న్యాయమూర్తులు ముఖముఖాలు చూసుకున్నారు. వారి పెదాల మీద చిరునవ్వు తళుక్కుమన్నది.

"నీవు విష్ణుమిత్రుడివి కాక, మరెవరివి?" అన్నాడొక న్యాయమూర్తి అపహాస్యంగా!







"నేను అగ్నిపాలుణ్ణి! ఆ పేరే గల సంస్థానాధిపతిని. నవభోజ రాజుల ఆస్థానంలో చాలా కాలంగా ఉంటున్నాను," అన్నాడు అగ్నిపాలుడు.

న్యాయమూర్తులు ముగ్గురూ, అవజ్ఞవర్మ కేసి తలలు తిప్పారు.

అతడు ఆసనంలోంచి కొంచెం ముందుకు వంగి, నవ్వుతూ ఏదో చెప్పాడు.

"నీవు అగ్నిపాలుడవని గుర్తించేందుకు ఉపకరించే సాక్ష్యం ఏమైనా ఉన్నదా? నవభోజ రాజాస్థానం వారైన అవజ్ఞవర్మ ఇక్కడే ఉన్నారు. వారెవరో గుర్తించి చెప్పగలవా?" అన్నాడొక న్యాయమూర్తి.

అగ్నిపాలుడు చూపుడు వేలిని అవజ్ఞవర్మ కేసి ఎత్తి, "ఆయనే అవజ్ఞవర్మ. ఆయన నన్ను బాగా ఎరుగును. నేను అగ్నిపాలుణ్ణి అవునో కాదో, తమరే ప్రశ్నించి చూడండి," అన్నాడు.

ఒక న్యాయమూర్తి పక్కకు తిరిగి, అవజ్ఞవర్మను ఏదో ప్రశ్నించాడు.

ఆ వెంటనే అవజ్ఞవర్మ ముఖం కందగడ్డలా చేసుకునిలబడుతూ, "ఈ అహంకారి, లేక ఉన్మాదేమో... తను అగ్నిపాలుణ్ణిని చెప్పుకోవడం, మొత్తం ఈ న్యాయస్థానాన్నే అవమానించటమూ, ధిక్కరించటమూ అని భావిస్తున్నాను. లోగడ తను విష్ణుమిత్రుణ్ణని అందరితోనూ బహిరంగంగా చెప్పుకున్నాడు. పోతే, ఇక్కడికి బంధితుడుగా వచ్చిన తరువాత, అగ్నిపాలుడనే రాజాశ్రితుడు,

ఈ ప్రాంతాల ఎక్కడో మరణించినట్టు విని ఉంటాడు. అదే అవకాశంగా తీసుకుని, రాజద్రోహానికి ఉరి తప్పదు గనక, దాన్నుంచి ప్రాణం కాపాడుకునేందుకు – ఆ అగ్నిపాలుడి నామం తనదిగా చేసుకోదలుస్తున్నాడు. ఇతణ్ణి బంధించి యిక్కడికి తెచ్చిన ధర్మనందుణ్ణి పిలిపిస్తే, అతడికి ప్రసేనుడి ఇంట ఇతడు తన పేరు విష్ణుమిత్రుడని చెప్పాడో లేదో తెలిసిపోతుంది. విష్ణుమిత్రుడనే రాజద్రోహిని బంధించి తెమ్మనేగదా, ఆ ధర్మనందుడికి ఇవ్వబడిన ఆజ్ఞ? అలాంటప్పుడు అతడు, విష్ణుమిత్రుణ్ణి కాక, అగ్నిపాలుడనేవాణ్ణి బంధించి యిక్కడికి తేవడం జరిగివుంటే – అతడు ఆజ్ఞాధిక్కరణ చేసిన నేరానికి గురి అవుతాడు," అన్నాడు.

న్యాయమూర్తుల ఆజ్ఞ కాగానే ధర్మనందుడు అక్కడికి రావించబడ్డాడు. న్యాయమూర్తి ఒకరు ధర్మనందుణ్ణి ఉద్దేశించి యిలా ప్రశ్నించాడు :

"ఈ నిందితుణ్ణి రాజా ప్రసేనుడి ఇంటనే గదా నువ్వు పట్టుకున్నది!"

"చిత్తం, అవును!" అన్నాడు ధర్మనందుడు.

"బంధించే సమయంలో ఇతడు తన పేరు ఏమని నీకు చెప్పాడు?"

"అతడికై అతడేమీ తన పేరు నాకు తెలియబరచలేదు," అన్నాడు ధర్మనందుడు.

"నీవు అక్కడ ఎవరిని బంధించి తెమ్మని ఆజ్ఞాపింపబడ్డావు?"

"విష్ణుమిత్రుడనే రాజద్రోహిని"

"బంధించేముందు, ఆ విషయం అతడికి తెలియబరిచావా?"

"అవును, తెలియబరిచాను"

"అతను, తను విష్ణుమిత్రుడు కాదని నీతో చెప్పాడా?"

"అప్పట్లో చెప్పలేదు"

"మనం అప్పటి సంగతే మాట్లాడుతున్నాం.... ఇప్పటి సంగతి కాదు!" అంటూ అవజ్ఞవర్మ, ధర్మనందుడికేసి కోపంతో కేకపెట్టి, న్యాయమూర్తుల కేసి తిరిగి, "ఇక మీరు న్యాయనిర్ణయం చేయవచ్చుననుకుంటాను," అన్నాడు.

"విష్ణుమిత్రా! నీవు నవభోజరాజుపై కత్తి కట్టడం ద్వారా, గొప్ప రాజద్రోహం చేశావని తేలిపోయింది. ఇంకా నీవు చెప్పదలచుకున్నది ఏమైనా ఉన్నదా?" అన్నాడొక న్యాయమూర్తి.

"క్షమించాలి. నేను విష్ణుమిత్రుణ్ణి కాదు! అగ్నిపాలుణ్ణి!" అన్నాడు అగ్నిపాలుడు నిందుస్వరంతో.

"అందుకు సాక్ష్యం?.... అలాంటిదేమీ లేదన్నట్టు తేలిపోయింది!"

"న్యాయమూర్తులు ఈ విచారణను, రేపు సాయంకాలానికి వాయిదా వేస్తే, నేను సాక్ష్యం తెచ్చుకోగలను," అన్నాడు అగ్నిపాలుడు.

"అది సాధ్యం కాదు"

"కాలం పొడిగించినంత మాత్రాన, చేసిన రాజద్రోహం కనబడకుండా పోతుందా!" అంటూ





అవజ్ఞవర్మ నవ్వాడు.

ఆ నవ్వు అగ్నిపాలుడి మనస్సును ఉడుకెత్తించింది. అతడు తన భవిష్యత్తు గురించీ, తను న్యాయమూర్తుల ఎదట ఉన్నాననే సంగతీ మరిచిపోయి క్రోధావేశంతో, "అవజ్ఞా! నీ ద్రోహచింతకు తగిన ప్రాయశ్చిత్తం జరిగితీరుతుంది. విష్ణుమిత్రుడన్న పేరుతో నన్ను ఉరితీయించాలని నీవు చేస్తున్న కుట్ర పటాపంచలు చేయగలను, జాగ్రత్త! అగ్నిపాలుడి శక్తిసామర్థ్యాలు నీకు తెలియనివి కావు!" అన్నాడు.

"వీడు రాజద్రోహి మాత్రమే కాదు, ఉన్మాది కూడా!" అంటూ అవజ్ఞవర్మ పెద్దగా అరిచాడు.

న్యాయమూర్తులు, అగ్నిపాలుడి కేసి కోపంగా చూస్తూ, తలలు ఆడించారు.

తరవాత వారిలో వారు నాలుగైదు క్షణాల కాలం సంప్రతించుకుని, "విష్ణుమిత్రుడనే రాజద్రోహి విచారించబడి, నేరం రుజువైనందున, ఉరిశిక్ష విధించడమైనది," అంటూ తమ తమ ఆసనాల మీది నుంచి లేచారు.

అవజ్ఞవర్మ కూడా, న్యాయమూర్తులతో పాటే లేచాడు. తన దృష్టి ఒక్క క్షణకాలం, అగ్నిపాలుడి ముఖం మీద ప్రసరింపజేసి, విజయసూచకంగా ఒక చిరునవ్వు నవ్వి అక్కడ నుంచి వెళ్ళిపోయాడు.

ఇద్దరు భటులు అగ్నిపాలుడి చేతులకు సంకెళ్లు తగిలించి, అతణ్ణి న్యాయస్థానం నుంచి బయటికి నడిపారు. ద్వారం దగ్గిర ధర్మనందుడు అతడికి ఎదురై, ఆప్యాయంగా భుజం తడుతూ, "అగ్నిపాలా! ఈ రాత్రికి నీకు వచ్చిన భయం ఏమీలేదు. ఇప్పటికే ఆరు గంటల కాలం దాటినందున, నీకు విధించబడిన ఉరి శిక్ష అమలు జరిగే అవకాశం లేదు. ఆరు గంటల తరవాత ఏ నేరస్థుడూ ఉరితీయబడడు. నేను, నవభోజ మహారాజు ఏ ప్రాంతాల ఉన్నదీ తెలుసుకుని, ఆయన పరివారంలో ఉండే నీ మిత్రులతో అన్ని సంగతులూ చెప్పి, తెల్లవారే లోపల సహాయం అందేలా చూస్తాను," అన్నాడు.

"ధర్మనందా, నీ రుణం ఏనాటికీ తీర్చజాలనిది!" అన్నాడు అగ్నిపాలుడు.

భటులు, అగ్నిపాలుణ్ణి తిరిగి చీకటి కొట్టులో పెట్టి, బయట తాళం బిగించారు.

అతడు నిస్త్రాణతో, నిరాశతో గోడకు చేరగిలబడ్డాడు.

## - 18 -

బయట సూర్యాస్తమయమవుతున్నది. పక్క కొట్లలో బంధింపబడిన మరి కొందరు చేసే రణగొణధ్వనీ, మధ్య మధ్య ఏడుపులూ, కేకలూ అగ్నిపాలుణ్ణి చీకాకు పరుస్తున్నవి.

ఉన్నట్టుండి హఠాత్తుగా అగ్నిపాలుడున్న చీకటి కొట్టు ముందు కాగడా వెలుగు ప్రసరించింది. అగ్నిపాలుడు గోడపక్కనుంచి లేచి, ఇనప కటకటాల దగ్గిరకు బయలుదేరాడు. అంతలో కాగడా

పట్టుకున్న వ్యక్తి, అతడున్న గది తాళం తీసి కాగడాను ముందుకు చూపుతూ, "అమ్మా! మీరు లోపలకు వెళ్ళవచ్చు," అన్నాడు.

ఆ క్షణం వరకూ, ఆ కాగడా పట్టుకుని ఉన్న వ్యక్తి వెనక ఒక స్త్రీ నిలబడి ఉన్నదని అగ్నిపాలుడు గ్రహించలేదు. తనను చూడవచ్చిన స్త్రీ ఎవరై ఉంటారని అగ్నిపాలుడు ఆలోచించే లోపలే, ఆ స్త్రీమూర్తి గదిలో ప్రవేశించింది.

ఆమె తల నిండుగా ఒక పట్టు వస్త్రం కప్పుకుని ఉన్నది. లోపలికి వస్తూనే దాన్ని తొలగించే సరికి, అగ్నిపాలుడామెను గుర్తించగలిగాడు.

ఆ వచ్చినది వకుళమాల!

ఆమె రూపుదాల్చిన శోకదేవతలా ఉన్నది.

తల వెంట్రుకలు చెల్లాచెదురుగా ముఖం మీద పడివున్నవి. దుఃఖభారంతో ఆమె నేత్రాలు ఎర్రనై వున్నవి.

"నువ్వా, వకుళా!" అంటూ అగ్నిపాలుడు, ఆమెకేసి సంభ్రమాశ్చర్యాలతో చూశాడు.

"అవును, అగ్నీ! నేను! పాపిని, నీచురాలిని!" అన్నది వకుళమాల గాద్గదికంగా.

అగ్నిపాలుడు ఆమె దీనస్థితి చూసి కంపించి పోతూ, ఒకడుగు ముందుకు వేసి, ఆమెను తన చేతుల్లోకి తీసుకున్నాడు.

"ఏం జరిగింది, వకుళా? ఈ రూపమేమిటి?" అన్నాడతను.

"నన్ను తాకకు, అగ్నీ, నన్ను వదులు! నేను పాపిని, పిశాచాన్ని," అంటూ వకుళమాల, అగ్నిపాలుడి పట్టునుంచి విడిపించుకో చూసింది. కాని, అగ్నిపాలుడు ఆమెను మరింత దగ్గరగా లాక్కుని, చిక్కుపడిన తలవెంట్రుకలను వేళ్ళతో సరిచేస్తూ, "వకుళా! నీ యీ దుస్థితికి కారణం ఏమిటో తెలియటం లేదు. ఇంత దుఃఖానికీ మూలం ఏమిటి?" అన్నాడు జాలిగా.

"నా ద్రోహం సంగతి నీకు తెలియదా, అగ్నీ?" అన్నదామె.

"ద్రోహమా!" అంటూ అగ్నిపాలుడు ఆశ్చర్య పడ్డాడు. మరుక్షణంలోనే అతడికి వకుళమాల చెప్పదలచినదేమిటో అర్థమైపోయింది. తను సైనికుల చేతుల్లో బందీ కావటానికి కారణం - బేతాళవర్మ, తను ఆశ్రయం పొందిన చోటును గురించి, నవభోజ సైనికులకు చెప్పడం అయివుంటుందని, అంతవరకూ అగ్నిపాలుడు నమ్మాడు. కాని, వకుళమాలను గురించి కూడా కొంత అనుమానం ఉన్నా... అతడి హృదయం, ఆమె అంత పని చేస్తుందని నమ్మేందుకు అంగీకరించలేదు.

"అంతా దైవాధీనం, వకుళా! ఇప్పుడు విచారించి లాభం లేదు. ఇందులో నేను చేసిన తప్పు కొంత లేకపోలేదు," అన్నాడు అగ్నిపాలుడు.

వకుళమాల దుఃఖాన్ని దిగమింగుతూ, "విజయరాజు ఇంటిలో మణిమంతుణ్ణీ... విష్ణుమిత్రుణ్ణీ, లలితాంగినీ కలుసుకున్నాను. వాళ్ళ ద్వారా నిన్ను గురించిన నిజం తెలుసుకున్నాను. నీ ప్రేమను శంకించి, నిన్ను నవభోజుడి సైనికులకు పట్టియిచ్చిన పాపిని నేనే! అయినా అగ్నీ, ఇంతకాలం నన్ను ప్రేమించి కూడా... నీ నిజనామం నా దగ్గిర ఎందుకు దాచావు?" అన్నది.







"అందుకు ప్రబల కారణమే ఉన్నది, వకుళా! ఇప్పటికీ నేను, నీ నుంచి దాస్తున్న ముఖ్య విషయం ఒకటున్నది. నేను ఈ చీకటి కొట్టు

నుంచి బయటపడగలినాడు, ముందుగా చక్కబరుచుకోవలసిన పనులు కొన్ని ఉన్నవి. ఆ తరువాత మాత్రమే నేను, నీ దగ్గరకు వచ్చి, నీ ప్రేమభిక్ష అర్థించగలను," అన్నాడు అగ్నిపాలుడు.

"ఆ ముఖ్యవిషయమేమిటో ఇప్పుడైనా, నాకు చెప్పకూడదా, అగ్నీ!" అన్నది వకుళమాల కన్నీళ్ళతో.

"వకుళా! యీ విషయమై నన్ను వత్తిడి చేయకు. నేను చంద్రగిరి నగరాన్ని ఏ కారణం వల్ల వదిలి, నీ ఇంటికి వచ్చానో... ఆ కారణం యొక్క నిజస్వరూపం నీకు తెలిస్తే... ఈ క్షణాన కూడా నీ ప్రేమ, ద్వేషంగా మారే అవకాశం ఉన్నది కనుక, ప్రస్తుతానికి నన్ను క్షమించు," అన్నాడు అగ్నిపాలుడు.

"సరే, ఆ సంగతి ప్రస్తుతానికి మరిచిపోదాం. నీవీ ఉరిశిక్ష నుంచి ఎలా బయటపడగలవు? రేపు ఉదయం పది గంటలకు, నీవు ఉరితీయబడగలవని అందరూ అనుకుంటున్నారు. నిన్ను అగ్నిపాలుడని గుర్తించి, సాక్ష్యం చెప్పగలవారెవ్వరూ ఈ పట్టణంలో లేరా?" అన్నది వకుళమాల.

"ఒకే ఒకడున్నాడు! కాని, వాడు నా నాశనం కోరుతున్నాడు. వాడి వల్లనే, నేనీ పద్మవ్యూహంలో చిక్కుకోవటం జరిగింది," అన్నాడు అగ్నిపాలుడు.

"ఎవరా నీచుడు?" అన్నది వకుళమాల తీవ్ర స్వరంతో.

"అవజ్ఞవర్మ!" అని అగ్నిపాలుడు తన తొందరపాటుకు నాలుక కొరుక్కున్నాడు.

వకుళమాల భయంగా అగ్నిపాలుడి కళ్ళల్లోకి చూసి, "అతడూ నవభోజుడి ఆస్థానంలో వాడే గదా, అగ్నీ? నీ మీద ఇంత క్రోధం ఎందుకు పూనాడు?" అన్నది.

"అతడేనాడూ నాకు మిత్రుడు కాదు. అతడు మొదటి నుంచీ నా మీద విరోధభావమే కనబరుస్తున్నాడు. కాని, అప్పట్లో అతడు నన్నేమీ చేయలేకపోయాడు. ఈనాడు అతడు ఈ మానుకోటలో నవభోజ రాజు ప్రతినిధిగా సర్వశక్తిమంతుడు! అందువల్లనే అతడి చేతిలో నేను నిస్సహాయంగా చిక్కిపోయాను," అన్నాడు అగ్నిపాలుడు.

"అగ్నీ! ఆ అవజ్ఞవర్మ అతిధిగా మా ఇంట కొన్ని దినాలు ఉన్న సంగతి నీకు తెలుసుగదా?" అన్నది వకుళమాల.

"తెలుసు," అన్నాడు అగ్నిపాలుడు అయిష్టంగా.

"ఇప్పుడు నేనతడి సహాయం కోరితే..."

"వద్దు, వకుళా!" అన్నాడు అగ్నిపాలుడు ఆదుర్దాగా.

వకుళమాల కొద్దిసేపు ఆలోచిస్తూ తల వంచుకు వూరుకుని, "నీకు ఉరిశిక్ష తప్పకపోతే, ఆ పాపభారం నేను బతికినన్నాళ్ళూ మోయవలసి వస్తుంది!" అన్నది.

అగ్నిపాలుడు జవాబు చెప్పలేదు.

"నాలోని దౌర్బల్యం, ద్వేషం కారణంగా...





నీకీనాడు, ఈ విషాద మరణం ఎదురౌతున్నది, అగ్నీ! నిన్నీ ఇక్కట్లలోకి ఈడ్చినది నేనే. చేతనైతే నిన్ను కాపాడవలసిన బాధ్యత కూడా నా మీదే ఉన్నది," అన్నదామె మళ్ళీ.

"నువ్వేమీ ఆదుర్దా పడనవసరం లేదు, వకుళా! నవభోజరాజు ఇక్కడికి వస్తున్నారు. ఆయనను కలుసుకుని, నా ప్రస్తుత స్థితి గురించి చెప్పేందుకు ఒకరిని పంపాను. నా సేవకుల కోసం, అయిదారుగురు సైనికులు ఈ ప్రాంతాలన్నీ గాలిస్తున్నారు. తెల్లవారే లోపల వీరిలో ఒకరి నుంచయినా, నాకు సహాయం వస్తుంది," అన్నాడు అగ్నిపాలుడు.

ఈ మాటలు వకుళమాల హృదయంలో ఆశారేఖలను రేకెత్తించలేకపోయినై.

"అగ్నీ! యిక నేను వెళ్ళివస్తాను. తెల్లవారక ముందే మళ్ళీ వచ్చి నిన్ను కలుసుకుంటాను. దైవకృప వల్ల నీవు తప్పక యీ ప్రమాదాన్నుంచి సురక్షితంగా బయటపడగలవు," అంటూ అతడి చేతుల నుంచి విడివడింది.

అగ్నిపాలుడు ఏమీ జవాబివ్వలేదు.

గది నుంచి బయటికి వెళుతున్న తన ప్రేమమూర్తి కేసి చూస్తూ, 'ఇది, నా ప్రేమ దేవతతో తుది సమావేశం కాదు గదా!' అనుకున్నాడు.

- 19 -

మానుకోట పట్టణంలోని ఒకానొక పెద్దభవనంలో, రాజోచితంగా ఏర్పాటు చేయబడిన విడిదిలో ఉన్న అవజ్ఞవర్మకు వకుళమాల అనే క్షత్రియాంగన తనను చూడ వచ్చినదని సేవకుడు చెప్పగానే, ఎక్కడలేని ఆశ్చర్యమూ కలిగింది.

'ఈ వకుళమాల ఇంత రాత్రివేళ తననెందుకు చూడగోరుతున్నది?' అన్న ప్రశ్న అవజ్ఞవర్మను ఒక్క క్షణకాలం బాధించింది. కాని, వెంటనే అతడు ఆమె రాకకు కారణం వూహించుకోగలిగాడు.

'నేను భయపడినంతా జరిగింది. ఈ అగ్నిపాలుడు తన ప్రయత్నంలో సఫలుడయ్యాడు. ఔరా...' అనుకుని ఆశ్చర్యపోయాడు అవజ్ఞవర్మ. ఆ వెంటనే అతడి హృదయం ద్వేషంతో పొగలు కక్కింది.

"ఆమెను ప్రవేశపెట్టు! మీరెవరూ ఈ గది చాయల నుండనవసరం లేదు," అన్నాడు అవజ్ఞవర్మ తన సేవకుడితో.

వకుళమాల అడుగులో అడుగు వేసుకుంటూ, భయవిహ్వల అయిన దానిలా, నలువైపులకు చూస్తూ గదిలో ప్రవేశించింది.

అవజ్ఞవర్మ పెదాల మీద చిరునవ్వు తెచ్చిపెట్టుకుంటూ, "ఇది నాకు చాలా గౌరవ కారణమూ, గర్వ కారణమూ కూడా! మల్లూరు మండలాధీశుని ఏకైక పుత్రికారత్నం, ఈ విధంగా నన్ను ఆదరించగలదని, కలలో కూడా భావించి వుండలేదు!" అంటూ వకుళమాలకు పట్టుమెత్తలు పరిచిన ఒక ఆసనం చూపించాడు.

వకుళమాల, అవజ్ఞవర్మ మాటల్లోని హేళనా

భావాన్ని గుర్తించింది. ఆమె హృదయం భగ్నమన్నది. కాని తను ఈ సమయంలో తన కోపాన్ని బయటపెట్టటం అంటే – అగ్నిపాలుడి మరణాన్ని కోరుకోవటమే అవుతుందని ఆమె భయపడింది.

వకుళమాల కూర్చోగానే, ఆవజ్ఞవర్మ కూడా తన ఆసనం మీద కూర్చుంటూ, "తమ రాకకు కారణం ఏమిటో అడగవచ్చునా?" అన్నాడు ఎంతో మర్యాద ఉట్టిపడే గొంతుతో.

"మీ నుంచి ఒక సహాయం కోరేందుకు వచ్చాను. ప్రస్తుతం ఇక్కడ కారాగారంలో అగ్నిపాలుడనే వ్యక్తి ఉన్నాడు. మీకు తెలుసుగదా?" అన్నది వకుళమాల.

"అగ్నిపాలుడా? ఎవరతడు?" అంటూ అవజ్ఞవర్మ ఎక్కడలేని ఆశ్చర్యమూ నటించి, "ఆ పేరు గల వ్యక్తి, ఈ ప్రాంతాలలోనే ఎక్కడో మరణించాడని ఎవరో చెప్పగా విన్నానే!" అన్నాడు.

వకుళమాల పొంగివస్తున్న కోపాన్ని అణుచుకుంటూ, "అవజ్ఞవర్మా! ఈ సమయంలో హాస్య ప్రసంగం ఏమీ మర్యాద అనిపించుకోదు," అన్నది కఠినంగా.

"క్షమించాలి!" అంటూ అవజ్ఞవర్మ, వకుళమాల ముఖంలోకి సూటిగా చూసి, "ఈ సాయంత్రం జరిగిన న్యాయవిచారణలో, విష్ణుమిత్రుడనబడే ఒకనొక రాజద్రోహి, తను అగ్నిపాలుణ్ణని న్యాయమూర్తులతో వాదించటం విన్నాను. బహుశా నీవు మాట్లాడేది అతణ్ణి గురించయి ఉంటుందేమో!" అన్నాడు.

"అతడు రాజద్రోహి విష్ణుమిత్రుడు కాదు! అతడు అగ్నిపాలుడనీ, నవభోజ రాజుకు ఆప్త మిత్రుడనీ, నీకు తెలియంది కాదు!" అన్నది వకుళమాల.

"సరే, వాదం కోసమో లేక మన సంభాషణ సాగేందుకో, అతణ్ణి అగ్నిపాలుడే అనుకుందాం. తరువాత..." అన్నాడు అవజ్ఞవర్మ కనుబొమ్మలు చిట్లిస్తూ.

"అతడు రాజద్రోహి విష్ణుమిత్రుడు కాదు గనక, ఆయన విడుదల కోరుతున్నాను," అన్నది వకుళమాల.

"న్యాయమూర్తులు అతణ్ణి విచారించి, నేరస్థుడని రుజువయింతరవాత, ఉరిశిక్ష విధించారు. ఆ తీర్పును నేనెలా మార్చగలను?" అన్నాడు అవజ్ఞవర్మ.

"ఆ తీర్పును మార్చనవసరం లేదు కాని, అతడు విడుదల అయ్యేందుకు అవసరం అయిన సాక్ష్యం, మీ రివ్వగలరు. ఒక్క మాటలో – అతడు అగ్నిపాలుడని మీరు గుర్తించండి, చాలు" అన్నది వకుళమాల.

అవజ్ఞవర్మ నిర్వికారంగా ఒక క్షణకాలం వకుళమాల కేసి చూసి, "ఇంత జరిగిన తరవాత, ఆ విష్ణుమిత్రుణ్ణి... అగ్నిపాలుడే అనుకుందాం – విడుదల చేయడం అంటే, నా నాశనం నేను కొనితెచ్చుకోవటమే అన్నమాట!" అన్నాడు.







"అతడికి ప్రాణదానం చెయ్యటం వల్ల, మీకు కష్టం ఎలా కలుగుతుంది?" అని అడిగింది వకుళమాల.

"వకుళా! ఇంతకూ, ఈ అగ్నిపాలుడి చావు బ్రతుకుల గురించి, నీకింత బాధ ఎందుకు?... అందుకు కారణం చెప్పగలిగితే..."

వకుళమాల, అవజ్ఞవర్మ మాట పూర్తిచేయక ముందే అందుకుని, "ఆయన్ని నేను ప్రేమిం

చాను!" అన్నది నిస్సంకోచంగా.

"అతడో?"

"అతడూ నన్ను ప్రేమించాడు!"

"ఎంత అమాయకత్వం!" అంటూ అవజ్ఞవర్మ జాలిపడుతున్నట్లు ముఖం పెట్టి, "అగ్నిపాలుడు నిజంగా నిన్ను ప్రేమించే ఉన్నట్టయితే, అతడికీ నాకూ మధ్య నడిచిన వ్యవహార కాండ గురించి తప్పక నీకు చెప్పే ఉంటాడు. అవునా?" అన్నాడు.

వకుళమాల కనుబొమ్మలు ముడిచి, అనుమానంగా అతడి కేసి చూసింది.

అవజ్ఞవర్మ బిగ్గరగా నవ్వాడు.

"అగ్నిపాలుడు పందెంలో గెలిచాడన్న మాట!" అన్నాడతడు హేళనగా.

వకుళమాల నిశ్చేష్టురాలైంది.

"నిన్ను భార్యగా తేగలనని, అతడు మూడు వారాల కిందట నాతో పందెం కట్టి చంద్రగిరి నగరాన్నుంచి బయలుదేరాడు. అగ్నిపాలుడుకి అది సాధ్యం కాదేమోనని, నేను భావించాను. ఎందువల్లనంటే, క్షత్రియ కన్యల ఆత్మగౌరవాన్ని గురించి నాకు చాలా సదభిప్రాయం ఉంది. పందెగాళ్ళను ప్రేమించి వివాహం ఆడే కన్యలు కూడా ఉంటారని నాకు తెలియదు," అని కొంచెం ఆగి, అవజ్ఞవర్మ, "ఏమైతేనేం, షరతుల ప్రకారం ఇప్పుడు, నా ఆస్తిపాస్తులన్నీ అగ్నిపాలుడివి!" అన్నాడు.

వకుళమాల నిలువెల్లా కంపించి పోయింది.

"మీరు చెప్పేది నిజమా? నిజంగా... అతడు, మీతో పందెం వేసి నన్ను భార్యగా తెచ్చేందుకే, మా ఇంటికి బయలుదేరి వచ్చాడా?" అన్నదామె.

అవజ్ఞవర్మ వికటంగా నవ్వాడు.

"ఈ పందెం అతడి గృహంలోనే వేయటం జరిగింది. ఆ షరతులన్నీ పత్రాల మీదికి ఎక్కించబడినవి కూడా. దానికి సాక్షులు కూడా ఉన్నారు. ఓబలరాజూ, ధర్మపాణీ, జయసింగ్..."

"చాలు, ఇక చెప్పనవసరం లేదు!" అంటూ వకుళమాల గట్టిగా చెవులు మూసుకున్నది.

అవజ్ఞవర్మ మందహాసం చేస్తూ, "ఇప్పటికైనా, ఆ అగ్నిపాలుడి నిజస్వరూపం ఏమిటో అర్థం చేసుకున్నావా?" అన్నాడు.

వకుళమాల మాట్లాడలేదు. ఆమె హృదయంలో పరస్పర విరుద్ధ భావాలకు తీవ్ర సంఘర్షణ జరుగుతున్నది.

"అమాయకంగా, నీ కన్నె వలపును ఒకానొక కుచ్చితుడూ, మోసకారీ అయిన గోముఖ వ్యాఘ్రానికి అంకితం చేశావు. ఎంత హాస్యాస్పదమైన సంగతి!" అన్నాడు అవజ్ఞవర్మ ఆశ్చర్యపోతున్నట్టు.

"నిజమే, నేను మోసపోయాను!" అన్నది వకుళమాల నిస్పృహతో.

"అలాంటి నీచుడికి, ఉరికంబమే తగినశిక్ష! అవునా?" అన్నాడు అవజ్ఞవర్మ.

వకుళమాల వెంటనే జవాబివ్వలేదు. అవజ్ఞవర్మ ఇంత చెప్పిన తరువాత కూడా, ఇంకా ఆమె నిర్మల హృదయంలో అగ్నిపాలుడికి స్థానం మిగిలిపోయింది. అగ్నిపాలుడు, అవజ్ఞవర్మ ఆస్తిపాస్తుల కోసం – పందెం గెలుచుకునేందుకు, తన మీద ప్రేమ నటించాడా? లేక, తనను చూసిన తరవాత, నిజంగానే అతడికి తనపై ప్రేమ కలిగిందా!

అగ్నిపాలుడు ఎంత నీచుడూ, మోసకారీ అయినా..... తన కారణంగా, తన వల్ల ప్రాణాపాయస్థితిలో పడటం జరిగింది. కనుక అతణ్ణి రక్షించవలసిన బాధ్యత తన మీద ఉన్నదని వకుళమాల భావించింది. తను ఏ పరిస్థితులలోనూ, ఎంత దుర్మార్గుడైన వ్యక్తి మరణానికీ కారణం కాకూడదు...

అవజ్ఞవర్మ తన వాడి చూపులతో వకుళమాల ముఖభంగిమలను గమనిస్తూనే ఉన్నాడు. తన మాటల ప్రభావం ఆమె మీద పనిచేస్తున్నదని అతడికి తెలుస్తూనే ఉన్నది. అయినా ఆమె ఏ నిర్ణయానికి రాలేక కొట్టుమిట్టాడుతున్నదని భయపడ్డాడు.

"వకుళా! నేను అబద్ధాలు చెపుతున్నానని, భావించటం లేదుగదా?" అన్నాడు అవజ్ఞవర్మ.

లేదన్నట్లు ఆమె తల ఊపింది.

"సరే, అలా అయితే, ఇప్పుడేం చేయదలుచుకున్నావ్?" అని ప్రశ్నించాడతడు.

"ఏ దృష్టి నుంచి ఆలోచించినా, అతడు విడుదల చేయబడటమే ఉత్తమ మార్గమని నాకు తోస్తున్నది. కారణం, అతడు నవభోజ సైనికుల చేజిక్కటానికి అవసరమైన సమాచారం ఇచ్చిన దాన్ని నేను కనక అతడి చావుకు కారణమై, ఆ పాపభారంతో బ్రతకలేను," అన్నది వకుళమాల.

"అతణ్ణి విడుదల చేస్తే, పందెం షరతుల ప్రకారం కాకపోయినా... ఈ సాయంత్రం న్యాయమూర్తుల ఎదుట జరిగిన విచార ధోరణిని బట్టి – నా మీద పగబూని, నన్ను హతమార్చుతాడు," అన్నాడు అవజ్ఞవర్మ కంపిత గాత్రంతో.

"అయితే మార్గాంతరమేమిటి?" అన్నదామె.

"అతణ్ణి ఉరికంబం ఎక్కనీ వకుళా!" అన్నాడతను.

"ఆ పాపం, నేను మూటకట్టుకోలేను," అన్నది వకుళమాల గాద్గదిక స్వరంతో.

అవజ్ఞవర్మ ఓ క్షణంసేపు తల వంచుకు ఊరుకుని, తరవాత తల ఎత్తి వకుళమాల కళ్ళలోకి సూటిగా చూస్తూ, "అయితే, ఒక పరిష్కార మార్గం చెపుతాను," అన్నాడు.

వకుళమాల కుతూహలంగా అతడి ముఖంలోకి చూసింది.

"అతణ్ణి విడుదల చేయించుతాను, కాని....." అంటూ అవజ్ఞవర్మ ఆగాడు.

"ఊఁ, చెప్పండి!" అన్నది వకుళమాల ఉత్కంఠతో.

"అగ్నిపాలుడు విడుదల చేయబడిన మరుక్షణం బయలుదేరి, యీ చంద్రగిరి రాజ్య సరిహద్దులను దాటిపోవాలి. బ్రతికి ఉండగా ఏ



నాడూ, యీ రాజ్యంలో కాలుపెట్టకూడదు. అంతేకాక, తను బ్రతికి ఉన్నట్లు కూడా ఎవరికీ తెలియనివ్వకూడదు. ఈ షరతులకు అతడు అంగీకరిస్తే – ప్రాణదానం!" అన్నాడు అవజ్ఞవర్మ.

"ఇందుకు అతడంగీకరించేలా నేను చేయగలను... కనీసం ప్రయత్నించగలను," అంటూ వకుళమాల ఆగి, "అతడు ఈ షరతులకు అంగీకరించి దేశం వదిలి వెళ్ళిపోతే ఎంత బావుండును! అడడికి చావుకు కారణం అయ్యాననే బాధ.... ఆ కల్మషాత్మతో చేయవలసిన పోరాటం నాకు తప్పుతుంది!" అన్నది.

"అయితే ప్రయత్నించు," అన్నాడు అవజ్ఞవర్మ ఆశగా.

వకుళమాల లేచింది. ఆమె అవజ్ఞవర్మ కేసి ఓమారు చూసి, తల వంచుకుని ద్వారం కేసి బయలుదేరింది.

అవజ్ఞవర్మ కూడా లేచాడు. అతడి నేత్రాలు ఆనందంతో మిలమిలలాడినై. పెదాల మీద మందహాసం కదుల్లాడింది.

"వకుళా!" అన్నాడతడు ఆనంద పారవశ్యంతో.

వకుళమాల ద్వారం దగ్గిర ఆగి, వెనుదిరిగి చూచింది.

"వకుళా! ఒకప్పుడు నేను, నీ ప్రేమభిక్ష కోసం వచ్చాను. జ్ఞాపకం ఉన్నదా?" అని అడిగాడు అవజ్ఞవర్మ.

వకుళమాల నిశ్చేష్టురాలైంది.





"వకుళా! నా సహృదయం తెలిసిన నీవు, ఏనాటికైనా నా అర్థాంగివి కాగలవని, నేను నమ్ముతున్నాను," అన్నాడు అవజ్ఞవర్మ హీన స్వరంతో.

ఆ మాటలు వింటూనే, వకుళమాల గిరుక్కున తిరిగి గడపదాటి వీధిలోకి వెళ్ళిపోయింది.

అవజ్ఞవర్మకు ఆమె మనోగత భావమేమిటా అన్న ప్రశ్న ప్రత్యక్షమైంది.

అతడు గబగబా గడప దగ్గిరకు పోయి, వేగంగా నడిచిపోతున్న వకుళమాల కేసి చూస్తూ నిట్టూర్చి, "ఎవరక్కడ?" అంటూ సేవకుడి కోసం కేకవేశాడు.

ఎవరూ జవాబు పలకలేదు.

ఈసారి అవజ్ఞవర్మ మరింత గట్టిగా, "ఎవరక్కడ?" అని అరిచాడు.

దానికీ జవాబు లేదు.

- 20 -

"ఓబలా! నువ్వు తెచ్చిన సమాచారం, నాకు చాలా సంతోషం కలిగిస్తున్నది. అందరితోపాటు నేనూ, అగ్నిపాలుడు మరణించి వుంటాడనే యిన్నాళ్లుగా భావిస్తున్నాను," అన్నాడు నవభోజ మహారాజు.

"చిత్తం, ప్రభూ! మొదటి నుంచీ ఈ దుర్వార్తలను కావాలనే ఎవరో ప్రచారం చేస్తున్నారని నేను అనుమానిస్తూనే వున్నాను. కాని, యిప్పటి అగ్నిపాలుడి పరిస్థితి..." అంటూ నవభోజరాజు దృష్టిని మరో వైపుకు తిప్పేసరికి, ఓబలరాజు మాట మధ్యలోనే ఆగి అటుకేసి చూశాడు.

అగ్నిపాలుడు, ఆనాటి సాయంత్రం అయిదు గంటల వేళ న్యాయమూర్తుల ఎదట రాజద్రోహిగా విచారించబడుతున్న సమయంలో, నవభోజ మహారాజు తన పరివారంతో మానుకోట నగరానికి వస్తూ, దారిలో వున్న కూర్మశైలం దగ్గిర ఆగి, అక్కడ కాలభోజుడితో తన ప్రధాన సేనాని హనుమప్ప నాయకుడు జరిపిన ఘోర సంగ్రామాన్ని గురించిన వివరాలు అడిగి తెలుసుకుంటున్నాడు.

ఆ సమయంలో, అగ్నిపాలుడి మిత్రులలో ఒకడైన ఓబలరాజు నవభోజ మహారాజుకు, అగ్నిపాలుణ్ణి గురించి అప్పుడే తనకు తెలిసిన సమాచారాన్ని గురించి వివరిస్తున్నాడు.

"అయితే, ఓబలా! మనం మానుకోటకు బయలుదేరి వస్తున్నట్టు, ఈసరికి అగ్నిపాలుడికి తెలిసే వుంటుందనుకుంటాను. అతడు మన కోసం తప్పక ఎదురు చూస్తూంటాడు," అన్నాడు నవభోజుడు.

"ఇంతకు ముందు ప్రభువులవారికి నేను విన్నవించిన సంగతి..." అంటూ ఓబలరాజు నీళ్ళు నమిలాడు.

నవభోజరాజు చిరునవ్వు నవ్వుతూ, "అదంతా, అవజ్ఞవర్మ హాస్యం కోసం చేసిన పనై వుంటుంది. బహుశా, సత్రంలో ఆ సమయాన వున్నవారికి

ఆ సంగతి తెలిసి వుండదు," అన్నాడు.

"లేదు, ప్రభూ! హనుమప్ప సేనానిని ఆడగండి. ఆయన అగ్నిపాలుణ్ణి బందీగా పట్టి తెచ్చేందుకు సైనికులను పంపాడు. అయితే, ఆయనకు ఆ సమయంలో వచ్చిన సమాచారాన్ని బట్టి అతడు అగ్నిపాలుడు కాదు – విష్ణుమిత్రుడనే రాజద్రోహి!" అన్నాడు ఓబలరాజు

నవభోజుడు పక్కనే నిలబడివున్న హనుమప్ప సేనానికేసి చూశాడు.

"అవును మహారాజా! నాకు అందిన సమాచారం ప్రకారం, ప్రసేనుడి ఇంట దాగివుంటున్నది విష్ణుమిత్రుడనే రాజద్రోహి. అతణ్ణి బంధించేందుకు నేను సైనికులను పంపాను. కాని, యిప్పుడు ఓబలరాజు చెపుతున్న దాన్ని బట్టి, అతడు అగ్నిపాలుడనీ, విష్ణుమిత్రుడి పేరుతో ఆ ఇంట వుంటున్నాడనీ తేలుతున్నది," అన్నాడు హనుమప్ప.

నవభోజరాజు ఆశ్చర్యపోతూ, ఓబలరాజు కేసి చూశాడు.

"అవును, ప్రభూ! అగ్నిపాలుడు రాజద్రోహి అయిన విష్ణుమిత్రుడని పొరపాటుపడి సైనికులు పట్టుకోబట్టే – అవజ్ఞవర్మ అతణ్ణి ఆ పేరు మీదుగా హతమార్చచూస్తున్నాడు," అన్నాడు ఓబలరాజు.

"వారిద్దరి మధ్యా అంత విరోధ భావమున్నదని నాకు యింతవరకూ తెలియదే!" అంటూ నవభోజుడు కనుబొమలు ముడిచి, "అగ్నిపాలుడికి, ప్రసేనుడి యింట విష్ణుమిత్రుడని పేరు పెట్టుకుని చేరవలసిన అవసరం ఎందుక్కలిగింది?" అన్నాడు.

"అవజ్ఞవర్మను, ఆ మల్లూరు మాండలికుడైన ప్రసేనుడి యింటికి మీరొకసారి పంపడం జరిగింది – జ్ఞాపకం వున్నదా, ప్రభూ?" అని అడిగాడు ఓబలరాజు.

"జ్ఞాపకం లేకేం!" అన్నాడు నవభోజుడు.

"ఆ ప్రసేనుడి పుత్రిక వకుళమాల విషయమై వాళ్ళిద్దరూ వాదోపవాదాలకు దిగి, చివరకు పందెం కట్టుకున్నారు. ఆమెను భార్యగా తేగలనని అగ్నిపాలుడు బయలుదేరి వెళ్ళాడు," అన్నాడు ఓబలరాజు.

"పందెంలో ఒడ్డిన వస్తువులేమిటి?" అన్నాడు నవభోజుడు ఆశ్చర్యంగా.

"ఇద్దరూ తమ తమ సంస్థానాలు పణంగా ఒడ్డారు ప్రభూ!" అన్నాడు ఓబలరాజు కొంచెం భయపడుతూ.

"సంస్థానాలనే పందెంగా ఒడ్డటమా.......! బావుంది," అంటూ నవభోజుడు చిరుకోపంగా ఓబలరాజుకేసి చూసి, "ఆ సమయంలో నువ్వక్కడ వున్నావా?" అన్నాడు.

ఓబలరాజు తడబడ్డాడు.

"అవును, ప్రభూ! నేనూ, ధర్మపాణీ, జయసింగ్....., అందరం వున్నాం. పందెం షరతులు లిఖితపూర్వకంగా ఉదాహరించి, ఆ పత్రాలను







వారు పరస్పరం మార్చుకోవటం కూడా జరిగింది," అన్నాడు.

"నా ఆస్థానంలో యింత గొప్ప జూదగాళ్ళున్నారని నాకు యిప్పుడే తెలుస్తున్నది, ఓబలా!" అంటూ నవభోజుడు కనుబొమలు ముడిచి, "సరే! అగ్నిపాలుడు, అవజ్ఞవర్మకు ఎందులోనూ తీసిపోయే వ్యక్తి కాదు గనక, వాళ్ళిద్దరినీ ఒకరి గొంతులు ఒకరు కోసుకోనిద్దాం!" అన్నాడు.

"మహాప్రభూ!..... మీరొకటి చిత్తగించాలి," అన్నాడు ఓబలరాజు జంకుతూ.

"ఏమిటదీ?" అంటూ నవభోజుడు, ఓబలరాజుకేసి అనుమానంగా చూశాడు.

"వాళ్ళిద్దరూ యీనాడు సమవుజ్జీలు కారు. అవజ్ఞవర్మ మానుకోట పట్టణానికి పంపబడిన రాజప్రతినిధి!" అన్నాడు ఓబలరాజు.

"నాకా సంగతి గుర్తున్నది!"

"అగ్నిపాలుడు, విష్ణుమిత్రుడనే పేరుగల రాజద్రోహిగా పట్టుకోబడిన ఖైదీ, ప్రభూ!" అన్నాడు ఓబలరాజు.

"ఆ.... తరువాత' అన్నట్టు నవభోజుడు తల వూపాడు.

"అవజ్ఞవర్మ అగ్నిపాలుణ్ణి ఈ కారణాలవల్ల ఏ క్షణాన అయినా ఉరితీయించగలడు!"

ఓబలరాజు మాటలు వింటూనే, నవభోజుడు

చకితుడయ్యాడు.

కొంచెం ఆగి, "అంతా అర్థమైంది, ఓబలా! అవజ్ఞవర్మ సత్రంలో అగ్నిపాలుణ్ణి గుర్తించనట్లు నటించినదాని వెనక, ఏదో కుట్ర వున్నదనేనా నీ నమ్మకం?" అన్నాడు.

"అవును ప్రభూ!" అన్నాడు ఓబలరాజు.

"అయితే ఎటుపోయి ఎటు వస్తుందో, ముందే జాగ్రత్తపడటం మంచిది," అంటూ నవభోజుడు చుట్టూ కలయచూసి,"జయసింగ్ ఏమయినట్టు?" అన్నాడు.

"అతడు వెనకగా, అశ్వసైనికులతో కలిసివస్తున్నాడు మహారాజా!" అన్నాడు హనుమప్ప సేనాని.

"అతణ్ణి వెంటనే యిక్కడికి పంపించు"

కొద్దిసేపట్లో జయసింగ్ మహారాజు వద్దకు వచ్చాడు.

"జయసింగ్! నీవు మాకన్న ముందు బయల్దేరి, మానుకోట చేరవలసివుంది," అన్నాడు నవభోజుడు.

"చిత్తం!" అన్నాడు జయసింగ్.

"విష్ణుమిత్రుడనబడే రాజద్రోహికి బదులుగా, అగ్నిపాలుడు మన సైనికుల వల్ల ఖైదీగా పట్టుకోబడినట్టు వార్త వచ్చింది. నీవు మానుకోట చేరేసరికి అతడు స్వేచ్ఛగా వుంటే సరేసరి, లేకపోతే నా ఆజ్ఞగా అతణ్ణి కారాగారం నుంచి విడిపించవలసిన బాధ్యత నీది!" అన్నాడు నవభోజుడు.

"ప్రభూ, అవజ్ఞవర్మ అక్కడ వున్నాడు గదా! అతడు..."

"ఓబలరాజు చెప్పేదాన్నిబట్టి, అతడి వల్లనే అగ్నిపాలుడికి ప్రమాదం జరగనున్నది. ప్రసేనుడి కుమార్తె విషయమై వాళ్ళిద్దరూ వేసుకున్న పందెం సంగతి నీకు తెలుసుగదా?" అన్నాడు నవభోజుడు కటువుగా.

"చిత్తం. తెలుసు ప్రభూ!" అంటూ జయసింగ్ తడబడ్డాడు.

"ఓబలరాజు ఊహించేది ఒకవేళ తప్పు కావచ్చు. కనుక, నువ్వు నా ఆజ్ఞను అతి రహస్యంగా వుంచవలసి వుంటుంది. అవజ్ఞవర్మ యిప్పుడు మానుకోట పట్టణంలో, నా ప్రతినిధిగా వ్యవహరిస్తున్నాడు. అగ్నిపాలుడు స్వేచ్ఛగా వుండటం జరిగితే, యిప్పుడు నేనిచ్చిన ఆజ్ఞ సంగతి మరెవరికీ తెలియకూడదు. నా ఆస్థానంలో పందెగాళ్ళూ, జూదగాళ్ళే కాక – వారిని ప్రోత్సహించి, పత్రాలు రాసి, సాక్షి సంతకాలు చేసేవారు కూడా వున్నారని, నా ప్రజలందరికీ వెల్లడించనవసరం లేదు," అన్నాడు నవభోజరాజు కోపంగా.

జయసింగ్ ప్రతిమలా కదలా మెదలక వుండిపోయాడు.

నవభోజుడు అతని ముఖంకేసి ఓ క్షణకాలం చూసి, వెళ్ళవచ్చునన్నట్టుగా తలవూపాడు.

మరుక్షణంలోనే జయసింగ్ తన గుర్రాన్నెక్కి అదిలించాడు.

ఓబలరాజు జయసింగ్ వెళ్ళిన దిక్కుకేసి తృప్తిగా చూస్తూ, 'భగవాన్,' అనుకున్నాడు మనసులోనే.

ఇంతలో, "మహారాజా!" అన్న హనుమప్ప సేనాని పిలుపు వినబడింది.

"ఏమిటి?" అన్నాడు నవభోజుడు.

"మనం ఇంతకాలంగా అనుమానిస్తున్నట్టు ఆ మల్లూరు సంస్థానికుడైన ప్రసేనుడు, గోడ మీది పిల్లి కాదు ప్రభూ! అతను నూటికి నూరుపాళ్ళు కాలభోజుడి పక్షపాతి," అన్నాడు హనుమప్ప సేనాని.

నవభోజుడు ఆశ్చర్యంగా చూశాడు.

"గత రెండు రోజులుగా ఈ విషయం తమతో మనవి చేద్దామనుకుంటున్నాను. బేతాళవర్మ అనే ప్రసేనుడి బంధువును తమరు చూశారు గదా! అతడు ఈ ప్రాంతాల వున్న అనేకమంది కాలభోజుడి అనుచరులను పట్టుకోవటంలో మనకు సహాయపడుతున్నాడు. ప్రసేనుడిని గురించీ, అతడి ముఖ్యానుచరులైన మరికొందరిని గురించీ అతడు నాతో కొన్ని విషయాలు చెప్పాడు. కూర్మశైలం దగ్గిర నా చేతుల్లో పడకుండా తప్పుకు పారిపోయిన మణిమంతుడు ఈ ప్రసేనుడికి ప్రాణమిత్రుడట!" అన్నాడు హనుమప్ప సేనాని.

నవభోజుడు ఓ క్షణకాలం వూరుకుని, "ఆ బేతాళవర్మ ఈ రాజద్రోహుల పేర్లన్నీ నీ దగ్గర ఏకరువు పెట్టేకన్న తనే బయలుదేరి వెళ్ళి వాళ్ళందర్నీ ఎందుకు బంధించి తేకూడదు?" అన్నాడు విసుగ్గా.

"చిత్తం!" అన్నాడు హనుమప్ప సేనాని తల పక్కకు తిప్పుతూ.

- 21 -

జయసింగ్ నలుగురశ్వసైనికులను వెంటబెట్టుకొని మానుకోట పట్టణానికి బయలుదేరాడు.

అతడు మార్గమధ్యంలో ఉన్న హిరణ్య పురాన్ని చేరబోయేంతలో ఎదురుగా రాజమార్గం మీద మహావేగంతో వస్తున్న ఇరువురు అశ్వికులు కనిపించారు. వారు అతివేగంగా అశ్వాలను పరిగెత్తిస్తున్న తీరు జయసింగ్‌ను ఆశ్చర్యపరిచింది. బహుశా వీరు ఏ రాజద్రోహినైనా వెన్నాడుతుండాలి. లేకపోతే నవభోజ రాజుకు ఏదైనా వార్త అందించేందుకైనా పోతూ వుండాలి, అనుకున్నాడతడు.

ఆ ఆశ్వికులిద్దరూ, యింకా ఒకటి రెండు వందల గజాల దూరంలో వుండగానే, జయసింగ్ తన గుర్రాన్ని రాజమార్గం మధ్యగా ఆపి, సమీపిస్తున్న ఆశ్వికులకు ఆగమన్న సూచనగా చేయి వూపాడు.

ఆశ్వికులిద్దరూ వేగాన్ని తగ్గించి, జయసింగ్‌ను సమీపించి గుర్రాలను ఆపారు.

అదే సమయంలో జయసింగూ, ఆ ఆశ్వికుల్లో ఒకరూ, "హే, భగవాన్!" అంటూ పెద్దగా అరిచి, "జయసింగ్!" అని ఒకరూ, "ఆః! ధర్మనంద్!"

అని ఒకరూ పెద్దగా సంబోధించుకున్నారు.

"ఆ భగవంతుడే మనిద్దరికీ యిక్కడ సమావేశం కల్పించాడు, జయసింగ్! నేను నీ కోసమే బయలుదేరి వస్తున్నాను" అన్నాడు ధర్మనందుడు ఉత్సాహంగా.

"నా కోసమా? ఏమిటా అవసర కార్యం?" అన్నాడు జయసింగ్.

"అగ్నిపాలుడు తెలుసు గదా?"

"తెలుసా! అతడు నా ముఖ్యస్నేహితుడు. అతడి కోసమే నేను..."

ధర్మనందుడు ఆత్రంగా, "అతడు ఉరిశిక్ష విధింపబడి కారాగారంలో వున్న సంగతి నీకు తెలిసిందా, జయసింగ్?" అన్నాడు.

"అశ్వాన్ని వెనక్కు తిప్పు - వివరాలు మాట్లాడుకుందాం. ఆలస్యం ప్రమాద కారణం కావచ్చు," అంటూ జయసింగ్ తన వాహనాన్ని అదిలించాడు.

ఆ తరవాత నడిరేయికి, వాళ్ళిద్దరూ మానుకోట పట్టణం చేరారు. ఆలోపల మార్గమధ్యంలోనే ఒకరి నుంచి మరొకరు సర్వం తెలుసుకున్నారు.

మానుకోట చేరగానే ధర్మనందుడు, "జయసింగ్! మనం సరాసరి కారాగారానికే గదా వెళ్ళవలసింది?" అని అడిగాడు.

"అవును, అక్కడికే. అగ్నిపాలుణ్ణి ఖైదు నుంచి విడిపించేవరకూ ఈ విషయం అవజ్ఞవర్మకు తెలియటం క్షేమం కాదు," అన్నాడు జయసింగ్.

కొద్దిసేపు తరవాత, సైనికులు వెంటరాగా జయసింగ్, ధర్మనందులు చీకటికోనలా వున్న ఒక సన్నని మార్గం వెంట తమ గుర్రాలను నడిపి, కారాగార ముఖద్వారాన్ని చేరారు.

కారాగార ముఖద్వారపు ఇనప తలుపులు దగ్గిరకు వేయబడి, లోపలి నుంచి తాళం బిగించబడి వున్నది. కారాగారాధిపతి నివసించే భవనం, నేరస్థులు బంధింపబడే కొట్లు కావల వున్నది. నవభోజ రాజు ఆజ్ఞ గురించి కారాగారాధిపతికి చెప్పి, అగ్నిపాలుడిని ఖైదు నుంచి విడిపించాలంటే, జయసింగ్ ఆ ముఖద్వారం నుంచి లోపల ప్రవేశించవలసిందే.

జయసింగ్ గుర్రం దిగి, ఆ చీకటిలో తడువుకుంటూ ఇనప తలుపులను సమీపించాడు.

ఇంతలో, అల్లంత దూరాన కలకలం బయలుదేరింది. ఆ వెంటనే, జుఁయ్‌మంటూ ఒక బాణం వచ్చి అతడి చేతిని రాసుకుంటూ పోయింది.

మరుక్షణం గుర్రం ఒకటి కర్ణకఠోరంగా సకిలించి, పైనున్న రౌతును పడదోసి, ఆ చీకటిలో పడి పారిపోయింది.

"జయసింగ్! ఇక్కడేదో మోసమున్నది. ఆ సందు మొగదల చీకట్లో ఎవరో పొంచి వున్నారు," అన్నాడు ధర్మనందుడు.

ఆ క్షణంలో జయసింగ్ కూడా ఆశ్చర్యపోతూ, అక్కడేదో మోసం వున్నదనీ అనుమానించాడు. అతడు ధర్మనందుడి మాటలు వింటూనే ఛెంగున వెనకకు దూకి, "ధర్మనంద్! కత్తులు పట్టుకొని సిద్ధంకండి. గుర్రాలు దిగి నా వెనకగా గోడవారగా నడవండి. ఆ ద్రోహుల అంతు తేల్చుకుందాం!" అన్నాడు, కారాగారపు ప్రహరీ గోడకేసి పరిగెత్తుతూ.

ధర్మనందుడు గుర్రం మీది నుంచి ఎగిరి కిందికి దూకాడు.

తతిమ్మా సైనికులు కూడా తమ తమ గుర్రాల నుంచి దూకుతున్నారు. గుర్రం మీది నుంచి పడిపోయిన రౌతు మాత్రం చీకట్లో ఎక్కడో మూలుగుతున్నాడు.

సందు మొగదలవున్న చీకట్లో నాలుగైదు మానవాకారాలు కదిలినై. అటునుంచి భీకరమైన కంఠస్వరంతో, ఒక కేక వినబడింది.

"ఆ జయసింగ్ ఎవరు? నవభోజ రాజాస్థాన సర్దారా?"

జయసింగ్ ఆ ప్రశ్న వింటూనే నిశ్చేష్టుడయ్యాడు. ఆ కంఠస్వరం తనకు బాగా తెలిసినదే! కాని, ఎవరో వెంటనే పోల్చుకోలేకపోయాడు.

"జయసింగ్ సర్దారును గుర్తించి కూడా, బాణం వదిలిన ఆ ద్రోహి ఎవరు?" అన్నాడు జయసింగ్ ఖంగుమనే కంఠస్వరంతో.

"సర్దార్ జయసింహులు ఈ సేవకుణ్ణి క్షమించాలి! నేను మాహూను - మీ సేవకుణ్ణి!" అంటూ మాహూ, వెంట మరి నలుగురితో కలిసి, జయసింగ్ దగ్గిరకు పరిగెత్తుకు వచ్చి అతడికి పాదాభివందనం చేశాడు.

జయసింగ్ ఏదో అనబోయేంతలో, కారాగార ముఖద్వారం లోపలి నుంచి ఒక కఠిన స్వరం, "ఏమిటా గుద్దులాట?.... ఎవరు మీరు?" అని ప్రశ్నించింది.

జయసింగ్ అటుకేసి చూశాడు.

ఎర్రని శాలువా కప్పుకుని వున్న ఒక భీకరాకారుడు అతడి కంటబడ్డాడు. అతడికి యిరువైపులా ముగ్గురేసి చొప్పున ఆయుధపాణులైన సైనికులు నిలబడి వున్నారు. వారి ఎడమ చేతుల్లో భగభగ మండుతున్న కాగడాలు వెలుగుతున్నవి.

"ఇక్కడేమీ గుద్దులాట జరగటంలేదు. చీకట్లో గుర్రం కాలుజారి, రౌతును పడేసింది. మీరేగదా కారాగారాధిపతులు?" అన్నాడు జయసింగ్ సమయోక్తిగా.

"అవును!" అంటూ ఆ భీకరాకారుడు జవాబు చెప్పి, జయసింగ్ ధరించిన సైనిక సర్దారు దుస్తులూ, అతడి వెంటవున్న సైనికులనూ కాగడాల వెలుగులో చూస్తూ ఆశ్చర్యపడ్డాడు.

"నా పేరు జయసింగ్! నేను నవభోజ మహారాజుల నుండి విష్ణుమిత్రుడనే ఖైదీ విడుదలకు ఆజ్ఞ తెచ్చాను," అన్నాడు జయసింగ్.

వెంటనే కారాగార ముఖద్వారం తలుపులు తెరవబడినై.

కారాగారాధిపతి ముందుండి సవినయంగా జయసింగ్‌ను అతడి అనుచరులతోపాటు, అగ్ని

పాలుడు బంధింపబడివున్న గది దగ్గిరకు తీసుకు పోయాడు.

గది తలుపులు తెరవబడినై. కాగడాల వెలుగులో జయసింగ్‌ను చూసిన అగ్నిపాలుడు నిద్ర లేక ఎర్రబడిన కళ్ళతో, దుమ్ముకొట్టుకుపోయిన దుస్తులతో వేగంగా ముందుకు వచ్చి, "జయసింగ్!" అంటూ అతణ్ణి గాఢంగా కౌగిలించుకున్నాడు.

వారిద్దరూ ఆ క్షణంలో ఆనందపారవశ్యం వల్ల, తమ పరిసరాలనే మరిచారు. వారి నేత్రాల నుండి సంతత ధారగా ఆనందబాష్పాలు చెక్కిళ్ళ మీదికి జాలువారినై.

ఆ దృశ్యం చూస్తున్న మాహూ సంతోషోద్వేగంతో చలించిపోయాడు.

"ప్రభూ! మిమ్మల్ని సజీవంగా చూడగలననుకోలేదు. 'మీ తండ్రిగారి సేవలోనే మరణించి వుంటే ఎంత బావుండేది!' అని వాపోయాను," అన్నాడు కన్నీళ్ళు తుడుచుకుంటూ.

అగ్నిపాలుడు, జయసింగ్ దగ్గిర నుంచి మాహూ కేసి రెండడుగులు వేసి, ఎంతో ఆప్యాయంగా అతడి వీపుమీద తడుతూ, "మాహూ! ఈనాటి నుంచీ నీవు, నా సేవకుడిని కాదు - బంధుసమానుడివి. నే కనబడకుండా పోయిన తరవాత, నా కోసమని నువ్వెన్ని పాట్లు పడ్డావో నాకు తెలుసు!" అన్నాడు.

మాహూ ఎంతో వాత్సల్యంగా అగ్నిపాలుడి రెండు చేతులనూ తన చేతుల్లోకి తీసుకుని కళ్ళ కద్దుకున్నాడు.

అందరూ కారాగార ద్వారాలు దాటి బయటికి వచ్చారు. ఆసరికి గుర్రం మీది నుంచి కింద పడిన సైనికుడు కొంత తేరుకుని, కారాగారపు గోడకు చేరగిలబడి కూర్చునివున్నాడు.

జయసింగ్ ఆ సైనికుణ్ణి చూస్తూనే మాహూకేసి తిరిగి, "మాహూ! ఇంతకుముందు నీవు చేసి అఘాయిత్యమేమిటి? మేము ఎవరిమని భావించి ఆ సందు మొగదల నుంచి మా మీదికి బాణాలు ప్రయోగించావు?" అని అడిగాడు.

"క్షమించండి, సర్దార్ జయసింగ్! అవజ్ఞవర్మ ఈ రాత్రి నా యజమానిని కారాగారంలోనే హత్య చేయ ప్రయత్నిస్తాడని శంకించి నా అనుచరులతో అక్కడ కాపు వేశాను," అన్నాడు మాహూ.

"నిజమా, మాహూ! అవజ్ఞవర్మ అంత సాహసానికి ఒడిగట్టగలడని నీవేకారణం వల్ల అనుమానించావు?" అని అడిగాడు జయసింగ్.

"అయ్యా, ఆ సంగతులన్నీ యిప్పుడే చెప్పమన్నారా? నేను విడిది చేసిన ఇంటిలో అవజ్ఞవర్మ సేవకుడొకడు కాళ్లూ చేతులూ బంధింపబడి నాకు ఖైదీగా వున్నాడు. జరిగినదేమిటో వాడి ద్వారా వింటే బాగుంటుందేమో?" అన్నాడు మాహూ.

"ఏం జరిగింది మాహూ? వాణ్ణి తరవాత విచారిస్తాంగాని, ముందు ఆ జరిగినదేమిటో నీవే చెప్పు!" అన్నాడు అగ్నిపాలుడు కుతూహలంగా.

మాహూ చెప్పినది యిది :

ధర్మనందుడి సైనికులు మాహూను వెతుక్కుంటూ వెళ్ళి, అతణ్ణి మానుకోటకు రెండు మూడు కోసుల దూరంలో వున్న ఒకానొక పల్లె గ్రామంలో కలుసుకున్నారు. వారి ద్వారా తన యజమాని ఎంత ప్రమాదకర పరిస్థితులలో వున్నాడో, అతడు తెలుసుకున్నాడు.

వెంటనే మాహూ మిగతా సేవకులను వెంట తీసుకుని, చీకటిపడేసరికి మానుకోట చేరాడు. అగ్నిపాలుణ్ణి గుర్తించగలిగిన వాళ్ళు ఒకరున్నా, అతడు ఉరిశిక్ష నుంచి బయటపడగలడని తెలుసుకున్నాడు గనక, అతడు మునుముందుగా కారాగారాధిపతి దగ్గిరకు వెళ్లి, తన యజమానిని చూసేందుకు అనుజ్ఞ యిప్పించమన్నాడు. కాని, కారాగారాధిపతికి ఈ విష్ణుమిత్రుల, అగ్నిపాలుర పేర్ల గజిబిజి అర్థంకాక, మాహూను రాజప్రతినిధి అయిన అవజ్ఞవర్మను దర్శించమన్నాడు.

మాహూ, మరిద్దరు సేవకులతో అవజ్ఞవర్మ విడిదిచేసిన గృహానికి వెళ్ళేసరికి, అక్కడ ఒక సేవకుడు తలుపు కంతల దగ్గిర చెవిపెట్టి, లోపల జరుగుతున్న సంభాషణ ఏదో రహస్యంగా వినటం కంటబడింది.

వెంటనే మాహూ, అన్నిటికీ తెగించి, కత్తిదూసి ఆ సేవకుడి కంఠానికి గురిపెడుతూ 'అరిస్తే చంపుతాను' అన్నట్టు సౌంజ్ఞ చేసి, తనూ తలుపుకు చెవి ఆనించి, ఆ లోపల జరుగుతున్న సంభాషణ సర్వం వినసాగాడు.

ఆ సంభాషణ అవజ్ఞవర్మ, వకుళమాలల మధ్య జరుగుతున్నది.

ఆ యిద్దరి మధ్యా జరిగిన సంభా షణ ఏమిటో మాహూ, అగ్నిపాలుడికి వివరంగా చెప్పాడు.

"అయ్యా..... మీరు ఫలానా అని గుర్తించే, మిమ్మల్ని ఉరితీయించేందుకు అవజ్ఞవర్మ సిద్ధపడుతున్నాడని గ్రహించాను. ఆ వకుళమాల అనే కన్యకు మీ మీద జాలిగాని, ప్రేమగాని లేదని నేను...... ఆమె మాటల వల్ల అనుకున్నాను. అలాంటప్పుడు అవజ్ఞవర్మ చేస్తున్న ద్రోహం సంగతి నవభోజ మహారాజుకు ప్రమాణం చేసి చెప్పగల వాళ్ళెవరు? నేను మీ సేవకుణ్ణి గనక, నా సాక్ష్యానికి విలువ వుండదు. అందుకని, అవజ్ఞవర్మ సేవకుడిని ప్రాణభయం చూపి, వెంట లాక్కుపోయి, నా విడిది గృహంలో బంధించి వుంచాను. అతణ్ణి ఏ క్షణాన కావాలన్నా సరే, మహారాజుల ఎదట హాజరు పెట్టగలను," అన్నాడు మాహూ ఎంతో ఉత్సాహంగా.

"నీ సమయస్ఫూర్తి అమోఘం మాహూ!" అన్నాడు అగ్నిపాలుడు.

ఆ క్షణంలో అతడి మనసు అవజ్ఞవర్మ మీద ద్వేషంతో భగభగ మండింది. వకుళమాలకు తమ పందెం గురించి చెప్పటం ద్వారా, ఆ దుర్మార్గుడు ఆమె మనస్సును తన మీది నుంచి పూర్తిగా తిప్ప

గలిగి వుండవచ్చు.

అగ్నిపాలుడు యిలాంటి ఆలోచనలతో కిందు మీదులవుతుండగా, జయసింగ్ మాహూతో, "అంతవరకూ నీవు చేసిన పని చాలా వివేకవంతమైనదే! కాని, కారాగారం దగ్గిర నీవు విల్లంబులు చేబూని దాగి వుండటంలో వున్న ప్రమాదం గుర్తించినట్టు లేదు. ఏ కావలి సైనికులో నిన్ను చూసివున్నట్టయితే తప్పక వెంటబడి వేటాడి వుండేవాళ్ళు," అన్నాడు.

"అలాంటి ప్రమాదం వుంటుందని నేను గుర్తించకపోలేదు, సర్దార్! కాని అవజ్ఞవర్మ, నవభోజ మహారాజు యిక్కడికి చేరకముందే నా యజమానిని చంపచూస్తాడని నా కెందుకో అనుమానం కలిగింది. తెల్లవారితే నవభోజులు యిక్కడికి రావొచ్చు – లేక నా యజమానిని గుర్తించి సాక్ష్యం యివ్వగల మరెవరైనా బయటపడవచ్చు. అప్పుడు తనకు తప్పక కీడు కలిగి తీరుతుంది... అవజ్ఞవర్మ వక్రబుద్ధి యిలా ఆలోచించి తీరుతుందని నమ్మటం వల్లనే, నేను నా అనుచరులను కొందరికి అతడి ఇంటికి కాపుంచి, మరికొందరితో కారాగారం దగ్గిర వేచి వున్నాను," అన్నాడు మాహూ.

"అంటే... అవజ్ఞవర్మ విడిది గృహాన్ని కాపలా కాస్తూ, యింకా మనవాళ్ళు కొందరు అక్కడే వున్నారా?" అని అగ్నిపాలుడు ఆశ్చర్యంగా అడిగాడు.

"చిత్తం!" అన్నాడు మాహూ.

"ఔరా, మాహూ!" అంటూ జయసింగ్ బిగ్గరగా నవ్వి, "ఒకవేళ అవజ్ఞవర్మ ఆ విడిది గృహాన్నుంచి బయటికి పారిపోజూస్తే, నీ అనుచరులు ఏం చేస్తారు?" అని అడిగాడు.

మాహూ తన యజమానికేసి చూసి వూరుకున్నాడు.

"ఏం మాహూ! నా ప్రశ్నకు జవాబు రాలేదే!" అన్నాడు జయసింగ్.

మాహూ ఈసారి కనుబొమలు ముడిచి అగ్నిపాలుడికేసి సాలోచనగా చూసి, తరవాత తల తిప్పి జయసింగ్ కేసి చూటిగా చూస్తూ, "సర్దార్! ఈ ప్రశ్న యింతమంది ముందు అడగవలసింది కాదంటున్నందుకు క్షమించండి. అయినా, అడిగారు గనక చెపుతున్నాను. అవజ్ఞవర్మ ఆ విడిది గృహంలో – నా యజమాని సురక్షితంగా కారాగారం నుంచి బయటపడేవరకూ – నా బందీ! నా యజమానికి ఆ చీకటి కొట్టు నుంచి స్వేచ్ఛ లభించందే – అతనికీ ఆ విడిది గృహం నుంచి స్వేచ్ఛ దొరకదు. కాదని అతడు బయటికి పోజూస్తే, నా అనుచరుల నుంచి ఒక్క బాణం..... లేక, ఒక కత్తివేటు..... అంతే సర్దార్!" అన్నాడు గంభీరంగా.

## - 22 -

చంద్రగిరి రాజ్యాధిపతియైన నవభోజ మహారాజు, మానుకోట పట్టణం ప్రవేశించాడన్న





సూచనగా, శతఘ్నులు పట్టణం దద్దరిల్లేటట్టు ప్రేలాయి.

అగ్నిపాలుడు అంతకు కొంచెం ముందే నిద్ర లేచి, స్నానం ముగించి, కొత్త దుస్తులు ధరిస్తున్నాడు. మహారాజును దర్శించి, జరిగినదేమిటో విన్నవించుకునేందుకు జయసింగ్ చాలా ముందుగానే వెళ్ళిపోయాడు.

ఆ క్షణానో, మరుక్షణానో మహారాజు నుంచి తనకు ఆయన సన్నిధికి రావలసిందిగా వార్త వస్తుందని అగ్నిపాలుడు ఎదురు చూస్తున్నాడు.

అంతలో వకుళమాలను గురించి అతడి మనస్సు క్షోభపడి పోతున్నది. తను అవజ్ఞవర్మతో పందెం వేసి ప్రసేనుడి ఇంటికి బయలుదేరిన సంగతి అవజ్ఞవర్మ ద్వారా వినటం వల్ల, వకుళమాలకు తప్పక తన ప్రేమ గురించి ఏహ్యభావం కలిగి వుంటుంది. ఆ దుర్మార్గుడు తనను రాజద్రోహిగా ఉరి తీయించే ప్రయత్నంలో విఫలుడైనా..... తన భవిష్యత్తును మాత్రం సర్వనాశనం చేయగలిగాడు. ఆ విధంగా అతడు జయించినట్టే!

ఇంత జరిగింతరవాత వకుళమాల తన ప్రేమను అంగీకరించటం కల్ల. ఆమెలేని జీవితాన్ని తానెన్నాళ్ళు సాగించగలడు? ఆత్మహత్య – అది మహాపాపమేగాక – తనబోటి క్షత్రియుడు ఆలోచించదగింది కూడా కాదు. ఇక తను జీవితాంతం బ్రహ్మచారిగా వుండిపోవలసిందే!

వకుళమాల బహుశా తన స్వగృహం చేరి వుంటుంది. తనలాగే, ఆమె కూడా అగ్నిపాలుడనే అహంకారి, మర్యాదహీనుడు... తన కన్నె మనసుకు కలిగించిన ఆఘాతాన్ని గురించి వ్యాకుల పడుతూ వుంటుంది.

"అయ్యా!" అన్న మాహూ పిలుపు అగ్నిపాలుణ్ణి విచారసాగరంలోనుంచి బయట పడవేసింది.

"మహారాజులుంగారు వార్తాహరుణ్ణి పంపారు – వారి సన్నిధికి వెంటనే బయలుదేరి రావలసిందిగా ఆజ్ఞ," అన్నాడు మాహూ.

అగ్నిపాలుడు వాకిట సిద్ధంగావున్న ఉత్తమాశ్వాన్ని అధిరోహించి, వెంట మాహూ, మరికొందరు సేవకులూ రాగా నవభోజ మహారాజు విడిది దిగిన భవనానికి వెళ్ళాడు.

నవభోజరాజు, అగ్నిపాలుణ్ణి అంత దూరాన చూస్తూనే చిరునవ్వు నవ్వాడు.

ఆయన పక్కన అటూ యిటూ ఓబలరాజూ, జయసింగ్ నిలబడి వున్నారు.

"అగ్నీ! నీవు క్షేమంగా వున్నందుకు చాలా సంతోషం కలుగుతున్నది," అన్నాడు మహారాజు.

"కృతజ్ఞుణ్ణి మహారాజా!" అన్నాడు అగ్నిపాలుడు వినయంగా.

"అవజ్ఞుడూ, నీవూ యింతకాలంగా నా ఆస్థానంలో వుంటున్నా... మీరు జూదరులని మాత్రం తెలుసుకోలేకపోయాను. ఆ సంగతి, కొద్దికాలం కిందటే తెలిసింది!" అన్నాడు నవభోజుడు

తాపీగా.

అగ్నిపాలుడు తల దించుకున్నాడు.

"జూదరులనూ, పందెగాళ్ళనూ ప్రేమించే క్షత్రియ కన్యలుంటారని నాకు తెలియదు! పందెంలో నీ వెంతవరకు సాధించావు, అగ్నీ?" అన్నాడు నవభోజుడు గంభీరంగా.

"మహారాజా! అవజ్ఞవర్మతో వాదుకు దిగి, ఈ విధమైన పందెం వేయటంలో నేను చాలా తప్పు చేశాను. ప్రభువులు క్షమించాలి," అన్నాడు అగ్నిపాలుడు.

"ఆ అవజ్ఞవర్మ గురించి సర్వం జయసింగ్ ద్వారా విన్నాను. అతడి సేవకుడు చెప్పినది కూడా విన్నాను. ఓబలరాజు వల్ల ఆ పందెం షరతు లేమిటో తెలుసుకున్నాను. వాటిని అతడు అతిక్రమించడం ద్వారా, ఓడిపోయాడని నిర్ణయిస్తున్నాను. కాని, నువ్వు నా తీర్పు వినేవరకైనా ఆగవలసింది. తొందరపడి ఈ లోపలే అతణ్ణి పుణ్యలోకాలకు పంపటం మాత్రం బావుండలేదు," అన్నాడు నవభోజుడు.

"క్షమించండి, మహారాజా! మీరనేదేమిటో..."

అగ్నిపాలుడి ముఖం మీద ప్రస్ఫుటమైన ఆశ్చర్య భావానికి నవభోజుడు కనుబొమలు చిట్లించి, "అగ్నీ! ఆ చైదము నీది కాదా? వెన్నులో తగిలిన బాణం దెబ్బకు, అవజ్ఞవర్మ తన విడిది గృహం ముందున్న రాజమార్గం పక్కన విగతజీవుడై వుండటం నీకు తెలియదా? అని అడిగాడు.

"ప్రమాణం చేసి చెపుతున్నాను. అతడి మరణానికి నేను కారణభూతుణ్ణి కాదు, మహారాజా!" అన్నాడు అగ్నిపాలుడు సవినయంగా.

నవభోజుడు జయసింగ్ కేసీ, ఓబలరాజు కేసీ చూశాడు. వారిలో ఏ మాత్రం చలనం లేదు.

కాని, నవభోజరాజు తల పక్కకు తిప్పుకోగానే, వారిద్దరి దృష్టి ద్వారం దగ్గిర నిలబడివున్న మాహూ మీదికి ప్రసరించింది.

అది గమనించిన మాహూ, అమాయకంగా వారికేసి చూసి చిరునవ్వుతో తల వంచుకున్నాడు.

"ఇది ఆశ్చర్యంగా వుందే, అగ్నీ!" అంటూ నవభోజుడు ఓ క్షణం ఆగి, "అయినా దుష్టులకు శత్రుగణం లోటేముంటుంది?... అతణ్ణి రాజప్రతినిధిగా పంపటంలో పెద్ద పొరబాటే జరిగింది." అన్నాడు స్వగతంలా.

అంతా నిశ్శబ్దంగా వూరుకున్నారు.

నవభోజుడు తిరిగి యిలా ప్రశ్నించాడు.

"అగ్నీ! పందెం మాట మరిచిపోదాం. పోతే, ఆ ప్రసేనుడి కుమార్తెతో నీ ప్రేమకలాపం ఏ దశలో వున్నది?"

"ఆమెను మరోసారి కలుసుకొని మాట్లాడితే తప్ప... నేనేమీ చెప్పలేను, మహారాజా!" అన్నాడు అగ్నిపాలుడు నిర్వికారంగా.

'ఆమెను యిప్పటికీ నీవు హృదయపూర్వకంగా ప్రేమిస్తున్నావా, అగ్నీ?" అన్నాడు నవభోజుడు.

"అవును, మహారాజా!"





"ఒకరకంగా - యిది చాలా దురదృష్టకరమైన సంగతి!" అన్నాడు నవభోజుడు జాలిగా.

అగ్నిపాలుడు నిశ్చేష్టుడయాడు.

"నీ కాబోయే మామ..... ప్రసేనుడు, రాజద్రోహి అగ్నీ!" అన్నాడు నవభోజుడు.

అగ్నిపాలుడు ఆపాదమస్తకం కంపించాడు.

"ఈ సంగతి తమకు తెలియపరచిన వారెవరు, మహారాజా?" అన్నాడతడు.

"బేతాళవర్మ! బహుశా అతణ్ణి చూసే వుంటావు - ప్రసేనుడి బంధువు"

"మహారాజా! అతడు కపటి! వదరుబోతు. అతడి మాటలు నమ్మకండి," అన్నాడు అగ్నిపాలుడు ఉద్వేగంగా.

"అయితే, ప్రసేనుడు రాజభక్తిపరుడని నీవు మాట ఇస్తున్నావా!" అన్నాడు నవభోజుడు అగ్నిపాలుడి ముఖంకేసి తీక్షణంగా చూస్తూ.

"మహారాజా! అతడు రాజభక్తుడూ కాదు, రాజద్రోహీ కాదు. అంతవరకూ నేను వాగ్దానం చేయగలను," అన్నాడు అగ్నిపాలుడు.

"అతడు రాజద్రోహి అని సాక్ష్యం వుంటే?"

"అతడు తమ మీద ఏనాడూ కత్తి కట్టలేదు మహారాజా!" అన్నాడు అగ్నిపాలుడు.

"కత్తి కట్టిన వారికి సహాయపడ్డాడు"

"క్షమించాలి, మహారాజా! ఏ విధంగా?"

"ఆశ్రయం యివ్వటం ద్వారా"

"ఆ మాట నమ్మకండి, మహారాజా! ఈ కల్లలు ప్రచారంచేసే బేతాళవర్మే శత్రుపక్షంలోనివాడని నేను రుజువు చేయగలను!" అన్నాడు అగ్నిపాలుడు నిబ్బరంగా.

"నిజమా, అగ్నీ!" అన్నాడు నవభోజుడు ఆశ్చర్యపోతూ.

"నిజం మహారాజా! ప్రసేనుడు తన కుమార్తెను యితడికివ్వ నిరాకరించాడు. అంతేకాక, ఆమె నన్ను ప్రేమిస్తున్నట్టు, ఈ బేతాళవర్మ గ్రహించాడు. ప్రసేనుడిపై అతడి పగకు కారణం అది!" అన్నాడు అగ్నిపాలుడు.

నవభోజుడు తల పైకెత్తి కొంచెంసేపు ఆలోచించి, ప్రసన్నవదనంతో, "అగ్నీ! అయితే నీవు వెంటనే బయలుదేరి వెళ్లటం మంచిది. ప్రసేనుణ్ణి రాజద్రోహిగా బంధించి పట్టుకువచ్చేందుకు, బేతాళవర్మ వెళ్ళాడు. నీకు ఆజ్ఞాపత్రం యిస్తున్నాను. ప్రసేనుణ్ణి బంధితుడుగా మాత్రం నా వద్దకు తేనవసరం లేదు, కాని..." అంటూ నవభోజుడు ఆగాడు.

"మహారాజా!" అన్నాడు అగ్నిపాలుడు ఆందోళనపడుతూ.

"ఆ ప్రసేనుడికి తను హైహయ వంశస్థుణ్ణనే మితిమీరిన గర్వం వున్నది. నా పరిపాలనలో అతడేనాడూ చంద్రగిరి నగరానికి వచ్చి, నాకు ప్రణమిల్లినది లేదు. నువు చెపుతున్నట్టు - నిజంగా అతడు రాజద్రోహి కాకపోతే - అతడిక్కడికి వచ్చి, నా సింహాసనం పక్కన... కొద్ది క్షణాల

పాటైనా చేతులు కట్టుకుని నిలబడాలి. ఆపాటి సామంతుల మర్యాదనైనా, అతడు పాటించగలడా?" అన్నాడు నవభోజుడు కొంచెం తీవ్ర స్వరంతో.

"చంద్రగిరి మహారాజులకు అతడు సామంతుడే గదా, మహారాజా! ఆపాటి గౌరవ మర్యాదలు అతడికి ఎందుకు తెలియవు!" అన్నాడు అగ్నిపాలుడు, ఎంతో వినయంగా.

"ప్రయత్నించు... చూద్దాం!" అన్నాడు నవభోజుడు.

- 23 -

ఆయుధపాణులై గుర్రాలెక్కి బయలుదేరేందుకు సిద్ధంగావున్న తన సేవకులకేసి అగ్నిపాలుడు ఓసారి పరీక్షగా చూశాడు.

మాహూతో కలసి - వాళ్ళు పదిహేను మంది. వాళ్ళలో ఎనిమిది మంది వరకూ, ఏ పరిస్థితులలోనైనా ప్రాణాలకు తెగించి, తుదివరకూ పోరాడగలిగినట్టి యోధులు. తతిమ్మా వాళ్లలో ముగ్గురు వయసు మీరిన వాళ్ళు, యిద్దరు వంట మనుషులు, యిద్దరు బండితోలే వాళ్ళు. వీళ్ళ మీద అంత నమ్మకం పెట్టుకునేందుకు వీలులేదు.

'బహుశా, బేతాళవర్మతో పోరుకు దిగవలసిన అవసరం కలగకపోవచ్చు. కాని, అతడి వెంట వుండే సైనికుల మాటేమిటి?' అనుకున్నాడు అగ్నిపాలుడు.

అతడి దగ్గిర ప్రసేనుడిని....... ఒకవేళ ఆసరికే బేతాళవర్మ అతన్ని బందీగా పట్టుకుని వుంటే, విడిపించేందుకు అవసరం అయిన రాజాజ్ఞా పత్రం వున్నది. కాని, ఎంతో తప్పనిసరి అయితే తప్ప, బేతాళవర్మకు చూపించరాదని అగ్నిపాలుడు నిశ్చయించుకున్నాడు. సాధ్యమైతే తన సేవకుల చేతనే బేతాళవర్మకు ప్రసేనుడి సమక్షంలో అవమానం జరిపించాలి...

అగ్నిపాలుడు తన సేవకులకు బయలుదేరవలసిందిగా అజ్ఞ యిచ్చి, తన గుర్రం మీద ముందుండి దారి తీశాడు. తను ఎక్కడా ఆగకుండా ప్రయాణించితే, సాయంత్రం నాలుగు గంటల ప్రాంతాల ప్రసేనుడి గృహం చేరగలడు. ప్రస్తుత విషమ పరిస్థితుల దృష్ట్యా, తను ఎంత త్వరగా వెళ్ళగలిగితే, అంత మంచిదని అగ్నిపాలుడు నిర్ణయించుకున్నాడు.

అనుకున్నదానికంటే వేగంగానే అగ్నిపాలుడి ప్రయాణం సాగింది. దారిలో బాగా మిట్టమధ్యాహ్నపు వేళ. ఒక అరగంట కాలం మాత్రం హిరణ్యపురంలో గడిపి, సూర్యుడు పడమటి దిక్కుకు వాలుతూండగా, అతను ప్రసేనుడి భవనానికి చూపుమేర దూరంలోకి వచ్చాడు.

భవనం చుట్టూవున్న ఎత్తయిన ప్రహరీ గోడల వెలుపలగాని, నదీతీరానగాని ఎవరూ లేరు.

కాని అగ్నిపాలుడు నది వైపుకు వున్న ప్రహరీ గోడను చుట్టి ముఖద్వారంకేసి వచ్చేసరికి భవన ప్రాంగణంలోనుంచి మనుషుల కేకలూ, గుర్రాల







సకిలింపులూ వినబడినై.

అతడు తన గుర్రాన్ని గట్టిగా అదిలించి ప్రహరీ గోడలోని ప్రధాన ద్వారాన్ని దాటి, భవన ప్రాంగణంలోకి ప్రవేశించాడు.

భవనం ముందున్న ఖాళీ ప్రదేశంలో రెండు గుర్రాలు పూన్చిన బండీ ఒకటి ప్రయాణానికి సిద్ధంగా వుంది. దానికి ఒక పక్కగా ప్రసేనుడూ, ఆయన భార్య చంద్రాదేవీ నిలబడి వున్నారు.

బేతాళవర్మ ప్రసేనుడికి అంత దూరంలో గుర్రం మీద కూర్చుని, చేతులను తీవ్రంగా గాలిలోకి ఊపుతూ, పెద్దగా మాట్లాడుతున్నాడు.

కొంచెం పక్కగా ఇరవై మంది సైనికులు, ఇదేమీ మాకు సంబంధించినది కాదన్నట్టు, ఆ దృశ్యంకేసి చూస్తూ నిలబడివున్నారు.

"ప్రసేన్! నీ పరుష వాక్యాలూ, ఈసడింపులూ యిక చాలు. ఇది రాజాజ్ఞ! బండీ ఎక్కుతావా లేదా? నీతోపాటు నీ భార్య కూడా ఖైదీగా రాదలిస్తే - నా అభ్యంతరం ఏమీ లేదు," అని అరుస్తున్నాడు బేతాళవర్మ.

ఆ మాటలు వింటూనే అగ్నిపాలుడికి విపరీతమైన కోపం వచ్చింది. అతడు గుర్రాన్ని వేగంగా బేతాళవర్మ దగ్గిరకు పరిగెత్తిస్తూ, "వర్మా! నువ్వే నాటి నుంచి నీ రాజద్రోహానికి స్వస్తిచెప్పి రాజ భక్తుడి వయ్యావు?" అన్నాడు తీవ్రంగా.

ఆ మాటలూ, అంతలోనే వేగంగా తనను సమీపిస్తున్న అగ్నిపాలుడూ తన దృష్టిపథంలోకి వచ్చే సరికి, బేతాళవర్మ నిలువునా నీరయి పోయాడు.

అతడి ముఖం మీద స్పష్టంగా భయ చిహ్నాలు కనిపించినై.

అతడు పక్కకు తల తిప్పి తనకు సహాయంగా వెంటవచ్చిన సైనికులకేసి చూశాడు. దానితో అతడి గుండె దడ కొంచెం తగ్గినట్టుయింది.

"ఎవరూ, విష్ణుమిత్రుడా!" అన్నాడు బేతాళవర్మ, చిరునవ్వు నవ్వేందుకు సతమతమవుతూ.

"వర్మా! విష్ణుమిత్రుణ్ణి కాదు, అగ్నిపాలుణ్ణి! ఆ సంగతి నిన్ననే నీకు తెలిసివుండాలే? సరే, ప్రస్తుతానికి ఆ సంగతి వదిలేద్దాం. రాజద్రోహివైన నీకు, ఈ ప్రసేనుడితో వచ్చిన పనేమిటి?" అన్నాడు అగ్నిపాలుడు

"ఎవరు రాజద్రోహి?" అన్నాడు బేతాళవర్మ కోపంతో నిలువెల్లా కంపించిపోతూ.

"మరొకమారు చెపుతున్నాను. రాజద్రోహివి, నీవే! కాలభోజుడి పక్షాన చేరి, నువ్వు చేసిన రాజద్రోహం నాకు తెలియంది కాదు," అన్నాడు అగ్నిపాలుడు కఠినంగా.

"ఇది నన్ను అవమానించటం. చాతనైతే ద్వంద్వ యుద్ధానికి రావొచ్చు," అన్నాడు బేతాళవర్మ కత్తి దూస్తూ.

"వర్మా! నువ్వు నా చేతుల్లో చావదలుస్తున్నట్టున్నది. కాని, ఆ గౌరవం నీ కివ్వలేను. జగ్గరాజు వంటి వీరులను తుండేలుగా నరికిన నా కత్తి నీబోటి బంధుద్రోహుల, పిరికిపందల రక్తాన్ని చవిచూడటానికి అంగీకరించదు," అని -

"మాహూ!" అంటూ వెనుదిరిగి కేక వేశాడు అగ్నిపాలుడు.

"ప్రభూ!" మాహూ కత్తి దూసి, తన గుర్రాన్ని బేతాళవర్మకేసి నడపబోయాడు.

కాని, ఈ లోపలే... కనురెప్పపాటు కాలంలో బేతాళవర్మ తన గుర్రాన్ని గట్టిగా డొక్కల్లో పొడవటంతో, అది నకిలిస్తూ వెనక కాళ్ళ మీద పైకిలేచి, వెంటనే ఒక్కదూకున ప్రహరీ గోడ ద్వారంకేసి మెరుపులా పరిగెత్తింది.

"పట్టుకోండి!" అంటూ అగ్నిపాలుడు తన సేవకులకేసి చూసి, "ఈ బేతాళవర్మ, చంద్రగిరి రాజ్యంలో సజీవుడుగా వుండేందుకు వీలులేదు. అతణ్ణి వెంబడించండి!" అన్నాడు.

ఇద్దరు సేవకులు తమ గుర్రాలను అదిలించి, బేతాళవర్మ వెంటపడ్డారు. హఠాత్తుగా జరిగిపోయిన ఈ సంఘటన అందరినీ నిశ్చేష్టుల్ని చేసింది.

ఒకటి రెండు క్షణాలాగి అగ్నిపాలుడు సైనికులకేసి తిరిగి, "ఈ బేతాళవర్మ మహారాజుతో రాజా ప్రసేనుడిపై చాడీలు చెప్పి, ఈయనను బందీగా పట్టుకునేందుకు మిమ్మల్ని వెంట పెట్టుకు వచ్చాడు. 'నువ్వే రాజద్రోహివి' అని నేననగానే ఆ పారుబోతు పారిపోయిన తీరు చూశారు గదా!" అన్నాడు.



సైనికులందరూ తలలు వంచి అగ్నిపాలుడికి నమస్కరించారు.

అగ్నిపాలుడు, ప్రసేనుడికేసి రెండడుగులు వేసి, "రాజా, ప్రసేన్! ఈ జరిగిన అవమానానికి, నేను చాల విచారిస్తున్నాను. ఇదంతా బేతాళవర్మ పన్నిన పన్నాగం. ఆఖరి క్షణంలో నా చేతనైన సాయం మీకు చేశాను," అన్నాడు.

"చాలా కృతజ్ఞుణ్ణి. నీకెంతో రుణపడివున్నాను అగ్నిపాల్!" అన్నాడు ప్రసేనుడు గాద్గదికంగా.

అగ్నిపాలుడు ప్రసేనుడికేసి పరీక్షగా ఓ క్షణ కాలం చూసి, "ఈ మాటలు మర్యాద కోసం అంటున్నారా, లేక నిజంగానే నాకు రుణపడి వున్నట్టు భావిస్తున్నారా, ప్రసేన్?" అంటూ చంద్రాదేవికేసి తలఎత్తి చూశాడు.

ఆమె కళ్ళలో అశ్రుబిందువులు తొణికిసలాడినై.

"మర్యాద కోసం అన్న మాట కాదు, అగ్నిపాల్! నిజంగా నీ రుణం తీర్చలేనిది," అన్నాడు ప్రసేనుడు.

"రుణవిముక్తికి మార్గం చెబుతాను, అంగీకరిస్తారా?" అంటూ అగ్నిపాలుడు చిరునవ్వు నవ్వాడు.

"అంతకన్న కావలసినదేమిటి?" అన్నాడు ప్రసేనుడు.

అగ్నిపాలుడు ప్రసేనుడికి మరింత దగ్గిరగా జరిగి, రహస్యం చెబుతున్న ధోరణిలో, "రాజా ప్రసేన్! నా మాట నమ్మండి, నవభోజ రాజుతో అన్ని సంగతులూ మాట్లాడాను. ఆయనకు ఏకోశానా మిమ్ములను అవమానించాలని లేదు. మీరు కనీస రాచమర్యాదల దృష్ట్యా అయినా, ఆ మహారాజును ఒకసారి ఎందుకు దర్శించకూడదు?" అన్నాడు.

ప్రసేనుడు తల వంచుకుని కొద్దిసేపు ఆలోచిస్తూ వూరుకుని, తరవాత తలెత్తి ఎంతో ప్రశాంతంగా, "అగ్నిపాల్! నేనిప్పుడే బయలుదేరి నవభోజ రాజుల దర్శనం చేసుకుంటాను. చంపదగిన శత్రువని తెలిసీ, ఆయన క్షమించారని నాకు అర్థమైంది. అంతకన్న ఉదాత్తత ఏముంటుంది?" అన్నాడు.

"అలా అయితే నే వచ్చిన పని నెరవేరింది, శెలవు!" అంటూ అగ్నిపాలుడు తన గుర్రం దగ్గిరకు వెళ్ళి, కళ్ళాలు అందుకోబోయి ఆగి, "వకుళమాల... మీ కుమార్తెకు నా నమస్కారాలు చెప్పండి," అన్నాడు.

"అగ్నిపాల్! నీ ప్రవర్తన నా కర్థం కావటంలేదు, నీవు మా ఇంటవున్న రోజుల్లో, మీరిద్దరూ అంతగా కలిసి మెలిసి తిరిగేవారు గదా, ఇప్పుడు ఏం జరిగింది? ఆ నమస్కారాలు వకుళకు మరెవరో అందించవలసిన అవసరం ఏమిటి?" అన్నాడు ప్రసేనుడు.

చంద్రాదేవి, అగ్నిపాలుడి ముఖంలోకి ఆశ్చర్యంగా చూసింది.



అగ్నిపాలుడు ఓ క్షణకాలం ఎటూ నిర్ణయించుకోలేక తటపటాయించి, చివరకు ఒక గట్టి నిశ్చయానికి వచ్చిన వాడిలా తల ఊపి, "రాజా ప్రసేన్! అవజ్ఞవర్మ దుశ్చర్యల కారణం వల్ల, వకుళమాల నా విషయంలో కొన్ని అపోహలకు గురి అయింది. వాటిని తొలగించే ప్రయత్నం అప్పట్లో నేను చేయలేకపోయాను. ఇప్పుడైనా సాధ్యం అనుకోను. కాని, ఒకసారి ఆమెను చూసి పలకరించి, నా దారిన నేను పోతాను," అన్నాడు.

ప్రసేనుడూ, చంద్రాదేవి ఎక్కడ లేని ఆశ్చర్యంతో ముఖముఖాలు చూసుకున్నారు.

ప్రసేనుడికి ఏం అనాలో తోచింది కాదు.

చంద్రాదేవి భవనం కేసి చేయి చూపుతూ, "అమ్మాయి పై అంతస్తులోని తన గదిలో వున్నది," అన్నది.

అగ్నిపాలుడు మారుమాట్లాడకుండా భవనంలోకి పోయి, మెట్లెక్కి పై అంతస్తు చేరేసరికి, వకుళమాల పిట్టగోడ నానుకొని, దూరంగా వున్న నదికేసి చూస్తూ కనిపించింది.

అగ్నిపాలుడి పాదాల చప్పుడు విని కూడా,





ఆమె తలతిప్పి చూడలేదు.

"వకుళా!" అని పిలిచాడు అగ్నిపాలుడు.

అతడి గొంతు వణికింది.

ఆమె మాట్లాడలేదు.

తిరిగి చూడనూలేదు.

"వకుళా! నా ముఖం చూడటం కూడా నీకు బాధాకరం అవుతుందని నేననుకోలేదు. నేనెవరినో నీవు గ్రహించకముందే, ఈ ఇంటి నుంచి వెళ్ళిపోయి అవజ్ఞవర్మతో నా ఓటమిని ఒప్పుకుని, నా ఆస్తిపాస్తులు అతడి పరంచేసి, నిష్కల్మష హృదయంతో నీ దగ్గిరకు తిరిగి వచ్చి - నిన్ను ప్రేమభిక్ష అడగాలనుకున్నాను. అలా జరిగి వుంటే, బహుశా నా ప్రేమను నీవు శంకించివుండేదానవు కాదు. కాని, నా దురదృష్టం కొద్దీ నేను బయలుదేరి వెళదామనుకున్న రోజునే బందీని కావటం - అవజ్ఞవర్మ నాకన్న ముందుగా నీకు పందెం సంగతి చెప్పటం...... వీటన్నిటి వల్లా, నేను నీ దృష్టిలో నీచాతినీచుణ్ణయి పోయాను. ఆ సంగతి నాకు తెలుసు. సరే, జరిగినదేదో జరిగిపోయింది. జీవితాంతం వరకూ, నా దురదృష్టానికి చింతిస్తూ కాలం వెళ్లబుచ్చటం తప్ప నాకు మరో మార్గం లేదు. సెలవు!" అంటూ అగ్నిపాలుడు వెనుదిరిగి, మెట్లకేసి నడిచాడు.

రెండు మూడు మెట్లు దిగేంతలో అగ్నిపాలుడికి వెనక చిన్న సవ్వడి వినిపించింది.

అతడు తలతిప్పి చూసేసరికి తనకేసి వస్తున్న వకుళమాల కంటబడింది.

"వకుళా!" అంటూ అగ్నిపాలుడు చేతులు చాచాడు.

"అగ్నీ!" అంటూనే వకుళమాల వేగంగా వచ్చి, అతడి చేతుల్లో ఒరిగి పోయింది.

❖

# అగ్నిమాల

- సమాప్తం -